


'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+6 వెల: ₹ 5.50

సంపుటి: 16

సంచిక: 248

బుధవారం 29-11-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



## ప్రపంచకప్‌కు నమీబియా క్వాలిఫై

వచ్చే ఏడాది జరిగే టి20 ప్రపంచకప్‌కు నమీబియా జట్టు అర్హత సాధించింది. ఆఫ్రికా రీజియన్ క్వాలిఫయర్స్ టోర్నీలో ఆడిన ఐదు మ్యాచ్‌లలో విజయం సాధించి అగ్రస్థానం ఖాయం చేసుకోవడంతో ఆ జట్టు వరల్డ్ కప్‌కు క్వాలిఫై అయింది. మంగళవారం జరిగిన పోరులో నమీబియా 58 పరుగుల తేడాతో టాంజానియాను ఓడించింది. నమీబియా 20 ఓవర్లలో 6 వికెట్లకు 157 పరుగులు చేసింది. జేజే స్మిట్ (40), మైకేల్ లింజెన్ (30) రాణించారు. అనంతరం టాంజానియా 20 ఓవర్లలో 6 వికెట్లకు 99 పరుగులే చేయగలిగింది. అమాల్ రాజీవన్ (41 నాటౌట్) మినహా అంతా విఫలమయ్యారు. వరుసగా మూడో టి20 ప్రపంచకప్‌కు (2021, 2022, 2024) నమీబియా అర్హత సాధించడం విశేషం. ఇదే టోర్నీలో జరిగిన మరో మ్యాచ్‌లో రువాండాపై 144 పరుగులతో గెలిచిన జింబాబ్వే తాము కూడా క్వాలిఫై అయ్యే అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. 2024 జూన్‌లో వెస్టిండీస్, అమెరికా ఈ టి20 ప్రపంచకప్‌కు సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్నాయి.

## జాతీయ చాంపియన్ పంజాబ్



**చెన్నై:** జాతీయ సీనియర్ హాకీ చాంపియన్‌షిప్‌లో పంజాబ్ జట్టు విజేతగా నిలిచింది. మంగళవారం మేయర్ రాధాకృష్ణన్ స్టేడియంలో జరిగిన ఫైనల్లో పంజాబ్ 'షూటౌట్'లో డిఫెండింగ్ చాంపియన్ హర్యానాను ఓడించింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు 2–2 గోల్స్‌తో సమంగా నిలవగా...షూటౌట్ నిర్వహించారు. ఇందులో 9–8తో పంజాబ్ గెలుపొందింది. పంజాబ్ తరఫున హర్జీత్ సింగ్ (13వ నిమిషం), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (42వ ని.) గోల్స్ చేయగా...హర్యానాకు సంజయ్ (25వ ని.), రజంత్ (50వ ని.) గోల్స్ అందించారు. షూటౌట్‌లో హర్యానా తరఫున సంజయ్, దీపక్, అభిషేక్ గోల్స్ కొట్టగా...పంజాబ్‌కు హర్మన్‌ప్రీత్ సింగ్, సిమ్రన్‌జిత్ సింగ్, సుఖ్‌జీత్ సింగ్ గోల్స్ సాధించారు. దాంతో పరిస్థితి సడెన్ డెత్‌కు మారింది. ఈ స్థితిలో సిమ్రన్‌జిత్ సింగ్ గోల్ కొట్టి పంజాబ్‌ను గెలిపించాడు. మూడో స్థానం కోసం కూడా ఫలితం షూటౌట్ ద్వారానే తేలింది. తమిళనాడు, కర్నాటక మధ్య జరిగిన ఈ పోరు ముందుగా 3–3తో సమంగా నిలవగా...షూటౌట్‌లో 5–3తో గెలిచి తమిళనాడు కాంస్యం సొంతం చేసుకుంది.

## ప్రిక్వార్టర్స్‌లో సిక్కి-సుమీత్

**లక్నో:** సయ్యద్ మోడి ఇండియా ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నీలో తెలంగాణకు చెందిన సిక్కి రెడ్డి - సుమీత్ రెడ్డి ద్వయం మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. మంగళవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో సిక్కి-సుమీత్ 21–14, 21–14 స్కోరుతో వి సువాన్ యి-చున్ యున్ యాంగ్ (చైనీస్ తైపీ) జోడీపై విజయం సాధించింది. మిక్స్‌డ్ విభాగంలోనే అశ్విని పొన్నప్ప-రోహన్ కపూర్ జంట కూడా ముందంజ వేసింది. తొలి రౌండ్‌లో అశ్విని-రోహన్ 21–12, 21–18తో పెంగ్ సూన్-యీ సీ (మలేసియా)ను ఓడించారు.

## ధీరజ్‌కు షాక్

**అయోధ్య:** జాతీయ సీనియర్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్‌కు అనూహ్య పరాజయం ఎదురైంది. పురుషుల రికర్వ్ సెమీ ఫైనల్లో జార్ఖండ్‌కు చెందిన మృణాల్ చౌహాన్ షూట్ ఆఫ్‌లో ధీరజ్‌ను ఓడించి ఫైనల్లోకి అడుగు పెట్టాడు. స్కోరు 5–5తో సమంగా ఉండగా, షూట్ ఆఫ్‌లో చౌహాన్ పైచేయి సాధించాడు. ఆలిండియా పోలీస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డుకు చెందిన తుషార్ శెల్కేతో ఫైనల్లో చౌహాన్ తలపడతాడు. సెమీస్‌లో శెల్కే 6–4తో అతుల్ వర్మ (గోవా)ను ఓడించాడు.

# రుతురాజ్ బాదాడు...

# మ్యాక్స్‌వెల్ గెలిపించాడు

- ఆఖరి బంతికి ఆస్ట్రేలియా విజయం
- 5 వికెట్ల తేడాతో భారత్ ఓటమి
- శుక్రవారం రాయ్‌పూర్‌లో నాలుగో టి20



**రుతురాజ్ మెరుపు శతకాన్ని మ్యాక్స్‌వెల్ విధ్వంసం కమ్మేసింది. టీమిండియా 'హ్యాట్రిక్'ను, సిరీస్ విజయాన్ని అడ్డుకుంది. ఇటీవలే ముగిసిన ప్రపంచకప్‌లో అఫ్గాన్‌పై అద్వితీయ డబుల్ సెంచరీని గుర్తుకు తెచ్చేలా మూడో టి20లో మ్యాక్సీ అజేయ శతకంతో ఆస్ట్రేలియాను గెలిపించాడు. బౌలింగ్‌లో ఆఖరి ఓవర్లో 30 పరుగులు సమర్పించుకున్న మ్యాక్సీ ఆ చేత్తోనే బ్యాటింగ్‌లో ఆఖరి బంతిదాకా పోరాడి మరీ జట్టును సిరీస్‌లో నిలిపాడు.**

**గువాహటి:** వరుస విజయాలతో సిరీస్‌ను గెలుచుకుందామనుకున్న టీమిండియా పట్టుదలకు ఒకే ఒక్కడు అడ్డుపడ్డాడు. గ్లెన్ మ్యాక్స్‌వెల్ (48 బంతుల్లో 104 నాటౌట్; 8 ఫోర్లు, 8 సిక్సర్లు) ధనాధన్ ధాటికి మ్యాచ్ చేజారింది. మంగళవారం జరిగిన మూడో టి20లో భారత్ 5 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా చేతిలో ఓడింది. సిరీస్ ఆధిక్యం 2–1కు తగ్గింది. మొదట భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 222 పరుగులు చేసింది. ఈ సిరీస్‌లో వరుసగా మూడో సారి టీమిండియా 200 పైచిలుకు స్కోరు చేసింది. ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ (57 బంతుల్లో 123 నాటౌట్; 13 ఫోర్లు, 7 సిక్స్‌లు) మెరుపు శతకాన్ని సాధించాడు. సూర్యకుమార్ (29 బంతుల్లో 39; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. అనంతరం ఆస్ట్రేలియా సరిగ్గా 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 225 పరుగులు చేసి గెలిచింది. ట్రవిస్ హెడ్ (18 బంతుల్లో 35; 8) వేగంగా ఆడాడు. మ్యాక్స్‌వెల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' లభించింది. పేసర్ ముకేశ్ వివాహం కోసం సెలవు తీసుకోగా, అవేశ్ ఖాన్ భారత తుది జట్టులోకి వచ్చాడు.

### ఒడిదుడుకులతో మొదలై...

పవర్‌ప్లేలో చెలరేగిపోయే ఓపెనర్ యశస్వి జైస్వాల్ (6) రెండో ఓవర్లోనే నిష్క్రమించడం, ఆ మరుసటి ఓవర్లోనే వన్‌డౌన్ బ్యాటర్ ఇషాన్ కిషన్ (0) డకౌట్ కావడంతో భారత్ పరుగుల పయనం నెమ్మదిగా మొదలైంది. 24/2 వద్ద కెప్టెన్ సూర్యకుమార్ క్రీజులోకి వచ్చాడు. నాథన్ ఎలిస్ ఐదో ఓవర్లో రెండు భారీ సిక్సర్లతో అతను భారత శిబిరంలో జోష్ తెచ్చాడు. పవర్‌ప్లేలో జట్టు 43/2 స్కోరు చేసింది. సూర్య తడాఖా చూపడంతో పరుగుల వేగం పుంజుకుంది. చూడచక్కని బౌండరీలతో సూర్యకుమార్ కాసేపు ఇన్నింగ్స్‌ను నడిపించాడు.

### రుతురాజ్ వీరవిహారం

అప్పటి వరకు అడపాదడపా బౌండరీలతో సరిపెట్టుకుంటూ వచ్చిన రుతురాజ్ తొలి 10 ఓవర్లు ముగిసేసరికి 21 బంతుల్లో 21 పరుగులే చేశాడు. ఆ తర్వాత 'పరుగుల మిషన్'లా చెలరేగిపోయాడు. గైక్వాడ్ తర్వాతి 10 ఓవర్లలో 36 బంతులాడి 102 పరుగులు చేశాడు. 13వ ఓవర్లో రెండు ఫోర్లు, 14వ ఓవర్లో గైక్వాడ్ మరో రెండు బౌండరీలు బాది 32 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. తిలక్ వర్మ కూడా ఓ ఫోర్ కొట్టడంతో ఆ ఓవర్లో 19 పరుగులు వచ్చాయి. సంఘా ఓవర్లో వరుసగా 4, 6 బాదిన గైక్వాడ్... హార్డి వేసిన 18వ ఓవర్లో 0, 6, 1వైడ్, 6, 4, 0, 6, 2లతో 25 పరుగులు పిండుకున్నాడు. మ్యాక్స్‌వెల్ వేసిన ఆఖరి ఓవర్లో రుతురాజ్ 3 సిక్స్‌లు, 2 ఫోర్లు బాదడంతో మొత్తం 30 పరుగులు వచ్చాయి. తొలి బంతికి బాదిన సిక్సర్‌తోనే 52 బంతుల్లో రుతురాజ్ సెంచరీ పూర్తయ్యింది. అబేధ్యమైన నాలుగో వికెట్‌కు రుతురాజ్, తిలక్ 9.4 ఓవర్లలో 141 పరుగులు జోడించారు.

### గెలిపించిన మ్యాక్స్‌వెల్

ఆస్ట్రేలియా ఛేజింగ్‌ను ఓపెనర్ హెడ్ ధాటిగా మొదలెట్టాడు. తొలి ఓవర్లో 2, రెండో ఓవర్లో 4 బౌండరీలు బాదాడు. హార్డి (16)ని అర్‌ష్‌దీప్ పెవిలియన్ చేర్చాడు. బౌండరీలతో చెలరేగిపోతున్న హెడ్‌ను అవేశ్‌ఖాన్ బోల్తా కొట్టించాడు. పవర్‌ప్లేలో ఆసీస్ స్కోరు 67/2. క్రీజులోకి వచ్చిన మ్యాక్స్‌వెల్ భారీషాట్లతో విరుచుకుపడ్డాడు. దీంతో ఆసీస్ ఓవర్‌కు 10పైచిలుకు రన్‌రేట్‌తో సాగిపోయింది. నాలుగో వికెట్‌కు 60 పరుగులు జోడించాక 128 పరుగుల వద్ద స్టొయినిస్ (17) నిష్క్రమించగా, స్వల్ప వ్యవధిలో టిమ్ డేవిడ్ (0) డకౌటయ్యాడు. భారత్ శిబిరం ఆనందంలో ఉండగా అప్పుడు ఆసీస్ స్కోరు 13.3 ఓవర్లలో 134/5. గెలుపు సమీకరణం 39 బంతుల్లో 85 పరుగులు భారత్‌కే అనుకూలంగా ఉంది. కానీ తర్వాత కెప్టెన్ వేడ్ (28 నాటౌట్) జతవ్వగా... మ్యాక్స్‌వెల్ యథేచ్ఛగా భారీసిక్సర్లతో భారత్ శిబిరాన్ని వణికించాడు. 18 బంతుల్లో 49 పరుగులు చేయాల్సివుండగా 18వ ఓవర్ వేసిన ప్రసిధ్ కేవలం 6 పరుగులే ఇచ్చి భారత్‌కు ఊరటనిచ్చాడు. కానీ అదే ప్రసిధ్ ఆఖరి ఓవర్లో 6 బంతుల్లో 21 పరుగులు కావాల్సినపుడు 4, 1, 6, 4, 4, 4లతో 23 పరుగులిచ్చుకున్నాడు. ఇందులో ఆఖరి 4 బంతుల్ని బౌండరీలను దాటించిన మ్యాక్స్‌వెల్ 47 బంతుల్లోనే సెంచరీ సాధించాడు.



### స్కోరు వివరాలు

**భారత్ ఇన్నింగ్స్:** యశస్వి (సి) వేడ్ (బి) బెహ్రెన్‌డార్ఫ్ 6; రుతురాజ్ నాటౌట్ 123; ఇషాన్ (సి) స్టొయినిస్ (బి) రిచర్డ్‌సన్ 0; సూర్యకుమార్ (సి) వేడ్ (బి) హార్డి 39; తిలక్ వర్మ నాటౌట్ 31; ఎక్స్‌ట్రాలు 23; మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 222. వికెట్ల పతనం: 1–14, 2–24, 3–81.
**బౌలింగ్:** రిచర్డ్‌సన్ 3–0–34–1, బెహ్రెన్‌డార్ఫ్ 4–1–12–1, ఎలిస్ 4–0–36–0, తన్వీర్ సంఘా 4–0–42–0, హార్డి 4–0–64–1, మ్యాక్స్‌వెల్ 1–0–30–0.
**ఆస్ట్రేలియా ఇన్నింగ్స్:** హెడ్ (సి) బిష్ణోయ్ (బి) అవేశ్ 35; హార్డి (సి) ఇషాన్ (బి) అర్‌ష్‌దీప్ 16; ఇంగ్లిస్ (బి) బిష్ణోయ్ 10; మ్యాక్స్‌వెల్ నాటౌట్ 104; స్టొయినిస్ (సి) సూర్య (బి) అక్షర్ 17; టిమ్ డేవిడ్ (సి) సూర్య (బి) బిష్ణోయ్ 0; వేడ్ నాటౌట్ 28; ఎక్స్‌ట్రాలు 15; మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 225. వికెట్ల పతనం: 1–47, 2–66, 3–68, 4–128, 5–134. **బౌలింగ్:** అర్‌ష్‌దీప్ 4–0–44–1, ప్రసిధ్‌కృష్ణ 4–0–68–0, రవి బిష్ణోయ్ 4–0–32–2, అవేశ్‌ఖాన్ 4–0–37–1, అక్షర్ పటేల్ 4–0–37–1.

**4** అంతర్జాతీయ టి20ల్లో అత్యధిక (4) సెంచరీలు చేసిన ఆటగాడిగా రోహిత్‌శర్మ రికార్డును మ్యాక్స్‌వెల్ సమం చేశాడు.

**100** మ్యాక్స్‌వెల్‌కు ఇది 100వ అంతర్జాతీయ టి20 మ్యాచ్. వందో మ్యాచ్‌లో సెంచరీ చేసిన తొలి ఆటగాడిగా అతను నిలిచాడు.

**68** భారత్ తరఫున టి20ల్లో అత్యధిక పరుగులు (68) ఇచ్చిన ఆటగాడు ప్రసిధ్ కృష్ణ

## 'ఆ క్షణం లైబ్రరీలా అనిపించింది'

- కోహ్లి వికెట్‌పై కమిన్స్ వ్యాఖ్య
- స్వదేశంలో వరల్డ్ కప్ గెలుపు సంబరాలు



**సిడ్నీ:** వన్డే వరల్డ్ కప్ గెలిచి వారం రోజులు దాటినా ఆస్ట్రేలియా జట్టు తమ విజయాన్ని ఇంకా వేడుకలా జరుపుకుంటూనే ఉంది. మంగళవారం సిడ్నీ మైదానంలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఆసీస్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్, పేసర్ మిచెల్ స్టార్క్ కలిసి వరల్డ్ కప్ ట్రోఫీని ప్రదర్శించారు. ఈ సందర్భంగా కమిన్స్ తన ఫైనల్ మ్యాచ్ అనుభవాన్ని గుర్తు చేసుకున్నాడు. ముఖ్యంగా కోహ్లి వికెట్ తీయడం మ్యాచ్‌ను మలుపు తిప్పిందని అతను అన్నాడు. కమిన్స్ బంతిని కోహ్లి వికెట్లపైకి ఆడుకోవడంతో భారత్ భారీ స్కోరు చేయడంలో విఫలమైంది. ఆ క్షణం మైదానంలో ఆవరించిన నిశ్శబ్దం మరచిపోలేనని కమిన్స్ అన్నాడు. 'కోహ్లి వికెట్ పడిన తర్వాత మా జట్టు సభ్యులంతా ఒక చోట చేరి సంబరాలు చేసుకుంటుంటే స్మిత్ ఒక మాట అన్నాడు. మైదానంలో ఏదైనా శబ్దం వినిపిస్తోందా అని అడిగాడు. మేం ఒక క్షణం ఆగి గమనించాం. స్టేడియం మొత్తం ఒక లైబ్రరీలా అనిపించింది. లక్ష మంది ఉన్న మైదానంలో అంతా నిశ్శబ్దం ఆవరించింది. ఈ ఘట్టాన్ని చిరకాలం గుర్తుంచుకుంటా' అని కమిన్స్ వ్యాఖ్యానించాడు. ఒకే సమయంలో భిన్న ఫార్మాట్‌లలో తాము ప్రపంచ చాంపియన్లుగా ఉండటం చాలా గర్వంగా ఉందని అన్నాడు.

### ఆరుగురు ఆసీస్ ఆటగాళ్లు ముందుగానే...

భారత్‌తో జరుగుతున్న టి20 సిరీస్‌లో పాల్గొంటున్న ఆస్ట్రేలియా జట్టులోని ఆరుగురు ప్రధాన ఆటగాళ్లు సిరీస్ ముగియడానికి ముందే స్వదేశానికి వెళ్లిపోతున్నారు. వరల్డ్ కప్ గెలిచిన జట్టులో సభ్యులుగా ఉన్నవారిలో ఏడుగురు టి20 సిరీస్ కోసం ఇక్కడే ఆగిపోయారు. వీరిలో హెడ్ ఒక్కడే సిరీస్ ముగిసే వరకు ఉండనున్నారు. స్మిత్, జంపా ఇప్పటికే బయల్దేరిపోగా...మరో నలుగురు మ్యాక్స్‌వెల్, స్టొయినిస్, ఇన్‌గ్లిస్, అబాట్ మూడో మ్యాచ్ ముగియగానే వెళ్లిపోతారు. చివరి రెండు మ్యాచ్‌లకు వీరు అందుబాటులో ఉండటం లేదు. వీరి స్థానాల్లో జోష్ ఫిలిప్, బెన్ మెక్‌డెర్మాట్, బెన్ ద్వార్షియస్, క్రిస్ గ్రీన్‌లను ఆస్ట్రేలియా సెలక్టర్లు ఎంపిక చేశారు.

## సినిమా

## ట్రైలర్ చూశా.. మెంటలొచ్చేసింది! - మహేశ్ బాబు



సందీప్ రెడ్డి, మహేశ్‌బాబు, రణ్‌బీర్ కపూర్, రాజమౌళి, అనిల్ కపూర్, రష్మికా మందన్నా

''యానిమల్' ట్రైలర్ చూశా.. మెంటలొచ్చేసింది. ఇంత ఒరిజినల్ ట్రైలర్‌ని నేను ఇప్పటి వరకూ చూడలేదు. సందీప్ అంటే నాకు ఇష్టం. తను చాలా యునిక్, ఒరిజినల్ ఫిల్మ్ మేకర్. ఇది ప్రీ రిలీజ్ వేడుకలా లేదు.. వంద రోజుల వేడుకలా ఉంది'' అని హీరో మహేశ్‌బాబు అన్నారు. రణ్‌బీర్ కపూర్, రష్మికా మందన్న జంటగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహించిన చిత్రం 'యానిమల్'. అనిల్ కపూర్, బాబీ డియోల్ కీలక పాత్రల్లో నటించారు. భూషణ్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా నిర్మించిన ఈ చిత్రం డిసెంబర్ 1న రిలీజ్ కానుంది. తెలుగులో నిర్మాత 'దిల్' రాజు రిలీజ్ చేస్తున్నారు. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి హీరో మహేశ్‌బాబు, డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి అతిథులుగా హాజరయ్యారు. మహేశ్‌బాబు మాట్లాడుతూ– ''నేను రణ్‌బీర్ అభిమానిని. తను ఇండియాలో ది బెస్ట్ యాక్టర్ అని నా అభిప్రాయం. రష్మిక ప్రయాణం చూస్తుంటే గర్వంగా ఉంది. ఈ చిత్రం బ్లాక్ బస్టర్ అవుతుంది'' అన్నారు. రాజమౌళి మాట్లాడుతూ– ''ప్రతి ఏడాది కొత్త దర్శకులు వచ్చి పెద్ద సినిమాలు తీసి విజయాలు అందుకుంటారు.. చాలా పేరు సాధిస్తారు. కానీ ఎప్పుడో ఒకసారి ప్రేక్షకులని, ఇండస్ట్రీనే కాదు.. సినిమా ఫార్ములాని కూడా షేక్ చేసే దర్శకులు వస్తారు. ఒకప్పుడు రామ్‌గోపాల్ వర్మ వచ్చారు.. ఇప్పుడు సందీప్ వంగా. బాలీవుడ్‌లో నా ఫేవరెట్ యాక్టర్ రణ్‌బీర్ కపూర్'' అన్నారు. రణ్‌బీర్ కపూర్ మాట్లాడుతూ– ''రాజమౌళిగారు గొప్ప మనసున్న వ్యక్తి. నేను కలిసిన మొదటి సూపర్ స్టార్ మహేశ్‌బాబుగారు. 'ఒక్కడు' సినిమా చూసి ఆయనకి మెసేజ్ చేశాను'' అన్నారు. ఈ వేడుకలో మంత్రి మల్లారెడ్డి, నిర్మాతలు 'దిల్' రాజు, భూషణ్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా తదితరులు పాల్గొన్నారు.

## అప్పుడు సూపర్ స్టార్ కావొచ్చు!



నయనతార

నయనతార కెరీర్‌లో రూపొందిన 75వ సినిమా 'అన్నపూరణి'. జై, సత్యరాజ్ కీలక పాత్రలు పోషించారు. నీలేష్ కృష్ణ దర్శకత్వంలో జీ స్టూడియోస్, నాడ్ స్టూడియోస్, ట్రైడెంట్ ఆర్ట్స్ నిర్మించిన ఈ చిత్రం డిసెంబర్ 1న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్ విడుదలైంది ''నేను ఇండియాలోనే బెస్ట్ చెఫ్ అవుతాను.. అంకుల్', 'కలలో కోట కట్టకు.. వీధిలో క్రికెట్ ఆడే ప్రతి ఒక్కరూ సచిన్ టెండూల్కర్ కాలేడు, అలాగే ప్రతి బస్ కండక్టర్ సూపర్‌స్టార్ కాలేడు', 'ఇష్టపడి చేస్తే లక్షల్లో ఒకరు కాదమ్మా... లక్ష మందీ సూపర్ స్టార్ కావొచ్చు' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ఓ బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన అన్నపూర్ణ (నయనతార పాత్ర పేరు) చెఫ్ కావాలనుకుంటుంది. ఈ క్రమంలో మాంసాహార వంటకాలను రుచిగా చేయాల్సి ఉంటుంది. కానీ ఇందుకు ఆ యువతి కుటుంబ సభ్యులు ఒప్పుకోరు. అప్పుడు ఆ యువతి ఏం చేసింది? జీవితంలో ఆమె లక్ష్యాన్ని ఎలా చేరుకుంది? అన్నది ఈ సినిమా కథనం.

## రాసి పెట్టుకోండి.. అందర్నీ నవ్విస్తాం - నితిన్



వక్కంతం వంశీ, నితిన్, సుధాకర్ రెడ్డి, సునీల్ నారంగ్

''నటుడిగా నా 21 ఏళ్ల కెరీర్‌లో 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్' నా 32వ సినిమా. నేను చేసిన మంచి పాత్రల్లో ఈ చిత్రం నంబర్ వన్ అవుతుంది. వక్కంతం వంశీగారు కథ అందించిన 'కిక్, రేసు గుర్రం, టెంపర్' సినిమాలన్నీ హిట్ అయ్యాయి. ఈ చిత్రాలకు ఏ మాత్రం తగ్గకుండా 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్' మూవీ ఉంటుంది. ప్రేక్షకులందర్నీ నాన్ స్టాప్‌గా నవ్విస్తాం'' అని హీరో నితిన్ అన్నారు. వక్కంతం వంశీ దర్శకత్వంలో నితిన్, శ్రీలీల జంటగా నటించిన చిత్రం 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్'. శ్రేష్ఠ్ మూవీస్, ఆదిత్య మూవీస్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్స్, రుచిర ఎంటర్‌టైన్ మెంట్స్‌పై సుధాకర్ రెడ్డి, నికితా రెడ్డి నిర్మించిన ఈ చిత్రం డిసెంబర్ 8న విడుదల కానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ట్రైలర్ విడుదల వేడుకలో నితిన్ మాట్లాడుతూ– ''ఈ మూవీలో స్క్రీన్ ప్లే కొత్తగా ఉంటుంది. మంచి కథ, పాటలు, చక్కని డ్యాన్స్ కూడా ఉంటాయి. డిసెంబర్ 8న హిట్ సాధించబోతున్నాం.. ఇది కచ్చితం.. రాసి పెట్టుకోండి'' అన్నారు. ''ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్' ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌కి మమ్మల్ని సపోర్ట్ చేయటానికి వచ్చిన అభిమానులు, ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు ఎన్. సుధాకర్ రెడ్డి. ''అద్భుతమైన బౌండ్ స్క్రిప్ట్ ఇవ్వటానికి నేను, నితిన్ రెండేళ్లు కష్టపడ్డాం. అందర్నీ ఎంటర్‌టైన్ చేయాలని రెండేళ్లు కష్టపడి చాలా జాగ్రత్తగా ఒళ్లు దగ్గర పెట్టుకుని పని చేశాం'' అన్నారు వక్కంతం వంశీ.

## గర్ల్ ఫ్రెండ్ కథ



అల్లు అరవింద్, రాహుల్ రవీంద్రన్

రష్మికా మందన్నా ప్రధాన పాత్రలో నటించనున్న సినిమా 'ది గర్ల్ ఫ్రెండ్'. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో విద్య కొప్పినేని, ధీరజ్ మొగిలినేని నిర్మించనున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవం మంగళవారం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి దర్శక-నిర్మాత మారుతి కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ ఇచ్చారు. దర్శక-నిర్మాత సాయి రాజేశ్ గౌరవ దర్శకత్వం వహించారు. వైవిధ్యమైన ప్రేమకథతో తెరకెక్కనున్న 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమా రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభం కానుందని చిత్ర యూనిట్ వెల్లడించింది. ఈ సినిమాకు సంగీతం: హేషమ్ అబ్దుల్ వాహబ్, కెమెరా: కృష్ణన్ వసంత్.


## ఎనభై లొకేషన్స్‌లో షష్టిపూర్తి



అర్చన, ఆకాంక్షా సింగ్, రూపేష్ కుమార్, రాజేంద్రప్రసాద్

రూపేష్ కుమార్ హీరోగా నటిస్తూ, నిర్మిస్తున్న చిత్రం 'షష్టిపూర్తి'. పవన్‌ప్రభ దర్శకత్వంలో ఆకాంక్షా సింగ్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో రాజేంద్ర ప్రసాద్, అర్చన కీలక పాత్రధారులు. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను దర్శకుడు అనిల్ రావిపూడి విడుదల చేసి, సినిమా విజయం సాధించాలన్నారు. ఈ సందర్భంగా పవన్ ప్రభ మాట్లాడుతూ– ''షష్టిపూర్తి' నేపథ్యంలో రూపొందుతున్న సినిమా ఇది. కొంత టాకీ పార్టు, ఓ యాక్షన్ సీక్వెన్స్ బ్యాలెన్స్ ఉన్నాయి. బ్యాలెన్స్ ఉన్న యాక్షన్ సీన్ కోసం రూపేష్ గారు శిక్షణ తీసుకుంటున్నారు. సినిమాలో మొత్తం 80 లొకేషన్స్ ఉన్నాయి. కానీ రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో ఎక్కువ శాతం చిత్రీకరణ జరిగింది. 'లేడీస్ టైలర్' తర్వాత.. అంటే 37 ఏళ్ల తర్వాత రాజేంద్రప్రసాద్, అర్చనగార్లు ఈ సినిమాలో నటిస్తున్నారు కాబట్టి వారిపై ఓ స్పెషల్ రెట్రో ఎపిసోడ్‌ను కూడా చిత్రీకరించాం. ఈ సినిమా ఓ మ్యూజికల్ జర్నీ. అందుకే సంగీత దర్శకుడిగా ఇళయరాజాగారిని తీసుకోవడం జరిగింది'' అన్నారు.

## మార్చిలో గోదావరి గ్యాంగ్



విశ్వక్ సేన్

విశ్వక్ సేన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' మార్చిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. కృష్ణ చైతన్య దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నేహా శెట్టి కథానాయికగా నటించగా, నటి అంజలి ముఖ్యమైన పాత్రను పోషించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య, వెంకట్ ఉప్పుటూరి, ఇన్నమూరి గోపీచంద్ నిర్మించిన ఈ చిత్రం విడుదల తేదీ మారింది. తొలుత డిసెంబరు 8న సినిమాని విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. అయితే 2024 మార్చి 8న రిలీజ్ చేయనున్నట్లు తాజాగా ప్రకటించారు. ''చీకటి ప్రపంచంలో సాధారణ స్థాయి నుండి ధనవంతుడిగా ఎదిగిన ఓ వ్యక్తి కథతో ఈ చిత్రం రూపొందింది. అతని ప్రయాణంలో రాజకీయ చిక్కులు కూడా ఉంటాయి. ఈ సినిమాలో విశ్వక్ సేన్ గ్రే క్యారెక్టర్‌లో కనిపిస్తారు'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: యువన్ శంకర్ రాజా, కెమెరా: అనిత్ మధాడి.

## పదకొండు సినిమాల ప్లాన్ ఉంది



కంచర్ల ఉపేంద్ర


కంచర్ల ఉపేంద్ర, సావిత్రీ కృష్ణ హీరోయిన్లుగా ఆర్యన్ సుభాన్ ఎస్ .కె దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఉపేంద్రగాడి అడ్డా'. కంచర్ల అచ్యుతరావు నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 1న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా కంచర్ల ఉపేంద్ర మాట్లాడుతూ– ''మా నాన్న (కంచర్ల అచ్యుతరావు)గారు రియల్ ఎస్టేట్ వ్యాపారి. సామాజిక కార్యకర్త. ఉపకారి అనే స్వచ్ఛంద సేవా సంస్థను కూడా నిర్వహిస్తున్నారు. నన్ను యాక్టింగ్ వైపు ప్రోత్సహించారు. కంచర్ల, ఉపేంద్ర బీఫార్మసీ, ఐపీసీ 369, అనగనగా కథలో..., ఉపేంద్రగాడి అడ్డా.. ఇలా ఒకేసారి ఐదు సినిమాలు ప్రారంభించాం. వివిధ కారణాల వల్ల నేను సైన్ చేసిన నా ఐదో సినిమా 'ఉపేంద్రగాడి అడ్డా' నా తొలి మూవీగా రిలీజ్ అవుతోంది. సోషల్ మీడియాను మంచిగా ఎలా వినియోగించుకోవాలి అనే అంశంతో పాటు ఎలా వినియోగించుకోకూడదో కూడా చెప్పేలా చిన్న సందేశంతో ఈ సినిమా తీశాం. మహిళలకు బాగా నచ్చుతుంది. నా తర్వాతి చిత్రం 'కంచర్ల' సంక్రాంతి టైమ్‌లో విడుదల కావొచ్చు. ఇక నా ఆరో సినిమా '1920 భీమునిపట్నం'కు ఇళయరాజాగారు సంగీతం ఇవ్వడం చాలా సంతోషాన్నిస్తోంది. మా నాన్నగారు నాతో 11 సినిమాలు తీయాలని నిర్ణయించుకున్నారు'' అని చెప్పుకొచ్చారు.

## పది నిమిషాలకో ట్విస్ట్ ఉంటుంది



సుభాష్ నూతలపాటి

కార్తీక్‌రాజు, సిమ్రాన్ చౌదరి, ఐరా హీరో హీరోయిన్లుగా మహేశ్ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రం 'అథర్వ'. నూతలపాటి నరసింహం, అనసూయమ్మ సమర్పణలో సుభాష్ నూతలపాటి నిర్మించిన ఈ సినిమా డిసెంబరు 1న విడుదల కానుంది. ఈ సందర్భంగా సుభాష్ నూతలపాటి మాట్లాడుతూ– ''దర్శకుడు మహేశ్ రెడ్డిగారు ఈ సినిమా కథ చెప్పినప్పుడు థ్రిల్లింగ్‌గా అనిపించింది. మహేశ్‌గారి సోదరుడు ఒకరు 'క్లూ' టీమ్‌లో వర్క్ చేస్తున్నారు. ఆయన సహకారంతో, పరిశోధన చేసి ఈ సినిమా కథను రెడీ చేశారు మహేశ్. ప్రతి పది నిమిషాలకో ట్విస్ట్ ఉంటుంది. సురేశ్ ప్రొడక్షన్స్ మా సినిమా రిలీజ్‌కు సహాయం చేస్తోంది. నిర్మాత సురేశ్‌బాబుగారు ఈ సినిమాను చూడలేదు. అయితే 'క్లూస్' అధికారులకు ఈ సినిమాను చూపించినప్పుడు వారు హ్యాపీగా ఫీలయ్యారు. థ్రిల్లింగ్‌గా ఉందని చెప్పారు. ఈ సినిమా వారికో నివాళిగా కొందరు పేర్కొనడం ఆనందంగా అనిపించింది. ఈ సినిమాకు సీక్వెల్ తీయవచ్చు'' అని చెప్పుకొచ్చారు.


'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే,
ప్రజా సేవలో సమర్థతను
చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+6 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 248

బుధవారం 29-11-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




**వాహనాలకు పండుగ గిరాకీ..**

ఈ ఏడాది పండుగ సీజన్‌లో దేశీయంగా 37,93,584 వాహనాలు అమ్ముడైనట్లు వాహన డీలర్ల సమాఖ్య ఫాడా వెల్లడించింది. గతేడాదితో పోలిస్తే 19% వృద్ధి నమోదైనట్లు తెలిపింది. అక్టోబర్ 15 నుంచి నవంబర్ 25 వరకు జరిగిన విక్రయాల గణాంకాలను ఫాడా విడుదల చేసింది. -బిజినెస్‌లో

## ఇందిరమ్మ రాజ్యం

# ఎవరికి కావాలిప్పుడు?

### గజ్వేల్, వరంగల్ ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్



గజ్వేల్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన జనం. ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్



**కాంగ్రెసోళ్లు పాత చరిత్ర మళ్లీ తెస్తామంటున్నారు**

- తెలంగాణ పిల్లలను చంపిన ఘనత ఆ పార్టీది
- మీరు నన్ను సీఎంని చేస్తే రాష్ట్రానికి ఆకాశం అంత కీర్తి వచ్చింది
- తలసరి ఆదాయంలో దేశంలోనే నంబర్ వన్‌గా తెలంగాణ
- సాగు నీరు, ఉచిత విద్యుత్‌తో 3 కోట్ల టన్నుల ధాన్యం దిగుబడి
- నాకు పదవుల కాంక్ష లేదు.. రాష్ట్రాన్ని చక్కదిద్దాలన్నదే లక్ష్యమన్న కేసీఆర్
- మనం ఏంటో 30వ తేదీన నిరూపించాలని విజ్ఞప్తి

సాక్షిప్రతినిధి, వరంగల్/ సాక్షి, సిద్దిపేట: 'కాంగ్రెస్ గెలిస్తే ఇందిరమ్మ రాజ్యం తెస్తామని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఇందిరమ్మ రాజ్యం ఎవరికి కావాలిప్పుడు? అప్పుడు ఏం సక్కదనం వెలగబెట్టారని పదేపదే ఆ పేరు ఉచ్చరిస్తున్నారు? ఇందిరమ్మ రాజ్యం అంటే ఎమర్జెన్సీ.. కాలిన కడుపులు, కాల్చివేతలు, కూల్చివేతలేగా. ఆ కష్టాలు మనకు అవసరమా? ఎన్‌కౌంటర్లు, రక్తపాతం, తెలంగాణ ఉద్యమ సమయంలో 1969లో 400 మంది కాల్చివేత.. ఇవన్నీ మరిచిపోలేదు. కాంగ్రెసోళ్లు ఇప్పుడు మళ్లీ పాత చరిత్ర తెస్తామంటున్నారు. కానీ మనం ఏంటనేది 30వ తేదీన నిరూపించాలి..' అని సీఎం, బీఆర్ఎస్ అధినేత, పార్టీ గజ్వేల్ అభ్యర్థి కె.చంద్రశేఖర్‌రావు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారం చివరిరోజు మంగళవారం గజ్వేల్‌లో, వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ ఆవరణలో నిర్వహించిన భారీ ప్రజా ఆశీర్వాద సభల్లో ఆయన మాట్లాడారు.

**కాంగ్రెస్ ఒరగబెట్టిందేమీ లేదు:** 'ఐదు దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమంలో వందలాది మంది పిల్లలను, ఉద్యమకారులను పొట్టనబెట్టుకున్న ఘన చరిత్ర కాంగ్రెస్‌కు ఉంది. 1956లో తెలంగాణను ఊడగొట్టింది కాంగ్రెస్ పార్టీ కాదా? ఆ తర్వాత నా ఆమరణ నిరాహార దీక్షతో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం కావడం, 33 రాష్ట్రాలు మద్దతు లేఖలు ఇవ్వడంతో దిగొచ్చిన కేంద్రం తెలంగాణ ప్రకటన చేసింది. బీఆర్ఎస్ పుట్టిందే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకునేందుకు, హక్కులను పరిరక్షించుకునేందుకు. ఇందిరమ్మ రాజ్యం సక్కగా ఉంటే ఎన్టీఆర్ పార్టీ పెట్టి రూ.2కే కిలో బియ్యం ఎందుకు ఇయ్యాల్సి వచ్చింది? అప్పటివరకు రాష్ట్రం ఆకలి కడుపుతో ఉన్నందుకేగా? కాంగ్రెస్ గెలిచేది లేదు సచ్చేది లేదు. ఒక్క మెడికల్ కళాశాల, ఒక్క నవోదయను ఇవ్వని బీజేపీని మనం ఎందుకు నెత్తిన పెట్టుకోవాలి? రాష్ట్ర అభివృద్ధికి సాయం చేయని కేంద్రానికి మనం ఎందుకు సహకరించాలి?' అని కేసీఆర్ ప్రశ్నించారు.

**మీరు సీఎం చేస్తేనే నేను కష్టపడ్డా..**

'గజ్వేల్ నుంచి మీరు అవకాశం ఇచ్చి రాష్ట్రానికి ముఖ్యమంత్రిని చేసి పంపిస్తేనే నేను కష్టపడ్డా. తెలంగాణ ఆచరిస్తే.. దేశం అనుసరించే విధంగా తెలంగాణను తయారు చేసుకున్నాం. ఆకాశం అంత కీర్తి వచ్చింది. తలసరి ఆదాయంలో

మిగతా 3వ పేజీలో ▶



## కారు.. సారు.. హ్యాట్రిక్?

తెలుగునాట ఏ పార్టీ వరుసగా మూడుసార్లు గెలిచిన రికార్డు ఇప్పటి వరకూ లేదు. ప్రస్తుతం బీఆర్ఎస్ ఆ రికార్డు సృష్టించనుందా? సీఎంగా కేసీఆర్ మూడోసారి ప్రమాణం చేయనున్నారా? ఆ పార్టీ నేతలు అవుననే అంటున్నారు.

- జంగ్ తెలంగాణలో



**ఇదంజూఠ్**




అలవాటయిన ప్రాణమాయె!
బయట తిరగకూడదుగా!!

## ప్రలోభాలపై

# 24×7 నిఘా!

### చెక్ పోస్టుల వద్ద ప్రతి వాహనం తనిఖీ: సీఈఓ వికాస్‌రాజ్

**ముగిసిన ప్రచార గడువు**

- అమల్లోకి నిషేధాజ్ఞలు, 144 సెక్షన్
- ఒపీనియన్ పోల్స్‌పై నిషేధం.. బల్క్ ఎస్ఎంఎస్‌లు, వాయిస్ మెసేజ్‌లపై కూడా..
- ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు కూడా పోలింగ్ ముగిసిన అర్ధగంట తర్వాతే



సాక్షి, హైదరాబాద్: 'ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా మంగళవారం రాత్రి మొదలు నిరంతర పర్యవేక్షణ పోలింగ్ పూర్తయ్యే వరకూ కొనసాగుతుంది. ప్రతి వాహనాన్నీ తనిఖీ చేయాలని ఆదేశించాం. ప్రతి ఫిర్యాదుపై దగ్గర్లోని వీడియో సర్వైలెన్స్ బృందాలు వెళ్లి విచారణ చేస్తాయి.'అని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) వికాస్‌రాజ్ స్పష్టం చేశారు. ఓటర్లకు డబ్బులు, మద్యం, ఇతర కానుకల పంపిణీని కట్టడి చేసేందుకు కంట్రోల్ రూమ్ ద్వారా 24x7 పర్యవేక్షణ కొనసాగుతుందని వెల్లడించారు. అన్ని చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలను ప్రత్యక్ష ప్రసారం ద్వారా కంట్రోల్ రూమ్స్ నుంచి పర్యవేక్షిస్తామని చెప్పారు. రాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికల ఏర్పాట్లను మంగళవారం ఆయన బీఆర్‌కేఆర్ భవన్‌లోని తన కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వివరించారు.

**స్థానికేతరులందరూ వెళ్లిపోవాలి...**

ఎన్నికల ప్రచారానికి తెరపడిందని, మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి సైలెన్స్ పీరియడ్ ప్రారంభమైందని వికాస్ ప్రకటించారు. రాజకీయ, ప్రచార కార్యక్రమాలపై నిషేధాజ్ఞలతో పాటు 114 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఎన్నికల ప్రచారం కోసం వచ్చిన స్థానికేతరులందరూ నియోజకవర్గాలను విడిచి తక్షణమే వెళ్లిపోవాలని ఆదేశించారు

**ప్రతి పార్టీ నిషేధాజ్ఞలు పాటించాలి**

నిషేధాజ్ఞలను అనుసరించాలనీ, టీవీ, సినిమా, రేడియో వంటి ప్రసార మాధ్యమాల ద్వారా ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయకూడదనే నిబంధనలను పాటించాలని అన్ని

మిగతా 3వ పేజీలో ▶

# ఆఖిరి క్షణం దాకా అప్రమత్తం

- ప్రచారం ముగియడంతో తదుపరి కార్యాచరణపై బీఆర్ఎస్ దృష్టి
- పోలింగ్ ముగిసేదాకా అనుసరించాల్సిన వ్యూహంపై కేసీఆర్ దిశా నిర్దేశం
- గజ్వేల్ నుంచి ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల ప్రచార పర్వం మంగళవారం సాయంత్రం ముగియడంతో వచ్చే రెండురోజుల పాటు అనుసరించాల్సిన వ్యూహంపై భారత్ రాష్ట్ర సమితి దృష్టి సారించింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజా ఆశీర్వాద సభల పేరిట బహిరంగ సభల్లో పాల్గొన్న పార్టీ అధినేత, సీఎం కె.చంద్రశేఖర్‌రావు గజ్వేల్ సభ అనంతరం ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్నారు. ఎన్నికల ప్రచారం తీరుతెన్నులను సమీక్షించిన కేసీఆర్.. పోలింగ్ ప్రక్రియ ముగిసేంత వరకు క్షేత్ర స్థాయిలో పార్టీ కేడర్, నాయకులు, అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. చివరి నిమిషం వరకు ఓటర్లతో సమన్వయం చేసుకుంటూ ఒక్కో ఓటును ఒడిసి పట్టుకోవాలని సూచించారు. పోలింగ్ శాతం పెరిగేలా చూసుకోవడంతో పాటు, దూర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లను రప్పించడంపై దృష్టి సారించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. ప్రత్యర్థి పార్టీల వ్యూహాలు, ఎత్తుగడలు, ప్రలోభాలపై ప్రత్యేకంగా కన్నేసి ఉంచాలంటూ పార్టీ నేతలకు ఆదేశాలు వెళ్లాయి. చివరి ఓటు పడేంత వరకు పార్టీ ఏజెంట్లు పోలింగ్ బూత్‌లలోనే

మిగతా 3వ పేజీలో ▶

క్లుప్తంగా...


నిజామాబాద్ జిల్లా కంజర్‌లో కురిసిన వడగళ్లు

## నిజామాబాద్‌లో వడగళ్ల వాన బీభత్సం

తెగిపడిన విద్యుత్ తీగలు.. ధ్వంసమైన వాహనాల అద్దాలు

**సుభాష్‌నగర్:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా మంగళవారం సాయంత్రం కురిసిన వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. 20 ఎంఎం సైజులో వడగళ్లు పడి పలుచోట్ల వాహనాల అద్దాలు ధ్వంసమయ్యాయి. బలమైన ఈదురుగాలులకు విద్యుత్ తీగలు తెగి పడి విద్యుత్ అంతరాయం ఏర్పడింది. చెట్లు నేలకొరిగి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఒక్కసారిగా వడగళ్లు కురవడంతో పలుచోట్ల వాహనదారులు గాయపడ్డారు. జిల్లాలోని పలు మండలాల్లో వరి ధాన్యం రాసులు తడిసి ముద్దయ్యాయి. ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు చేరుకున్నా.. ఇంకా అక్కడక్కడా ధాన్యం సేకరణ కొనసాగుతోంది.

## నీటిపారుదల శాఖ ఇన్‌చార్జి కార్యదర్శిగా స్మితాసబర్వాల్



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర నీటిపారుదల శాఖ కార్యదర్శిగా ముఖ్యమంత్రి కార్యదర్శి స్మితా సబర్వాల్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్ ఈనెల 30న పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ఆయన స్థానంలో తదుపరి నిర్ణయం తీసుకునే వరకు స్మితా సబర్వాల్ కొనసాగుతారని ఉత్తర్వుల్లో తెలిపారు.

## కర్ణాటక పాలనపై అసత్య ప్రచారం

కర్ణాటక మంత్రి రామలింగారెడ్డి


రెడ్డి సంఘాల ప్రతినిధులతో రామలింగారెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** కర్ణాటకలో ఐదు గ్యారంటీ పథకాల అమలుపై తెలంగాణలో అసత్య ప్రచారం చేస్తున్నారని ఆ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డి వ్యాఖ్యానించారు. ఎన్నికల సందర్భంగా కర్ణాటక ప్రజలకిచ్చిన అన్ని హామీలను నెరవేర్చామని, కానీ తెలంగాణ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బీఆర్‌ఎస్, బీజేపీలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని మండిపడ్డారు. తెలంగాణ ఎన్నికల్లో ప్రచారం కోసం మంగళవారం హైదరాబాద్‌కు వచ్చిన ఆయన రెడ్డి సంఘాలతో సమావేశమయ్యారు. రామలింగారెడ్డి మాట్లాడుతూ తెలంగాణలోని రెడ్డి సామాజిక వర్గం కాంగ్రెస్‌కు వెన్నుదన్నుగా నిలవాలని కోరారు. అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ పార్టీ రెడ్డి కులస్తులకు సముచిత ప్రాధాన్యం ఇస్తుందన్నారు. తెలంగాణ ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామని హామీఇచ్చారు. ఖైరతాబాద్‌లోని టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఎంఆర్‌జీ వినోద్‌రెడ్డి నివాసంలో జరిగిన ఈ సమావేశంలో తీగల మోహన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, పాండు రంగారెడ్డి (రాజ్ బహదూర్ వెంకట్రామారెడ్డి అసోసియేషన్), ప్రొఫెసర్ మధుసూదన్‌రెడ్డి (తెలంగాణ రెడ్డి అసోసియేషన్), లక్ష్మారెడ్డి, అశోక్‌రెడ్డి (రెడ్డి జన సంఘం ఆలియాబాద్) తదితరులు పాల్గొన్నారు.

## ‘ఊహించని మెజార్టీతో అధికారంలోకి కాంగ్రెస్’



**సాక్షి ప్రతినిధి, ఖమ్మం:** ఊహించని మెజార్టీకి తోడు కనీవిని ఎరుగని రీతిలో 82 సీట్లు గెలుచుకుని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతోందని.. వచ్చేనెల 9న ఎల్‌బీ స్టేడియంలో ఉదయం 10 గంటలకు సీఎం ప్రమాణ స్వీకారం ఉంటుందని మాజీ ఎంపీ, కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఖమ్మం రూరల్ మండలం సాయిగణేష్ నగర్‌లో మంగళవారం సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ తొలి కేబినెట్‌లోనే ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుడతామని, రైతు భరోసా కింద ఎకరాకు రూ.7,500 రైతుల ఖాతాల్లో వేయనున్నట్లు చెప్పా రు. కాంగ్రెస్ దత్తపుత్రిక ఉచిత కరెంట్ అని, నాడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ ఫైల్‌పైనే వైఎస్ తొలి సంతకం చేశారని గుర్తు చేశారు. పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలను తెలుసుకున్న వైఎస్.రాజశేఖరరెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేశారన్నారు.

# మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి

- ఫామ్‌హౌస్ పాలన కావాలా? ప్రజా పాలన సర్కారు కావాలా?
- కాంగ్రెస్ వస్తేనే పేదలకు న్యాయం జరుగుతుంది
- మొదటి మంత్రివర్గంలోనే గ్యారంటీ పథకాలను అమలు చేస్తాం
- జహీరాబాద్ రోడ్‌షోలో ప్రియాంకా గాంధీ


జహీరాబాద్ రోడ్‌షోలో మాట్లాడుతున్న ప్రియాంక

**జహీరాబాద్:** రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో అధికారంలోకి రావడం ఖాయమని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అన్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో నిర్వహించిన రోడ్‌షోలో ఆమె పాల్గొని ప్రసంగించారు. బీఆర్‌ఎస్ పాలనతో విసిగిపోయిన ప్రజలు మార్పు కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. ఫాంహౌస్‌కే పరిమితం అయిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బైబై చెప్పాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మహిళల కోసం చేసిందేమీ లేదని, రాష్ట్రంలో అత్యాచారాలు పెరిగిపోయాయని, యువతకు ఉద్యోగాలు ఇవ్వలేదని, పేపర్ లీకేజీలు అయ్యాయని, రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయిందని అన్నారు. రుణమాఫీ హామీ ఎందుకు అమలు చేయలేదని ఆమె ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్‌ఎస్ రెండూ ఒక్కటేనని, ఈ రెండూ ధనిక పార్టీలని, ఈ డబ్బంతా ప్రజలదేనన్నారు.

**ప్రధానికి రెండు విమానాలు**

ప్రధాని నరేంద్రమోదీ వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి రెండు విమానాలను కొనుగోలు చేశారని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. దేశంలో రైతు రోజుకు రూ. 27 సంపాదిస్తున్నాడని, మోదీ స్నేహితుడు అదానీ మాత్రం వేల కోట్లు సంపాదించారని చెప్పారు. అయినప్పటికీ అదానీకి వేలకోట్ల రూపాయల రుణాలను ప్రధాని మాఫీ చేయించారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వానికి పార్లమెంట్‌లో అవసరం వచ్చినప్పుడు బీఆర్‌ఎస్ మద్దతునిస్తోందని, తెలంగాణలో బీఆర్‌ఎస్‌కు ఎంఐఎం మద్దతునిస్తోందన్నారు.

**రాహుల్‌పైనే ఒవైసీ విమర్శలు**

ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కేసీఆర్, బీజేపీలను విమర్శించరని, కేవలం రాహుల్‌గాంధీపైనే విమర్శలు చేస్తారని ప్రియాంక తెలిపారు. ఎంఐఎం దేశ వ్యాప్తంగా 40 కంటే ఎక్కువ సీట్లలో పోటీ చేస్తోందని, తెలంగాణలో మాత్రం 9 స్థానాల్లోనే పోటీకి దిగిందన్నారు. బీఆర్‌ఎస్‌ను గెలిపించేందుకే ఆ పార్టీ ఇలా చేస్తోందని ఆమె విమర్శించారు.

**ప్రజలకోసం ఆరు గ్యారంటీలు..**

తెలంగాణ ప్రజల కోసం ఆరు గ్యారంటీ పథకాలు తెచ్చామని, అధికారంలోకి రాగానే అమలు చేస్తామని ప్రియాంక గాంధీ అన్నారు. ధాన్యంపై ప్రతి క్వింటాలుపై రూ.500 బోనస్ ఇస్తామని, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, 24 గంటల కరెంటు సరఫరా చేస్తామని ఆమె వివరించారు. ఇందిరమ్మ ఇంటి పథకం కింద స్థలంతో పాటు రూ.5 లక్షల అందిస్తామని, రాజీవ్ ఆరోగ్యశ్రీ యోజన కింద రూ.10 లక్షలతో ఉచిత వైద్యం అందిస్తామన్నారు. వృద్ధులకు రూ.4వేల పింఛన్ అందజేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ అమరుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామన్నారు. నీతి, నిజాయితీగల తమ పార్టీ అభ్యర్థి ఎ.చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరారు. సభలో కర్ణాటక మంత్రి ఈశ్వర్ ఖండ్రే, మాజీ ఎంపీ సురేష్ షెట్కార్, జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డి, నియోజకవర్గం కో–ఆర్డినేటర్ ఎన్.గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఇదేమి పని ‘నారాయణా’!?

- టీడీపీ ఎన్నికల ఉచ్చులోకి నారాయణ విద్యా సంస్థల ఉపాధ్యాయులు, సిబ్బంది
- నెల్లూరులో ఓటర్ల వెరిఫికేషన్ పేరుతో వ్యక్తిగత సమాచార సేకరణ

**సాక్షి ప్రతినిధి, నెల్లూరు:** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో నారాయణ విద్యా సంస్థల ఉద్యోగులు, ఉపాధ్యాయులు టీడీపీ ఎన్నికల ఉచ్చులో ఇరుక్కున్నారు. తమ విద్యాసంస్థల అధినేత, టీడీపీకి చెందిన మాజీ మంత్రి పొంగూరు నారాయణ రాజకీయంలో సమిధలైపోతున్నారు. వారి చేత నారాయణ ఓటర్ల వెరిఫికేషన్ పేరుతో ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఇలా వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తున్న నారాయణ సిబ్బంది, ఉపాధ్యాయులకు ప్రజలు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగిస్తున్నారు. 3 రోజుల క్రితమే నెల్లూరు మూలాపేట డివిజన్‌లో ఓటర్ల వెరిఫికేషన్ పేరుతో వ్యక్తిగత సమాచారం సేకరిస్తున్న నారాయణ ఉద్యోగినికి స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. తాజాగా మంగళవారం 42వ డివిజన్ మన్సూర్‌నగర్‌లో ఇదే తరహాలో నారాయణ విద్యా సంస్థల ఉపాధ్యాయుడు ఓటర్ల వెరిఫికేషన్ పేరుతో వ్యక్తిగత సమాచారం సేకరిస్తుండగా స్థానికులు ఆగ్రహించి అతనికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

**ఎన్ టీంగా ఏర్పాటు**

నారాయణ టీడీపీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయిన ఆయన 2024 ఎన్నికల్లో నెల్లూరు నుంచి మరోసారి బరిలోకి దిగేందుకు సమాయత్తం అవుతున్నారు. నాలుగున్నరేళ్ల పాటు నెల్లూరుకు ముఖం చాటేసిన ఆయనపై టీడీపీ కేడర్‌లో తీవ్ర అసంతృప్తి ఉంది. ఆయన కోసం పనిచేయడానికి టీడీపీ నేతలెవరూ ముందుకు రావడంలేదు. దీంతో తన విద్యా సంస్థల ఉద్యోగులు, ఉపాధ్యాయులను రంగంలోకి దింపుతున్నారు. దాదాపు 150 మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులతో నారాయణ టీం (ఎన్ టీం)గా ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఆ బృందంలోని వారితో నెల్లూరు నగరంలో ఓటర్ల వెరిఫికేషన్ పేరుతో ప్రజల వ్యక్తిగత సమాచారం తీసుకుంటున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల ఆధార్ కార్డులు, బ్యాంకు ఖాతా సమాచారం, వారి మొబైల్‌కు వచ్చే ఓటీపీని కూడా అడుగుతుండడంతో స్థానికుల్లో ఆందోళన ఏర్పడింది. తమ ఓట్లు తొలగిస్తారని స్థానికులు వారిని అడ్డుకుంటున్నారు. నెల్లూరు నగరంలో మూడు రోజుల్లోనే ఇద్దరు ఉపాధ్యాయులు దేహశుద్ధి చేయించుకొన్నారు.

**ఇదేం ఖర్మ అంటున్న ఉద్యోగులు**

2014 ఎన్నికల వరకు నారాయణ టీడీపీకి ఆర్థికంగా తోడ్పాటు అందిస్తూ ఆ పార్టీ అధినేత చంద్రబాబుకు బినామీగా వ్యవహరించేవారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక నారాయణకు చంద్రబాబు మంత్రి పదవి ఇచ్చారు. 2019 ఎన్నికల్లో నెల్లూరు నగరం నుంచి పోటీ చేసి ఆయన ఓడగా నాటి నుంచి ఉద్యోగులను జీ రాజకీయ ఉచ్చులోకి దింపుతున్నారు. నిరాకరించిన వారిని తొలగించడం లేదా బదిలీ చేస్తున్నట్లు ఓ ఉద్యోగి చెప్పారు. ఇప్పుడు ఉద్యోగులు ప్రజల చేతిలో తన్నులు తింటున్నారు. మాకు ఇదేం ఖర్మ అంటూ ఆవేదన చెందుతున్నారు.

# బ్యాంక్‌కు రూ.కోటి బురిడీ !

నకిలీ బంగారాన్ని కుదువబెట్టించిన గోల్డ్ అప్రైజర్

**భద్రాచలం అర్బన్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో గోల్డ్ అప్రైజర్‌గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి అదే బ్యాంక్‌కు సుమారు రూ.కోటి మేర బురిడీ కొట్టినట్లు సమాచారం. నిత్యం వివిధ పనులపై బ్యాంకుకు వస్తున్న ఖాతాదారులతో స్నేహం పెంచుకుని, తన వద్ద కొంత బంగారం ఉందని, తన పేరున బ్యాంక్‌లో కుదువపెట్టడం నిబంధనలకు విరుద్ధమని వారిని నమ్మించాడు. వన్‌గ్రామ్ గోల్డ్‌ను సదరు ఖాతాదారులతో అదే బ్యాంక్‌లో కుదువ పెట్టించి సుమారు 65 మంది నుంచి నగదు తీసుకున్నాడు. బ్యాంక్ నిబంధనల ప్రకారం మేనేజర్ స్థాయి వరకు వెళ్లకుండా కొంతమేర నగదు విడుదల చేయించవచ్చు. దీన్ని ఆసరాగా చేసుకుని ఇదే ప్రక్రియను కొనసాగించాడు. కాగా బ్యాంక్‌లో వస్తువు కుదువబెట్టి ఏడాది దాటిందని, వెంటనే విడిపించుకోవాలని ఓ ఖాతాదారుడి ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో అతడు బ్యాంక్‌కు వచ్చి గోల్డ్ అప్రైజర్‌ను నిలదీయడంతో బ్యాంక్ అధికారులు ఆరా తీశారు. దీంతో 65 మంది ఖాతాదారులతో నకిలీ బంగారాన్ని (వన్ గ్రామ్) కుదవపెట్టించి సుమారు రూ.కోటి వరకు బ్యాంక్‌ను మోసం చేసినట్లు వెల్లడైంది.

## ఓ పార్టీ నేత ఇంట్లో రూ.55 లక్షలు పట్టివేత



**మంచిర్యాల రూరల్ (హాజీపూర్):** మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండల కేంద్రంలో ఓ పార్టీ నాయకుడి ఇంట్లో జరిపిన సోదాల్లో పెద్ద ఎత్తున నగదు బయటపడింది. ఆదాయ పన్ను శాఖ, ఫ్లయింగ్ స్క్వాడ్, హాజీపూర్ పోలీసులు సంయుక్తంగా బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు మాధవరపు వెంకటరమణారావు ఇంట్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి ఆధారాలు, పత్రాలు లేని రూ.55 లక్షలు గుర్తించి వివరాలు ఆరా తీశారు. ఎన్నికల నియమావళి మేరకు ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో ఆ డబ్బును ఆదాయ పన్ను శాఖ అధికారులు సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో ఆదాయ పన్ను శాఖ అధికారి సూర్యభగవాన్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు రాజయ్య, రాములు, హాజీపూర్ ఎస్సై నరేశ్‌కుమార్ పాల్గొన్నారు. బీజేపీ నేత ఇంట్లో డబ్బులు దొరకడంతో ఓటర్లకు పంపిణీ చేసేందుకే ఇక్కడ ఉంచారని ప్రత్యర్థి పార్టీలు ఆరోపించాయి.

# మళ్లీ కరోనా కలకలం

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో మళ్లీ కరోనా కలకలం రేపింది. మంగళవారం రాష్ట్రంలో 415 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా, అందులో హైదరాబాద్‌లో ఒకరికి వైరస్ సోకినట్లు ప్రజారోగ్య సంచాలకుడు శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ మేరకు ఆయన బులెటిన్ విడుదల చేశారు. ఈనెల 25న కూడా నగరంలో ఒక కేసు నమోదైందని తెలిపారు. ప్రస్తుతం నలుగురు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని చెప్పారు. దీంతో కరోనా మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో మొత్తం కేసుల సంఖ్య 8.44 లక్షలకు చేరింది. అందులో 8.40 లక్షల మంది రికవరీ అయ్యారు. చలికాలం కావడం, ఎన్నికల్లో జనం గుంపులుగా ఉండటం, ఫ్లూ జ్వరాలు వంటి తదితర కారణాలతో కరోనా కేసులు నమోదవుతున్నట్లు చెబుతున్నారు. అయితే అది ప్రమాదకరంగా లేదని వైద్య వర్గాలు వెల్లడించాయి.

## సీపీఎం అభ్యర్థి మల్లు లక్ష్మిని గెలిపించాలి

సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందాకారత్


హుజూర్‌నగర్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న బృందాకారత్

**హుజూర్‌నగర్:** ‘బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఈ ఎన్నికల్లో డబ్బులు ఇచ్చి గెలవాలని చూస్తున్నాయి. అలాంటి బూర్జువా పార్టీల మాయాజాలాన్ని ప్రజలు తిప్పికొట్టాలి’అని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందాకారత్ పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి మల్లు లక్ష్మి గెలుపునకు మద్దతుగా మంగళవారం స్థానికంగా రోడ్ షో నిర్వహించారు. అనంతరం పొట్టి శ్రీరాములు సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆమె మాట్లాడారు. ఐదేళ్లకు ఒక సారి వచ్చే ఎన్నికల్లో అధిక మొత్తంలో డబ్బులు ఖర్చుచేసి ప్రజలను మాయచేసే వారికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఎన్నికలు వచ్చాయంటే కొందరు నాయకులు పూటకో పార్టీ మారుతున్నారని, అలాంటి వారికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని బృందాకారత్ సూచించారు. నిరుపేదల పక్షాన, సిద్ధాంతాల కోసం పోరాడే ఎర్రజెండాను ప్రజలు ఆదరించాలని, సీపీఎం అభ్యర్థి మల్లు లక్ష్మిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, శేఖర్‌రావు, రమేశ్, వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి, పాండు, ఏకలక్ష్మి పాల్గొన్నారు.


# నాలుగేళ్లలో ఆంధ్రప్రదేశ్‌కు రూ. 9.41 లక్షల కోట్ల కొత్త పెట్టుబడులు

ఎంఎస్‌ఎంఈ ఎగుమతి ప్రమోషన్ కౌన్సిల్ చైర్మన్ వెల్లడి

**సాక్షి, అమరావతి:** ప్రభుత్వ, ప్రైవేట్‌రంగ పెట్టుబడుల్లో ఆంధ్రప్రదేశ్ దూసుకెళుతోంది. 2018–19 నుంచి 2022– 23 వరకు రూ. 9,41,020 కోట్ల విలువైన కొత్త పెట్టుబడులను రాష్ట్రం ఆకర్షించింది. దీనిలో 2022–23లో అత్యధికంగా రూ. 3,32,186 కోట్లు ఉండటం విశేషం. ఎంఎస్‌ఎంఈ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆర్గానిక్ ఫుడ్ ప్రొడ్యూసర్స్ అండ్ మార్కెటింగ్ ఏజెన్సీస్ (సీఏఐఐ) సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనం ఈ వివరాలు వెల్లడించింది. ఈ అధ్యయన నివేదికను మంగళవారం ఢిల్లీలో ఎంఎస్‌ఎంఈ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్. రావత్ విడుదల చేశారు. ఇదిలావుండగా, 2022–23లో ప్రభుత్వం ప్రకటించిన కొత్త పెట్టుబడి ప్రాజెక్టులు రూ. 23,293 కోట్లు కాగా, ప్రైవేట్ రంగం రూ. 3,08,893 కోట్లు.

# ముగిసిన చంద్రబాబు ఢిల్లీ పర్యటన

- ఎంపీలు, న్యాయవాదులతో భేటీ
- ముఖ్య నేతల అపాయింట్‌మెంట్లు లేక నిరాశతో తిరుగు ప్రయాణం



**సాక్షి, న్యూఢిల్లీ:** టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు నాయుడు రెండు రోజుల ఢిల్లీ పర్యటన ముగిసింది. ఆయన మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ఢిల్లీ ఎయిర్‌పోర్టు నుంచి హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. ఢిల్లీలోని జాకీర్‌హుస్సేన్ మార్గ్‌లో ఉన్న ప్రముఖ హోటల్‌లో బస చేసిన చంద్రబాబు... మంగళవారం ఉదయం టీడీపీ ఎంపీలు కనకమేడల రవీంద్రకుమార్, కేశినేని నాని, రామ్మోహన్‌నాయుడులతో భేటీ అయ్యారు. వచ్చే పార్లమెంటు సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. అనంతరం సుప్రీంకోర్టులో చంద్రబాబు తరపు న్యాయవాదులు గుంటూరు ప్రభాకర్, గుంటూరు ప్రమోద్, ప్రేరణ తదితరులు ఆయనను కలిశారు. సుప్రీం కోర్టులో ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ కేసు, ఫైబర్‌నెట్ కేసులపై న్యాయవాదులతో చర్చించారు. సోమవారం మధ్యాహ్నం తన సతీమణితో కలిసి ఢిల్లీకి వచ్చిన చంద్రబాబు... సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా కుమారుడి వివాహ విందుకు హాజరయ్యారు. ఈ పర్యటనలో పలువురు ముఖ్య నేతలను ఆయన కలుస్తారనే ప్రచారం జరిగింది. కానీ, ఎవరి అపాయింట్‌మెంట్లు లభించకపోవడంతో చంద్రబాబు నిరాశతో వెనుదిరిగారు.

# రైతుబంధు ఆగడానికి కేసీఆరే కారణం: భట్టి

వచ్చే కాంగ్రెస్ ప్రభుత్వంలో తనది ప్రముఖపాత్ర అని వెల్లడి


భట్టి విక్రమార్కకు హారతులతో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

**మధిర:** సీఎం కేసీఆర్ కావాలనే రైతులకు రైతుబంధు నిధులు జమ కాకుండా చేశారని సీఎల్పీ నేత, మధిర కాంగ్రెస్ అభ్యర్థి మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. ఖమ్మం జిల్లా మధిర మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. కేసీఆర్ ఎన్నికల వేళ ఓట్లు రాబట్టుకునేందుకు కుట్ర చేశారని, రైతులపై శ్రద్ధ ఉంటే వైన్స్ టెండర్ల మాదిరిగా రైతుబంధు కూడా ముందే ఇచ్చేవారని చెప్పారు. అయితే, ఇప్పుడు కాంగ్రెస్ నేతలు అడ్డుపడ్డారని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. కాగా, కాంగ్రెస్ హయాంలో ఏర్పాటు చేసిన పవర్ ప్రాజెక్టులతోనే నిత్యం విద్యుత్ ఇవ్వగలుగుతున్నారని, కేసీఆర్ రాకముందే రైతులకు ఉచిత కరెంట్ ఇచ్చిన ఘనత తమ పార్టీదని భట్టి తెలిపారు. రైతుల రుణమాఫీ, పంటలకు నష్టపరిహారం, సబ్సిడీలపై ఎరువులు, విత్తనాలు, సబ్సిడీపై విద్యుత్ మోటార్లు తాము ఇవ్వగా, కేసీఆర్ వాటన్నిటినీ నిలిపేశారని విమర్శించారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణలో జరిగిన అభివృద్ధి ఏమీలేదని ఆరోపించారు. ఈ నెల 30 తర్వాత బీఆర్‌ఎస్ రాష్ట్రంలో కనిపించదని, కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటులో మధిర ఎమ్మెల్యేగా తాను ప్రముఖ పాత్ర పోషిస్తానని భట్టి తెలిపారు.

# నిరుపేదలకూ చిరుధాన్యాలు అందాలి

అంతర్జాతీయ చిరుధాన్య సమ్మేళనం ముగింపు సభలో గవర్నర్ తమిళిసై


మిల్లెట్ స్టార్టప్ వ్యవస్థాపకులకు సర్టిఫికెట్ల ప్రదాన కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై

**సాక్షి సాగుబడి, హైదరాబాద్:** చిరుధాన్యాలను దైనందిన ఆహారంలో భాగంగా చేసుకుంటే పౌష్టికాహార లోపాన్ని సులువుగా జయించవచ్చని, నిరుపేదలు సైతం చిరుధాన్యాలను రోజువారీ ఆహారంగా తీసుకునే అవకాశం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గవర్నర్ డాక్టర్ తమిళిసై అన్నారు. అంతర్జాతీయ చిరుధాన్య సంవత్సరం సందర్భంగా భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ (ఐఐఎంఆర్)–న్యూట్రిహబ్ ఆధ్వర్యంలో నోవోటెల్ హోటల్‌లో సోమవారం ప్రారంభమైన అంతర్జాతీయ చిరుధాన్య సమ్మేళనం మంగళవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో తమిళిసై ముఖ్య అతిథిగా ప్రసంగిస్తూ, చిరుధాన్యాలను ప్రజలు రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవటం తప్పనిసరి అన్నారు. జొన్నలు, రాగులు, సజ్జలకు మాత్రమే పరిమితం కావద్దని, కొర్రలు, సామలు, అరికెలు, అండుకొర్రలు, ఊదలు తదితర చిరుధాన్యాలను కూడా తినాలని సూచించారు.

ప్రధాని మోదీ ప్రత్యేక శ్రద్ధతో యోగాతో పాటు చిరుధాన్యాలను ప్రపంచానికి తిరిగి పరిచయం చేయటం హర్షదాయకమన్నారు. ఐఐఎంఆర్ న్యూట్రిహబ్‌లో శిక్షణతో పాటు ఆర్థిక సాయం పొంది చిరుధాన్యాల ఆహారోత్పత్తుల వ్యాపారం చేపట్టిన పలు స్టార్టప్‌ల వ్యవస్థాపకులకు గవర్నర్ గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందించారు. ముగింపు సమావేశానికి ఐఐఎంఆర్ న్యూట్రిహబ్ సీఈవో డాక్టర్ బి.దయాకర్‌రావు అధ్యక్షత వహించారు. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (క్రాప్‌సైన్స్) డాక్టర్ శర్మ, కమిషన్ ఫర్ అగ్రికల్చరల్ కాస్ట్స్ అండ్ ప్రైసెస్ (సీఏసీపీ) చైర్మన్ డాక్టర్ విజయపాల్ శర్మ, ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ సి.తార సత్యవతి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

**ప్రతి ఒక్కరూ ఓటేయాలి: గవర్నర్**

**సాక్షి, హైదరాబాద్:** అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పిలుపునిచ్చారు. ఓటు వేయడం అనేది ప్రజాస్వామ్య ప్రక్రియలో అత్యంత ప్రాధాన్యం గల హక్కు అని, ప్రతిఒక్కరూ ఈ సదవకాశం వినియోగించుకోవాలని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.


ఫోరమ్ ఫర్ పొలిటికల్ కార్టూనిస్టుల ఆధ్వర్యంలో రూపొందించిన ‘ఆర్ట్ ఫర్ డెమోక్రసీ’వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రామ్‌గోపాల్ వర్మ

# డబ్బులిస్తే తీసుకోండి.. సమర్థులకే ఓటేయండి

‘ఆర్ట్ ఫర్ డెమోక్రసీ’ఆవిష్కరణలో సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ


**సాక్షి, హైదరాబాద్:** ఓటు కోసం అభ్యర్థులెవరైనా డబ్బులిస్తే తీసుకుని ఓటును మాత్రం సమర్థులకే వేయాలని సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ పిలుపునిచ్చారు. ‘ఓటుకు నోటు’కు వ్యతిరేకంగా అవగాహన కల్పించడంలో భాగంగా తెలంగాణ ఆర్టిస్ట్స్ ఫోరమ్, ప్రెస్‌క్లబ్ హైదరాబాద్, ఫోరమ్ ఫర్ పొలిటికల్ కార్టూనిస్టుల ఆధ్వర్యంలో రూపొందించిన ‘ఆర్ట్ ఫర్ డెమోక్రసీ’వాల్‌పోస్టర్‌ను రామ్‌గోపాల్ వర్మ మంగళవారం ఆవిష్కరించారు. సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్ వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో రామ్‌గోపాల్‌వర్మ మాట్లాడుతూ...ప్రజలను మేలుకొల్పడంలో పొలిటికల్ కార్టూన్స్ చాలా ప్రభావం చూపిస్తాయన్నారు. నియోజకవర్గంపై పూర్తి అవగాహన ఉండి, అభివృద్ధి, రోడ్లు, విద్య, వైద్యం తదితర అవసరాలను మెరుగుపరిచే అభ్యర్థులనే ఎన్నుకోవాలని ఓటర్లకు సూచించారు. తానెప్పుడూ పొలిటికల్ మేనిఫెస్టో చూడనని, దానిని రూపొందించడం, అమలు చేయడం తెలిస్తే తానే ఓ రాజకీయ నాయకుడిగా మారిపోయే వాడినని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ‘ఆర్ట్ ఫర్ డెమోక్రసీ’లో భాగమైన కార్టూనిస్ట్‌లను ఆర్జీవీ అభినందించారు. వ్యంగ్య చిత్రాలను గీసే వారు ఇంత సీరియస్‌గా ఉంటారని కార్టూనిస్టులను చూశాకే తెలిసిందని చమత్కరించారు. కార్యక్రమంలో కార్టూనిస్టులు శంకర్ (సాక్షి), సుభాని, మృత్యుంజయ, నర్సిం, అక్బర్, వెంకటేశ్ కతుల, రాకేశ్, పి.ఎస్.చారీ, సురేందర్ సముద్రాల, జె.వెంకటేశ్, నివాస్ చొల్లేటి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాల్ నాయుడు, జనరల్ సెక్రటరీ రవికాంత్ రెడ్డి తదితర ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# లారీని దగ్ధం చేసిన మావోయిస్టులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఘటన



**చర్ల:** ఎన్నికల బహిష్కరణకు పిలుపునిచ్చిన మావోయిస్టులు పోలింగ్‌కు రెండు రోజుల ముందు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం పూసుగుప్ప సమీపంలో ఓ లారీని దగ్ధం చేసి భయోత్పాతం సృష్టించారు. మంగళవారం సాయంత్రం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. చర్ల మండల కేంద్రానికి చెందిన ఓ ధాన్యం వ్యాపారి పూసుగుప్పలో రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని తీసుకొస్తుండగా పూసుగుప్ప – వద్దిపేట మధ్య రోడ్డుపై అడ్డంగా మొద్దులు పెట్టి లారీని నిలిపేశారు. అందులో ఉన్న హమాలీలతో ధాన్యం బస్తాలను కిందకు దింపించి ట్యాంకర్‌లోని డీజిల్ తీసి లారీపై చల్లి నిప్పంటించారు. దీంతో లారీ పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో 30 నుంచి 40 మంది వరకు మావోయిస్టులు పాల్గొన్నట్లు సమాచారం. లారీకి పూర్తిగా మంటలు అంటుకున్న తర్వాత మావోయిస్టులు అక్కడి నుంచి వెళ్లిపోయారని డ్రైవర్, హమాలీలు తెలిపారు. వద్దిపేట, పూసుగుప్ప గ్రామాల్లో సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌లు ఉండగా ఈ రెండింటి మధ్య ఘటన చోటు చేసుకోవడం చర్చనీయాంశమైంది.


'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+6 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 248

బుధవారం 29-11-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




**2 నెలల గరిష్టానికి నిఫ్టీ**

నిఫ్టీ 95 పాయింట్లు పెరిగి గరిష్ట స్థాయి 19,890 వద్ద ముగిసింది - బిజినెస్‌లో



**దుర్గ రాసింది.. సీతా చాలీసా!**

సీతా చాలీసాను రాసి, వినిపిస్తున్న డాక్టర్ జివిఎల్‌కె దుర్గపై కథనం -ఫ్యామిలీలో



**యూపీఐ తొలి లావాదేవీకి...**

రూ.2 వేలు అంతకంటే ఎక్కువ మొత్తాలను పంపాలంటే ఆ ట్రాన్సాక్షన్ పూర్తికి 4 గంటల వ్యవధి పెట్టాలని కేంద్రం భావిస్తోంది.


- వివరాలు 4లో



**విస్తరణ బాటలో ఫాక్స్‌కాన్**

తైవాన్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఫాక్స్‌కాన్ భారత్‌లో తమ కార్యకలాపాలను మరింతగా విస్తరించడంపై దృష్టి పెడుతోంది.

-బిజినెస్‌లో



**కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య**

రాజస్తాన్‌లోని కోటాలో మరో విద్యార్థి తనువు చాలించాడు. పశ్చిమబెంగాల్‌కు చెందిన ఫరీద్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

- వివరాలు 4లో



**వైట్‌హౌస్, యుద్ధ నౌకలు..**

వైట్‌హౌస్, పెంటగాన్, యుద్ధ నౌకల ఫొటోలను తమ నిఘా ఉపగ్రహం పంపించినట్లు ఉత్తరకొరియా ప్రకటించుకుంది.

- వివరాలు 4లో

## న్యూస్‌రీల్

### జేఈఈ మెయిన్స్‌కు దరఖాస్తు గడువు రేపే



ఐఐటీలు, ఎన్‌ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్రప్రభుత్వ నిధులతో నడిచే ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ మెయిన్స్‌కు దరఖాస్తు గడువు ఈ నెల 30తో ముగుస్తుంది. తొలివిడత పరీక్ష దేశవ్యాప్తంగా 2024 జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 వరకూ జరుగుతుంది. రెండోవిడత ఏప్రిల్‌లో జరుగుతుంది.

- వివరాలు 8లో

### నేడు, రేపు అక్కడక్కడా తేలికపాటి వానలు



రాష్ట్రంలో బుధ, గురువారాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. వాతావరణంలో మార్పులతో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గుతాయని వెల్లడించింది. రాష్ట్రానికి ఆగ్నేయ దిశ నుంచి వీస్తున్న గాలుల ప్రభావంతో చలి తీవ్రత పెరిగే అవకాశం ఉందని తెలిపింది.

- వివరాలు 8లో

### ప్రజాగొంతుకనై ఉంటా!



ఎన్నికల అనంతరం కొత్త ప్రభుత్వ ఏర్పాటులో బీఎస్పీ పాత్ర కీలకం అవుతుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఐపీఎస్ అధికారిగా ఏడేళ్ల సర్వీస్‌ను వదులుకొని రాజకీయాల్లోకి వచ్చి ప్రజల గొంతుకగా మారిన తాను ఎన్నికల అనంతరం కూడా అదేవిధంగా ఉంటానని అన్నారు. ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ 111 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న బీఎస్పీ అధికార, ప్రతిపక్ష పార్టీలకు గట్టిపోటీ ఇస్తుందన్నారు.

- వివరాలు 3లో

### సీపీఎం రాష్ట్ర నేతలకు ఏచూరి క్లాస్?



సీపీఎం రాష్ట్ర నాయకత్వానికి ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి క్లాస్ తీసుకున్నారు. తెలంగాణ ఎన్నికల్లో రాష్ట్ర కమిటీ తీసుకున్న వైఖరిపై ఆయన అసహనంతో ఉన్నట్లు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని నిలువరించేందుకు కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపే విషయంలో ఊగిసలాట ఎందుకని ఏచూరి నిలదీశారు. ఈ వైఖరి వల్ల కొన్నిచోట్ల బీఆర్ఎస్‌కు కూడా ప్రయోజనం కలుగుతుందని ఆయనన్నట్లు సమాచారం.

- వివరాలు 2లో

### నేడు, రేపు విద్యాసంస్థలకు సెలవు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 30వ తేదీన పోలింగ్ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థలకు గురువారం అధికారిక సెలవు ప్రకటించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. అయితే, ఈనెల 29న పోలింగ్ కేంద్రాలుగా ఉండే పాఠశాలలకు జిల్లా కలెక్టర్లు సెలవు ఇవ్వాలని ఆదేశించారు. పోలింగ్ విధులకు హాజరయ్యే ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాలకు కూడా వచ్చే నెల 1న పెయిడ్ హాలీడే ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# అధికారంలోకి రాగానే... ఆరు గ్యారంటీలపై సంతకాలు

## హైదరాబాద్ కార్నర్ మీటింగుల్లో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ

- కాంగ్రెస్‌కు ఓటేస్తేనే ప్రజా సర్కార్ ఏర్పడుతుంది
- ప్రజా సర్కార్ కోసం బీఆర్ఎస్‌ను ఓడించాలి
- మోదీ విద్వేషాలతో కూడిన భారతదేశాన్ని తయారు చేశారు
- బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం మూడూ ఒకటే టీమ్

సాక్షి, హైదరాబాద్, మల్కాజిగిరి, నాంపల్లి (హైదరాబాద్): తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాల అమలుపై మంత్రివర్గం సంతకాలు చేస్తుందని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రకటించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు ఓటేస్తే మళ్లీ దొరల సర్కారే ఏర్పడుతుందని, కాంగ్రెస్‌కు ఓటేస్తే ప్రజల సర్కార్ ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రజా సర్కార్ కోసం బీఆర్ఎస్‌ను ఓడించి కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు. దేశంలో మత విద్వేషాలు లేకుండా చేసేందుకు ఢిల్లీలో నరేంద్ర మోదీని గద్దె దింపాలంటే, ముందుగా తెలంగాణలో కేసీఆర్‌ను ఓడించాలని అన్నారు. దేశంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ విద్వేషాలను వ్యాప్తి చేస్తున్నాయని విమర్శించారు. మోదీ విద్వేషాలతో కూడిన భారతదేశాన్ని తయారు చేశారని, తాము ప్రేమతో కూడిన దేశాన్ని కోరుకుంటున్నామని చెప్పారు. దేశంలో ప్రేమను పంచాలనే లక్ష్యంతోనే భారత్ జోడో యాత్ర చేశానని, ఈ సందర్భంగా ప్రజల కష్టాలను నేరుగా చూశానని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో చివరి రోజైన మంగళవారం.. హైదరాబాద్ నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలోని బజార్‌ఘాట్ చౌరస్తాలో, మల్కాజిగిరి ఇందిరా చౌక్ వద్ద

మిగతా 2వ పేజీలో ▶



మల్కాజిగిరి రోడ్డు షోలో రేవంత్‌రెడ్డి, ప్రియాంకగాంధీతో కలిసి సెల్ఫీ తీసుకుంటున్న రాహుల్‌గాంధీ

### తెలంగాణ తీర్పును దేశం గమనిస్తోంది

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతుబంధు ఇస్తాం: రేవంత్‌రెడ్డి

- వివరాలు 2లో



### నేను రాలేకపోతున్నా... మీరు మార్పు తీసుకురండి

- తెలంగాణ ప్రజలకు సోనియా వీడియో సందేశం
- దొరల తెలంగాణను ప్రజల తెలంగాణగా మార్చాలని పిలుపు

2 లో

## వారికి అవగాహన లేదు

- రాహుల్, ప్రియాంకలపై కిషన్‌రెడ్డి ధ్వజం
- బీజేపీ కనుసన్నల్లో మజ్లిస్ పని చేస్తుందన్న వ్యాఖ్యలపై ఆగ్రహం
- కుటుంబ పార్టీలను బహిష్కరించాలని పిలుపు

"పాతచింతకాయ పచ్చడిలాగా.. అరిగిపోయిన గ్రామ్‌ఫోన్ రికార్డులాగా.. రాహుల్, ప్రియాంకా గాంధీలు అవే అసత్యాలు మాట్లాడుతున్నారు. కేసీఆర్, సోనియా కుటుంబ పార్టీలను ప్రజలు బహిష్కరించాలి

8 లో

ఒత్తిళ్లు, ప్రలోభాలకు లొంగొద్దు.. ప్లీజ్







సొరంగం నుంచి బయటికి వస్తున్న కార్మికులు

సొరంగం నుంచి వస్తూ... ఓ కార్మికుని విజయ దరహాసం

## సొరంగాన్ని జయించారు

ఎప్పుడేం జరిగింది? 4లో

- సిల్క్యారా టన్నెల్‌లో ముగిసిన రెస్క్యూ ఆపరేషన్
- క్షేమంగా బయటకు వచ్చిన 41 మంది కార్మికులు

17 రోజుల సుదీర్ఘ నిరీక్షణ ముగిసింది. సొరంగంలో చిక్కుకొని క్షణమొక యుగంలా గడిపిన 41 మంది కార్మికులు ప్రాణాలతో బయటపడ్డారు. బాహ్య ప్రపంచాన్ని కళ్లారా తిలకించి, గుండెనిండా హాయిగా ఊపిరి పీల్చుకున్నారు.

4 లో

## కాంగ్రెస్ చేతికి వెళ్తే కుక్కలు చింపిన విస్తరే

### ఓటు కోసం తెలంగాణ ద్రోహులు వస్తుండ్రు

- రేవంత్ ఇవాళ టికెట్లు అమ్ముకున్నాడు.. రేపు రాష్ట్రాన్ని కూడా అమ్మేస్తాడు
- రెండు చోట్లా రేవంత్ ఓడిపోతున్నాడు
- సిద్దిపేట రోడ్ షో, మద్దూరు సభల్లో మంత్రి హరీశ్‌రావు

3 లో





పోలీసులతో వాగ్వాదం చేస్తున్న బండి సంజయ్

### నన్ను ఓడించేందుకే.. కుట్రలకు తెరలేపారు

- బండి సంజయ్ ఆరోపణ
- అర్ధరాత్రి బీజేపీ– బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య ఉద్రిక్తత
- బీఆర్ఎస్ నేతలు దాడికి యత్నించారని మండిపాటు

- వివరాలు 8లో

## పోల్ మేనేజ్‌మెంట్‌పై బీజేపీ ఫోకస్

- పార్టీ అభ్యర్థుల పోలింగ్ శాతం పెంచడంపై దృష్టి
- ముఖ్యనేతలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి దిశానిర్దేశం

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ముగియడంతో పోలింగ్ బూత్ మేనేజ్‌మెంట్‌పై బీజేపీ దృష్టిసారించింది. పార్టీ అభ్యర్థులకు ఓటింగ్ శాతాన్ని గణనీయంగా పెంచేందుకు అనుసరించాల్సిన వ్యూహాలకు పదునుపెడుతోంది. బూత్ స్థాయిలో ఓటర్ల జాబితాలోని ఒక్కో పేజీ పర్యవేక్షణకు నియమించిన పన్నా ప్రముఖ్‌ల ద్వారా ఓటర్లంతా కచ్చితంగా ఓటేసేలా చూడాలని పార్టీ నాయకులు దిశా



నిర్దేశం చేస్తున్నారు. బూత్ కమిటీల సభ్యులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు రప్పించే చర్యలు చేపడుతున్నారు. పార్టీవైపు మొగ్గుచూపే ఓటర్లను కచ్చితంగా

మిగతా 3వ పేజీలో ▶

## కేసీఆర్ అందరికీ లోకలే.. రేవంత్ నాన్‌లోకల్

### అడ్డమైనోళ్లకు ఓటేస్తే బతుకులు ఖరాబ్ అవుతాయి: కేటీఆర్

- మంచిగా కారు నడుపుతున్న డ్రైవర్‌ను ఎందుకు మార్చాలి?
- ప్రతి కుటుంబానికి ఇల్లు మా లక్ష్యం
- మోదీ పిరమైన ప్రధాని.. ధరలు పెంచి దగా చేసిండు
- కామారెడ్డి, సిరిసిల్ల రోడ్‌షోలలో మంత్రి వ్యాఖ్యలు



కామారెడ్డి పట్టణంలో రోడ్‌షోలో పాల్గొని కార్నర్ మీటింగులో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

సాక్షి, కామారెడ్డి/సిరిసిల్ల: 'ముఖ్యమంత్రి కేసీఆర్ మూలాలు ఇక్కడే (కామారెడ్డి) ఉన్నాయి. అయినా తెలంగాణ తెచ్చిన కేసీఆర్ అందరికీ లోకలే. కానీ కాంగ్రెస్ అభ్యర్థి రేవంత్‌రెడ్డి కొడంగల్ నుంచి వచ్చారు. బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి పక్క నియోజకవర్గం నుంచి వచ్చారు. అడ్డమైనోళ్లకు, చిటికెడంత లేనోడికి, సన్నాసులకు ఓటేస్తే బతుకులు ఖరాబైతయి' అని మంత్రి కె. తారక రామారావు వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచారానికి చివరి రోజైన మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రం, సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించిన రోడ్ షోలలో పాల్గొనడంతోపాటు సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో జాతీయ మీడియాతో మంత్రి కేటీఆర్ మాట్లాడారు.

**కాంగ్రెస్ ఓ చెత్త పార్టీ...:** తెలంగాణలో మార్పు కావాలంటున్న కాంగ్రెస్ కొత్త పార్టీ కాదని, అదో చెత్త పార్టీ అని కేటీఆర్ విమర్శించారు. మంచిగా కారు (రాష్ట్రాన్ని) నడుపుతున్న డ్రైవర్ (కేసీఆర్)ను కాదని కాంగ్రెసోళ్లను నమ్మితే.. రాష్ట్రం అధోగతి పాలవుతుందని పేర్కొన్నారు.

**సిలిండర్ ధరను మోదీ రూ. 1,200కు పెంచిండు..**

'నరేంద్ర మోదీ ప్రియమైన ప్రధాన మంత్రి కాదు.. పిరమైన ప్రధాన మంత్రి. గ్యాస్ ధరను రూ. 400 నుంచి రూ. 1,200కు పెంచిండు. మోదీ పాలనలో పెట్రోల్, ఉప్పు, పప్పు,

మిగతా 3వ పేజీలో ▶

# నేను రాలేకపోతున్నా... మీరు మార్పు తీసుకురండి


**తెలంగాణ ప్రజలకు సోనియాగాంధీ వీడియో సందేశం**



సాక్షి, హైదరాబాద్/న్యూఢిల్లీ: తెలంగాణలో మార్పు కావాలని, ఆ మార్పు కోసం ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ కోరారు. ఈ మేరకు తెలంగాణ ప్రజలనుద్దేశించి మంగళవారం ఓ వీడియో సందేశం పంపారు. 'ప్రియమైన సోదర సోదరీమణులకు నమస్కారం. నేను మీ దగ్గరకు రాలేకపోతున్నా. కానీ మీరు నా హృదయానికి చాలా దగ్గరగా ఉంటారు. మీకు ఓ విషయాన్ని చెప్పాలనుకుంటున్నాను. తెలంగాణ అమరవీరుల కలలు నెరవేరడం చూడాలనుకుంటున్నా. మనం దరం కలసి దొరల తెలంగాణను ప్రజల తెలంగాణగా మార్చాలి. మీ కలలు సాకా రం కావాలి. ఒక మంచి ప్రభుత్వం రావాలి. సోని యమ్మ అని పిలిచి మీరు నాకు చాలా గౌరవప్రదమైన అమ్మ స్థానం ఇచ్చారు. మీ ప్రేమాభిమానాలకు నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను. తెలంగాణ సోదరులు, అమ్మలు, బిడ్డలందరికీ నా విన్నపం. మార్పు కోసం కాంగ్రెస్ పార్టీకి ఓటేయండి. మార్పు కావాలి. కాంగ్రెస్ రావాలి. జై తెలంగాణ. జైహింద్.' అని ఆమె తన వీడియో సందేశంలో పేర్కొన్నారు.

# చంద్రబాబుకు 'సుప్రీం' నోటీసులు

- బెయిల్ రద్దుపై డిసెంబరు 8లోగా లిఖితపూర్వక కౌంటర్ దాఖలు చేయండి
- స్కిల్ కేసులో క్వాష్ పిటిషన్ తీర్పు తర్వాతే బెయిల్ రద్దుపై విచారణ
- జస్టిస్ బేలా ఎం త్రివేది ధర్మాసనం స్పష్టీకరణ
- తదుపరి విచారణ 11కు వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: స్కిల్ కుంభకోణం కేసులో ఏపీ సీఐడీ దాఖలు చేసిన బెయిలు రద్దు పిటిషన్‌లో సుప్రీంకోర్టు చంద్రబాబుకు నోటీసులు జారీచేసింది. ఈ కేసుకు సంబంధించి క్వాష్ పిటిషన్‌పై తీర్పు వెలువరించిన తర్వాతే బెయిల్ రద్దు కేసు విచారణ చేపడతామని తెలిపింది. డిసెంబరు 8లోగా లిఖితపూర్వక కౌంటరు దాఖలు చేయాలని చంద్రబాబుకు ఇచ్చిన నోటీసుల్లో పేర్కొంది. తదుపరి విచారణ డిసెంబరు11కు వాయిదా వేసింది. టీడీపీ అధినేత చంద్రబాబుకు ఏపీ హైకోర్టు మంజూరు చేసిన రెగ్యులర్ బెయిలు రద్దుచేయాలంటూ ఏపీ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ సతీష్‌చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. ఏపీ సీఐడీ తరఫు సీనియర్ న్యాయవాది రంజిత్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. మధ్యంతర బెయిలు సమయంలో హైకోర్టు విధించిన షరతులు పొడిగించాలని కోరారు. దీంతోపాటు కేసు గురించి పబ్లిక్ డొమైన్‌లో ఎలాంటి ప్రకటనలు చేయకుండా చూడాలన్నారు. ఈ సమయంలో.. కోర్టులో ఉన్న అంశాలపై శాఖ అధికారులు బహిరంగ ప్రకటనలు చేస్తున్నారని చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాది సిద్దార్థ అగర్వాల్ ఆరోపించారు. ఇరుపక్షాలకు ఈ షరతు వర్తించేలా చూడాలని అభ్యర్థించారు. అగర్వాల్ వాదనకు ఏపీ సీఐడీ తరఫు మరో సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి అభ్యంతరం తెలిపారు. షరతులనేవి నిందితులకే వర్తిస్తాయని.. ప్రభుత్వానికి వర్తించదని చెప్పారు. అయితే, మీరు వాయిదా కోరుతున్నారా అని ధర్మాసనం ప్రశ్నించగా.. ప్రతివాదికి నోటీసులు జారీచేయాలని రోహత్గి బదులిచ్చారు. ఏపీ హైకోర్టు మంజూరు చేసిన బెయిల్ ఆర్డర్‌లో మెరిట్స్‌పై నిర్ధారణలు ఉన్నాయని, ఇది రూ.300 కోట్ల ప్రజాధనం మళ్లించిన కేసు అని వివరించారు. ఏపీ సీఐడీ విజ్ఞప్తిని ధర్మాసనం అనుమతించింది. చంద్రబాబుకు నోటీసులు జారీచేస్తున్నామని, నవంబరు 3న ఏపీ హైకోర్టు విధించిన షరతుల్లో బహిరంగ ర్యాలీలు, సమావేశాలు నిర్వహించడం లేదా పాల్గొనడం మినహా అన్నీ వర్తిస్తాయని ధర్మాసనం ఉత్తర్వుల్లో పేర్కొంది. తదుపరి విచారణ డిసెంబరు 11కు వాయిదా వేసింది.

# కాంగ్రెస్‌ను ఓడించేందుకే బీజేపీ ప్రచారం

**రాజస్తాన్ సీఎం అశోక్‌గెహ్లోత్**



సాక్షి, హైదరాబాద్: ఢిల్లీలో ఉన్న కేంద్ర ప్రభుత్వం ఆటోమోడ్‌లో నడుస్తోందని రాజస్తాన్ ముఖ్యమంత్రి అశోక్‌గెహ్లోత్ వ్యాఖ్యానించారు. ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారం జరుగుతుంటే ప్రధాని మోదీతో పాటు ఇతర బీజేపీ నేతలు మిజోరంకు వెళ్లి ఎందుకు ప్రచారం చేయలేదని ఆయన ప్రశ్నించారు. మంగళవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో గెహ్లోత్ మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఓట్లు చీల్చి బీఆర్ఎస్‌కు లబ్ధి చేకూర్చాలని, తెలంగాణలో బీఆర్ఎస్‌ను గెలిపించాలని బీజేపీ నేతలు విస్తృత ప్రచారం చేశారని ఆరోపించారు. ఇక్కడ బీజేపీ, బీఆర్ఎస్‌లు కలిసిపోయాయన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలు చాలా బాగున్నాయని, కచ్చితంగా తెలంగాణలో తాము అధికారంలోకి రాబోతున్నామని గెహ్లోత్ ధీమా వ్యక్తంచేశారు. ఎన్నికల్లో గెలిచేందుకు బీజేపీ ఈడీ, సీబీఐలను ప్రయోగిస్తుందని, కానీ, అవినీతిలో నంబర్ వన్ స్థానంలో ఉన్న తెలంగాణలో అధికార పార్టీ జోలికి మాత్రం వెళ్లదని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం మంగళవారం గాంధీభవన్‌లో అశోక్‌గెహ్లోత్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.



# గిగ్ వర్కర్స్ కోసం రాజస్తాన్ తరహా పథకం

**ఏఐసీసీ అగ్రనేత రాహుల్ వెల్లడి**

- ప్రభుత్వం ఏర్పడగానే సామాజిక భద్రతతో కూడిన నిధిపై చర్చ
- ఇప్పటికే మేనిఫెస్టోలో సంక్షేమ బోర్డు, ఇతర అంశాలు
- పారిశుధ్య కార్మికులు, డెలివరీ బాయ్స్‌తో ముఖాముఖి



యూసుఫ్‌గూడలో మంగళవారం ఓ ఆటోడ్రైవర్‌తో రాహుల్‌గాంధీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ కోసం రాజస్తాన్ తరహాలో పథకాన్ని వర్తింప జేస్తామని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారు. సీఎం, మంత్రివర్గస్థాయిలో గిగ్ వర్కర్స్ ప్రతినిధుల బృందంతో సమావేశం ఏర్పాటు చేసి సామాజిక భద్రతతో కూడిన నిధిపై చర్చిస్తామని, తగిన ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. ఇప్పటికే పార్టీ మేనిఫెస్టోలో సంక్షేమ బోర్డు ఏర్పాటు అంశం ఉందని, ఆటో డ్రైవర్లకు రూ.12 వేలు సాయం, సింగిల్ పర్మిట్ పాలసీ, పెండింగ్ చలాన్ 50 శాతం తగ్గింపుతో క్లియరెన్స్ లాంటి ఆలోచనలు ఉన్నాయని తెలిపారు. మంగళవారం హైదరాబాద్ యూసుఫ్‌గూడలో జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులు, గిగ్ వర్కర్ల (డెలివరీ బాయ్స్ ఆటో, క్యాబ్ డ్రైవర్లు)తో ఆయన ముఖాముఖి నిర్వహించారు. డెలివరీ బాయ్స్, పారిశుధ్య కార్మికుల సమస్యలు, దినచర్య గురించి అడిగి తెలుసుకున్నారు. కాగా కార్మికులు తమ కష్టాలు ఆయనకు వివరించారు.

**శ్రమకు తగిన ఫలితం దక్కడం లేదు**

శ్రమకు తగిన ఫలితం దక్కడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. గంటల కొద్దీ పనిచేసి సంపాదించినదంతా డీజిల్, పెట్రోల్‌కే సరిపోతోందని వాపోయారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సామాజిక భద్రత, ప్రమాద, ఆరోగ్య బీమా కల్పించాలన్నారు. తాత్కాలిక ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటా యించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి అజారుద్దీన్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌పై ఈసీకి కాంగ్రెస్ ఫిర్యాదు

**సైలెంట్ పీరియడ్‌లో ప్రచారంపై ఆందోళన**

సాక్షి, న్యూఢిల్లీ: సైలెంట్ పీరియడ్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు గులాబీ చొక్కాలు వేసుకుని బయట తిరగాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసిందని, ఇది ఎన్నికల నియమావళి ఉల్లంఘన కిందకు వస్తుంది కాబట్టి దీనిపై దృష్టి సారించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మంగళవారం ఆపార్టీ నేతలు అభిషేక్ మను సింఘ్వీ, సల్మాన్ ఖుర్షీద్, ప్రణవ్ ఝాలతో కూడిన బృందం ఈసీఐ అధికారులను కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం అభిషేక్ మను సింఘ్వీ మీడియాతో మాట్లాడారు. పోలింగ్ కు ముందు సైలెంట్ పీరియడ్‌లో అధికార బీఆర్ఎస్ పార్టీ ఎలక్షన్ కోడ్ ఉల్లంఘించే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలు గులాబీ టీ షర్ట్‌లు, చొక్కాలు, మహిళలు ఆ పార్టీ రంగు చీరలు కట్టుకుని ప్రజలలో సంభాషించాలని నిర్ణయించిందని తెలిపారు. దీనిపై దృష్టి సారించి నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కోరామని సింఘ్వీ తెలిపారు.



మంగళవారం మల్కాజిగిరిలో జరిగిన రోడ్‌షోలో రాహుల్, ప్రియాంక గాంధీ

# అధికారంలోకి రాగానే... ఆరు గ్యారంటీలపై సంతకాలు

▶ మొదటి పేజీ తరువాయి

నిర్వహించిన కార్నర్ మీటింగుల్లో రాహుల్ మాట్లాడారు.

**మోదీతో రాజీపడే ప్రసక్తే లేదు**

'కాంగ్రెస్ పోరాటం కేవలం కాషాయం విద్వేషాల పైనే. మోదీతో రాజీ పడే ప్రసక్తే లేదు. బీజేపీకి బీఆర్ఎస్, ఎంఐఎం బీ టీం కాకుంటే అవినీతిపరుడైన కేసీఆర్‌తో పాటు ఒవైసీపై ఒక్క కేసు, ఈడీ దాడులు ఎందుకు లేవు? మోదీ సర్కార్ తెచ్చిన అన్ని బిల్లులకు బీఆర్ఎస్ మద్దతు పలికింది. ఉత్తరాది, ఇతర దక్షిణాది రాష్ట్రాల్లో మజ్లిస్ పార్టీకి కనీసం ఉనికి, ఒక్క ఓటు లేకున్నా బీజేపీకి లబ్ధి చేకూర్చేందుకు ఎన్నికల బరిలో దిగుతుంది. మజ్లిస్ ఎక్కడ పోటీ చేయాలో కూడా బీజేపీ నిర్ణయిస్తోంది. కేవలం కాంగ్రెస్‌ను దెబ్బతీయడమే మజ్లిస్ ఉద్దేశం. ఈ మూడూ ఒకటే టీమ్. కలిసే పనిచేస్తాయి..' అని రాహుల్ ధ్వజమెత్తారు.

**నేను, ప్రియాంక సైనికుల్లా ఉంటాం**

'అధికారంలోకి వస్తే తొమ్మిదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం దోచుకున్నదంతా తిరిగి ప్రజల జేబులో వేస్తాం. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే హైదరాబాద్ అభివృద్ధి చెందింది. హైదరాబాద్‌లో అంతర్జాతీయ విమానాశ్రయం, మెట్రో రైలు ప్రాజెక్టు ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే. వచ్చే ఎన్నికల్లో గెలిపిస్తే గ్యాస్ సిలిండర్‌ను రూ.400కే అందిస్తాం. విద్యార్థులకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం చేస్తాం..' అని రాహుల్ హామీ ఇచ్చారు. ప్రజల తరఫున ఢిల్లీలో పోరాడడానికి తాను, సోదరి ప్రియాంక సైనికుల్లా ఉంటామన్నారు.

**అసలు ప్రభుత్వాన్ని చూపిస్తాం: ప్రియాంక**

పది సంవత్సరాల తెలంగాణలో ప్రజలకు కేసీఆర్ ఇల్లు ఇచ్చారా? అని ప్రజలను ప్రియాంకాగాంధీ ప్రశ్నించారు. పదేళ్లు ఫాంహౌస్ పాలన కొనసాగిందని, ఆయన కుటుంబంలోని వారికి మంత్రి పదవులు వచ్చాయని విమర్శించారు. కాంగ్రెస్ గెలిస్తే అసలు ప్రభుత్వాన్ని చూపిస్తామని అన్నారు. మల్కాజిగిరి రోడ్‌షోలో బోనాలతో మహిళలు, కల్లు గీసే పనిముట్లతో గీత కార్మికులు, వలలు పట్టుకుని గంగపుత్రులు పాల్గొన్నారు. మూడు రంగుల జెండా పాటకు రాహుల్, ప్రియాంక, రేవంత్, హన్మంతరావు ఉత్సాహంగా నృత్యం చేశారు. కాగా జూబ్లీహిల్స్ యూసుఫ్‌గూడలో కార్యక్రమానంతరం అక్కడి నుంచి నాంపల్లి కార్నర్ మీటింగ్‌కు రాహుల్ ఆటోలో వచ్చారు. రాహుల్ తన ఆటోలో ప్రయాణించడం జీవితంలో మరిచిపోనంటూ ఆటో డ్రైవర్ అశోక్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కార్యదర్శి మన్సూర్ అలీఖాన్, రాజస్తాన్ సీఎం అశోక్ గెహ్లోత్, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, నాంపల్లి, జూబ్లీహిల్స్, మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థులు ఫిరోజ్ ఖాన్, అజారుద్దీన్, మైనంపల్లి హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ తీర్పును దేశం గమనిస్తోంది

**కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతుబంధు ఇస్తాం: రేవంత్‌రెడ్డి**

సాక్షి, కామారెడ్డి: 'కేసీఆర్ పాములాంటి వాడు. ఓటు వేశారో మిమ్మల్నే కాటు వేస్తాడు. కేసీఆర్‌ను నమ్మడం అంటే పాముకు పాలుపోసి పెంచినట్టే. డిసెంబర్ 9న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపడుతుంది. పదో తేదీన రైతుబంధు సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేస్తాం'అని పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు దోమకొండ, బీబీపేట మండల కేంద్రాల్లో రోడ్‌షోలు, కార్నర్ మీటింగుల్లో ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. కేసీఆర్ ఓడినా, గెలిచినా ఫాంహౌస్‌లోనే పడుకుంటాడని, కామారెడ్డి ప్రజల భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడేందుకే తాను వచ్చానని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పదేళ్లుగా అధికారంలో ఉన్న కేసీఆర్ డబుల్ బెడ్రూంలు ఎంతమందికి ఇచ్చాడని, నిరుద్యోగులకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చాడని ప్రశ్నించారు. గజ్వేల్‌ను వదిలి సిద్దిపేటకో, సిరిసిల్లకో పోకుండా కామారెడ్డికి రావడంలోనే మతలబు ఉందన్నారు. మాస్టర్ ప్లాన్‌ను తాత్కాలికంగా రద్దు చేసినా, ఎన్నికల తరువాత మళ్లీ తెరపైకి తెచ్చి భూములను లాక్కుంటారని వివరించారు. తెలంగాణ దశ, దిశను మార్చే తీర్పును దేశమంతా గమనిస్తోందన్నారు. బీఆర్ఎస్ నేతలు ఓటుకు రూ.పది వేలు ఇచ్చి, రూ.పదివేల కోట్ల విలువైన భూములు లాక్కుంటారని ఆరోపించారు.




కామారెడ్డి జిల్లా కేంద్రంలో రోడ్‌షోలో మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

**వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేస్తాం....**

పదేళ్లుగా అధికారంలో ఉన్న కేసీఆర్ వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని చెప్పి వైశ్యులను మోసం చేశాడని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి అభ్యున్నతికి కాంగ్రెస్ కృషి చేస్తుందని రేవంత్ చెప్పారు. గల్ఫ్ కార్మికులకు సంక్షేమ నిధిని ఏర్పాటుచేసి వారికి అండగా ఉంటామని, కామారెడ్డిలో పరిశ్రమల కారిడార్‌ను ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. అందరూ కాంగ్రెస్ పార్టీకి ఓటేసి గెలిపించాలని కోరారు.

# సీపీఎం రాష్ట్ర నేతలకు ఏచూరి క్లాస్?

- పార్టీ పోటీ చేయనిచోట కాంగ్రెస్‌కు మద్దతుపై గందరగోళం ఎందుకని ప్రశ్న
- హంగ్ వస్తే బీఆర్ఎస్‌కు బీజేపీ మద్దతిస్తుందని జోస్యం
- హస్తానికి మద్దతివ్వాలని దిశానిర్దేశం



సాక్షి, హైదరాబాద్: సీపీఎం రాష్ట్ర నాయకత్వానికి ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి క్లాస్ తీసుకున్నారు. తెలంగాణ ఎన్నికల్లో రాష్ట్ర కమిటీ తీసుకున్న వైఖరిపై ఆయన అసహనంతో ఉన్నట్లు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని నిలువరించేందుకు కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపే విషయంలో ఊగిసలాట ఎందుకని ఏచూరి నిలదీశారు. బీజేపీ బలంగా ఉన్నచోట్ల బీఆర్ఎస్ లేదా కాంగ్రెస్ లేదా ఇతర ప్రజాతంత్ర లౌకిక శక్తులకు మద్దతు వైఖరి తీసుకోవడం వల్ల ఎవరికి ప్రయోజనం కలిగించదలుచుకున్నారని ఆయన ప్రశ్నించిన ట్లు తెలిసింది. ఈ వైఖరి వల్ల కొన్నిచోట్ల బీఆర్ఎస్‌కు కూడా ప్రయోజనం కలుగు తుందని, ఇది ఏ మేరకు సరైన నిర్ణయమని ఆయనన్నట్లు సమాచారం. ఇండియా కూటమిలో కాంగ్రెస్‌తో పాటు సీపీఎం కీలకంగా ఉన్న విషయం గుర్తులేదా అని ఆయన ప్రశ్నించినట్లు తెలియవచ్చింది. పార్టీ రాష్ట్ర కమిటీ వైఖరిని తనకు తెలియజేయకపోవడంపట్ల ఆయన ఒకింత ఆగ్రహంతో ఉన్న ట్లు తెలిసింది. తెలంగాణలో ఒకవేళ హంగ్ పరిస్థితి వస్తే బీఆర్ఎస్‌కు బీజేపీ మద్దతిస్తుందని కూడా ఆయన పేర్కొన్నారు.

**కార్యకర్తలకు కామ్రేడ్ల వినతి...**

ఎన్నికల ప్రచారంలో భాగంగా సీతారాం ఏచూరి హైదరాబాద్‌లో 'మీట్ ది మీడియా' కార్యక్రమంలో మాట్లాడారు. 'రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీలకు వ్యతిరేకంగా ఎన్నికల బరిలోకి దిగాం. కాబట్టి మేం పోటీచేయని నియో జకవర్గాల్లో కాంగ్రెస్‌కు ఓటేయ్యాలి'అని స్ప ష్టం చేశారు. అలాగే ఖమ్మం, నల్లగొండ జిల్లా ల పర్యటన సందర్భంగా పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు, మేధావులతో భేటీ అయ్యా రు. జాతీయ స్థాయిలో పార్టీ వైఖరిని వివరించారు. కాంగ్రెస్‌తో పొత్తుపై చొరవ చూపడంలో వెనుకబడినట్లు ఆయన వ్యాఖ్యానించినట్లు విశ్వసనీయ సమాచారం. తాను సోని యాగాంధీతో పలుమార్లు మాట్లాడినప్పటికీ అది ఆచరణ సాధ్యం కాకపోవడంతో ఆయన రాష్ట్ర నేతలను తప్పుబట్టినట్లు తెలిసింది. కాగా, ఏచూరి దిశానిర్దేశం నేపథ్యంలో బీఆర్ ఎస్ కాకుండా కాంగ్రెస్ లేదా ఇతర ప్రజాతంత్ర లౌకిక శక్తులకు మద్దతివ్వాలని సీపీఎం జిల్లా కమిటీలు కార్యకర్తలను కోరుతున్నట్లు తెలిసింది. దీనివల్ల ఒకవైపు సీపీఐ, మరోవైపు సీపీఎం ఓట్లు కాంగ్రెస్‌కు మరింత ఉపయోగపడతాయని భావిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా లెఫ్ట్ పార్టీలకు దాదాపు 50 నియోజకవర్గాల్లో ఎంతోకొంత ఓట్లు ఉన్నాయని కామ్రేడ్లు అంచనా వేస్తున్నారు.

# 'వ్యూహం'పై 10 రోజుల్లో నిర్ణయం తీసుకోండి

**సీబీఎఫ్‌సీకి హైకోర్టు ఆదేశం**

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ దర్శకుడు రాంగోపాల్‌వర్మ దర్శకత్వం వహించిన 'వ్యూహం'సినిమా విడుదలకు సంబంధించిన సర్టిఫికెట్ జారీపై కమిటీ ఏర్పాటు చేసి 10 రోజుల్లోగా నిర్ణయం తీసుకోవాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్(సీబీఎఫ్‌సీ)ని హైకోర్టు ఆదేశించింది. తెలంగాణలో ఎన్నికల కోడ్ కారణంగా వ్యూహం సినిమాకు సర్టిఫికెట్ ఇవ్వని సీబీఎఫ్‌సీ చర్యను సవాల్ చేస్తూ రామదూత క్రియేషన్స్, చిత్ర నిర్మాత దాసరి కిరణ్‌కుమార్ హైకోర్టును ఆశ్రయించారు. న్యాయవాది పాశం మోహిత్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా మంగళవారం విచారణ చేపట్టారు. నిర్మాత తరఫున సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు.

## క్లుప్తంగా...

### మళ్లీ రానున్నది కేసీఆర్ సర్కారే: 'ఎక్స్'లో కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మళ్లీ రానున్నది కేసీఆర్ సర్కారేనని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. తెలంగాణ అంతటా కారు జోరు ఉందని స్పష్టం చేశారు. ఆదిలాబాద్ నుంచి అచ్చంపేట దాకా... సిర్పూర్ నుంచి అలంపూర్ దాకా... తాండూరు నుంచి చెన్నూరు దాకా... మధిర నుంచి ముథోల్ దాకా... మక్తల్ నుంచి జుక్కల్ దాకా బీఆర్ఎస్ హవా ఉందని కవితాత్మక ధోరణిలో పేర్కొన్నారు. కేసీఆర్ హ్యాట్రిక్ అనే హాష్‌ట్యాగ్‌ను జత చేశారు. కేటీఆర్ పోస్ట్‌ను లక్షలాది మంది వీక్షించి భారీ ఎత్తున కామెంట్లు పెట్టారు.

### బాండ్ పేపర్ల పేరిట కాంగ్రెస్ కొత్త డ్రామాలు

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజం



నిజామాబాద్ నాగారం/జగిత్యాల: బాండ్ పేపర్ల పేరిట కాంగ్రెస్ కొత్త డ్రామాలకు తెర లేపిందని, జీవన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రాజనర్సింహ, భట్టి వంటి పెద్ద నేతలు కూడా బాండ్ పేపర్ రాసివ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందంటే ప్రజల్లో ఆ పార్టీ ఎంత విశ్వాసం కోల్పోయిందో అర్థమవుతుందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. మంగళవారం నిజామాబాద్ నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో కవిత మీడియాతో మాట్లాడారు. కర్ణాటక ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ ఇదే డ్రామా చేసిందని, బాండ్ పేపర్లలోని ఏ అంశాన్ని కూడా సంపూర్ణంగా అమలు చేయలేకపోయిందని ఆరోపించారు. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ సంస్థ వెల్లడించిన గణాంకాల ప్రకారం నిరుద్యోగంలో బీజేపీ పాలిత హరియాణా రాష్ట్రం నంబర్ వన్‌గా ఉందని, కాంగ్రెస్ పాలిత రాజస్థాన్ రాష్ట్రం రెండోస్థానంలో ఉందని ఎద్దేవా చేశా రు. కాగా, సీఎం కేసీఆర్ కల్పవృక్షం వంటివారని, ఆయన ఎప్పుడూ పేదల పక్షపాతేనని కవిత అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్‌కుమార్‌కు మద్దతుగా ఆమె మంగళవారం రోడ్ షో నిర్వహించారు. రాష్ట్రంలో ఇచ్చినన్ని ప్రభుత్వ ఉద్యోగాలు దేశంలోని ఏ రాష్ట్రం కూడా ఇవ్వలేదని, ఎక్కడైనా ఇచ్చినట్లు రుజు వు చేస్తే రాజకీయాల్లోంచి తప్పుకుంటానన్నారు.

### గిరిజన డిక్లరేషన్‌కు బీఆర్ఎస్ సానుకూలం

సేవాలాల్ సేన రాష్ట్ర కమిటీ

హిమాయత్‌నగర్(హైదరాబాద్): సేవాలాల్ సేన విడుదల చేసిన గిరిజన డిక్లరేషన్‌కు బీఆర్ఎస్ సానుకూలంగా స్పందించిందని, మళ్లీ అధికారంలోకి రాగానే అందులోని అన్ని అంశాలను పరిష్కరిస్తామని ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆంగోతు రాంబాబునాయక్ తెలిపారు. మంగళవారం ఇక్కడ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లంబాడీల ఆరాధ్యదైవం సంత్ శ్రీశ్రీశ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి అయిన ఫిబ్రవరి 15వ తేదీని అధికారిక సెలవుదినంగా ప్రకటిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడంపై సేవాలాల్ సేన రాష్ట్ర కమిటీ హర్షం వ్యక్తం చేసిందన్నారు. సమావేశంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ రఘురామ్ రాథోడ్, ఉపాధ్యక్షులు రేఖ్యానాయక్, డి.పరశురామ్ నాయక్, నాయకులు ఎల్.మోహన్‌నాయక్, కళ్యాణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### మార్పు వచ్చింది.. కాంగ్రెస్‌కు అధికారం వస్తుంది: వీహెచ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజల వైఖరి మారిందని, ఈసారి తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని మాజీ ఎంపీ వీహెచ్ ధీమా వ్యక్తంచేశారు. మంగళవారం గాంధీ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో రాహుల్‌గాంధీ నేతృత్వంలో భారత్ జోడో యాత్ర జరిగిన తర్వాత ఈ మార్పు స్పష్టంగా కనిపించిందన్నారు. అదే మార్పు ఎన్నికల వరకు కొనసాగిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా అధికారంలోకి వస్తుందని, అధికారంలోకి రాగానే తాము ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామన్నారు.

### మద్యం దుకాణాలు మూత

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికలు నవంబర్ 30న జరగనుండటంతో.. మంగళవారం సాయంత్రం 5గంటల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మద్యం దుకాణాలు మూతపడ్డాయి. పోలింగ్ ముగిసిన తర్వాత డిసెంబర్ 1 నుంచి మద్యం దుకాణాలను తిరిగి తెరవనున్నారు. పోలింగ్‌కు 48 గంటల ముందు సైలెన్స్ పీరియడ్ అమల్లోకి రావడంతో ఈ మేరకు చర్యలు తీసుకున్నారు.

### పోలింగ్ రోజు సెలవివ్వాలి లేకుంటే కఠిన చర్యలు..

సీఈఓ వికాస్‌రాజ్ ఆదేశం

శాసనసభ సాధారణఎన్నికల్లో ఓటేసేందుకు నవంబర్ 30న పోలింగ్ రోజు సెలవు ప్రకటించని ప్రైవేటు వ్యాపార సంస్థలు, కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) వికాస్‌రాజ్ ఆదేశించారు. గత శాసనసభ సాధారణ ఎన్నికల పోలింగ్ రోజు కొన్ని ఐటీ, ఇతర ప్రైవేటు కంపెనీలు తమ ఉద్యోగులకు సెలవు ప్రకటించలేదని ఫిర్యాదులొచ్చాయని ఆయన గుర్తు చేశారు. ఈ సారి ఎవరైనా తమ ఉద్యోగులకు సెలవు ప్రకటించని పక్షంలో కార్మిక చట్టంతో పాటు ఎన్నికల చట్టాల కింద కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ రాష్ట్ర కార్మిక శాఖకు మంగళవారం లేఖ రాశారు.

మంగళవారం వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ ఆవరణలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్



# ఇందిరమ్మ రాజ్యం.. ఎవరికి కావాలిప్పుడు?

మొదటి పేజీ తరువాయి

దేశంలోనే తెలంగాణ నంబర్ వన్ రాష్ట్రంగా నిలుస్తోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాకముందు 30-40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండితే, రాష్ట్రం ఏర్పడ్డాక సాగు నీరు, ఉచిత విద్యుత్ అందించడం వలన 3 కోట్ల టన్నుల ధాన్యం పండుతోంది. ధరణి పోర్టల్ రాకముందు రైతు భూమిపై వీఆర్ఓ నుంచి సీసీఎల్ఏ అధికారుల వరకు 10 మందికి అధికారం ఉండేది. ఇప్పుడు రైతు బొటన వేలికి వారి భూమికి సంబంధించిన హక్కులు ఇచ్చాం. ధరణి ఉంది కాబట్టే ఎవరి భూమి వారికి ఉంది. లేకపోతే ఇబ్బంది ఉండేది. గత పాలకుల పరిపాలనను తలదన్నే విధంగా సంక్షేమ కార్యక్రమాల్లో అన్ని రాష్ట్రాల చేత భేష్ అనిపించుకుంటున్నాం. కాంగ్రెస్ రాజ్యంలో రూ.200 పింఛన్ ఇస్తే, ఇప్పుడు రూ.2 వేలు ఇస్తున్నాం. ఈ ఎన్నికల తర్వాత రూ.5 వేలు ఇవ్వబోతున్నాం. నెహ్రూ, ఇందిరమ్మ కాలంలో దళిత వర్గానికి మేలు చేస్తే ఇంత దరిద్రంలో ఉండేవారు కాదు. దళితుల జీవితాల్లో వెలుగులు నింపాలనే దళితబంధును ఏర్పాటు చేశాం. కంటి వెలుగు కార్యక్రమం ద్వారా 3 కోట్ల మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 80 లక్షల మందికి ఉచితంగా కంటి అద్దాలను అందించాం. అమ్మఒడి వాహనాలు, కేసీఆర్ కిట్లు, షాదీ ముబారక్, కల్యాణలక్ష్మితో పేదింట్లో ఆర్థిక భారం తగ్గించాం. అన్ని వర్గాలకు పెద్దన్నగా నిలిచాం. హైదరాబాద్ విశ్వనగరంగా రూపుదిద్దుకుంటోంది. ఒక్కరోజు కూడా కర్ఫ్యూ, మతకల్లోలాలు, గొడవలు లేని వాతావరణం ఉంది. కాంగ్రెస్ పార్టీ హయాంలో వరంగల్‌లో అజాంజాహీ మిల్లును మూసేసి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు భూములు అమ్ముకుంటే వేలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారు. వారికి తిరిగి ఉపాధి కల్పించేందుకు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేస్తున్నాం..' అని సీఎం తెలిపారు.

**సరికొత్త చరిత్ర సృష్టిద్దాం:** 'నా వయసు ఫిబ్రవరిలో 70 ఏళ్లకు చేరుతుంది. పదవుల కాంక్ష లేదు.. తెలంగాణను సక్కదిద్దాలనే ఉంది. మనసు పెట్టి సంక్షేమం అందిస్తున్న బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటు వేసి మూడవసారి పాలన తెచ్చుకుందాం. సరికొత్త చరిత్రను సృష్టిద్దాం. సమైక్యవాదులతో మనమంతా జాగ్రత్తగా ఉండాలి. ప్రతి ఎన్నికల్లో ఎవరో ఒకరు వచ్చి ఓటు వేయాలని అడుగుతారు. అభ్యర్థుల గుణగణాలు, గతంలో చేసిన అభివృద్ధి, ఇప్పుడు ఏం చేస్తారనే విషయాన్ని తెలుసుకోవాలి. 50 ఏళ్ల కాంగ్రెస్ చరిత్ర, 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనను బేరీజు వేసుకుని ఓట్లు వేయాలి..' అని కేసీఆర్ విజ్ఞప్తి చేశారు. సభల్లో మంత్రి సత్యవతి రాథోడ్, వరంగల్ పశ్చిమ, తూర్పు ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ అభ్యర్థులు దాస్యం వినయభాస్కర్, నన్నపునేని నరేందర్, ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనాచారి, బండా ప్రకాశ్, బస్వరాజు సారయ్య, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ సుందరరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ అందరికీ లోకలే.. రేవంత్ నాన్‌లోకల్



మంగళవారం సిరిసిల్ల రోడ్ షోలో మాట్లాడుతున్న కేటీఆర్

మొదటి పేజీ తరువాయి

నూనె ధరలు ఆకాశాన్నంటాయి. సామాన్యుడు ఇబ్బంది పడాల్సి వస్తోంది. కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కాంగనే గ్యాస్ సిలిండర్ రూ. 400కే ఇవ్వబోతుండు'అని కేటీఆర్ తెలిపారు.

**బీడు భూములకు సాగునీటి కోసమే కేసీఆర్ తపన..**

కామారెడ్డిలో రైతుల భూములను గుంజుకుంటారని కేసీఆర్‌పై కాంగ్రెస్, బీజేపీ నాయకులు చిల్లర ప్రచారం చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఆ మాటలు మాట్లాడుతున్న వాళ్లకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు.'కామారెడ్డిలో ఏమైనా లంకె బిందెలు ఉన్నయా 'అని ప్రశ్నించారు. ఎవడెవడో ఏదేదో మాట్లాడుతున్నారని, కామారెడ్డి ప్రాంతంలో బీడువారిన భూములకు సాగునీరు అందించాలనేదే కేసీఆర్ తపన అని కేటీఆర్ పేర్కొన్నారు.

**90 శాతం పనులు చేశాం..**

'సాధించాల్సిది ఇంకా ఉంది. అంతా అయిపోయిందని చెప్పట్లేదన్నారు. పొరపాట్లు జరగలేదని అనట్లేదు.. వాటిని సరిదిద్దుకుంటాం. వచ్చేసారి అన్నీ పూర్తి చేసుకుంటాం. నూటికి 90% పనులు చేశాం.. మరో 10 శాతం పనులు కూడా చేస్తాం. మాకంటే మెరుగైన వాళ్లు, మంచిగా పనిచేసేవాళ్లు ఎవరున్నారో ప్రజలు ఆలోచించాలి'అని కేటీఆర్ కోరారు.

**కేసీఆర్ హ్యాట్రిక్ ఖాయం...**

దక్షిణాదిలో వరుసగా మూడోసారి సీఎంగా కేసీఆర్ అరుదైన ఘనత సాధించబోతున్నారని, పూర్తి విశ్వాసంతో ఈ మాట చెబుతున్నానని.. ఈ ఎన్నికల్లో విజయం బీఆర్ఎస్‌దేనని కేటీఆర్ జోస్యం చెప్పారు. 'కేసీఆర్ గెలుసుడు పక్కానే. భారీ మెజారిటీతో గెలవాలంటే దమ్ము జూపాలె.. దుమ్ములేపాలె'అని ఆయన ప్రజలు, పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మతం పేరుతో బీజేపీ, కులం పేరుతో కాంగ్రెస్ రాజకీయాలు చేస్తున్నాయని, కులం, మతం తిండిపెట్టవన్న విషయాన్ని గుర్తించి మానవత్వం ఉన్న కేసీఆర్‌కు ఓటేయాలని కోరారు. మహిళల కోసం కేసీఆర్ పడుతున్న తపనను గుర్తించి మహిళలు ఏకపక్షంగా ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియాలో వచ్చే మాయామశ్చీంద్రగాళ్లను, ఫేక్ న్యూస్‌లు, ఫేక్ ప్రచారాలను ప్రజలు తిప్పికొట్టాలన్నారు. తెలంగాణలో ప్రతి కుటుంబానికి ఇల్లు కట్టివ్వడమే తమ లక్ష్యమని, సంపూర్ణ అక్షరాస్యతతో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తామన్నారు.

## పోల్ మేనేజ్‌మెంట్‌పై బీజేపీ ఫోకస్



మొదటి పేజీ తరువాయి

బూత్‌కు రప్పించేలా చేయడంలో లోటుపాట్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వరాదని పార్టీ నాయకులు క్యాడర్‌కు స్పష్టం చేస్తున్నారు. ఈ అంశంపై కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి మంగళవారం సాయంత్రం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పార్టీ పోలింగ్ బూత్ అధ్యక్షులు, ఆపై నాయకులు, జిల్లా అధ్యక్షులు, ముఖ్యనేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. బుధవారం కూడా టెలికాన్ఫరెన్స్ చేపట్టి పోల్ మేనేజ్‌మెంట్‌పై తగిన సూచనలు చేయనున్నట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 35,655 వేల పోలింగ్ బూత్‌లకుగాను 90 శాతం బూత్‌లలో బీజేపీ సంస్థాగతంగా కమిటీలు ఏర్పాటు చేసుకుంది.

**జాతీయ నేతల ప్రచారంతో గెలుపుపై ధీమా...**

రాష్ట్రంలో ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఇతర ముఖ్యనేతలు నిర్వహించిన విస్తృత ప్రచారం బీజేపీ అభ్యర్థుల గెలుపునకు, ఓటింగ్ శాతం పెంచేందుకు దోహదపడుతుందనే ధీమా పార్టీ నాయకుల్లో వ్యక్తమవుతోంది. మంగళవారం ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల పరిధిలో మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, మరికొన్ని చోట్ల మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, ఇతర జిల్లాల్లో కేంద్ర మంత్రుల ప్రచారం ప్రభావం చూపిందనే విశ్వాసాన్ని వారు వెలిబుచ్చుతున్నారు.







నల్లగొండలో ప్రచారం ముగియడంతో పోస్టర్లు తొలగిస్తున్న వాహనదారుడు ● ఎన్జీ కాలేజీలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్.. ● బోయవాడలో ఏర్పాటు చేసిన ఆదర్శ పోలింగ్ స్టేషన్

# ప్రలోభాలపై 24×7 నిఘా!

మొదటి పేజీ తరువాయి

రాజకీయ పార్టీలకు వికాస్‌రాజ్ సూచించారు. ఒపీనియన్ పోల్స్‌పై నిషేధం ఉంటుందన్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత అర్ధ గంట వరకు ఎలాంటి ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను ప్రకటించరాదని స్పష్టం చేశారు. ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియాలో ఎలాంటి రాజకీయ ప్రకటనలు ఇవ్వరాదన్నారు. మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ ఆమోదంతోనే పత్రికల్లో ప్రకటనలు జారీ చేయాలని సూచించారు. బల్క్ ఎస్ఎంఎస్‌లు, వాయిస్ మెసేజ్‌లపై నిషేధం ఉంటుందన్నారు. ఎన్నికలకు సంబంధించి పార్టీల స్టార్ క్యాంపైనర్లు పత్రికా సమావేశాలు పెట్టరాదని, మీడియాకు ఇంటర్వ్యూలు ఇవ్వరాదని స్పష్టం చేశారు

**ఈవీఎంల తరలింపును ఫాలో కావచ్చు..**

పోలింగ్ రోజు పోలింగ్ కేంద్రాల వద్ద ప్రచారం నిర్వహించడం, మొబైల్ ఫోన్స్, కార్డ్‌లెస్ ఫోన్లు, వాహనాలతో రావడంపై నిషేధం ఉంటుందని వికాస్‌రాజ్ తెలిపారు. అభ్యర్థులు పోలింగ్ కేంద్రానికి ఓటర్లను తీసుకుని రావడం, తీసుకెళ్లడం కోసం వాహనాలను సమకూర్చడం నేరమని హెచ్చరించారు. ఈవీఎంల మూడో ర్యాండమైజేషన్ పూర్తయిందని, పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంల కేటాయింపుపై మంగళవారం రాత్రిలోగా నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు బుధవారం ఉదయం పోలింగ్ సిబ్బంది వచ్చాక వారికి ఈవీఎంలను ఇచ్చి పోలింగ్ కేంద్రాలకు పంపిస్తారన్నారు. పోలింగ్‌కు ముందు, పోలింగ్ తర్వాత ఈవీఎంలను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించే సమయంలో అభ్యర్థుల ఏజెంట్లు తమ వాహనాల్లో ఫాలో కావచ్చని సూచించారు. నిర్దేశిత రూట్లలోనే ఈవీఎంలను రవాణా చేయాల్సి ఉంటుందని, మధ్యలో ఎక్కడా ఆగకూడదని స్పష్టం చేశారు. పోలింగ్ రోజు అభ్యర్థి ఒక వాహనం వాడడానికి మాత్రమే అనుమతిస్తామని, ఏజెంట్‌కు మరో వాహనం అనుమతి ఉంటుందన్నారు. ఓటర్లకు రాజకీయ పార్టీలు పంపిణీ చేసే ఓటర్ స్లిప్పుల్లో అభ్యర్థి పేరు, రాజకీయ పార్టీ గుర్తు ఉండరాదన్నారు.

**ఏజెంట్లు ఈవీఎంల వద్దకి వెళ్లరాదు..**

పోలింగ్ రోజు మాక్ పోల్ కోసం అభ్యర్థుల ఏజెంట్లు ఉదయం 5.30 గంటలకి పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని సీఈఓ వికాస్‌రాజ్ సూచించారు. ప్రిసైడింగ్ అధికారులు మాక్‌పోల్ నిర్వహించిన తర్వాత వీవీ ప్యాట్ కంపార్ట్‌మెంట్‌ను ఖాళీ చేయాల్సి ఉంటుందని, కంట్రోల్ యూనిట్ మెమోరీని సైతం డిలీట్ చేయాలన్నారు. ఏజెంట్లు ఈవీఎంల వద్దకి వెళ్లరాదని, లేనిపక్షంలో ప్రిసైడింగ్ అధికారులు వారిని బయటికి గెంటివేస్తారన్నారు.

**పోస్టల్ బ్యాలెట్‌లో విఫలం కాలేదు..**

పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పనలో విఫలమైనట్టు వచ్చిన ఆరోపణలను వికాస్‌రాజ్ తోసిపుచ్చారు. ఇంటి నుంచి ఓటేసేందుకు దరఖాస్తు చేసుకున్న వారిలో 94శాతం మందికి సదుపాయం కల్పించామన్నారు. 27,178 మంది ఇంటి నుంచే ఓటేయగా, వారిలో 15,999 మంది 80ఏళ్లపైబడినవారు, 9459 మంది దివ్యాంగులు, 1720 మంది అత్యవసర సేవల ఓటర్లున్నారని వెల్లడించారు. మరో 10,191 మంది సర్వీసు ఓటును ఎలక్ట్రానిక్ రూపంలో డౌన్‌లోడ్ చేసుకున్నారని, డిసెంబర్ 3న ఉదయం 7.59 గంటలకు అవి సంబంధిత కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుందని వివరించారు. ఎన్నికల విధుల్లో ఉన్న మరో 1.48 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు సోమవారం నాటికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేశారని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లను సంబంధిత నియోజకవర్గానికి పంపించేందుకు గచ్చిబౌలి స్టేడియంలో ఎక్ఛేంజ్ కేంద్రం పెట్టామని ఆయన వివరించారు

**సెక్టోరియల్ అధికారులకు మెజిస్టీరియల్ అధికారాలు...**

ప్రతి నియోజకవర్గం పరిధిలోని కొన్ని పోలింగ్ కేంద్రాలకు ఒక్కో సెక్టోరియల్ అధికారిని నియమించామని ఎక్కడ ఎలాంటి సమస్య వచ్చినా వారు స్పందించి చర్యలు తీసుకుంటారని వికాస్‌రాజ్ తెలిపారు. శాంతిభద్రతల సమస్యలొస్తే చర్యలు తీసుకునే మెజిస్టీరియల్ అధికారాలు వారికి ఉంటాయన్నారు. ఎక్కడైన ఈవీఎంలు పనిచేయని పక్షంలో తక్షణమే ప్రత్యామ్నాయ ఈవీఎంలను వారే సమకూర్చుతారని తెలిపారు. విలేకరుల సమావేశంలో అదనపు సీఈఓ లోకేష్‌కుమార్, జాయింట్ సీఈఓ సర్ఫరాజ్ అహమద్, డిప్యూటీ సీఈఓ సత్యవాణి పాల్గొన్నారు.



మంగళవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగిన రోడ్‌షోలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

# కాంగ్రెస్ చేతికి వెళ్తే కుక్కలు చింపిన విస్తరే

- ఓటు కోసం తెలంగాణ ద్రోహులు వస్తుండ్రు
- సిద్దిపేట రోడ్ షో, మద్దూరు సభల్లో మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట జోన్, మద్దూరు: 'కొంతమంది దొంగలు, తెలంగాణ ద్రోహులు ఓటు కోసం బయల్దేరారు. కాంగ్రెస్ వాళ్లు ఎప్పుడైనా తెలంగాణ కోసం పోరాటం, రాజీనామాలు, దీక్షలు చేసిండ్రా? అన్నీ చేసింది కేసీఆర్. తెలంగాణ తెచ్చింది కేసీఆర్. కానీ ఇప్పుడు కుర్చీ మీద కూసోవడానికి వస్తుండ్రు. తప్పిపోయి రాష్ట్రం కాంగ్రెస్ చేతికి పోతే కుక్కలు చింపిన విస్తరే' అని మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ అభ్యర్థి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలో భారీ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టపడి తెచ్చుకున్న తెలంగాణ కేసీఆర్ చేతుల్లో ఉంటేనే సురక్షితంగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు అడిగే నైతిక హక్కు కూడా లేదని విమర్శించారు. వాళ్లు ఎన్నికల సమయంలో తప్ప ఎప్పుడూ కనిపించరని, ఎన్నిక లున్నా లేకున్నా ఐదేళ్లు తాను ప్రజల మధ్య ఉంటానని హరీశ్ హామీ ఇచ్చారు. కొందరు సిద్దిపేట అభివృద్ధి మీద విమర్శలు చేశారని, ఇక్కడి ప్రగతిని చూసి ఓర్వలేని వారికి, అభివృద్ధిని విమర్శించిన వారికి ఓటు రూపంలో సరైన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రతిసారీ తన మెజార్టీ పెంచుతూ ఎంతో ప్రేమను అందించిన సిద్దిపేటకు తన జీవితం అంకితమని హరీశ్ వ్యాఖ్యానించారు.

**యూపీలో చెల్లని రూపాయి.. ఇక్కడ చెల్లుతుందా?**

''ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా వ్యవహరించిన ప్రియాంకాగాంధీ 6 నెలలు రాష్ట్రం మొత్తం పర్యటిస్తే అక్కడ కాంగ్రెస్‌కు వచ్చిన సీట్లు 2 అని గుర్తు చేశారు. ఉత్తరప్రదేశ్‌లో చెల్లని రూపాయి.. తెలంగాణలో చెల్లుతుందా''అని హరీశ్‌రావు ప్రశ్నించారు. నారాయణపేట జిల్లా మద్దూరులో ఎన్నికల ప్రచారంలో భాగంగా గనులు, భూగర్భ శాఖ మంత్రి మహేందర్‌రెడ్డితో కలిసి పట్నం నరేందర్‌రెడ్డికి మద్దతుగా కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో 2.5 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వేస్తామని రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారని, ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికి 180 రోజులు గడిచినా ఒక్క నోటిఫికేషన్ వేయలేదని ఎద్దేవా చేశారు. ఇక్కడి నుంచి పోటీ చేస్తున్న రేవంత్‌రెడ్డి రైతులకు మూడు గంటల విద్యుత్ సరిపోతుంది అంటున్నారు.. రైతులు ఆలోచించాలి.. రేవంత్‌రెడ్డి ఇవాళ టికెట్లు అమ్ముకున్నాడు. అధికారంలోకి తీసుకొస్తే రాష్ట్రాన్ని అమ్ముకుంటాడని ఆరోపించారు. సోనియాగాంధీని బలిదేవత అన్న రేవంత్‌రెడ్డి ఇప్పుడేమో దేవత అంటున్నాడు. ఏ ఎండకు ఆ గొడుగు పట్టే అతన్ని ప్రజలు నమ్మడం లేదని, పోటీ చేస్తున్న రెండు చోట్లా ఓడిపోతున్నాడని హరీశ్ జోస్యం చెప్పారు.

**కాంగ్రెస్ ది బలుపు కాదు.. వాపు**

గెలిచి నిలిచేది బీఆర్ఎస్సే: 'ఎక్స్'లో హరీశ్ రావు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ది బలుపు కాదు వాపు అని ఆ పార్టీ నిర్వహించిన బహిరంగ సభలు రుజువు చేశాయని మంత్రి హరీశ్ రావు వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, బీజేపీ నుంచి ఎన్నికల ప్రచారానికి ఎంత మంది పొలిటికల్ టూరిస్టులు వచ్చినా రాష్ట్ర ప్రజలు సీఎం కేసీఆర్‌కే బ్రహ్మరథం పట్టారని పేర్కొన్నారు. తెలంగాణలో గెలిచి నిలిచేది బీఆర్ఎస్ మాత్రమేనని ప్రచార సరళి నిరూపించిందని సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' లో పేర్కొన్నారు. ఈ నెల 30 న జరిగే పోలింగ్‌లో కేసీఆర్ పై తెలంగాణ ఏకపక్షంగా తన అభిమానాన్ని చాటుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. మూడో సారి బీఆర్ఎస్ పార్టీని గెలిపించి, కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎం చేసేందుకు తెలంగాణ ప్రజలు మానసికంగా సిద్ధమయ్యారని హరీశ్ తెలిపారు.



# ఆఖరి క్షణం దాకా అప్రమత్తం..

మొదటి పేజీ తరువాయి

ఉండేలా చూసుకోవాలని సూచించారు. పార్టీ బలహీనంగా ఉన్న బూత్‌ల పరిధిలో అనుకూల ఓట్లు ఖచ్చితంగా పోలయ్యేలా చూసుకోవాలని ఆదేశించారు.

**96 సభల్లో పాల్గొన్న సీఎం**

కేసీఆర్ గత నెల 15 నుంచి ప్రజా ఆశీర్వాద సభల పేరిట ముమ్మర ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 33 రోజుల వ్యవధిలో ఏకంగా 96 నియోజకవర్గాల్లో జరిగిన బహిరంగ సభల్లో ప్రసంగించారు. అక్టోబర్ 15న హుస్నాబాద్‌లో ప్రారంభించిన ప్రచారాన్ని, మంగళవారం గజ్వేల్‌లో ముగించారు. నవంబర్ 9న తాను ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్‌తో పాటు కామారెడ్డిలోనూ నామినేషన్లు దాఖలు చేశారు. మరోవైపు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు కూడా రెండు నెలల పాటు నిర్విరామ ఎన్నికల ప్రచారంలో నిమగ్నమయ్యారు. రోడ్‌షోలు, బహిరంగ సభలు కలుపుకొని సుమారు వందకు పైగా ప్రాంతాల్లో ప్రసంగించారు. ఓ వైపు పార్టీ విధానాలను వివరించేందుకు వరుసగా మీడియా సమావేశాలు, ప్రత్యేక ఇంటర్వ్యూలు ఇస్తూనే బీఆర్ఎస్ అభ్యర్థులు, పార్టీ నేతలతో వరుస టెలీ కాన్ఫరెన్స్‌లు నిర్వహించారు.

# ప్రజాగొంతుకనై ఉంటా!

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల అనంతరం కొత్త ప్రభుత్వ ఏర్పాటులో బీఎస్పీ పాత్ర కీలకం అవుతుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఐపీఎస్ అధికారిగా ఏడేళ్ల సరీ్వస్‌ను వదులుకొని రాజకీయాల్లోకి వచ్చి ప్రజల గొంతుకగా మారిన తాను ఎన్నికల అనంతరం కూడా అదేవిధంగా ఉంటానని అన్నారు. ఎన్నికల ప్రచారం ముగిసిన నేపథ్యంలో ఆయ న మంగళవారం 'సాక్షి'తో మాట్లాడారు. రాష్ట్రంలోని 111 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న బీఎస్పీ అధికార, ప్రతిపక్ష పార్టీలకు గట్టిపోటీ ఇస్తుందన్నారు. చాలా నియోజకవర్గాల్లో అనూహ్య విజయాలు సాధించబోతున్నామని చెప్పారు. అధికార బీఆర్ఎస్‌తోపాటు కాంగ్రెస్, బీజేపీల ధనబలాన్ని తట్టుకొని బీఎస్పీ అభ్యర్థులు దీటైన పోటీ ఇస్తున్నారని చెప్పారు. సిర్పూరులో తనతోపాటు చాలా జిల్లాల్లో బీఎస్పీ అభ్యర్థులు విజయం సాధించబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. నిరుద్యోగుల పక్షాన నిలిచిన బీఎస్పీకి రాష్ట్రంలోని 30 లక్షల మంది నిరుద్యోగులు అండగా నిలిచారన్నారు. ఆదివాసీల పోడుభూముల కోసం పోరుబాట పట్టిన విషయాన్ని గుర్తుచేశారు. దళిత, గిరిజన, బీసీ వర్గాలతోపాటు ఆర్థికంగా వెనుకబడ్డ అగ్రవర్ణాల కోసం రెండేళ్లుగా రాజకీయ పోరాటం సాగిస్తున్నానని చెప్పారు. ఈ ఎన్నికల్లో అన్నివర్గాల ప్రజలు అత్యధిక స్థానాల్లో బీఎస్పీ అభ్యర్థులను గెలిపించి ఆదరిస్తారని భావిస్తున్నట్లు చెప్పారు. గెలిచిన తరువాత ప్రభుత్వ ఏర్పాటులో కీలకపాత్ర పోషించడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యేందుకు, నిరుద్యోగులకు న్యాయం జరిగేందుకు పోరాడతానని చెప్పారు.

## గెలిపిస్తే విజయయాత్రకు వస్తా.. లేదంటే మా శవయాత్రకు రండి

కమలాపూర్‌లో పాడి కౌశిక్‌రెడ్డి భావోద్వేగ ప్రసంగం



కమలాపూర్: 'ఎన్నికల్లో నన్ను గెలిపిస్తే విజయయాత్రకు వస్తా.. లేదంటే డిసెంబర్ 4న మీరే మా శవయాత్రకు రండి' అని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచార రోడ్ షోలో తన భార్య శాలిని, కూతురు శ్రీనిఖతో కలిసి ఆయన భావోద్వేగంగా మాట్లాడారు. 'మమ్మల్ని ఓడగొడితే ముగ్గురం ఇక్కడే ఉరి తీసుకోవాల్నా' అని ప్రజలను ప్రశ్నించారు. తాను 15 ఏళ్లుగా మీ కళ్ల ముందు ఎదిగిన బిడ్డనని, మీ కష్టసుఖాల్లో తోడుంటున్నానని, తనను గెలిపించి సాదుకుంటారో? లేక సంపుకుంటారో? ఇక మీ ఇష్టమన్నారు. అయితే కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలపై ప్రత్యర్థి పార్టీలు భగ్గుమ న్నాయి. ఓటమి భయంతోనే కౌశిక్‌రెడ్డి ఇలాంటి బ్లాక్ మెయిలింగ్, బెదిరింపు రాజకీయా లకు పాల్పడుతున్నాడని, కౌశిక్‌రెడ్డిపై ఈసీ చర్యలు తీసుకోవాలని వారు కోరారు.




# వాళ్లు సొరంగాన్ని జయించారు!

## సిల్క్యారా టన్నెల్‌లో ముగిసిన రెస్క్యూ ఆపరేషన్

- 12 మీటర్ల శిథిలాల డ్రిల్లింగ్ పనులు పూర్తిచేసిన ర్యాట్–హోల్ మైనింగ్ నిపుణులు
- క్షేమంగా బయటకు వచ్చిన 41 మంది కార్మికులు
- స్టీల్‌పైపు గుండా బయటకు తీసుకొచ్చిన ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది
- కార్మికులకు స్వాగతం పలికిన కేంద్ర మంత్రి వి.కె.సింగ్, ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్
- ఆపరేషన్ విజయవంతం కావడం పట్ల దేశమంతటా హర్షాతిరేకాలు

**ఉత్తరకాశీ/న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా మతాలకు అతీతంగా కోట్లాది మంది చేసిన ప్రార్థనలు ఫలించాయి. 17 రోజుల సుదీర్ఘ నిరీక్షణ ముగిసింది. ఉత్కంఠకు తెరపడింది. ప్రమాదవశాత్తూ సొరంగంలో చిక్కుకొని ఆశ నిరాశల మధ్య క్షణమొక యుగంలా బిక్కుబిక్కుమంటూ గడిపిన 41 మంది కార్మికులు ప్రాణాలతో బయటపడ్డారు. 60 మీటర్ల పొడవైన ఎస్కేప్ రూట్‌లో ఏర్పాటు చేసిన స్టీల్ పైపు గుండా కార్మికులను ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది క్షేమంగా బయటకు తీసుకొచ్చారు. గుహ లాంటి సొరంగం నుంచి బయటకు వచ్చిన కార్మికులు బాహ్య ప్రపంచాన్ని కళ్లారా తిలకించి, గుండెనిండా హాయిగా ఊపిరి పీల్చుకున్నారు. ఉత్తరాఖండ్‌లో సిల్క్యారా సొరంగంలో సహాయక చర్యలు మంగళవారం పూర్తయ్యాయి. ర్యాట్–హోల్ మైనింగ్ నిపుణులు సొరంగం లోపల మిగిలిన 12 మీటర్ల మేర శిథిలాల డ్రిల్లింగ్ పనులు పూర్తిచేశారు. వెంటనే భారీ స్టీల్ పైపును ఏర్పాటు చేసి, ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది కార్మికుల వద్దకు చేరుకున్నారు. ఒక్కొక్కరిని స్ట్రెచ్చర్లపై బయటకు చేర్చారు. స్టీల్ పైపు నుంచి బయటకు రాగానే కార్మికులకు వైద్య సిబ్బంది కొన్ని పరీక్షలు చేశారు. వారందరి ఆరోగ్యం మెరుగ్గానే ఉందని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామీ చెప్పారు. అయినప్పటికీ వారిని ఇళ్లకు పంపించడానికి ముందు కొన్నిరోజులపాటు వైద్యుల పరిశీలనలో ఉంచాలని నిర్ణయించామని తెలిపారు. 41 మంది కార్మికులకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందజేస్తామని ప్రకటించారు. సహాయక ఆపరేషన్‌లో పాల్గొన్నవారికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మద్దతు లేకుంటే ఈ ఆపరేషన్ ఇంత త్వరగా విజయవంతమయ్యేది కాదని పుష్కర్‌సింగ్ ధామీ అన్నారు.

### ఘటనా స్థలంలో ఉద్విగ్న వాతావరణం

సొరంగం ముఖద్వారం వద్ద మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో కార్మికులకు కేంద్ర మంత్రి వి.కె.సింగ్, ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ కొందరు కార్మికులతో ఫోన్‌లో మాట్లాడారు. ఘటనా స్థలంలో ఉద్విగ్న వాతావరణం నెలకొంది. హర హర మహాదేవ, భారత్ మాతాకీ జై అనే నినాదాలు మిన్నంటాయి. సొరంగం బయట ఉన్న వారంతా పరస్పరం ఆలింగనాలతో ఆనందం పంచుకున్నారు. కార్మికుల కుటుంబ సభ్యులు సైతం అభినందనలు తెలుపుకున్నారు. సహాయక సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. భగవంతుడు తమ మొర ఆలకించాడని చెమర్చే కళ్లతో వారు చెప్పారు. అధికారులు అప్పటికే సిద్ధంగా ఉంచిన అంబులెన్స్‌ల్లో కార్మికులను స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఈ ఆసుపత్రిలో కార్మికుల కోసం ఇంతకుముందే 41 పడకలతో ప్రత్యేక వార్డు సిద్ధం చేశారు. ఈ నెల 12వ తేదీన కార్మికులు సిల్ క్యారా సొరంగంలో చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. సొరంగంలో రెస్క్యూ ఆపరేషన్ విజయవంతమై, కార్మికులు క్షేమంగా బయటకు రావడం పట్ల దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. సహాయక సిబ్బందిని అభినందిస్తూ సోషల్ మీడియాలోనూ నెటిజన్లు పోస్టులు పెట్టారు.


క్షేమ సమాచారం కోసం ఫోన్ చేసిన ప్రధాని మోదీతో మాట్లాడుతున్న కార్మికులు

### 'ర్యాట్-హోల్'పై నిషేధం.. అదే ప్రాణాలు కాపాడింది

ఎలుకలాగా కలుగును తవ్వేసే ర్యాట్–హోల్ మైనింగ్ అనేది నిజానికి చట్టవిరుద్ధమే. కానీ, సిల్క్యారా టన్నెల్లో ఇదే ప్రక్రియ 41 మంది కార్మికుల ప్రాణాలు కాపాడిందని నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ(ఎన్డీఎంఏ) సభ్యుడు లెఫ్టినెంట్ జనరల్(రిటైర్డ్) సయ్యద్ అతా హస్నెయిన్ మంగళవారం వెల్లడించారు. ఈ సొరంగంలో ర్యాట్–హోల్ మైనింగ్ నిపుణులు 12 మీటర్ల శిథిలాలను 24 గంటల వ్యవధిలో తవ్వేశారని చెప్పారు. వారి కృషి వల్లే కార్మికులు త్వరగా బయటకు వచ్చారని ప్రశంసించారు. బొగ్గు గనుల్లో 3 నుంచి 4 అడుగుల ఎత్తయిన సొరంగాలను అడ్డంగా తవ్వడానికి ర్యాట్–హోల్ మైనింగ్ టెక్నాలజీ వాడుతుంటారు. కేవలం ఒక్క మనిషి పట్టేందుకు వీలుగా ఈ సొరంగాలు ఉంటాయి. మేఘాలయ బొగ్గు గనుల్లో ఈ సాంకేతికతను వాడడాన్ని 2014లో జాతీయ హరిత ట్రిబ్యునల్ నిషేధించింది. దేశవ్యాప్తంగా బొగ్గు గనుల్లో ర్యాట్–హోల్ మైనింగ్‌పై నిషేధం అమలవుతోంది. కానీ, ఇతర నిర్మాణ పనుల్లో అనధికారికంగా ఉపయోగిస్తూనే ఉన్నారు. సిల్క్యారా సొరంగంలో మట్టి శిథిలాలను తవ్వడానికి 12 మంది ర్యాట్–హోల్ మైనింగ్ నిపుణులను రప్పించారు.

## ఎప్పుడేం జరిగింది?

**నవంబర్ 12** దీపావళి పండుగ రోజే ఉదయం 5.30 గంటలకు సిల్క్యారా–దందల్‌గావ్ మధ్య నిర్మాణంలో ఉన్న సొరంగం కూలిపోయింది. 41 మంది కార్మికులు అందులో చిక్కుకుపోయారు. అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. సొరంగంలోకి ఎయిర్–కంప్రెస్డ్ పైపుల ద్వారా ఆక్సిజన్, విద్యుత్, ఆహార పదార్థాలు పంపించడానికి ఏర్పాట్లు చేశారు. ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్, బీఆర్‌ఓ, ఎన్‌హెచ్ఐడీసీఎల్, ఐటీబీపీ తదితర సంస్థలు సహాయక చర్యల్లో పాల్గొన్నాయి.

**నవంబర్ 13** సొరంగంలో ఉన్న కార్మికులతో మాట్లాడేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఆక్సిజన్ కోసం ఉద్దేశించిన పైపుల గుండా అధికారులు మాట్లాడారు. క్షేమంగా ఉన్నామని కార్మికులు బదులిచ్చారు. అదేరోజు సొరంగం పైభాగం నుంచి మట్టి కూలింది. టన్నెల్ లోపల 60 మీటర్ల మేర మట్టి విస్తరించింది.

**నవంబర్ 14** దాదాపు 900 మిల్లీమీటర్ల వ్యాసార్థం ఉన్న స్టీల్ పైపులను సొరంగం వద్దకు చేర్చారు. మట్టి శిథిలాల గుండా సొరంగంలోకి ఈ పైపులను పంపించాలని నిర్ణయించారు. సొరంగంలో పైభాగం నుంచి మరింత మట్టి కూలడం ఆందోళన కలిగించింది. ఇద్దరు కార్మికులు స్వల్పంగా గాయపడ్డారు.

**నవంబర్ 15** కార్మికులను బయటకు తీసుకురావడానికి డ్రిల్లింగ్ యంత్రంతో తవ్వకం పనులు చేపట్టారు. అవి సవ్యంగా సాగకపోవడంతో అత్యాధునిక అగర్ మెషీన్‌ను రంగంలోకి దింపాలని నిర్ణయించారు. ఢిల్లీ నుంచి విమానంలో తీసుకొచ్చారు.

**నవంబర్ 16** అగర్ మెషీన్‌తో డ్రిల్లింగ్ పనులు ప్రారంభించారు.

**నవంబర్ 17** సొరంగంలో 57 మీటర్ల మేర మట్టి శిథిలాలు ఉండగా, 24 మీటర్ల మేర తవ్వకాలు జరిపారు. నాలుగు ఎంఎస్ పైపులను శిథిలాల గుండా పంపించారు. ఐదో పైపునకు అవరోధాలు ఎదురుకావడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. మరో అగర్ మెషీన్‌తో పనులు ప్రారంభించారు. ఐదో పైపును అమర్చే క్రమంలో సొరంగంలో భారీగా పగుళ్ల శబ్దాలు వినిపించాయి. సొరంగం మొత్తం కుప్పకూలే అవకాశం ఉండడంతో ఆ పనులు వెంటనే నిలిపివేశారు.

**నవంబర్ 18** 1,750 హార్స్‌పవర్ కలిగిన అమెరికన్ అగర్ మెషీన్ వల్ల టన్నెల్ లోపల ప్రకంపనలు పుట్టుకొస్తున్నట్లు గుర్తించారు. ప్రత్యామ్నాయం కోసం అన్వేషించారు. సహాయక చర్యల్లో ఆలస్యం జరుగుతుండడంతో ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంఓ) అధికారులు కూడా రంగంలోకి దిగారు. ఐదు రకాల మార్గాలపై దృష్టి పెట్టారు. టన్నెల్ ఉపరితలం నుంచి లోపలికి నిలువుగా డ్రిల్లింగ్ చేయాలని నిర్ణయించారు.

**నవంబర్ 19** ఘటనా స్థలంలో సహాయక చర్యలను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ స్వయంగా సమీక్షించారు. నిలువుగా కాకుండా అగర్ మెషీన్‌తో అడ్డంగా డ్రిల్లింగ్ చేస్తే బాగుంటుందని సూచించారు.

**నవంబర్ 20** సహాయక చర్యలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరా తీశారు. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రితో మాట్లాడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. టన్నెల్‌లో అడ్డంగా డ్రిల్లింగ్ చేస్తుండగా, అగర్ మెషీన్‌కు పెద్ద రాయి అడ్డుపడింది. పనులు నిలిచిపోయాయి.

**నవంబర్ 21** సొరంగంలో చిక్కుకుపోయిన కార్మికుల మొదటి వీడియోను అధికారులు విడుదల చేశారు. ఆహారం తీసుకుంటూ, ఒకరితో ఒకరు మాట్లాడుకుంటూ కార్మికులు కనిపించారు. తమ కుటుంబ సభ్యులతోనూ వారు మాట్లాడారు. సిల్కియారా వైపు నుంచి అగర్ యంత్రంతో అడ్డంగా డ్రిల్లింగ్ పనులను అధికారులు పునఃప్రారంభించారు.

**నవంబర్ 22** 800 వ్యాసార్థం కలిగిన స్టీల్ పైపులను శిథిలాల గుండా 45 మీటర్ల వరకు పంపించారు. మరో 12 మీటర్లే మిగిలి ఉంది. ఇంతలో మరో అవాంతరం వచ్చిపడింది. అగర్ మెషీన్‌కు కొన్ని ఇనుప కడ్డీలు అడ్డం వచ్చాయి.

**నవంబర్ 23** అడ్డంగా ఉన్న ఐరన్ రాడ్లను తొలగించారు. శిథిలాల్లో అడ్డంగా 48 మీటర్ల మేర డ్రిల్లింగ్ పూర్తయ్యింది. ఇక్కడ మరో ఉపద్రవం తప్పలేదు. అగర్ మెషీన్‌ను ఏర్పాటు చేసిన వేదికకు పగుళ్లు వచ్చాయి.

**నవంబర్ 24** పగుళ్లను సరిచేసి, డ్రిల్లింగ్ మళ్లీ ప్రారంభించారు. ఈసారి మెటల్ గిర్డర్ అడ్డుపడింది. దాన్ని తొలగించారు.

**నవంబర్ 25** అగర్ మెషీన్ బ్లేడ్లు శిథిలాల్లో ఇరుక్కున్నాయి. దీంతో రెస్క్యూ ఆపరేషన్ పూర్తి కావడానికి మరికొన్ని వారాలు పడుతుందని భావించారు. మరో 12 మీటర్ల మేర డ్రిల్లింగ్ మిగిలి ఉంది. కానీ, ఆ పనులు ఆపేయాలని నిర్ణయించారు.

**నవంబర్ 26** కార్మికులను క్షేమంగా బయటకు తీసుకురావడానికి ప్రత్యామ్నాయ మార్గం కోసం 19.2 మీటర్ల మేర నిలువుగా డ్రిల్లింగ్ పూర్తిచేశారు. 700 మిల్లీమీటర్ల వ్యాసార్థం కలిగిన పైపులు పంపించే పనులు ప్రారంభించారు.

**నవంబర్ 27** 12 మీటర్ల మేర డ్రిల్లింగ్ కోసం ర్యాట్–హోల్ మైనింగ్ నిపుణులను రప్పించారు. అదే సమయంలో టన్నెల్ పై భాగం నుంచి నిలువుగా డ్రిల్లింగ్ 36 మీటర్ల మేర పూర్తయ్యింది.

**నవంబర్ 28** సాయంత్రం 7 గంటలకల్లా డ్రిల్లింగ్ ఆపరేషన్ మొత్తం పూర్తయ్యింది. ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్ సిబ్బంది స్టీల్ పైపు గుండా కార్మికుల వద్దకు చేరుకున్నారు. వీల్డ్–స్ట్రెచ్చర్లపై ఒక్కొక్కరిని భద్రంగా బయటకు తీసుకొచ్చారు.



బయటకొచ్చిన కార్మికులతో మాట్లాడుతున్న ఉత్తరాఖండ్ సీఎం ధామి, కేంద్రమంత్రి వీకే సింగ్


టన్నెల్ నుంచి రక్షించిన 41 మంది కార్మికులను ఆస్పత్రికి తీసుకెళ్తున్న అంబులెన్సులు

## కార్మికుల స్థైర్యానికి సలాం

**సొరంగం ఆపరేషన్ విజయవంతంపై రాష్ట్రపతి ముర్ము**

**న్యూఢిల్లీ:** ఉత్తరాఖండ్‌లోని సొరంగంలో 17 రోజులుగా చిక్కుబడిపోయిన కార్మికులు సురక్షితంగా బయటకు రావడంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే సహా పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. సొరంగం ఆపరేషన్ విజయవంతంగా ముగిసినందుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సంతోషం వ్యక్తం చేశారు. కార్మికుల స్థైర్యానికి దేశం సలాం చేస్తుందన్నారు. 'తమ ప్రాణాలకు ప్రమాదమున్నా లెక్క చేయకుండా కీలక మౌలిక నిర్మాణాల పనుల్లో పాలుపంచుకుంటున్న కార్మికులకు దేశం రుణపడి ఉంటుంది. 17 రోజులపాటు కార్మికులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. వారిని రక్షించేందుకు చేపట్టిన ప్రయత్నాలకు ఆటంకాలు ఎదురయ్యాయి. మనిషి సహనానికి ఈ ఘటన ఒక నిదర్శనం'అని రాష్ట్రపతి పేర్కొన్నారు.

### ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం: ప్రధాని మోదీ

'కార్మికుల ధైర్యం, సహనం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిని కలిగిస్తుంది. వారికి మంచి ఆరోగ్యం, శ్రేయస్సు కలగాలని ఆకాంక్షిస్తున్నాను. మన స్నేహితులు చాలా కాలం ఎదురుచూపుల తర్వాత తమ ప్రియమైన వారిని కలుసుకోవడం చాలా సంతృప్తిని కలిగించే విషయం. వారి కుటుంబ సభ్యుల సహనం, ధైర్యాన్ని ఎంత పొగిడినా తక్కువే. టన్నెల్ ఆపరేషన్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ నా సెల్యూట్'అని ప్రధాని మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. కార్మికుల ప్రాణాలు కాపాడేందుకు అహర్నిశలు శ్రమించిన వివిధ విభాగాల అధికారులకు హోం మంత్రి అమిత్ షా కృతజ్ఞతలు తెలిపారు.

### యాంత్రిక శక్తిపై మానవ శ్రమ విజయం: ప్రపంచ మీడియా

**లండన్:** ఉత్తరాఖండ్ టన్నెల్‌లో 41 మంది కార్మికులు 17 రోజుల క్రితం చిక్కుబడిపోయినప్పటి నుంచి.. మంగళవారం రాత్రి వారందరినీ సురక్షితంగా బయటకు తీసుకువచ్చే వరకు జరుగుతున్న పరిణామాలను అంతర్జాతీయ మీడియా ఎప్పటికప్పుడు అందజేస్తూ వస్తోంది. 'టన్నెల్ నుంచి మొదటి వ్యక్తి బయటకు వచ్చినట్లు తెలియగానే అక్కడ పండుగ వాతావరణం నెలకొంది'అంటూ రెస్క్యూ ఆపరేషన్ అప్‌డేట్స్ అందజేస్తున్న బీబీసీ విలేకరి పేర్కొన్నారు. 'సొరంగం లోపల చిక్కుకున్న వారిని రక్షించే క్రమంలో చిట్టచివరి అడ్డంకిగా ఉన్న 12 మీటర్ల మేర శిథిలాలను మాన్యువల్‌గా డ్రిల్ చేశారు. యంత్ర శక్తిపై మానవ శ్రమ సాధించిన విజయమిది'అని బ్రిటిష్ డెయిలీ 'ది గార్డియన్ పేర్కొంది. అదేవిధంగా, సీఎన్ఎన్, అల్‌జజీరా, ది టెలిగ్రాఫ్ కూడా ఎప్పటికప్పుడు అక్కడి పరిణామాలను కవర్ చేశాయి.

## “దేవుని దీవెనలు ఉన్నాయి కన్నా..

**కార్మికునితో ఫోన్‌లో మాట్లాడిన తల్లి**

కార్మికులు సురక్షితంగా బయటపడటంతో వారి కుటుంబాల్లో ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. కొందరి కుటుంబసభ్యులు ఘటనాస్థలికి రాగా, మరికొందరు ఫోన్‌లో తమ క్షేమ సమాచారాన్ని కుటుంబసభ్యులకు చేరవేశారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన కార్మికుడు శౌభిక్ పఖీరా బయటకురాగానే ఇంటికి ఫోన్ చేసి తల్లి లక్ష్మితో మాట్లాడారు. ఆ ఆనందకర దృశ్యం అక్కడివారికి కంటతడి పెట్టించింది. ' దేవుని దీవెనలు నీపై ఉన్నాయిరా. నువ్వు వరల్డ్ రికార్డ్ సాధించావు. నిన్ను నవమాసాలు మోసినందుకు ఆనందంగా ఉంది. నీ ఆరోగ్యం బాగుందా? హెల్త్ చెకప్ చేశారా? జాగ్రత్తగా ఇంటికి రా. స్నానం చేసి కొత్త బట్టలు కట్టుకో. పూజ చేసిన పూలు పంపిస్తున్నా' అని తల్లి లక్ష్మి ఏడుస్తూ మాట్లాడారు. మరోవైపు, కార్మికులు బయటకురావడంతో జార్ఖండ్‌లోని ఖైరాబేడా గ్రామంలో ఆనందం వెల్లివిరిసింది. రాజేంద్ర, సుఖ్‌రామ్, అనిల్ అనే కార్మికులు ఈ గ్రామం వారే.

## యూపీఐ 'తొలి' లావాదేవీకి 4 గంటలు ఆగాల్సిందే!

**సాక్షి, న్యూఢిల్లీ:** డిజిటల్ సీమలో చెలరేగిపోతున్న సైబర్ చోరుల ఆట కట్టించేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనను ప్రవేశపెట్టే యోచనలో ఉంది. అయితే ఈ నిబంధన మొదటికే మోసం వస్తుందేమోనన్న అనుమానం ప్రజలు, వర్తకుల్లో వ్యక్తమవుతోంది. యూపీఏ లావాదేవీల ద్వారా 2022–23 భారతీయ రిజర్వ్ బ్యాంక్ గణాంకాల ప్రకారం యూపీఐ లావాదేవీల రూపంలో సైబర్ నేరగాళ్లు ఏకంగా రూ.30,252 కోట్లు కొట్టేయడంతో ప్రజాధనాన్ని కాపాడేందుకు కొత్త నిబంధనలను తేవాలని కేంద్రం యోచిస్తోంది. ఇందులోభాగంగా కొన్ని ప్రతిపాదనలతో ముందుకొచ్చింది. డిజిటల్ పేమెంట్స్ ద్వారా ఇద్దరి మధ్య జరిగే తొలి లావాదేవీలో భారీగా రెప్పపాటులో బదిలీకాకుండా ఆపాలని భావిస్తోంది. ఈ నిబంధన అమల్లోకి వస్తే రూ.2వేలు వంటి చిన్న మొత్తాలను వెంటనే యూపీఐ వంటి డిజిటల్ చెల్లింపుల ద్వారా పంపుకోవచ్చు. అంతకంటే ఎక్కువ మొత్తాలను పంపాలంటే ఆ ట్రాన్సాక్షన్ పూర్తికి 4 గంటల వ్యవధి పెట్టాలని కేంద్రం భావిస్తోంది. తప్పుడు/మోసపూరిత యూపీఐ లావాదేవీ ద్వారా భారీ మొత్తం ఖాతా నుంచి చోరీ అయితే ఆ 4గంటలలోపు ఫిర్యాదు అందితే బాధితులకు తక్షణ సాయం చేసేందుకు అవకాశం ఉంటుందని కేంద్రం భావిస్తోంది. గతంలో ట్రాన్సాక్షన్ జరగని ఖాతాలకు మాత్రమే దీనిని అమలు చేయనున్నారు.

## వైట్‌హౌస్, పెంటగాన్, యుద్ధ నౌకలు...

**ఫొటోలను తమ నిఘా ఉపగ్రహం తీసిందన్న ఉత్తరకొరియా**

**సియోల్:** అమెరికా అధ్యక్షుడి నివాసం వైట్‌హౌస్, రక్షణశాఖ కార్యాలయం పెంటగాన్, అమెరికా విమాన వాహక నౌకల స్పష్టమైన ఫొటోలను సోమవారం తమ నిఘా ఉపగ్రహం పంపించినట్లు ఉత్తరకొరియా ప్రకటించుకుంది. వీటిని తమ నేత కిమ్ జొంగ్ ఉన్ పరిశీలించారని తెలిపింది. మల్లిగియోంగ్–1 అనే నిఘా ఉపగ్రహం ప్రయోగాన్ని కిమ్ తిలకిస్తున్న ఫొటోలను గత మంగళవారం అధికార వార్తా సంస్థ కేసీఎన్ఏ విడుదల చేసింది. శాటిలైట్ విడుదల చేసిన చిత్రాల్లో అమెరికా నేవీ కేంద్రం, నౌకాశ్రయం, వర్జీనియాలోని వైమానిక కేంద్రం ఉన్నాయని తెలిపింది.

## కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య

**కోటా:** రాజస్తాన్‌లో పోటీ పరీక్షల శిక్షణకు పేరున్న కోటాలో మరో విద్యార్థి తనువు చాలించాడు. పశ్చిమబెంగాల్‌లోని బిర్భూమ్ జిల్లాకు చెందిన ఫరీద్ హుస్సేన్(20) నీట్ పరీక్ష కోసం జూలై నుంచి స్థానిక వఫ్ఫ్‌నగర్‌లోని అద్దె ఇంట్లో ఉంటూ శిక్షణ తీసుకుంటున్నాడు. సోమవారం మధ్యాహ్నం తోటి వారికి కనిపించిన ఫరీద్ రాత్రి 8 గంటలైనా బయటకు రాలేదు. పోలీసులు తలుపులు బద్దలు కొట్టి చూడగా ఫరీద్ ఉరికి వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. కాగా, ఈ ఏడాదిలో ఇప్పటి వరకు కోటా నగరంలో శిక్షణ కోసం వచ్చి విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడిన ఘటనల్లో ఇది 25వది కావడం గమనార్హం.

## బిహార్ పాఠశాలల్లో హిందూ పండుగల సెలవులు కుదింపు

**పట్నా:** 2024వ సంవత్సరానికి బిహార్ విద్యా శాఖ సోమవారం విడుదల చేసిన సెలవుల క్యాలెండర్ రాజకీయంగా అగ్గి రాజేసింది. పాఠశాలల్లో హిందువుల పండుగలకు సెలవులు తగ్గించడం, ముస్లిం పండుగలకు సెలవుల సంఖ్యను పెంచింది. జన్మాష్టమి, రక్షాబంధన్, శ్రీరామనవమి, శివరాత్రి, తీజ్, వసంత పంచమి, జీవిపుత్రిక పర్వదినాల్లో సెలవులుండని ప్రభుత్వం చెప్పింది. ముస్లిం పండుగలైన ఈద్, బక్రీద్‌కు మూడు రోజుల చొప్పున, మొహర్రంకు రెండు రోజులు సెలవులు ప్రకటించింది. విద్యా హక్కు చట్టం ప్రకారం.. పాఠశాలల్లో ఏటా కనీసం 220 బోధనా రోజులు ఉండాలని, అందుకే సెలవులను తగ్గిస్తూ హాలిడే క్యాలెండర్ విడుదల చేసినట్లు విద్యా శాఖ వెల్లడించింది.

సాక్షి
హైదరాబాద్
బుధవారం । 29 । నవంబర్ । 2023




# ఎవరు ఎక్కడ ఓటు?



- జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్

**పోలింగ్ బూత్ 164**
విజయ దేవరకొండ
ఆనంద్ దేవరకొండ
శ్రీకాంత్

- ఎఫ్ఎన్‌సీసీ

**పోలింగ్ బూత్ 164**
రాఘవేంద్రరావు, జీవిత, రాజశేఖర్ (ఎఫ్ఎన్‌సీసీ)

**పోలింగ్ బూత్ 160**
విశ్వక్‌సేన్

**పోలింగ్ బూత్ 166**
దగ్గుబాటి రాణా, సురేష్‌బాబు

- జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్

**పోలింగ్ బూత్ 165**
మహేష్‌బాబు, నమ్రత
మంచు మోహన్‌బాబు, విష్ణు, లక్ష్మి, మనోజ్

- జూబ్లీహిల్స్ క్లబ్

**పోలింగ్ బూత్ 149**
చిరంజీవి, సురేఖ
రాంచరణ్, ఉపాసన
నితిన్

- ఎంపీ, ఎమ్మెల్యే కాలనీ

**పోలింగ్ బూత్ 157**
రవితేజ

- ఓబుల్‌రెడ్డి స్కూల్

**పోలింగ్ బూత్ 150**
జూనియర్ ఎన్టీఆర్, ప్రణతి

- బీఎస్ఎన్ఎల్ సెంటర్

**పోలింగ్ బూత్ 153**
అల్లు అర్జున్, స్నేహారెడ్డి
అల్లు అరవింద్, అల్లు శిరీష్

- వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్

**పోలింగ్ బూత్ 151**
నాగార్జున, అమల, నాగచైతన్య, అఖిల్

- మణికొండ

ప్రభాస్, అనుష్క, వెంకటేశ్, బ్రహ్మానందం

- అల్లరి నరేశ్

రోడ్ నెం.45, జూబ్లీహిల్స్ –ఆర్థిక సహకార సంస్థ

- తనికెళ్ల భరణి

యూసఫ్‌గూడ చెక్‌పోస్టు ప్రభుత్వ పాఠశాల

## డిబేట్లు తర్వాత.. డ్యూటీ ముందు..



ఇటీవలి కాలంలో ఎక్కడ చూసినా ప్రతీ విషయం మీదా యూత్ బాగా డిబేట్స్ చేస్తున్నారు. అది మంచిదే కానీ... ఓటేసే విషయంలో మాత్రం ఎందుకో అంత ఉత్సాహం చూపడం లేదు అనిపిస్తోంది. అది సరైంది కాదు. నా వరకూ వస్తే నేను ఎక్కడ ఉన్నా తప్పకుండా నాకు ఓటు ఉన్న చోటుకు వెళ్లి వేస్తాను. నాకు తెలిసి అంతకన్నా ఫస్ట్ ప్రయారిటీ మరొకటి ఉండదు. లైన్ పెద్దగా ఉంటుంది అంటే దాని ప్రకారం ప్లాన్ చేసుకోవాలి. అంతే తప్ప ఓటు మిస్ చేయకూడదు. మనకు తెలిసిన ఒక నానుడి ఉంది కదా...చెడ్డవాడి దుర్మార్గం కంటే మంచివాడి నిశ్శబ్దం చాలా ప్రమాదకరం. దీన్ని అందరూ గుర్తుంచుకోవాలి.

– శేఖర్ కమ్ముల, సినీ దర్శకుడు

## వేలెత్తి చూపించాలంటే తప్పదు..



నేను ఇప్పటి దాకా ఏ ఎన్నికల్లో కూడా ఓటు వేయకుండా ఉండలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో వేయలేనప్పుడు ఎంత బాధపడ్డానో... ఎందుకంటే అది మన హక్కు. మనం ఉపయోగించుకోకలేకపోవడం నిజంగా దురదృష్టం కదా. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లయినా మనం ఇంకా అనేక విషయాల్లో వెనుకబడి ఉన్నామంటే దానికి ఓటు పట్ల మన నిరాసక్తత కూడా ఓ కారణం. రాజకీయాల్లో తప్పొప్పులను నిలదీయాలంటే ఓటేయాల్సిందే. తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ పోలింగ్ స్టేషన్‌కు వెళ్లండి. నచ్చిన అభ్యర్థికి ఓటేయండి.

– రాజీవ్ కనకాల, సినీనటుడు

## బాధ్యత గల పౌరులుగా ఉందాం..



మనం ఇప్పుడు సోషల్ మీడియాలో అనేక సొసైటీ ప్రాబ్లెమ్స్ మీద యాక్టివ్‌గా చర్చిస్తున్నాం. డైలీ లైఫ్‌లో మనకు ఎదురవుతున్న అనేక సమస్యలపై స్పందిస్తున్నాం. ప్రతీ ఒక్కరం ఒక రెస్పాన్సిబుల్ సిటిజన్‌గా మనకు మనం భావించి అవన్నీ చేస్తున్నాం అన్నదే నిజమైతే తప్పనిసరిగా ఓటు కూడా వేయాల్సిన అవసరం ఉంది. యువత ఫ్యూచర్‌ని డిసైడ్ చేసేది ప్రభుత్వాల నిర్ణయాలే కాబట్టి... తప్పనిసరిగా మన ఫ్యూచర్‌ని దృష్టిలో పెట్టుకుని మంచి లీడర్స్‌ని ఎన్నుకోవాలి అంటే దానికి ఓటు వేయడమే మార్గం.

– అరియానా గ్లోరీ, యాంకర్, సినీనటి



## హాలిడే కాదు...



పోలింగ్ రోజు అంటే హాలిడే మూడ్ వచ్చేస్తుంది కొందరికి అది కరెక్ట్ కాదు ఏ రోజునైనా సెలవు రోజు అనుకున్నాం అంటే మన బాధ్యత నుంచీ తప్పుకున్నట్టే కదా. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల ప్రధాన విధి ఓటు వేయడం అది నిర్వర్తించకపోతే ఎలా? అప్పుడు మనం కూడా బాధ్యత మరచిన నాయకులు ప్రభుత్వాలను నిలదీసే అర్హత కోల్పోతాం. కాబట్టి తప్పనిసరి గా ఓటేద్దాం ...మన బాధ్యత మనం నిర్వర్తిద్దాం.

– హరితేజ, సినీనటి






జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి అజహరుద్దీన్‌తో ఆటోలో నాంపల్లికి వస్తున్న రాహుల్.. ఓ ఆటో డ్రైవర్ ఇచ్చిన ఖాకీ చొక్కాను ధరిస్తూ..

# రాహుల్ మాస్.. ప్రియాంక జోష్..



రాహుల్‌తో నాంపల్లి అభ్యర్థి ఫిరోజ్‌ఖాన్

కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు మంగళవారం నగరంలో పలు చోట్ల నిర్వహించిన రోడ్ షోల్లో పాల్గొన్నారు. మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా ఆనంద్‌బాగ్ నుంచి జరిగిన ర్యాలీలో, నాంపల్లి కాంగ్రెస్ అభ్యర్థి ఫిరోజ్ ఖాన్‌ను గెలిపించాలంటూ బజార్‌ఘాట్ చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో రాహుల్ గాంధీ పాల్గొని ప్రసంగించారు. అంతకుముందు నాంపల్లి గోకుల్‌నగర్ చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు రాహుల్‌గాంధీ జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి అజహరుద్దీన్‌తో కలిసి ఆటోలో వచ్చారు. యూసుఫ్‌గూడలో జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు, గిగ్ వర్కర్లు, డెలివరీ బాయ్స్, ఆటో, క్యాబ్ డ్రైవర్లతో రాహుల్‌గాంధీ ముచ్చటించారు. అనంతరం ఓ ఆటో డ్రైవర్ ఇచ్చిన ఖాకీ చొక్కాను ఆయన ధరించారు.



నేనుగానీ స్టెప్పు వేస్తే..

ప్రచార రథంపై డ్యాన్స్ చేస్తున్న ప్రియాంక గాంధీ



యూసుఫ్‌గూడలో స్విగ్గీ డెలివరీ బాయ్‌లతో రాహుల్ గాంధీ



కాంగ్రెస్ రోడ్ షోలో కళా బృందాల ప్రదర్శన



బల్దియా పారిశుద్ధ్య కార్మికులతో రాహుల్



ప్రచార సమయం ముగియడంతో కూకట్‌పల్లిలో బ్యాండ్ కళాకారులు ఇలా..

# మాటల్లేవ్ మాట్లాడుకోవడాలే!

అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ముగిసింది. మైకులు మూగబోయాయి. ర్యాలీలు నిలిచిపోయాయి. రోడ్ షోలు, బహిరంగసభలు ముగిసిపోయాయి. మాటల తూటాలు ఆగిపోయాయి. ఇక మిగిలింది ఒక్కరోజే. ఓట్లకు నోట్ల పంపిణీకి రహస్య మంతనాలు మొదలయ్యాయి. అవి గుంభనంగా ఎక్కడ జరగాలో అక్కడ గుట్టుగా జరుగుతున్నాయి. నగదు చేతులు మారుతోంది. కొన్ని చోట్ల పనుల హామీలు పొందినట్లు తెలుస్తోంది. ఈ ఎన్నికల్ని మూడు ప్రధాన పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా, సవాల్‌గా తీసుకున్నాయి. గ్రేటర్ పరిధిలో మూడు జిల్లాలకు చెందిన 29 నియోజకవర్గాలతో పాటు విభిన్న జాతులు, సంస్కృతుల ప్రజలుండటంతో ఇక్కడ ఎక్కువ స్థానాల్లో గెలిస్తే రాష్ట్రమంతటా గెలిచేనట్లేననే అభిప్రాయంతో అన్నిపార్టీలూ రాజధాని నగరంపై ప్రత్యేక దృష్టి సారించాయి. దీంతో అన్ని పార్టీల అగ్రనేతల్ని ప్రచారంలోకి దింపడంతో ఒకరకంగా నగరం ఉక్కిరిబిక్కిరయ్యింది. వీఐపీల పర్యటనలతో, ట్రాఫిక్ మళ్లింపులతో కొన్ని ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. బీఆర్ఎస్‌కు ప్రత్యేకంగా జాతీయ నేతలు లేకపోవడంతో, కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు చుట్టబెట్టారు. సీఎం కేసీఆర్ పాల్గొనాల్సిన పరేడ్‌గ్రౌండ్స్ బహిరంగ సభ జరగలేదు. దానిద్వారా గ్రేటర్‌లోని అన్ని నియోజకవర్గాల అభ్యర్థుల తరఫున ఒకేసారి ప్రచారం నిర్వహించాలనుకున్నారు. ఆ సభ ఆగిపోవడంతో కోర్‌సిటీలోని అభ్యర్థులకు మాత్రం కేసీఆర్ ప్రచారం నిర్వహించలేకపోయారు. ఉమ్మడి రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో జరిగిన సభల్లో పాల్గొన్నారు. మంత్రి కేటీఆర్ గ్రేటర్‌లోని అన్ని నియోజకవర్గాల్లోనూ రోడ్‌షోలు నిర్వహించారు. మెట్రో రైలు, హోటళ్లలో తిరిగారు. ప్రజలతో ముచ్చటించారు. వివిధ వర్గాలతో ప్రత్యేక సమావేశాల ద్వారా ప్రచారం చేశారు.

–సాక్షి, సిటీబ్యూరో

### ప్రచారానికి బైబై.. ఓట్ల వేటకు జై

- అగ్రనేతల పర్యటనలతో గ్రేటర్ ఉక్కిరిబిక్కిరి
- ప్రధాని మోదీ నుంచి స్మృతి ఇరానీ దాకా..
- రాహుల్‌గాంధీ నుంచి సిద్ధరామయ్య వరకు
- శివార్లలో సీఎం కేసీఆర్..
- నగరమంతటా మంత్రి కేటీఆర్
- హేమాహేమీల మాటల తూటాలు
- ఎవరికి వారే హామీల మంత్రం.. ఓటర్లను ఆకట్టుకునే తంత్రం

### బీజేపీ అతిరథ మహారథులు

కేంద్రంలో అధికార పార్టీ బీజేపీ ప్రధానమంత్రితో సహా పలువురు కేంద్రమంత్రుల్ని రంగంలోకి దింపింది. పలువురు మంత్రులు వివిధ నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థుల తరఫున సభలు, రోడ్‌షోల ద్వారా ప్రచారం చేశారు. ప్రధాని మోదీ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ నుంచి కాచిగూడ వరకు రోడ్‌షోలో పాల్గొన్నారు. మహేశ్వరం తుక్కుగూడలో బహిరంగ సభలో ప్రసంగించారు. కొద్ది వారాల ముందు పరేడ్‌గ్రౌండ్‌లో 'మాదిగల విశ్వరూపసభ'లో, ఎల్‌బీ స్టేడియంలో బీసీ డిక్లరేషన్ సభలోనూ పాల్గొన్నారు. హోం మంత్రి అమిత్‌షా ఖైరతాబాద్, అంబర్‌పేట, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, ఉప్పల్, తదితర నియోజకవర్గాల్లో రోడ్‌షోల్లో పాల్గొన్నారు. రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ కంటోన్మెంట్, మేడ్చల్, కార్వాన్ నియోజకవర్గాల్లో, ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ జూబ్లీహిల్స్‌లో, నగరానికే చెందిన కిషన్‌రెడ్డి అంబర్‌పేటలో, మరో కేంద్రమంత్రి స్మృతిఇరానీ ఖైరతాబాద్ నియోజకవర్గంలో, తమిళనాడు పార్టీ అధ్యక్షుడు అన్నామలై శేరిలింగంపల్లి, సికింద్రాబాద్‌లలో రోడ్‌షోలతో పార్టీ శ్రేణుల్లో జోష్ నింపారు. యూపీ సీఎం ఆదిత్యనాథ్ యోగి ఎల్‌బీనగర్, గోషామహల్‌లలో, అసోం సీఎం హేమంత్‌విశ్వశర్మ మలక్‌పేట నియోజకవర్గంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ముషీరాబాద్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లో తమ పార్టీ అభ్యర్థులకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మరో కేంద్రమంత్రి పీయూష్ గోయల్ తదితరులు గ్రేటర్‌లో బీజేపీ గెలుపు కోసం నగరానికి వచ్చారు.

### కాంగ్రెస్ హేమాహేమీలు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ముషీరాబాద్, నాంపల్లి, జూబ్లీహిల్స్, మల్కాజిగిరి నియోజకవర్గాల్లో పర్యటించారు. ప్రియాంక గాంధీ మల్కాజిగిరి తదితర ప్రాంతాల్లో, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ముషీరాబాద్‌లో, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ముషీరాబాద్, సనత్‌నగర్‌లలో, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే ఎల్‌బీనగర్‌లో, విజయశాంతి సికింద్రాబాద్, కంటోన్మెంట్‌లలో కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం ప్రచారాలు చేశారు. రోడ్‌షోల్లో పాల్గొన్నారు. పరిసరాల్ని హోరెత్తించారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దాదాపుగా గ్రేటర్‌లోని అన్ని నియోజకవర్గాల్లో ప్రచారంలో పాల్గొన్నారు. రాహుల్‌గాంధీ నిరుద్యోగులతో కలిసి చిక్కడపల్లిలో చాయ్ తాగుతూ, బావర్చీ హోటల్‌లో ముచ్చట్లు పెడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు, ఫుడ్‌డెలివరీ బాయ్స్, ఆటోవాలాలతో భేటీ అయ్యారు. వీరితోపాటు పలువురు ఏఐసీసీ నేతలు, పలువురు ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ముఖ్యనేతలు నగరంలో మకాం వేసి పార్టీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేశారు.దీంతో ఆయాప్రధాన రహదారులతోపాటు గల్లీల్లోనూ సందడి నెలకొంది. ఒకరిపై మరొకరు పదునైన విమర్శలతో పరిసరాలు దద్దరిల్లేలా చేశారు.

### ఓట్ల వేటలో..

ప్రచారం ముగియడంతో అన్నిపార్టీల్లోనూ పంపిణీలపై దృష్టి సారించారు. ఓట్ల వేటలో బిజీగా మారారు. కాలనీ సంఘాలు, కుల, మహిళా సంఘాలతో కలిసి రహస్యంగా ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఇప్పటికే మద్యం బాటిళ్లు, నగదును పోగేసిన ద్వితీయశ్రేణి నేతలు వాటిని పంపిణీ చేస్తూ బిజిబిజీగా ఉన్నారు.. స్థానిక వ్యాపారులు, అనుచరులతో ఫోన్‌పే, గూగుల్ పే వంటి యూపీఐ ద్వారా నగదు పంపిణీ చేస్తున్నారు.

**ఎవరు ఎక్కువిస్తే వాళ్లకే..**

ఓటుకు రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు పార్టీలు డబ్బు పంపిణీ చేస్తున్నాయి. అన్ని పార్టీల దగ్గర డబ్బు తీసుకొని ఎవరు ఎక్కువ డబ్బు ఇస్తే వారికే ఓట్లు వేసేందుకు ఓటర్లు సిద్ధమైనట్లు తెలుస్తోంది. యువతులను ఆకట్టుకునేందుకు స్మార్ట్ వాచ్‌లు, ఎలక్ట్రిక్ స్కూటర్లు వంటి బహుమతులను సైతం పంపిణీ చేస్తున్నట్లు సమాచారం.



## 36 గంటలు..!

**నేటి ఉదయం నుంచి రేపు రాత్రి వరకు అలర్ట్**

**అత్యంత అప్రమత్తంగా నగర పోలీసు విభాగం**



చైతన్యపురిలో అంబులెన్స్‌ను తనిఖీ చేస్తున్న పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కీలక ఘట్టమైన పోలింగ్ సమీపిస్తుండటంతో నగర పోలీసు విభాగం అప్రమత్తమైంది. బుధవారం ఉదయం నుంచి గురువారం రాత్రి వరకు ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ అత్యంత అప్రమత్తంగా ఉండనున్నారు. ఈవీఎంలు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి బయటకు వెళ్లి మళ్లీ స్ట్రాంగ్ రూమ్స్‌కు చేరే వరకు ఎక్కడికక్కడ ప్రత్యేక బందోబస్తు, భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిని నగర పోలీసు కమిషనర్ సందీప్ శాండిల్య మంగళవారం తన కార్యాలయం నుంచి సమీక్షించారు. నగర వ్యాప్తంగా 144వ సెక్షన్, నిషేధాజ్ఞలు విధిస్తూ కొత్వాల్ ఉత్తర్వులు జారీ చేశారు. నగరంలోని 15 ప్రాంతాల్లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం నుంచి వీటి వద్ద ఈవీఎంల పంపిణీ ప్రారంభం కానుంది. సాయంత్రానికి ఈవీఎం బాక్సులు పోలింగ్ కేంద్రాలకు చేరతాయి. ఆపై గురువారం రాత్రి పోలింగ్ ముగిసిన తర్వాత డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఉన్న స్ట్రాంగ్ రూమ్స్‌కు ఈవీఎంలను తరలిస్తారు. ఈ నేపథ్యంలోనే నగర పోలీసు విభాగం ప్రత్యేక బందోబస్తు, భద్రత ఏర్పాట్లు చేస్తోంది. బుధవారం ఉదయం నుంచి గురువారం రాత్రి వరకు సిబ్బంది, అధికారులు నిర్విరామంగా విధుల్లో ఉండనున్నారు. కీలక ప్రాంతాల్లో విధులు నిర్వర్తించే వారికి మాత్రం రిలీవర్ సిస్టం ఏర్పాటు చేస్తున్నారు. దీని ప్రకారం నిర్ణీత సమయం తర్వాత ఆ ప్రాంతంలో కొత్త వాళ్ళు వస్తూ రోటేషన్ విధానంలో పని చేస్తారు. నగదు, మద్యం సహా ఇతర వస్తువులు పంపిణీ, ఓటర్ల తరలింపు పైనా నిఘా వేసి ఉంచుతున్నారు. నగర కమిషనరేట్‌లో ఉన్న 7 జోన్లలోనూ అధికారులు కేంద్ర బలగాలతో కలిసి ఫ్లాగ్‌మార్చ్‌లు ముమ్మరం చేశారు. పోలింగ్ కేంద్రాలను 200 మీటర్ల పరిధిలో 144వ సెక్షన్ విధిస్తూ కొత్వాల్ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం రాత్రి 8 గంటల వరకు ఇవి అమలులో ఉండనున్నాయి. వీటికి తోడు నగర వ్యాప్తంగా నిషేధాజ్ఞలు విధించారు. వీటి ప్రకారం నలుగురి కంటే ఎక్కువ మంది ఒకేచోట గుమిగూడటం, జెండాలతో సహా ఎలాంటి కర్రలు తదితరాలు కలిగి ఉండటం నిషేధం.

## చలో పల్లెటూరు

**ఓటు వేసేందుకు సొంతూళ్లకు నగరవాసులు**

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో స్థిరపడి.. సొంత ఊరులో ఓటున్న వారు స్వగ్రామాల బాట పట్టారు. తమ ఓటుహక్కును అక్కడే వినియోగించుకునేందుకు చలో పల్లెటూరు అంటున్నారు. దీంతో నగరం నుంచి బస్సులు, రైళ్లలో రద్దీ పెరిగింది. కార్లు, టాటాఏస్ వంటి వాహనాలు, సొంత కార్లు, ట్యాక్సీలు, క్యాబ్‌లు, బైక్‌లపైనా సిటీ జనులు ఊరుబాట పట్టారు. దీంతో హైదరాబాద్ నుంచి వరంగల్, నల్లగొండ, కరీంనగర్, తదితర ప్రాంతాలకు వెళ్లే రహదారులపై వాహనాల రద్దీ పెరిగింది. గురువారం ఎన్నికలు జరగనున్న దృష్ట్యా రెండు రోజులు ముందే సొంత ఊరుకు చేరుకోవాలనే ఉద్దేశంతో చాలామంది మంగళవారం ఊళ్లకు తరలి వెళ్లారు. బుధ, గురువారాల్లోనూ ప్రయాణికుల రద్దీ ఎక్కువగానే ఉండే అవకాశం ఉంటుందని ఆర్టీసీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## తలసీమియా రోగులకు రక్తం కొరత

ఎన్నికల ఎఫెక్ట్...

సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుతం ఓ వైపు ఎన్నికల సందడి కొనసాగుతోంది. దీని కారణంగా బ్లడ్ బ్యాంకులు, హాస్పిటల్స్‌లో తీవ్రమైన రక్తనిల్వల కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలో తలసేమియా సికిల్ సెల్ సొసైటీ (టిఎస్సిఎస్)సెక్రటరీ డాక్టర్ సుమన్ జైన్ ఓ ప్రకటనలో రక్తదానం కోసం దాతలకు అత్యవసర విజ్ఞప్తి చేశారు. తలసీమియా రోగులు, వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి క్రమం తప్పకుండా రక్తమార్పిడిపై ఆధారపడతారనీ, ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల కారణంగా రక్త లభ్యత తగ్గిపోయి రోగులు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ రోగుల వినియోగార్థం సాధారణంగా 600–700 యూనిట్ల రక్తం అవసరం కాగా ఇప్పుడు కేవలం 100 యూనిట్ల రక్తం మాత్రమే అందుబాటులో ఉందన్నారు, మరీ ముఖ్యంగా కొన్ని బ్లడ్ గ్రూపులు పూర్తిగా అందుబాటులో లేవని, ఆసుపత్రులు బ్లడ్ బ్యాంకులు దగ్గర రక్తదానం బాగా తగ్గిపోయిందని వెల్లడించారు.. ఇది తలసేమియాతో బాధపడుతున్న వారి జీవితాలను ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తోందన్నారు. గతంలోని నిల్వ చేసిన రక్తాన్ని దాదాపుగా వినియోగించేశామని చెప్పారు, ఇదే పరిస్థితి కొనసాగితే తలసేమియా రోగుల జీవితాలు మరింత దుర్భరంగా మారతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

## చార్మినార్ అభ్యర్థి మేఘా రాణి అగర్వాల్‌పై.. ఎలాంటి కఠిన చర్యలు వద్దు: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరఫున చార్మినార్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న మేఘా రాణి అగర్వాల్‌తో పాటు పవన్ మిస్త్రాపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ర్యాలీలో జరిగిన వివాదంపై వివరణ ఇచ్చేందుకు వారు సిద్ధంగా ఉన్నందున, వారి వివరణ వినాలని స్పష్టం చేసింది. ఈ ఆదేశాలు వెలువడిన నాటి నుంచి 3 రోజుల్లో సీఆర్‌పీసీ 41ఏ నోటీసులకు వివరణ ఇవ్వాలని పిటిషనర్లకు చెప్పింది. హైదరాబాద్ హుస్సేనీ ఆలం పోలీస్‌స్టేషన్‌లో తమపై దాఖలైన కేసులో అరెస్టు సహా ఇతర చర్యలు చేపట్టకుండా పోలీసులను ఆదేశించాలని కోరుతూ మేఘా రాణి అగర్వాల్‌తో పాటు మరొకరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ మాధవీదేవి విచారణ చేపట్టారు. పిటిషనర్ న్యాయవాది అంజలి అగర్వాల్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్లలో ఒకరైన మేఘా రాణి అగర్వాల్ చార్మినార్ నుంచి పోటీ చేస్తున్నారని, ఈ నెల 9న నిర్వహించిన ర్యాలీ సందర్భంగా కొంత గందరగోళం చోటుచేసుకుందన్నారు. ర్యాలీలో గందరగోళంపై ఎండీ.జాఫర్ ఖాన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పిటిషనర్లపై కేసు నమోదైంది. 22న పిటిషనర్లకు పోలీసులు 41ఏ నోటీసులు జారీ చేశారు. పిటిషనర్లు వివరణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, పోలీసులు అరెస్టు సహా ఎలాంటి చర్యలు చేపట్టకుండా ఆదేశాలివ్వాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. వివరణ ఇచ్చేందుకు వారికి అవకాశం ఇవ్వాలని ఆదేశిస్తూ, పిటిషన్‌లో వాదనలను ముగించారు.

## కష్టాలు తీరాలంటే.. కాంగ్రెస్ జెండా ఎగరాలి

టీపీసీసీ నేత రేవంత్‌రెడ్డి


ఈసీఐఎల్‌లో రోడ్‌షోలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

కాప్రా: ఉప్పల్ నియోజకవర్గం ప్రజల కష్టాలు తీరాలంటే ఈ గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఈసీఐఎల్‌లో రేవంత్‌రెడ్డి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉప్పల్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి మందముల పరమేశ్వర్ రెడ్డిని గెలిపిస్తే ప్రజల వెన్నంటే ఉంటూ కష్టాలు తీరుస్తారన్నారు.

నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు రానివారికి, నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. మల్కాజిగిరి ఎంపీగా తనను ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపినట్లే ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఉప్పల్ నుండి మందముల పరమేశ్వర్‌రెడ్డిని గెలిపించి అసెంబ్లీకి పంపించాలని కోరారు. తెలంగాణ అమరవీరుల త్యాగాలను చూసి సోనియాగాంధీ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారని, త్యాగాలతో ఏర్పడిన తెలంగాణలో కేసీఆర్ అవినీతి పాలన కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే అండగా ఉంటుందని, ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామని, రూ.400కే గ్యాస్ సిలిండర్ ఇస్తామన్నారు. ఇవన్నీ జరగాలంటే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడాలని, తెలంగాణలో మార్పు రావాలంటే కేసీఆర్ పోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓటు చాలెంజ్!

- ఓటు వేశాక సెల్ఫీ దిగి వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు
- ఓటర్లలో ఉత్సాహం నింపేలా వినూత్న కార్యక్రమాలు
- పోలింగ్ శాతం పెంచేందుకు కాలనీ సంఘాల చొరవ



సాక్షి, సిటీబ్యూరో: గ్రీన్ చాలెంజ్, బకెట్ చాలెంజ్ తరహాలోనే ఓటు చాలెంజ్‌కు కాలనీ సంఘాలు తెరలేపాయి. గ్రేటర్‌లో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు, యువ ఓటర్లలో చైతన్యం నింపేందుకు యునైటెడ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్స్ (యూ–ఎఫ్ఈఆర్‌డబ్ల్యూఏఎస్) పలు వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ప్రౌడ్ ఓటరు, ఫ్యామిలీతో సెల్ఫీ.. అనే కార్యక్రమాలను చేపడుతున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి బీటీ శ్రీనివాస్ తెలిపారు. కుటుంబంతో కలిసి ఉదయమే ఓటు వేసి, సిరా చుక్కను చూపిస్తూ సెల్ఫీ దిగాలని, ఆయా ఫొటోలను కాలనీ సంఘాల వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేయాలని సూచించారు. కాలనీలో ఇతరులకు ఓటు వేయాలని చాలెంజ్ చేయాలని తెలిపారు.

**డివిజన్ స్థాయిలో వాట్సాప్ గ్రూపులు..**

నగరంలోని 4,800 కాలనీల్లో పోలింగ్ శాతం తక్కువగా ఉన్న ప్రాంతాలను ఎంచుకొని డివిజన్ స్థాయిలో వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేశారు. ఒక్కో డివిజన్‌లో 800–900 మంది సభ్యులున్నారు. ఈనెల 30న పోలింగ్ రోజు ఉదయమే ఓటేశాక కుటుంబ సభ్యులంతా కలిసి వేలిపై సిరా చుక్కను చూపిస్తూ సెల్ఫీ దిగి కాలనీ వాట్సాప్ గ్రూప్‌లలో పెట్టాలని అసోసియేషన్ ప్రతినిధులు సూచించారు. ఆ రోజు ఎలాంటి పనులున్నా వాయిదా వేసుకోవాలని, వేడుకలకు హాజరవ్వాల్సి ఉంటే సమయాన్ని సర్దుబాటు చేసుకోవాలని సూచించారు. పోలింగ్‌కు ముందురోజు కాలనీ వాసులంతా సమూహంగా బూత్ వరకు ఈవినింగ్ వాక్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ప్రధానంగా 40–55 శాతం మాత్రమే పోలింగ్ నమోదైన కాలనీల్లో ఈసారి 60 శాతం కంటే ఎక్కువ ఓటింగ్ జరగాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టారు.

## అండర్ ట్రయల్ ఖైదీని కలిసేందుకు న్యాయవాదిని అనుమతించండి: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: అండర్ ట్రయల్ ఖైదీని కలిసేందుకు, మాట్లాడేందుకు న్యాయవాదికి చట్టప్రకారం అనుమతి ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు పిటిషనర్(న్యాయవాది)కు అనుమతి ఇవ్వాలని చర్లపల్లి జైలు సూపరింటిండెంట్‌ను ఆదేశించింది. జైలు ములాఖత్/ఇంటర్వ్యూ కోసం చర్లపల్లి జైలులో ఉన్న అండర్ ట్రయల్ ఖైదీలను కలవడానికి అనుమతి లేదంటూ సూపరింటిండెంట్ పేర్కొనడంపై హైకోర్టులో న్యాయవాది జబాలి రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై మంగళవారం హైకోర్టు విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది విష్ణువర్ధన్‌రావు వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయస్థానం.. ప్రిజన్స్ మాన్యువల్ రూల్స్ మేరకు సంబంధిత అండర్ ట్రయల్ ఖైదీలను కలవడానికి పిటిషనర్‌ను అనుమతించాలని చర్లపల్లి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఆదేశించింది.

## తెలంగాణకు బీసీని సీఎంగా చేయాలి

హిమాయత్‌నగర్: తెలంగాణ రాష్ట్రానికి వెనుకబడిన కులాలకు చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రిగా చేయాలని, ఏ రాజకీయ పార్టీ అధికారంలోకి వచ్చినా ఇదే నిర్ణయం తీసుకోవాలని బీసీ ముఖ్యమంత్రి సాధన సమితి చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. ఇప్పటికే బీజేపీ బీసీ సీఎంను ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. బీసీలంతా పార్టీలకు అతీతంగా బీసీ అభ్యర్థులను గెలిపించాలని అఖిల భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఓం ప్రకాష్ యాదవ్, లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ యాదవ్‌లతో కలిసి గాలి వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా బీసీని సీఎం చేయాలని, లేనిపక్షంలో 2024లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఆయా పార్టీలను భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు బీసీ సీఎంను ఎందుకు ప్రకటించలేదనీ. బీసీలు ఓట్లు వేయకపోతే ఆ పార్టీలు ఎలా అధికారంలోకి వస్తాయని ప్రశ్నించారు. సమావేశంలో అఖిలభారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి రవి, కార్యదర్శి సుదర్శన్ నేత, సుప్రీంకోర్టు న్యాయవాది సురేందర్, న్యాయవాదులు వినోద్ కుమార్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## అతిక్రమిస్తే పోలీసుల్నీ వదలను

ప్రతి ఒక్కరూ నిబంధనల ప్రకారం నడవాల్సిందే

- నగరంలో 666 క్రిటికల్ పోలింగ్ లొకేషన్ల గుర్తింపు
- ఓటర్ల భద్రతకు పూర్తి భరోసా: సిటీ సీపీ సందీప్ శాండిల్య



సాక్షి, సిటీబ్యూరో: 'నేను ప్రతి అంశాన్నీ నిబంధనలకు అనుగుణంగానే పరిగణనలోకి తీసుకుంటా. పోలీసు అధికారులు సహా ఎవరైనా వీటిని అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదు' అని నగర పోలీసు కమిషనర్ సందీప్ శాండిల్య స్పష్టం చేశారు. పోలింగ్ నేపథ్యంలో తీసుకుంటున్న, ఇప్పటి వరకు చేపట్టిన చర్యలపై ఆయన మంగళవారం వీడియో సందేశం విడుదల చేశారు. అందులోని అంశాలు ఆయన మాటల్లోనే..

- నగరంలో ప్రశాంత వాతావరణం కోసం అన్ని స్థాయిలకు చెందిన పోలీసులు నిర్విరామంగా శ్రమించారు. దీనికి ప్రతిఫలంగా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలి. జిల్లాల్లో ఓటింగ్ శాతం ఎక్కువ ఉంటోంది. నగరంలో మాత్రం 40 నుంచి 50 శాతం మాత్రమే నమోదు అవుతోంది. పోలీసులు తమ విధులు నిర్వర్తించినట్లే ఓటర్లు ఓటు వేసి తమ విధి పక్కాగా నిర్వహించాలి. డ్రైవింగ్ లైసెన్సు, సరైన పత్రాలు, నిబంధనలకు తగ్గట్టు నెంబర్ ప్లేట్ లేని వాహనాలు పోలింగ్ రోజు తారసపడినా సీజ్ చేస్తాం.
- ఓటు వేయడానికి ఏ వాహనంపై వస్తున్నారో, దాని పత్రాలు, నెంబర్ ప్లేట్ పక్కాగా ఉండటంతో పాటు ఓటరు హెల్మెట్ ధరించడం కూడా కచ్చితం. ఈ నెల 9 నుంచి ఇప్పటి వరకు 2.5 లక్షల వాహనాలను తనిఖీ చేశాం. ప్రతి రోజూ సరైన పత్రాలు, నెంబర్ ప్లేట్లు లేని 20 నుంచి 25 వాహనాలను స్వాధీనం చేసుకున్నాం. ఎన్నికల ప్రక్రియ తర్వాతే వీటిని తిరిగి వస్తాం. నగరంలోని 31 ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవింగ్ తనిఖీలు నిర్వహిస్తున్నాం. 40 కంపెనీల కేంద్ర సాయుధ బలగాలు అదనంగా వచ్చాయి. ఇప్పటి వరకు నగర పోలీసులు రూ.63 కోట్ల విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నాం. 2400 నాన్ బెయిలబుల్ వారెంట్లు ఎగ్జిక్యూట్ చేయడంతో పెండెన్సీ లేదు. మినహాయింపులు పొందినవి మినహా అన్ని ఆయుధాలు డిపాజిట్ అయ్యాయి. నగరంలో 1600 మంది రౌడీషీటర్లను బైండోవర్ చేశాం. ప్రతి రోజూ వీరిపై నిఘా ఉంచి కనీసం 600 మందిని వ్యక్తిగతంగా తనిఖీ చేస్తున్నాం.
- బుధ, గురువారాలు మాకు అత్యంత కీలకం. దానికి తగ్గట్టు పోలీసు విభాగం సమాయత్తమైంది. 1700 పోలింగ్ లోకేషన్స్ ఉన్న రెవెన్యూ మార్గాల పైనా ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. ఈ పోలింగ్ లోకేషన్స్‌లో 4915 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఇవన్నీ సీసీ కెమెరాల నిఘాలో ఉంటాయి. ఈ లోకేషన్లలో 666 క్రిటికల్‌గా నిర్ధారించాం. అక్కడ కేంద్ర బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో గుమిగూడితే అదుపులోకి తీసుకుని పోలింగ్ తర్వాత వదిలి పెడతాం. ఓటు వేసిన వెంటనే మీ ఇళ్లకు వెళ్లి కుటుంబాలతో గడపండి. 21 మంది పరిశీలకులు సైతం సీసీ కెమెరాల్లోని దృశ్యాలను సమగ్రంగా అధ్యయనం చేస్తారు. బెదిరింపులు, హెచ్చరికలు, అమర్యాదగా మాట్లాడటం ఇలాంటి ఏ అంశాన్నీ పోలీసులు ఉపేక్షించరు. వీటికి పాల్పడిన వారిని తక్షణం అరెస్టు చేస్తారు. ఈ అంశంలో విఫలమైన అధికారుల పైనా చర్యలు ఉంటాయి. నగదు, మద్యం సహా ప్రలోభాల పంపిణీకి ప్రయత్నించినా కఠిన చర్యలు తీసుకుంటాం. నగరంలో ఉన్న అన్ని నియోజకవర్గాలను పరిగణలోకి తీసుకున్న బందోబస్తు, భద్రత ఏర్పాటు చేస్తున్నాం.

## తెలంగాణ డయాగ్నస్టిక్స్ సెంట్రల్ ల్యాబ్ సందర్శించిన ఏపీ వైద్యాధికారులు..



సాక్షి సిటీబ్యూరో: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ కమిషనర్, మిషన్ డైరెక్టర్ (ఎన్‌హెచ్ఎమ్) జె.నివాస్ నగరంలోని నారాయణగూడలోని ఐపీఎమ్ క్యాంపస్‌లో ఉన్న తెలంగాణ డయాగ్నస్టిక్స్ సెంట్రల్ ల్యాబ్‌ను మంగళవారం సందర్శించారు. సెంట్రల్ ల్యాబ్‌లోని ఎక్విప్‌మెంట్ పనిచేస్తున్న తీరు తెన్నుల గురించి అధికారులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వైద్య అధికార బృందానికి డయాగ్నస్టిక్స్ నోడల్ అధికారి ప్రసాద్ తదితరులు తమ కార్యకలాపాల గురించి వివరించారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ రమాదేవి తదితరులతో కూడిన తమ బృందం బుధవారం సంగారెడ్డిలోని డిస్ట్రిక్ట్ హబ్‌ను, మేడ్చల్ జిల్లాలోని యుపిహెచ్‌సి, బస్తీ దవాఖానాలను కూడా సందర్శించనున్నట్టు అర్బన్ హెల్త్ రాష్ట్ర నోడల్ అధికారి విజయలక్ష్మి తెలిపారు.

## బీఆర్ఎస్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత

- జాగో తెలంగాణ చైర్మన్ జస్టిస్ చంద్రకుమార్

పంజగుట్ట: రాష్ట్రంలో అన్ని వర్గాల వారూ బీఆర్ఎస్‌పై పూర్తి వ్యతిరేకంగా ఉన్నట్లు తమ నెలరోజుల రాష్ట్రవ్యాప్త బస్సుయాత్ర ద్వారా గుర్తించినట్లు జాగో తెలంగాణ, తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక ప్రతినిధులు పేర్కొన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాగో తెలంగాణ చైర్మన్ జస్టిస్ చంద్రకుమార్, కన్వీనర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళిలు మాట్లాడుతూ... అక్టోబర్ 26వ తేదీన తమ యాత్ర మొదలుపెట్టామని, రాష్ట్ర వ్యాప్తంగా 64 నియోజకవర్గాల్లో, 29 జిల్లాల్లో 198 సమావేశాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బీఆర్ఎస్ వారు కొన్నిచోట్ల ఆపేందుకు యత్నిస్తే ప్రజలే వారికి బుద్ధిచెప్పారని తెలిపారు. మతోన్మాద బీజేపీని, అవినీతి బీఆర్ఎస్‌ను ఓడించాలని, ప్రజలు జాగ్రత్తగా ఓటు వేయాలని సూచించారు. సమావేశంలో ప్రొఫెసర్ పద్మజా షా, జేవీ చలపతిరావు, ఎమ్.హన్మేష్, నైనాల గోవర్ధన్, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, కృష్ణ ప్రసాద్, కె.గోవర్ధన్, బాల మల్లేష్, కె.ఎస్.ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## కౌంటింగ్‌కు 14 టేబుళ్లు

సాక్షి, సిటీబ్యూరో: కౌంటింగ్ ప్రక్రియను కౌంటింగ్ అబ్జర్వర్లు సునిశితంగా పరిశీలించాలని జనరల్ అబ్జర్వర్ సమీర్ వర్మ సూచించారు. మంగళవారం కౌంటింగ్ అబ్జర్వర్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ, ఫారం–17 సి ద్వారా అభ్యర్థుల ఓట్లను నమోదు చేయాలని తెలిపారు. హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రాస్ మాట్లాడుతూ కౌంటింగ్ రోజు అబ్జర్వర్లు పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌ను పరిశీలించి నమోదు చేసుకోవాలని తెలిపారు. ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌మీటర్ పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునే ఆర్మీ పోలీసుల క్యూ ఆర్ కోడ్ ను కూడా పరిశీలించి నమోదు చేయాలని తెలిపారు. ఓట్ల లెక్కింపు కోసం కౌంటింగ్ రోజు 14 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రతి రౌండ్ తర్వాత ర్యాండమ్‌గా కంట్రోల్ యూనిట్లను ఎంపిక చేసి అందులో నమోదైన ఓట్లు, ఫారం–17 సి పున:పరిశీలించడం జరుగుతుందని తెలిపారు.

## పోలింగ్‌కు ఏర్పాట్లు


సాక్షి, రంగారెడ్డిజిల్లా: మరో కొన్ని గంటల్లో ఓటింగ్ ప్రక్రియ మొదలు కానుంది. జిల్లా ఎన్నికల అధికారులు ఓటింగ్ కోసం సర్వం సిద్ధం చేశారు. ఇప్పటికే నియోజకవర్గాల వారీగా పోలింగ్ బూత్‌లను ఎంపిక చేసి, సిబ్బందిని కూడా నియమించారు. జిల్లా వ్యాప్తంగా ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో 3,453 పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేశారు. మొత్తం 35,23,219 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా 15,212 మంది విధులు నిర్వర్తించనున్నారు. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గం పోలింగ్ సిబ్బందికి మంగల్‌పల్లి సమీపంలోని సీవీఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో వీవీప్యాట్‌లు, కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు అందజేయనున్నారు. ఎల్బీనగర్ పోలింగ్ కేంద్రాలకు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో అందజేయనున్నారు. చేవెళ్ల పోలింగ్ కేంద్రాలకు ఫరా ఇంజనీరింగ్ కాలేజీ నుంచి డిస్ట్రిబ్యూషన్ చేయనున్నారు. శేరిలింగంపల్లి పోలింగ్ సిబ్బందికి గచ్చిబౌలి ఇండోర్‌స్టేడియం నుంచి, షాద్‌నగర్ మినీస్టేడియం నుంచి షాద్‌నగర్ పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను సరఫరా చేయనున్నారు. సీబీఎండీ కాలేజీ నుంచి కల్వకుర్తి పోలింగ్ బూత్‌లకు ఈవీఎంలను అందజేయనున్నారు. ఓటింగ్ తర్వాత ఆయా ఈవీఎంలను అదే ప్రాంతంలో ఎంపిక చేసిన కౌంటింగ్ కేంద్రాలకు తరలించనున్నారు. ఇందుకోసం జిల్లా ఎన్నికల సంఘం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది.

**అప్రమత్తంగా ఉండాలి**

ఎన్నికల నేపథ్యంలో ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, ఎంసీసీ, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, కల్యాణ మండపాలు, హోటళ్లు, లాడ్జీల్లో తనిఖీ చేయాల్సిందిగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళికేరి ఆదేశించారు. ఇప్పటి వరకు నియోజకవర్గాల్లో మకాం వేసిన స్థానికేతరులు వెంటనే ఆయా కేంద్రాలను వదిలి వెళ్లాల్సిందిగా కోరా రు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సెక్షన్ 126 (1)(బి) ఆర్ పి యాక్ట్ 1951 ప్రకారం ఒపీనియన్ పోల్, ఎగ్జిట్ పోల్స్ నిషేధమని స్పష్టం చేశారు. సాయంత్రం ఐదు గంటల నుంచి ఎన్నికలు ముగిసే వరకు జిల్లాలో మద్యం షాపులను మూసివేయించి, డ్రైడేగా ప్రకటించడం జరిగిందన్నారు.

**సిబ్బందికి పోలింగ్ కేంద్రాల కేటాయింపు**

ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా మంగళవారం పోలింగ్ సిబ్బంది మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళికేరి థర్డ్ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. సాధారణ పరిశీలకులు చంద్రకాంత్ కృష్ణారావు డాంగే(ఐఏఎస్), నినమ(ఐఏఎస్), రామ్ కుమార్(ఐఏఎస్), తైతలంగ్ పమేయ(ఐఏఎస్)లు ర్యాండమైజేషన్‌ను పరిశీలించారు. అనంతరం ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, ఓపీఓలతో కూడిన బృందాలకు పోలింగ్ కేంద్రాలు కేటాయించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 3,453 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 15,212 సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. 20 శాతం రిజర్వు సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు.


ఫిలింనగర్‌లో..


కుత్బుల్లాపూర్‌లో..

## 'మందు' షాపులు బంద్

ఎన్నికల వేళ మద్యం షాపులకు తాళం పడింది. మంగళవారం సాయంత్రం ఐదు గంటల నుంచి గ్రేటర్ పరిధిలోని అన్ని వైన్ షాపులు బంద్ చేశారు. మళ్లీ గురువారం పోలింగ్ ముగిసిన తర్వాత ఆరు గంటలకు షాపుల్ని తెరుస్తారు. ఈ నేపథ్యంలో నగరంలో మంగళవారం వైన్ షాపుల వద్ద రద్దీ నెలకొంది. చాలాచోట్ల షాపులు ఖాళీ అయ్యాయి.


– సాక్షి, సిటీబ్యూరో


ఫిలింనగర్‌లో..


జూబ్లీహిల్స్‌లో ఓ వైన్‌షాపు వద్ద..



జగద్గిరిగుట్టలో..


ఖైరతాబాద్ అభివృద్ధికి పాటుపడే వారిని,
మీకు అందుబాటులో ఉండేవారిని
అసెంబ్లీకి పంపించండి
వ.సం
అభ్యర్థి పేరు
ఫోటో
గుర్తు
1
చింతల రామచంద్రారెడ్డి
2
3
4
5
6
7
పోలింగ్ తేది :
30 నవంబర్, 2023
సమయం :
ఉ. 7 గం.ల నుండి
సా. 5 గం.ల వరకు
బిజెపికి ఒక్క అవకాశం ఇవ్వండి...ఖైరతాబాద్ రూపురేఖల్ని
మనమంతా కలిసి మార్చుదాం. అధికార, ధన బలంతో కాదు
ప్రజాబలంతో ముందుకెళ్తున్న నన్ను మీ అమూల్యమైన
ఓటు వేసి గెలిపించండి
కమలం పువ్వు
గుర్తుకు ఓటేద్దాం
చింతల రామచంద్రారెడ్డి
ఖైరతాబాద్ బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి

# వారిద్దరికీ రాజకీయాలపై కనీస అవగాహన లేదు



**రాహుల్, ప్రియాంకలపై కిషన్‌రెడ్డి ధ్వజం**

**బీజేపీ కనుసన్నల్లో మజ్లిస్ పని చేస్తుందన్న వ్యాఖ్యలపై ఆగ్రహం**

**కుటుంబ పార్టీలను బహిష్కరించాలని పిలుపు**

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు రాజకీయంగా కనీస అవగాహన లేదని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. మజ్లిస్.. బీజేపీ కనుసన్నల్లో పనిచేస్తుందన్న రాహుల్ వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు. రాహుల్ గాంధీ కనీసం వచ్చేముందైనా.. వాస్తవాలు తెలుసుకోవాలి కదా? అని నిలదీశారు. 'మజ్లిస్‌ను పెంచిపోషించింది మీ కుటుంబం. ముస్లింలీగ్‌ను ఈ దేశంలో ఎవరు పెంచి పోషించారు.. ఎవరి కారణంగా దేశ విభజన జరిగింది.. వీటన్నింటికీ మీ కుటుంబమే కారణం కాదా?'అని రాహుల్‌గాంధీని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అంతర్గత రాజకీయాల్లో భాగంగా.. చెన్నారెడ్డిని గద్దె దించేందుకు మజ్లిస్‌ను ఎగదోసి భాగ్యనగరంలో మతకల్లోలాలు చేసింది కాంగ్రెస్ కాదా అని నిలదీశారు. 'పాతచింతకాయ పచ్చడిలాగా.. అరిగిపోయిన గ్రామ్ ఫోన్ రికార్డులాగా.. రాహుల్, ప్రియాంక గాంధీలు అవే అసత్యాలు మాట్లాడారు. అని ఎద్దేవా చేశారు. మంగళవారం నగరంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు.

**సునామీలాగా బీజేపీకి ఓటేస్తారు**

'30న సునామీలాగా ప్రజలు బీజేపీకి అనుకూలంగా ఓటేస్తారు. 3న బీజేపీ భారీ విజయంతో అధికారంలోకి రానుంది. స్వాతంత్ర్యం వచ్చాక తొలిసారి బీసీ సీఎం ఈ గడ్డపై బాధ్యతలు తీసుకోబోతున్నారు'అని ఆయన ధీమా వ్యక్తంచేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మాయలో పడొద్దని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. కేసీఆర్ కుటుంబ, సోనియా గాంధీ కుటుంబ పార్టీలను ప్రజలు బహిష్కరించాలని పిలుపునిచ్చారు. ''తెలంగాణ భద్రంగా ఉండాలంటే.. మా కుటుంబమే అధికారంలో ఉండాలన్న కేటీఆర్ మాటలకు ప్రజలు నవ్వుకుంటున్నారు. వీరి కబంధ హస్తాలనుంచి రాష్ట్రం బయటపడాలి. అమరవీరుల ఆకాంక్షలు రావాలంటే.. బీఆర్ఎస్ పోవాలి. వీళ్ల డిపాజిట్లు గల్లంతు కావాలి'అని కోరారు. తెలంగాణ అభివృద్ధి కోసం,, భావితరాల భవిష్యత్తు కోసం ప్రజల ఓటేయాలని, ప్రధాని మోదీ కోరినట్లుగా రాష్ట్రంలో బీజేపీని ఆశీర్వదించాలని ఆయన కోరారు.

**మేధావులూ ఆలోచించండి:** 'కాంగ్రెస్, బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే తెలంగాణ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో పడుతుంది. ఆర్థిక విధ్వంసం ఏర్పడుతుంది. ఉద్యోగులకు జీతాలిచ్చే పరిస్థితి లేదు. తెలంగాణ విద్యావంతులు, మేధావులు, కవులు, కళాకారులు, అన్ని వర్గాల ప్రజలు ఆలోచించాలి. అని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. 'ఈ పార్టీలకు సరైన గుణపాఠం చెబుతూ.. బీజేపీకి అండగా నిలవాలని కోరుతున్నాను. మోదీ గ్యారంటీతో తెలంగాణను అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్తాం. సామాజిక, ప్రజాస్వామ్య, ప్రగతిశీల తెలంగాణ ఏర్పాటు కోసం మేం పనిచేస్తాం'అని స్పష్టం చేశారు.

**బీసీలూ ఆ అవకాశం చేజార్చుకోకండి**

'బీసీ సామాజిక వర్గానికి మరోసారి విజ్ఞప్తి చేస్తున్నాను. ఓటేసేముందు ప్రతి బీసీ బిడ్డ.. గుండెమీద చేయివేసుకుని ఆలోచించాలని కోరుతున్నాను. ఈ రోజు బీసీ సీఎం తెలంగాణకు అవసరం. కాబట్టి మీరంతా ఆలోచించండి. మీకు వివిధ రకాల పార్టీలతో సాన్నిహిత్యం ఉండొచ్చు. కానీ బీసీ సీఎం అయ్యే మంచి అవకాశాన్ని చేజార్చుకోకండని విజ్ఞప్తి చేస్తున్నాను'అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# నన్ను ఓడించేందుకే..

**కుట్రలకు తెరలేపారని బండి సంజయ్ ధ్వజం**

**కరీంనగర్‌లో అర్ధరాత్రి ఉద్రిక్తత**



కరీంనగర్‌లోని కొత్తపల్లిలో పోలీసులతో బండి సంజయ్ వాగ్వాదం

సాక్షిప్రతినిధి, కరీంనగర్/కొత్తపల్లి/కరీంనగర్ టౌన్: కరీంనగర్‌లో తన గెలుపు ఖాయమైన నేపథ్యంలో సీఎం కేసీఆర్ రంగంలోకి దిగి ప్రత్యేక టీంతో డబ్బులు పంచుతూ కుట్రలకు తెరలేపి, దిగజారిపోయారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఆరోపించారు. 'కేసీఆర్.. సీఎంగా ఉంటూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడానికి సిగ్గు లేదా?'అంటూ ధ్వజమెత్తారు. మీరెన్ని కుట్రలు చేసినా కరీంనగర్‌లో బండి సంజయ్ గెలవబోతున్నాడని, డిసెంబర్ 3న కేసీఆర్ మాజీ సీఎం కాబోతున్నారని చెప్పారు. కరీంనగర్‌లోని కొత్తపల్లిలో బీఆర్ఎస్ నాయకులు డబ్బులు పంపిణీ చేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో మంగళవారం రాత్రి అక్కడికి వెళ్లిన బండి సంజయ్ తర్వాత మీడియాతో మాట్లాడారు. డబ్బుల పంపిణీపై తమ కార్యకర్తలు సమాచారం అందించారని చెప్పారు. గంగుల కమలాకర్ కొంతమంది మహిళా గ్రూపులు, మరి కొంతమంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ద్వారా డబ్బులు పంపిణీ చేయిస్తున్నారని ఆరోపించారు. కొంతమంది పోలీస్ సిబ్బంది కూడా ఓటుకు రూ.10 వేలు చొప్పున పంచి పెడుతున్నారని ఆరోపించారు. అడ్డుకోవడానికి వెళ్లిన తమ కార్యకర్తలపై బీఆర్ఎస్ నేతలు నిస్సిగ్గుగా దాడులకు యత్నించారని అన్నారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ నిజాయితీగా, నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నా, కొందరు కింది స్థాయి సిబ్బంది గంగులకు అమ్ముడుపోయారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు డబ్బులు పంచుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో సంజయ్ సహా బీజేపీ శ్రేణులు కొత్తపల్లికి చేరుకోవడం, బీఆర్ఎస్ నేతలు కొందరు గాంధీ విగ్రహం వద్దకు చేరుకొని రోడ్డుపై బైఠాయించడం, రెండు వర్గాల నినాదాలతో పట్టణంలో అర్ధరాత్రి ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోగా, బీఆర్ఎస్ నాయకులు డబ్బులు పంచుతుంటే ఏం చేస్తున్నారంటూ సంజయ్ వారిని నిలదీశారు.

# ఒత్తిళ్లు, ప్రలోభాలకు లొంగొద్దు.. ప్లీజ్

- కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్‌లు కలిసి తెలంగాణను ముంచడానికే సిద్ధమయ్యాయి...
- ఆ మూడు పార్టీలకు బుద్ధి చెబుదాం
- బీజేపీకి మద్దతిచ్చి రాష్ట్రాభివృద్ధికి బాటలు వేసుకుందాం.

**ప్రజలకు కిషన్‌రెడ్డి బహిరంగలేఖ**

సాక్షి, హైదరాబాద్: 'ఇక పోలింగ్‌కు మిగిలింది ఒక్క రోజే.. మద్యం, డబ్బు ద్వారా ప్రలోభాలకు గురిచేసేందుకు చాలామంది ప్రయత్నిస్తారు. దయచేసి ఆ ఒత్తిళ్లకు లొంగకండి'అని తెలంగాణ ప్రజలకు కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. 'నేను మీకు చేతులెత్తి నమస్కరిస్తున్నా.. రాష్ట్ర భవిష్యత్తు కోసం జరుగుతున్న ఈ ఎన్నికల్లో బీజేపీకి సంపూర్ణంగా మద్దతు తెలపాలని కోరుతున్నాను'అని విన్నవించారు. ఈ మేరకు ఆయన మంగళవారం రాష్ట్ర ప్రజలకు కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు. ''ఇదేనా మనం కోరుకున్న తెలంగాణ? దీనిపై ప్రజలు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన తరుణమిది. అసలు ఈ పదేళ్లలో రాష్ట్రంలో సంతృప్తి చెందిన వర్గం ఒక్కటంటే ఒక్కటైనా ఉందా? అసలు రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి ఏమైనా అర్థం ఉందా? అని ప్రజలు ఆత్మవిమర్శ చేసుకోవాలి. 'మోదీ ఆశీర్వాదంతో బీసీ సీఎం నేతృత్వంలో రాష్ట్రాభివృద్ధికి బాటలు వేసుకుందాం. అమరవీరులు కలలుగన్న సామాజిక, ప్రజాస్వామ్య, ప్రగతిశీల తెలంగాణ స్వప్నాన్ని సాకారం చేసుకుందాం. ఇది మోదీ గ్యారంటీ! ఇది బీజేపీ గ్యారంటీ'అని ఆ లేఖలో పేర్కొన్నారు.

**ఆ మూడూ ముంచేస్తాయి:** ''మజ్లిస్‌తో కలిసి కాంగ్రెస్, బీఆర్ఎస్ తెలంగాణను ముంచడానికే సిద్ధమయ్యాయి. అయితే ను వ్వు, లేదంటే నేను.. మనిద్దరిలో ఎవరైనా ఒకరు అధికారంలో ఉండాలనే లక్ష్యంతో కలిసి పనిచేస్తున్నాయి. ఈ రెండు పార్టీల చరిత్ర, వర్తమానం, భవిష్యత్తు ఇదే. 2014, 2018లో కాంగ్రెస్ గుర్తుమీద గెలిచిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రాజీనామా చేయకుండానే.. బీఆర్ఎస్‌లో చేరడం, మంత్రిపదవులు పొందడం మనందరికీ గుర్తుండే ఉంటుంది.''అని పేర్కొన్నారు. 'నియామకాల విషయంలో.. ప్రభుత్వం అనుసరించిన విధానం తీవ్ర ఆక్షేపణీయం. ఉద్యమంలో యువత లాఠీ దెబ్బలు, రబ్బరు బుల్లెట్ల గాయాలు, టియర్ గ్యాస్‌ను లెక్కచేయకుండా పోరాడితే.. రాష్ట్రం వచ్చాక యువతకు ఒరిగిందేమీ లేదు. ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసేందుకు కారణమైన నిరుద్యోగ యువత.. ఇవాళ ఉద్యోగాలు రాక ఆత్మహత్యలకు పాల్పడుతున్న దుస్థితికి చేరుకోవడానికి కారణం కేసీఆర్ అసమర్థ పాలన కాదా? టీఎస్‌పీఎస్సీ పరిస్థితి 'మూడు లీకేజీలు, ఆరు రద్దులుగా'మారింది. రాష్ట్రంలోని 39 లక్షల మంది నిరుద్యోగుల్లో ఒక్కశాతానికైనా ఉద్యోగాలు అందాయా? రూ.3,106 నిరుద్యోగ భృతి ఇస్తామన్న హామీ ఎందరికి అందింది?'అని ప్రశ్నించారు. ఇవన్నీ ఒక్కసారి గుర్తు తెచ్చుకుని ఓటర్లు విజ్ఞతతో వ్యవహరించాలని కోరుకుంటున్నాను అని కిషన్‌రెడ్డి ఆ లేఖలో పేర్కొన్నారు.

## మత ప్రాతిపదికన హామీలిచ్చే పార్టీలను రద్దు చేయాలి: కె.లక్ష్మణ్



సాక్షి,హైదరాబాద్: మతం ప్రాతిపదికన రిజర్వేషన్ల కల్పన, ముస్లిం వర్గానికి ఐటీ పార్క్ ఏర్పాటు వంటి హామీలిస్తున్న పార్టీలను కేంద్ర ఎన్నికల సంఘం రద్దు చేయాలని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె. లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఒక మతం కోసం ఐటీ పార్క్ పెడతానని చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సిగ్గుండాలని మండిపడ్డారు. సామాజిక వివక్షకు గురైన వారికి మాత్రమే రాజ్యాంగనిర్మాత డా.బీఆర్.అంబేడ్కర్ రిజర్వేషన్లు కల్పించారని ఈ సందర్భంగా లక్ష్మణ్ గుర్తు చేశారు. మంగళవారం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ..బీఆర్ఎస్, కాంగ్రెస్ డబ్బు, మద్యం, ఓట్ల కొనుగోలునే నమ్ముకున్నాయన్నారు. ప్రజలు మాత్రం బీజేపీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. 1983 తర్వాత ఉమ్మడి ఏపీలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ తెలంగాణలో ఏనాడు 58 సీట్లకుమించి గెలవలేదని అలాంటిది...ఈ ఎన్నికల్లో గెలిచి కాంగ్రెస్ అధికారానికి ఎలా వస్తుందని ప్రశ్నించారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, నడ్డా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ప్రచారానికి ప్రజల నుంచి అనూహ్యమైన స్పందన లభించిందన్నారు. ''టాటా కాంగ్రెస్.. బై బై బీఆర్ఎస్..వెల్కమ్ బీజేపీ...కారు షెడ్డుకు పోతుంది.. కమలం వికసిస్తుంది...చెయ్యికి మొండి చెయ్యి...కారు గ్యారేజ్ కు వెళ్లడం ఖాయం''...అనే నినాదాలు వినిపిస్తున్నాయని తెలిపారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను ప్రజలు నమ్మడం లేదని, కేసీఆర్ అబద్ధపు మాటలు, వాగ్దానాలు విని ప్రజలు విసిగి పోయారని వ్యాఖ్యానించారు. కర్ణాటక ప్రజల సొమ్ముతో తెలంగాణలో కాంగ్రెస్ ఎన్నికల ప్రకటనలు ఇస్తున్నారు. కర్ణాటక నేడు కాంగ్రెస్‌కు ఏటీఎంగా మారింది అని ఆరోపించారు.

## జేఈఈ మెయిన్స్‌కు దరఖాస్తు గడువు రేపే


సాక్షి, హైదరాబాద్: ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్రప్రభుత్వ నిధులతో నడిచే ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష(జేఈఈ మెయిన్స్)కు దరఖాస్తు చేసుకునే గడువు ఈ నెల 30వ తేదీతో ముగుస్తుంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తామని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వెల్లడించింది. దరఖాస్తుల ప్రక్రియ ఈ నెల 1వ తేదీన మొదలైంది. జేఈఈ మెయిన్స్ తొలివిడత పరీక్ష దేశవ్యాప్తంగా 2024 జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకూ జరుగుతుంది. రెండోవిడత ఏప్రిల్‌లో జరుగుతుంది. ఫిబ్రవరి 12న మెయిన్స్ ఫలితాలు వెల్లడిస్తారు. కోవిడ్‌కాలంలో ఎన్‌సీఈఆర్‌టీ, సీబీఎస్ఈ సిలబస్ తగ్గించారు. దీంతో ఈసారి కొన్ని టాపిక్స్ నుంచి ప్రశ్నలు ఇవ్వడాన్ని మినహాయించినట్టు ఎన్‌టీఏ ప్రకటించింది. ఇందుకు సంబంధించిన సిలబస్‌నూ విడుదల చేసింది. మ్యాథ్స్‌లో కూడా సుదీర్ఘ జవాబులు రాబట్టే విధానానికి సడలింపు ఇచ్చారు. ఫలితంగా ఈసారి ఎక్కువమంది మెయిన్స్ రాసే వీలుందని అంచనా వేస్తున్నారు.

## నేడు, రేపు అక్కడక్కడా తేలికపాటి వానలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బుధ, గురువారాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. వాతావరణంలో మార్పులతో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గుతాయని వెల్లడించింది. ప్రస్తుతం రాష్ట్రంలో సాధారణ స్థితిలోనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయంది. మంగళవారం రాష్ట్రంలో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే గరిష్ట ఉష్ణోగ్రత ఖమ్మంలో 33.2 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 18.5 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. బుధ, గురువారాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ మేర తగ్గే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేసింది. రాష్ట్రానికి ఆగ్నేయ దిశ నుంచి తక్కువ ఎత్తులో బలంగా గాలులు వీస్తున్నాయంది. గాలుల ప్రభావంతో చలి తీవ్రత పెరిగే అవకాశం ఉందని తెలిపింది.

**మంగళవారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన కనిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీల సెల్సియస్)**

| | |
|---|---|
| మెదక్ | 18.5 |
| ఆదిలాబాద్ | 19.8 |
| నల్లగొండ | 20 |
| హకీంపేట్ | 20.2 |
| రామగుండం | 20.2 |
| హనుమకొండ | 21 |
| నిజామాబాద్ | 21.3 |
| దుండిగల్ | 21.4 |
| మహబూబ్‌నగర్ | 21.6 |
| హైదరాబాద్ | 21.6 |
| భద్రాచలం | 22 |
| ఖమ్మం | 22.4 |



# పవర్ 'ఫుల్'

- ఏపీలో ప్రజలు, రైతులకు నాణ్యమైన విద్యుత్
- ఇంధన రంగ చరిత్రలో సరికొత్త అధ్యాయం

**పలు ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలో సీఎం వైఎస్ జగన్**

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో విద్యుత్ సామర్థ్య పెరగడం ద్వారా ప్రజలకు, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందనుందని సీఎం వైఎస్ జగన్ అన్నారు. మంగళవారం రాష్ట్ర విద్యుత్ రంగ చరిత్రలో తొలిసారిగా ఒకేసారి ఆయన వర్చువల్ విధానంలో 16 సబ్ స్టేషన్ల నిర్మాణానికి శంకుస్థాపన, 12 సబ్‌స్టేషన్లకు ప్రారంభోత్సవం చేశారు. కర్నూలు, నంద్యాల, వైఎస్సార్ కడప, సత్యసాయి, ప్రకాశం, గుంటూరు, ఏలూరు, పశ్చిమ గోదావరి, కోనసీమ, తూర్పు గోదావరి, కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, పల్నాడు, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు, అన్నమయ్య జిల్లాల పరిధిలోని 28 ప్రాంతాల్లో వివిధ సామర్థ్యాలతో ఈ సబ్ స్టేషన్లు ఏర్పాటవుతున్నాయి. వీటితో పాటు కడపలో 750 మెగావాట్లు, అనంతపురంలో 100 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టుల నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. పునరుత్పాదక విద్యుత్ రంగంలో హెచ్‌పీసీఎల్‌తో రూ.10 వేల కోట్ల విలువైన ప్రాజెక్టుపై సీఎం సమక్షంలో ఒప్పందం కుదిరింది. ఏపీ సోలార్ పవర్ కార్పొరేషన్ ఎండీ అండ్ సీఈఓ కమలాకర్ బాబు, హెచ్‌పీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శుభేందు గుప్తా ఒప్పంద పత్రా లను అందుకున్నారు. వీటన్నింటి వల్ల రానున్న రోజుల్లో వేగంగా అడుగులు ముందుకు పడి మరిన్ని ఉద్యోగాలతో పాటు రాష్ట్రంలో విద్యుత్ పంపిణీ సామర్థ్యం మెరుగు పడుతుందని సీఎం అన్నారు. ''19 జిల్లాల్లో విద్యుత్ పంపిణీ సామర్థ్యాన్ని పెంచుతూ రూ.620 కోట్లతో 12 సబ్‌స్టేషన్లను ప్రారంభిస్తున్నాం. రూ.2,479 కోట్లతో మరో 16 సబ్‌స్టేషన్లకు శంకుస్థాపన చేస్తున్నాం. మొత్తంగా రూ.3,099 కోట్ల పెట్టుబడులతో మంచి కార్యక్రమం జరుగుతోంది. కొత్తగా వస్తున్న ఈ 28 సబ్ స్టేషన్లలో 200 మందికి ఉద్యోగావకాశాలు వస్తున్నాయి. మరోవైపు రూ.3,400 కోట్లతో 850 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తున్నాం. వీటి వల్ల 1,700 ఉద్యోగాలు వస్తున్నాయి. వీటిన్నింటి కోసం 6,500 కోట్ల పెట్టుబడి పెడుతున్నాం'' అని చెప్పారు.

## పోలింగ్ ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలి

- పార్టీ శ్రేణులకు టీపీసీసీ దిశానిర్దేశం
- ప్రభుత్వ వ్యతిరేకతను ఓట్లుగా మార్చుకోవాలని సూచన

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల ప్రచారగడువు ముగిసిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ మరింత అప్రమత్తమైంది. పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పార్టీ అభ్యర్థులు, శ్రేణులకు దిశానిర్దేశం చేసింది. ప్రచారపర్వంలో చూపిన ఉత్సాహాన్ని చివరి వరకు కొనసాగించాలని, ప్రభుత్వ వ్యతిరేకతను ఓట్లరూపంలో మార్చుకునేందుకు పకడ్బందీగా ముందుకెళ్లాలని సూచించింది. అభ్యర్థులతోపాటు కార్యకర్తలు, నాయకులను సమన్వయం చేసుకోవడంపై గాంధీభవన్‌లోని వార్‌రూం నుంచి పలు సందేశాలు అందాయి. పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు వ్యవహారాలన్నింటినీ చక్కబెట్టేందుకు వార్‌రూం నుంచి ప్రత్యేకంగా పర్యవేక్షించనుంది. ముఖ్యంగా బీఆర్ఎస్ నగదు పంపిణీని అడ్డుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఓటర్లను తన వైపు తిప్పుకునేందుకు అధికార పార్టీ చేసే ప్రలోభాలను ఎప్పటికప్పుడు పసిగట్టి అధికారులకు సమాచారమివ్వాలని సూచించింది. పోలింగ్ బూత్‌వారీ ప్రణాళికలతో ముందుకెళ్లాలని, ప్రతి బూత్‌లో ఓట్లన్నీ పడేలా బూత్ కన్వీనర్లు, సభ్యులు ప్రత్యేక దృష్టి పెట్టాలని దిశానిర్దేశం చేసింది. పోలింగ్ ఏజెంట్లుగా కూర్చునే పార్టీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి ఎక్కడా ఇబ్బందులు లేకుండా పోలింగ్ ప్రక్రియను ముగించాలని శ్రేణులకు సూచించింది.


'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+6 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 248

బుధవారం 29-11-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




చెయ్యి గుర్తుకే మన ఓటు






"జాతిని జాగృత పరచే గీతాల జన జాతర తెలంగాణ..
వేల కొలదిగా వీరులు నేల ఒరిగిపోతేనేమి..
తరగనిది మీ త్యాగం.. మరువనిది మీ పోరాటం." - అందెశ్రీ

ప్రియమైన తెలంగాణ ప్రజలారా..

**వీరుల త్యాగాలకు విలువివ్వని రాజకీయమెందుకు?**
**ప్రజల ఆకాంక్షలను నెరవేర్చని అధికారమెందుకు?**

తెలంగాణనే నినాదమై నాలుగు కోట్ల గొంతుకలు ప్రతిధ్వనించినప్పుడు మీ పోరాట పటిమ చూశాను. స్వరాష్ట్రమే సిద్ధాంతమై త్యాగాలు చేస్తున్నప్పుడు తల్లిగా తల్లడిల్లాను. 60 ఏండ్ల మీ ఆకాంక్షను నెరవేర్చే అరుదైన అవకాశం మాకు వచ్చినందుకు గర్వపడ్డాము. తెలంగాణ కల సాకారంతో మీరు చూపించిన అభిమానానికి ముగ్ధురాలినయ్యాను. ఆరోజు మీ కళ్ళల్లో చూసిన ఆనందం ఏనాటికీ చెదిరి పోకూడదని ఆకాంక్షించాను.

పదేళ్ల తెలంగాణ ప్రస్థానంలో అమరుల ఆశయాలకు భిన్నమైన, వీరుల త్యాగాలకు విలువలేని పాలన నడుస్తోంది. నాటి ఉద్యమ ఆకాంక్షలు ఏవీ నెరవేరని పరిస్థితి. ఇది కాదు కదా మీరు ఆశించిన, మనం కాంక్షించిన తెలంగాణ! సకల జనులు, సబ్బండ వర్గాలు సమాన అభివృద్ధి చెంది, స్వేచ్ఛ, ఆత్మగౌరవంతో జీవించే తెలంగాణను మనం ఆశించాము. కానీ ఆ ఆకాంక్షలు నెరవేరకపోవడం నాకు ఆవేదన కలిగిస్తోంది.

మనం కలలుగన్న తెలంగాణ సాకారం చేసుకునే సదవకాశం ఇప్పుడు మన ముందు ఉన్నది. మన భవిష్యత్తును నిర్మించుకునే నిర్ణయం మన చేతుల్లోనే ఉన్నది. ప్రజల జీవితాలలో వెలుగులు నింపేందుకు **కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలతో పాటు ఏడో గ్యారెంటీగా ప్రజాస్వామ్య పాలనను హామీ ఇస్తోంది. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే మా గ్యారెంటీలను అమలు చేస్తామని మీ తల్లిగా మాట ఇస్తున్నాను.**

**అరాచక పాలన అంతం కోసం.. ప్రజా పాలన స్థాపన కోసం..**
**మనం కలలుగన్న తెలంగాణ కోసం.. మనం కోరుకున్న భవిష్యత్తు కోసం..**
**కాంగ్రెస్‌కు ఒక అవకాశం ఇవ్వాలని మిమ్మల్ని కోరుతున్నాను.**

జై కాంగ్రెస్!
జై తెలంగాణ!

**మార్పు కావాలి - కాంగ్రెస్ రావాలి**

**సోనియా గాంధీ**






| మహాలక్ష్మి | రైతు భరోసా | గృహజ్యోతి | ఇందిరమ్మ ఇండ్లు | యువవికాసం | చేయూత |
|---|---|---|---|---|---|
| మహిళలకు ప్రతి నెలా ₹2500<br>₹500కే గ్యాస్ సిలిండర్<br>ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం | ప్రతి ఏటా రైతులకు, కౌలు రైతులకు ఎకరానికి ₹15000<br>వ్యవసాయ కూలీలకు ₹12000<br>వరి పంటకు ₹500 బోనస్ | ప్రతి కుటుంబానికి<br>200 యూనిట్ల<br>ఉచిత విద్యుత్ | ఇల్లు లేని వారికి<br>ఇంటి స్థలం మరియు ₹5 లక్షలు<br>ఉద్యమకారులకు<br>250చ.గ. ఇంటి స్థలం | విద్యార్థులకు ₹5 లక్షల<br>విద్యా భరోసా కార్డు<br>ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్స్ | ₹4000 నెలవారీ పింఛను<br>₹10 లక్షల<br>రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా |



ఆధ్యాత్మిక మార్గంలో నీకు ఎవరి మద్దతూ లేనప్పుడు ఒంటరిగా నడువు. అపరిపక్వ మనుషులు నీకు జత కాలేరు.
– బౌద్ధ ధర్మం



సాక్షి
బుధవారం, 29 నవంబర్ 2023

# ఎవరికీ పట్టని ప్రాణాలు

జానెడు పొట్ట కోసం ఉన్న ఊరునూ, అయినవారినీ వదిలి దూరతీరాలకు పోయి కాయకష్టం చేసే వారు బతుకుపోరాటంలో ఎప్పుడూ ఓడిపోతూనే వుంటారు. మహానగరాల్లో రాళ్లెత్తే కూలీలుగా, క్వారీల్లో గనుల్లో చెమటోడ్చే కార్మికులుగా, భారీ భవంతులకు కాపలాదార్లుగా, స్థానికులు చేయసాహసించని అనేక ప్రమాదకరమైన పనులను తప్పనిసరిగా తలకెత్తుకుని ప్రాణాలు పణంగా పెట్టే బడుగుజీవులుగా వీరు అందరికీ సుపరిచితులే. కానీ భద్రత, ఆరోగ్యం వంటివి వీరికెప్పుడూ ఆమడదూరమే. రోజంతా రెక్కలు ముక్కలు చేసుకుంటున్నా అర్ధాకలితో కాలం గడిపే అలాంటి అభాగ్యులపై ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) విడుదల చేసిన నివేదిక దిగ్భ్రాంతికరమైన నిజాలు వెల్లడించింది. పనికి సంబంధించిన ప్రమాదాల్లో చిక్కుకుని, వ్యాధుల బారినపడి ప్రపంచవ్యాప్తంగా సగటున ఏటా 30 లక్షలమంది కన్నుమూస్తున్నారని ఆ నివేదిక అంచనా. కార్మికుల ఉసురుతీస్తున్న పది రకాల కారణాలను ఆ నివేదిక గుర్తించింది. సుదీర్ఘమైన పనిగంటలు (వారానికి 55 గంటలు లేదా అంతకన్నా ఎక్కువ) కార్మికుల మరణాలకు ప్రధాన కారణమవుతున్నాయని, ఆ కేటగిరీలో ఏటా మరణిస్తున్నవారు 7,44,924 మంది అని తేల్చింది. ఆ తర్వాత స్థానం సూక్ష్మ ధూళి కణాలు, పొగలు, వాయువులది. వాటి బారినపడి మరణించేవారు ఏటా 4,50,381 మంది అని లెక్కేసింది. ఇవిగాక నికెల్, ఆర్సెనిక్, డీజిల్ కాలుష్యం, సిలికా, ఆస్బెస్టాస్ తదితరాల వల్ల మరో 15 లక్షల మరణాలు సంభవిస్తున్నాయని తెలిపింది. వీటిల్లో 63 శాతం ఆసియా–పసిఫిక్ ప్రాంత దేశాల్లోనే వుంటున్నాయని వివరించింది. వ్యవసాయం, రవాణా, మైనింగ్, నిర్మాణరంగం వగైరాల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి నివారణకు అనుసరించాల్సిన విధానాల రూపకల్పనకు సోమవారం ఆస్ట్రేలియాలోని సిడ్నీలో ప్రారంభ మైన నాలుగురోజుల సదస్సు సందర్భంగా ఐఎల్‌ఓ ఈ నివేదిక వెలువరించింది.

మనవరకూ తీసుకుంటే జనాభాలో మూడోవంతు మంది వలసబాట పడుతున్నారు. వీరంతా పల్లెటూళ్లను వదిలి పట్టణాలకూ, నగరాలకూ వలసపోయేవారే. ఇలాంటివారు ఎలాంటి గుర్తింపూ లేకుండా బతుకులీడుస్తున్నారు. వారికి ఓటు హక్కుండదు. రేషన్ కార్డు వుండదు గనుక చవగ్గా సరుకులు లభించవు. స్థానికతకు అవకాశం లేదు గనుక వారి హక్కుల కోసం, పని పరిస్థితుల మెరుగు కోసం పోరాడే సంస్థలుండవు. అసంఘటిత రంగ కార్మికులుగా కనీసం చట్టప్రకారం దక్కాల్సినవి వారికి ఎప్పుడూ దూరమే. జ్వరమో, మరే వ్యాధో ముంచుకొచ్చినా చూసే దిక్కుండదు. ఇలాంటి అభాగ్యులకు కుటుంబాలుంటే ఈ కష్టాలన్నీ మరిన్ని రెట్లు ఎక్కువ. ఈ కార్మికుల కాంట్రాక్టర్లు సర్వసాధారణంగా ఏదో ఒక పార్టీ ఛత్రఛాయలో వుంటారు గనుక అధికారులు వారి జోలికి పోవటానికి, కార్మికుల ప్రయోజనాలు కాపాడటానికి సాహసించరు. మెరుగైన సాంకేతికతలున్న యంత్ర సామగ్రి లభ్యమవుతున్నా వాటిపై పెట్టుబడులు పెట్టడం దండగన్న భావనతో ఈ కార్మికులతోనే అన్నీ చేయిస్తుంటారు. ఈ క్రమంలో ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోవటం లేదా అంగవికలురు కావటం రివాజు. ప్రపంచవ్యాప్తంగా గాయాలపాలై ఏటా 3,63,283 మంది కార్మికులు మరణిస్తున్నారని ఐఎల్‌ఓ నివేదిక చెబుతోంది. మన దేశంలో 2017–2020 మధ్య సగటున రోజూ ముగ్గురు కార్మికులు ప్రమాదాల బారినపడి చనిపోతున్నారని కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ డేటా తెలిపింది. ఇవన్నీ రిజిస్టరయిన ఫ్యాక్టరీలకు సంబంధించినవి. అసంఘటిత రంగంలో సంభవించే మరణాలకు అరకొర డేటాయే వుంటుంది. సాధారణంగా ఆ రంగంలో సంభవించే చాలా మరణాలు సహజ మరణాల ఖాతాలోకి పోతుంటాయి. వైద్యులు కూడా వారికి సహకరిస్తుంటారు. అసంఘటిత రంగ కార్మికులు చేసే వెట్టిచాకిరీ అపారమైన సంపద సృష్టిస్తోంది. కానీ ఆ సంపద సృష్టికర్తలు అనామకులుగా మిగిలిపోతున్నారు. ముగిసిపోతున్నారు.

అంతర్జాతీయంగా నిబంధనలు లేవని కాదు. పని పరిస్థితుల్లో భద్రత, ఆరోగ్యం వంటి అంశాలపై ఐఎల్‌ఓ రూపొందించిన అంతర్జాతీయ ఒడంబడికను 187 సభ్య దేశాల్లో కేవలం 79 దేశాలు ఆమోదించాయి. కనీసం అందుకు సంబంధించిన నియమ నిబంధనలకైనా సభ్య దేశాలన్నీ ఆమోదం తెలపలేదు. అందుకు కేవలం 62 దేశాలు మాత్రమే సమ్మతించాయి. ఈ రెండు ఒడంబడికలకూ మన దేశం ఆమడ దూరంలో వుంది. వృత్తిపరంగా ఎదురయ్యే ఇబ్బందులేమిటో, అందులో పొంచివుండే ప్రమాదాలేమిటో బయటివారికన్నా కార్మికులకే ఎక్కువ తెలుస్తుంది. కనీసం అవి బయటివారు తెలుసుకోవటానికైనా కార్మికులకు సంఘాలుండాలి. వారి తరఫున గట్టిగా ప్రశ్నించే నేతలుండాలి. కానీ మన దేశం వరకూ చూస్తే కార్మిక సంస్కరణల పేరిట తీసుకొచ్చిన కొత్త చట్టాలు అలాంటి అవకాశాలను మరింత నీరుగార్చాయి. ఫలితంగా బాల కార్మిక వ్యవస్థ, వెట్టిచాకిరీ, వివక్ష, అధిక పనిగంటలు వంటివన్నీ అసంఘటిత రంగ కార్మికులకు శాపాలవుతున్నాయి. రిజిస్టరైన ఫ్యాక్టరీల్లోనే తప్పుడు లెక్కలు చూపించి కార్మికుల భద్రతకు సంబంధించిన కమిటీల ఏర్పాటు, లైంగిక వివక్ష నిర్మూలన తదితరాలను ఎగ్గొడుతున్నారు. ఇక ఎవరికీ పట్టని అసంఘటితరంగ కార్మికుల గురించి చెప్పేదేముంది? సిడ్నీలో సాగుతున్న సదస్సులో 127 దేశాలకు చెందిన మూడు వేల మందికి పైగా ప్రతినిధులు పాల్గొంటున్నారు. 30 గోష్ఠులు, ఆరు సాంకేతిక సదస్సులు కూడా వుంటాయంటున్నారు. కనీసం ఈ సదస్సు తర్వాతనైనా కార్మికుల భద్రతకు ముప్పుగా పరిణమించిన సమస్యలను నివారించటానికి పకడ్బందీ విధానాలు రూపొందించటం తమ బాధ్యతగా ప్రభుత్వాలు గుర్తించాలి.

# ఉద్యమాన్ని మలుపు తిప్పిన రోజు

అభిప్రాయం



ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి

**తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో నవంబర్ 29కి ఒక ప్రత్యేకత ఉంది. కేసీఆర్ తన అంతిమ అస్త్రంగా 2009లో ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్న ఆ రోజు ఉద్యమాన్ని కీలక మలుపు తిప్పింది. అనేక దశాబ్దాలుగా వివిధ పోరాట రూపాల్లో వ్యక్తమైన తెలంగాణ ఆకాంక్షకు ఒక స్పష్టమైన లక్ష్యం 1996 నాటికే ఏర్పడింది. ప్రజా సంఘాలు, మేధావులు, కవులు, రచయితలు సభలు, సమావేశాలు ఏర్పాటు చేస్తూ విస్తృత ప్రజా చైతన్యానికి దోహదపడిన సందర్భంలో కేసీఆర్ 2001లో తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పాటు చేసి ఉద్యమ శక్తులకు ఒక కొత్త రాజకీయ వేదిక రూపొందించారు. అయితే, నవంబర్ 29 నాటి ఆ దీక్ష ఉద్యమాన్ని అంతిమ లక్ష్యానికి చేర్చింది.**

కేసీఆర్‌ను అపర చాణక్యుడు అనేవారు ఆచార్య జయశంకర్. ఆయన వ్యూహాలు, ఎత్తుగడలు అలాగే ఉంటాయి. ఎప్పుడైతే ప్రత్యర్థి బేలగా, డీలా పడిపోయి ఉంటాడో, తన బలగం ఐకమత్యం లేక సతమతం అవుతుందో అలాంటప్పుడు అదును చూసి దెబ్బతీసే యుద్ధ ప్రకటన చేయాలన్న చాణక్య నీతిని ప్రదర్శించాడు కేసీఆర్. 2009లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని రెండోసారి అధికారంలోకి తెచ్చిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి అకాల మరణం తరువాత కాంగ్రెస్ పార్టీ అస్తవ్యస్తమై పోయింది. ఆత్మ స్థైర్యం కోల్పోయి రాష్ట్ర నాయకత్వం అయోమయంలో ఉన్న దశలో కేసీఆర్ తన ఆఖరి అస్త్రమైన ఆమరణ దీక్షను ప్రకటించారు. తెలంగాణ ఉద్యోగులకు సంబంధించిన ఒక సమస్య నేపథ్యంలో ఆయన ఉన్నట్టుండి ఈ నిర్ణయం ప్రకటించారు.

2004 ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి పోటీచేసి, కేంద్ర ప్రభుత్వ 'కామన్ మినిమమ్ ప్రోగ్రామ్'లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును చేర్చినప్పటికీ దానిని అమలు చేసే ఆలోచన కాంగ్రెస్ పార్టీకి లేదనే సంగతి ఆయనకు అర్థమయ్యింది. ఆరేళ్ళ పాటు ఢిల్లీలో అనేక పార్టీలతో, కేంద్ర ప్రభుత్వంలో ఉన్న భాగస్వామ్య పక్షాలతో, రాష్ట్ర శాసన సభతో పాటు, పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహిస్తున్న అన్ని రాజకీయ పార్టీలతో ఆయన ఏకాభిప్రాయ సాధన కోసం ఐదేళ్ళు ప్రయత్నించారు. అప్పటికే తన పార్టీ ప్రారంభించి పదేళ్లయిన దరిమిలా ఉద్యమాన్ని పదునెక్కించే లక్ష్యంతో ప్రత్యక్ష యుద్ధానికి దిగక తప్పదని దీక్షబూనారు. కరీంనగర్‌లోని తన నివాసం నుంచి సిద్దిపేట దీక్షా స్థలికి బయలుదేరిన కొద్ది నిమిషాల్లోనే ఆయనను అరెస్టు చేసి ఖమ్మం తరలించారు. దీనితో తెలంగాణ ఒక్కటయ్యింది. అప్పటివరకు ఆచితూచి చూస్తున్న విద్యార్థి, ఉద్యోగ, కార్మిక వర్గాలతో పాటు, పల్లెలు పట్టణాలు అన్న తేడా లేకుండా తెలంగాణ ఒక విశాల సంగ్రామ వేదికయ్యింది. మరోవైపు ఖమ్మం నుంచి హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించిన కేసీఆర్ ఆరోగ్యంపై అనేక వదంతులు వచ్చాయి. దీక్ష ప్రారంభమైన 11వ రోజు డిసెంబర్ 9న అప్పటి హోమ్ మంత్రి పి. చిదంబరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై పార్లమెంటులో ప్రకటన చేశారు.

దీక్ష దానికి అదే ముగింపు కాదు. తాత్విక విశేషార్థంలో దీక్ష అంటే ఒక క్రతువుకు ముందు సన్నద్ధత. తెలంగాణ ఏర్పాటు డిసెంబర్ 9తో పూర్తవలేదు. మరో ఐదేళ్లపాటు తెలంగాణా సబ్బండ వర్ణాలు నిలబడి పోరాడి, అనేక అవాంతరాలు ఛేదించుకుని 2014లో సంపూర్ణ తెలంగాణను సాధించుకునే దాకా అదొక క్రతువులాగే సాగింది.

భారత దేశ చరిత్రలో ఏ సామాజిక ఉద్యమం సాధించని విజయాన్ని తెలంగాణా ఉద్యమం సాధించింది. పౌరులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడటంలోనూ, అమలు పరచడంలోనూ



రాజ్యాంగ వ్యవస్థలు విఫలమైనప్పుడు ప్రజలే స్వయంగా పూనుకుని తమ హక్కులను కాపాడుకోవాలంటారు డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్. భారత రాజ్యాంగం ప్రజల ఆకాంక్షల మేరకు, అవసరాలకు అనుగుణంగా రాష్ట్రాలను ఏర్పాటు చేసుకునే హక్కును కల్పించింది. ప్రజలు రాజ్యాంగ పరిధిలో అన్ని పోరాట రూపాలనూ వాడుకుని, సకల జనుల సమ్మె, సాగర హారం, సంసద్ యాత్ర వంటి రాజకీయ, సాంస్కృతిక, ప్రజాస్వామిక పోరాటాలతో తమ హక్కును సాధించుకున్నారు. ఇలా ఒక ఆకాంక్షను పోరాటంగా మార్చి, రాజకీయ ఉద్యమంగా మలిచి, అంతిమంగా రాజ్యాంగ హక్కును సాధించుకోవడం వెనుక ఆ దీక్ష ఒక చోదక శక్తిగా పనిచేసింది. దానికి సబ్బండ వర్ణాల గుండె నిబ్బరం తోడయ్యింది.

తెలంగాణ ఆవిర్భవించి పది సంవత్సరాలు కావొస్తోంది. స్వరాష్ట్రం సాధించుకోవడంతో పాటు, స్వపరిపాలన ఫలితాలను కూడా ఇప్పుడిప్పుడే నవ తెలంగాణా ఆవిష్కరించుకుంటున్నది. నీళ్లు, నిధులు, నియామకాలనే ఉద్యమ ఆకాంక్షల ప్రాతిపదికన పునర్నిర్మాణ ప్రణాళికను ఏర్పాటు చేసుకుని తెలంగాణ తనను తాను పునరావిష్కరించుకుంటున్నది. ఒకప్పుడు 'వరి పంటను నేర్పించింది మేమే' అన్న దెప్పిపొడుపు మాటలు అన్నవారి నోళ్లు మూయించే విధంగా ఇప్పుడు దేశానికే ధాన్యాగారంగా మారిపోయింది. అప్పుల ఊబిలో కుదేలయిపోయిన రైతుకు ఆసరాగా ఇప్పుడు అనేక సౌకర్యాలు అందుతున్నాయి. ఉచితంగా కరెంటు, సాగునీరు, పెట్టుబడి సాయం, రైతుబీమాతో 'రైతుబంధు' రాష్ట్రంగా ముందుకు సాగుతోంది. సంప్రదాయ పరిశ్రమలకు తోడు శాస్త్ర సాంకేతిక రంగాలకు తెలంగాణ కేంద్రం అవుతోంది. ఉత్పత్తి, తయారీ, సేవా రంగాల్లో తన సామర్థ్యాన్ని పెంచుకుంటోంది. పదేళ్ల క్రితం తెలంగాణా ఎక్కడుందో కూడా తెలియని వాళ్ళు ఇప్పుడు పెట్టుబడులకు, ఉద్యోగాలకు హైదరాబాద్ నగరాన్ని వెతుక్కుంటూ వస్తున్నారు. ఆర్థిక రంగంలో నిలదొక్కుకుంటూనే ఐదు ప్రధాన ఆహారోత్పత్తి విప్లవాల్లో– ధాన్యం, పాలు, చేపల పెంపకం, గొర్రెల పెంపకం, ఆయిల్ పామ్‌లో – రాష్ట్రం అనూహ్య పురోగతిని సాధిస్తోంది.

ఉద్యమం నుంచి వచ్చిన నాయకత్వానికి ఎప్పుడైనా సవాళ్లు ఎక్కువగానే ఉంటాయి. సహజంగానే పరిపాలనలో పరిమితులు ఉంటాయి. అపరిమితమైన ఆకాంక్షలు, పరిమితమైన వనరులను సమతుల్యం చేసుకోవడం అవసరం. కొంతవరకు కష్టమైన పనే అయినా ప్రజలకు విడమరిచి చెప్పినప్పుడు వారు అర్థం చేసుకుంటారు. ఆ సామర్థ్యం కేసీఆర్‌లో ఉంది. ప్రజలతో నిరంతర సంభాషణ, సమన్వయం అవసరం. ప్రాధాన్యాలను నిర్ణయించుకోవడంలో, ప్రజలను భాగస్వాములను చేయడం వల్ల అసంతృప్తిని అధిగమించవచ్చు. ఏ సమాజం కూడా పదేళ్లలో సంపూర్ణ సంతృప్త స్థాయికి చేరుకోదు. ఇప్పుడు కొన్ని కీలక రంగాల మీద దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా విద్య, వైద్య రంగాలు మన మానవాభివృద్ధికి సూచికలు. వైద్యం ఇప్పుడిప్పుడే మెరుగవుతోంది. విద్యారంగానికి నిధులు పెరగాలి. గురుకుల విద్యాలయాలు కొత్త విప్లవాత్మక మార్పులకు కేంద్రాలవుతున్నా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు పెరగాలి. విద్యలో నాణ్యత పెరగాలి. అదే విధంగా రాష్ట్రంలో ఉన్నత విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయన్న భావం ఉంది. వాటి మీద దృష్టి పెట్టాలి. ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్య అందించగలగాలి. రాబోయే కాలంలో ఈ రంగాల మీద ప్రత్యేక శ్రద్ధ అవసరం. దక్షత గల నాయకత్వానికి అది పెద్ద సమస్య కాదు.

ఇప్పుడు సమస్యంతా ప్రగతి నిరోధక శక్తులతోనే! తెలంగాణ ఏర్పాటు విషయంలో తాత్సారం చేసిన శక్తులు, 2004 నుంచి 2014 వరకు పదేళ్ల పాటు తెలంగాణ పంచాయతీ తెగనీయకుండా చేసిన వాళ్ళు తెలంగాణ మీద పెత్తనానికి బయలుదేరి వస్తున్నారు. ఢిల్లీ పార్టీల పాలనలో ఏమయ్యిందో చూశాం. తెలంగాణ సమస్యల కోసం కలం పట్టిన వాళ్ళను, గొంతువిప్పిన వాళ్ళను, గజ్జెకట్టిన వాళ్లను, మానవ హక్కుల కోసం నిలబడిన వాళ్ళను జైళ్లలో కుక్కి, నిర్బంధించారు. మరో పక్క మతతత్వంతో మానవత్వాన్ని మంట గలిపిన శక్తులు ముందుకు వస్తున్నాయి. మనుషులు ఏం తినాలి, ఏం మాట్లాడాలి, చివరకు ఏం ఆలోచించాలో కూడా వాళ్ళే చెబుతారు. ఒకరు రాష్ట్రాన్ని మార్చేస్తాం అంటే, ఇంకొకరు హైదరాబాద్ పేరు మారుస్తామని శపథాలు చేస్తున్నారు. మనం వాళ్ళలాగా మారాలా, మన రాష్ట్రాన్ని మన ఆకాంక్షలకు అనుగుణంగా మార్చుకోవాలా తేల్చుకోవాల్సిన సమయం ఇది. తెలంగాణా ఆలోచించాల్సిన సందర్భం ఇది.

వ్యాసకర్త సోషియాలజీ ప్రొఫెసర్, డా॥ బి.ఆర్. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, హైదరాబాద్

## సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

### మరో జీవితం



ఉత్తరకాశీలోని సిల్‌క్యారా సొరంగం ఇప్పుడు తెరుచుకుంది. 17 రోజుల భారీ సహాయక చర్య ఎట్టకేలకు ముగింపునకు వచ్చింది. లోపల చిక్కుకు పోయిన 41 మంది కార్మికులు ఊపిరి పీల్చుకున్నట్టే! మొత్తానికి, చీకటి తర్వాత వెలుగు వచ్చినట్టయింది.

– పీయూష్ రాయ్, జర్నలిస్ట్

### మానసిక క్షోభ



గాజాలో బంధితులుగా చేపట్టబడిన ఇద్దరు అమ్మాయిల (దఫ్నా–14 ఏళ్లు, ఎలా–8.5 ఏళ్లు) తల్లిగా నేను కచ్చితంగా చెప్పాలనుకుంటున్నది... వాళ్ల ప్రియమైనవాళ్ల కోసం ఎదురు చూస్తున్న కుటుంబాలతో హమాస్ క్రూరమైన మానసిక యుద్ధం కొనసాగిస్తోంది. బంధితులందరినీ హమాస్ వెంటనే విడుదల చేయాలి.

– మాయన్ జిన్, తల్లి

### తలవంపేనా?



ఇటీవలి దక్షిణాఫ్రికా సమావేశాల్లో, 'బ్రిక్స్'ను 5 నుంచి 11 సభ్యదేశాలకు విస్తరించాలని కూటమి నిర్ణయించింది. దానికి నాయకత్వం వహించిన చైనాకు దౌత్యపరమైన ఇబ్బంది కలిగించేలా, అర్జెంటీనా నూతన ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఆ సభ్యత్వం వల్ల పెద్ద ప్రయోజనమేమీ లేదంటూ బ్రిక్స్‌లో చేరిక ఆహ్వానాన్ని అంగీకరించబోనట్టుగా సంకేతాలిచ్చింది.

– బ్రహ్మ చెల్లానీ, వ్యూహాత్మక అంశాల నిపుణుడు

### ఆయనేనా?



ఒక వైద్యుడిగా మీకు రెండు అందమైన పేర్లున్న ఒక వ్యాధిని పరిచయం చేస్తాను: సూడొలాజికల్ ఫాంటాస్టికా లేదా మైథోమేనియా. ఈ వ్యాధి ఉన్నవాళ్లు అలవాటుగా అబద్ధాలాడుతారు. (ఇది చెప్పగానే) ఒక భారతీయుడిగా మీ మనసుకు ఎవరు గుర్తుకు వస్తున్నారో నేను అడగటం లేదు!

– షా ఆలమ్ ఖాన్, కాలమిస్ట్

### ఆత్మీయతే మందు



మీరూ మనుషులే, నేనూ మనిషినే! మీకూ సంతోషమయ జీవితం కావాలి, నాకూ సంతోషమయ జీవితం కావాలి. కానీ ఈ లక్ష్యం కేవలం భౌతిక విలువలతో నెరవేరదు. మనం మరింత దయాపూరితంగా ఉండాలంటే, మనందరికీ ఆత్మీయత కావాలి.

– దలై లామా, బౌద్ధగురువు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

# యువతరంలో అసంతృప్తి

తెలంగాణ రాష్ట్రంలో యువత ఎక్కువ సంఖ్యలో వున్నారు. తాము ఎన్నో ఉద్యమాలు చేసి సాధించిన స్వరాష్ట్రంలో ఉద్యోగాలు వస్తాయని ఆశించారు. కానీ వారి ఆశలు కల్లలయ్యాయి. ఈ పరిస్థితుల్లో వారు బీజేపీ వైపు చూస్తున్నారు. చాప కింద నీరులా యువత బీజేపీ కోసం చాలా గ్రౌండ్ వర్క్ చేస్తున్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో ఎందరో యువత ప్రాణ త్యాగం చేశారు. ఉప్పుడూ నిరుద్యోగంతో యువత ఆత్మహత్యలు చేసుకొంటున్నారు. అంటే ఇప్పటికీ యువత పరిస్థితిలో ఎటువంటి మార్పులేదనే కదా! నిరుద్యోగ యువత దారుణ పరిస్థితికి కారణం అయిన కేసీఆర్‌ను గద్దె దించాలని ఎక్కువ మంది యువత ఆలోచిస్తున్నారు.

స్వరాష్ట్ర సాధన కోసం మొదటి నుండి బీజేపీ పాటుపడింది. అధికారంలోకి వస్తే 'వంద రోజుల్లో తెలంగాణ' అని మేనిఫెస్టోలో బీజేపీ పెట్టడంతో... ఎక్కడ ఆ పార్టీకి తెలంగాణ ఇచ్చిన పేరు వస్తుందో అనే భయంతో కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది. బీజేపీ లేకుంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పడేది కాదు. బీజేపీ నాయకురాలు 'తెలంగాణ చిన్నమ్మ' సుష్మా స్వరాజ్ చేసిన కృషి మరువలేనిది. ఇక్కడి ప్రజల ఆవేదన అర్థం చేసుకున్న ఆమె దేశానికి తెలంగాణ పోరాట స్ఫూర్తిని చాటి చెప్పారు. బీజేపీ లేకుండా తెలంగాణ ఏర్పడేది కాదు. కాంగ్రెస్ ఇచ్చేది కాదు. కాబట్టి తెలంగాణ యువత దేశంలో, రాష్ట్రంలో బీజేపీ సర్కార్లు (డబుల్ ఇంజన్ సర్కార్) ఏర్పడితే రాష్ట్రం అభివృద్ధి అవుతుందని భావిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో తమ ఆవేదనను నిరుద్యోగ యువత ఓటు ద్వారా తెలియచేయాలనుకొంటున్నారు.

కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి కొరకు భారీగా నిధులు కేటాయించింది. రాష్ట్రంలో రహదారుల నిర్మాణంపై దృష్టిపెట్టి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేసింది. ప్రధాన హైవేలను సుందరంగా తీర్చి దిద్దిన కేంద్ర ప్రభుత్వం... గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, గ్రామ, పట్టణ ప్రాంతాల్లో 'వైకుంఠ ధామాల' నిర్మాణం వంటివాటికి కృషి చేసింది. 'ఉపాధి హామీ' పథకం ద్వారా ప్రతి గ్రామానికీ నిధులు కేటాయించినా... కమీషన్లు తీసుకొని నాణ్యమైన పనులు చెయ్యకుండా గ్రామాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం. అందుకే యువత ఈసారి వర్తమాన అధికార పక్షాన్ని వ్యతిరేకిస్తోంది.

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీసీ జనాభా ఎక్కువగా వుంది. అయినా అన్ని రంగాల్లో బీసీలు వెనక్కి నెట్టి వెయ్యబడ్డారు. రాజకీయంగా అణచబడిన బీసీ వర్గం ఆత్మ గౌరవాన్ని నిలబెట్టేలా బీజేపీ తెలంగాణలో అధికారంలోకి వస్తే 'బీసీని ముఖ్యమంత్రిని చేస్తామ'ని ప్రకటించింది. ఇది సామాజిక న్యాయాన్ని అందించడానికి తీసుకున్న కీలక నిర్ణయంగా పేర్కొనవచ్చు. బీసీ సంఘాలు, బీసీల హక్కుల కోసం, ఆత్మ గౌరవం కోసం పోరాటం చేసిన ప్రతి ఒక్కరూ బీజేపీ బీసీ సీఎం హామీకి మద్దతుగా ఉండాలి. గ్రామం, పట్టణం అనే భేదం లేకుండా యువత ప్రజలకు అవగాహన కల్పించి చైతన్య పరచాలి. ఎవరికి ఓటేస్తే ఏమి జరుగుతుందో స్పష్టం చేయాలి.

– జోగినపల్లి శ్రీనివాస్ గౌడ్, బీజేపీ యువ నాయకులు

# కడగండ్లు ఎందుకు తీరడం లేదు?

తెలంగాణలో ఎన్నికల ప్రచారం ముగిసింది. ఈ ఎన్నికల ప్రచారంలో అన్ని రాజకీయ పార్టీలూ సంక్షేమ పథకాల వాగ్దానాలకు సంబంధించిన అడ్వర్టయిజ్‌మెంట్‌లతో హోరెత్తించాయి. అధికారం తమదే అనీ, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే భారీ మెజార్టీ తమకే వస్తుందనీ ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు అంటున్నాయి. కానీ ప్రధాన పోటీ మాత్రం బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య కనిపిస్తున్నది. చివరికి ఈ ఎన్నికల్లో ఏదో ఒక పార్టీకి ఓటు వేయక తప్పదు. ఏదో ఒక పార్టీ గెలవక తప్పదు. ఎందుకంటే మనది ఎన్నికల ప్రజాస్వామ్యం కాబట్టి.

ప్రజాస్వామ్యమంటే ఎన్నికలనే ధోరణి మన సమాజంలో నాటుకుపోయింది. నిజానికి ఎన్నికలు ప్రజాస్వామ్యంలో ఒక భాగం మాత్రమే. ఇవాళ రాజకీయ పార్టీలు రాజ్యాంగబద్ధంగా ప్రజాస్వామ్య పరిధిలో ఏర్పడిన విషయాన్ని మర్చిపోతున్నాయి. తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి.

ఈ దేశంలో పదేపదే ప్రజాస్వామ్యం ఎదురుదెబ్బలు తింటున్నప్పటికీ, ప్రజలు ప్రజాస్వామ్యాన్ని కోరుకుంటున్నారు. ఎందుకంటే అందులో ప్రజలకు మనుగడ ఉంది కాబట్టి. రాజకీయ పార్టీలకు అధికారం మీద ఉన్న మమకారం ప్రజా ప్రాతినిధ్యం మీదా, ప్రజల అభివృద్ధి మీదా ఉండడం లేదని చెప్పవచ్చు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రాతినిధ్య పాలన చాలా విలువైనది. కానీ ప్రాతినిధ్య పాలనను మన రాజకీయ పార్టీలు ఎప్పుడో విస్మరించాయి. ప్రతి ఐదేళ్లకోసారి రాజకీయ పార్టీలు ఎన్నికలు పాల్గొనేది ప్రజాస్వామ్యాన్ని మరింత పటిష్ఠం చేయడం కోసం కాదనీ, అది కేవలం అధికారం కోసమేననీ చెప్పవచ్చు. నేడు అధికారమంటే ఆధిపత్యం చలాయించడం అయ్యింది. కానీ ప్రజాస్వామ్యంలో అధికారమంటే నిర్ణయం. అంటే ప్రజాభివృద్ధి కోసం నిర్ణయాధికారం కలిగి ఉండడం.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి మంచి ఉద్దేశాలు ఉంటే సరిపోవనీ, పటిష్ఠమైన వ్యవస్థలు ఉండాలనీ మన రాజ్యాంగం చెబుతుంది. కానీ మన రాజకీయ పార్టీలు ప్రభుత్వ వ్యవస్థలను నిత్యం నిర్లక్ష్యానికి గురిచేసి, నిర్వీర్యం చేస్తున్నాయి. ఆధునిక మనస్తత్వం లేనిదే ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్మించడం గానీ, స్థిరపరచడం గానీ సాధ్యం కాదంటారు. మన రాజకీయ నాయకుల్లో ఆధునిక మనస్తత్వం కంటే అణచివేత మనస్తత్వమే ఎక్కువగా కనిపిస్తోంది.

ఇక సంక్షేమం విషయానికొస్తే 70 సంవత్సరాల నుంచి ప్రతిసారీ రాజకీయ పార్టీలు సంక్షేమ పథకాల పేరు చెప్పి అధికారంలోకి వస్తున్నాయి. ఇక్కడ సంక్షేమం అంటే కాపాడడం. కాపాడుకోవడం! అంటే సంక్షేమ పథకాల ద్వారా ప్రజలను ఓటర్లుగా



కాపాడుకోవడం. ఓట్లు వేయించుకోవడం! అధికారంలోకి రావడం! ఇదంతా 70 ఏళ్ల నుంచి జరుగుతూ వస్తున్నదే. కానీ సంక్షేమ పథకాల కోసమో, ఆరు గ్యారంటీల కోసమో, బంగారు తెలంగాణ కోసమో మనం రాజ్యాంగం ఏర్పాటు చేసుకోలేదు. రాసుకోలేదు. సార్వభౌమాధికారం కోసం రాజ్యాంగం రాసుకున్నాం. సార్వభౌమాధికారాన్ని స్థాపించడం కోసం ప్రభుత్వం కావాలి. అందుకే మనకు మనం రాజ్యాంగాన్ని సమర్పించుకున్నాం. దానికి సామాజిక న్యాయం, ఆర్థిక న్యాయం, రాజకీయ న్యాయం వంటి లక్ష్యాలను ఏర్పరచుకొన్నాం. దీనికి ప్రాతిపదిక వ్యవస్థను స్థాపించడం కోసం రాజ్యాంగం రాసుకున్నాం. ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకుంటున్నాం. ఆర్థిక, సాంఘిక అసమానతలూ, అవకాశాలు పొందడంలో అసమానతలూ ఇంకా ఉన్నాయి. వాటిని తొలగించాలి. వాటి స్థానంలో సమానత్వ లక్ష్యాన్ని సాధించాలి. సమానత్వాన్ని సాధించాలంటే మన రాజకీయ పార్టీలకు చిత్తశుద్ధి ఉండాలి.

ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు అధికారంలోకి రావడానికి సంక్షేమ పథకాలతో పాటు ఒక భావజాలాన్ని కూడా తీసుకొస్తాయి. 'ఇందిరమ్మ రాజ్యం', 'బంగారు తెలంగాణ', 'రామరాజ్యం' వంటి భావనలు ఇందుకు ఉదాహరణలు. ఇప్పటి వరకు ఈ దేశంలో ఇందిరమ్మ, రామరాజ్యాలను చూశాము. అలాగే ఈ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం, బంగారు తెలంగాణలను చూశాము. కానీ ఇంకా ఈ నేలలో దారిద్ర్యం, పేదరికం, నిరక్షరాస్యత, ఉపాధి లేని జీవితాలూ మిగిలే ఉన్నాయి. అణచివేత, హక్కుల ఉల్లంఘనలు జరుగుతూనే ఉన్నాయి.

ఉపాధి అవకాశాలు కొంతమందికే దక్కుతున్నాయి. అభివృద్ధి పేరుతో కొంతమంది ప్రజలు నిరాశ్రయులవుతున్నారు. వీరికి న్యాయం జరగడం లేదు. భూముల ధరలు పెరగడం అభివృద్ధి అంటున్నారు. కానీ దీనివల్ల పేదవారు ఇల్లు కట్టుకునే పరిస్థితి లేకుండా పోయింది. ఉత్పత్తి పెరిగింది అంటున్నారు. కానీ ధరలు మాత్రం తగ్గడం లేదు.

మా సంక్షేమ పథకాలు మమ్మల్ని మళ్లీ గెలిపిస్తాయని ప్రభుత్వ పెద్ద అంటుంటే, ప్రభుత్వంపై వ్యతిరేకతతో పాటు మా గ్యారెంటీలు మమ్ములను గెలిపిస్తాయని ప్రతిపక్షం నమ్ముతోంది. ఏం జరుగుతుందో చూడాలి. సమాజంలో ఆధునిక మార్పు రావాలంటే యువత భారీ సంఖ్యలో రాజకీయాల్లోకి రావాలి. అప్పుడే మార్పు సాధ్యమవుతుంది.

– ఎ. మల్లేష్, రీసెర్చ్ స్కాలర్, ఉస్మానియా యూనివర్సిటీ । 96038 70734

# అసలైన సంతోషం

ఒక రాజు గారు తన దేశంలో సంతోషంగా, తృప్తిగా జీవిస్తున్న వ్యక్తి ధరించిన చొక్కా తీసుకురమ్మని భటులను పంపారు. అటువంటి వ్యక్తి కోసం వారు దేశమంతా గాలించారు. ఇల్లిల్లూ తిరిగారు. ప్రతి వ్యక్తి తనకు సమస్యలున్నాయనీ, తాను పూర్తి సంతోషంతో లేననీ చెప్పినవారే. భటులు విచారించిన వారిలో అత్యంత ధన సంపన్నులూ, విద్యావేత్తలూ, సామాన్యులూ...అన్ని రకాల వారు ఉన్నారు. భటులు అలా వెతుకుతూ వెతుకుతూ ఒక పూరి గుడిసె చూశారు. ఆ ఇంటిలోని వారితో మాట్లాడలేదని గుర్తించారు.



జ్యోతిర్మయం

కాని, ఆ ఇల్లు చాలా శిథిలావస్థలో ఉంది. తలుపులు ముట్టుకుంటే పడిపోయేట్లు ఉన్నాయి. ఇంతవరకు తాము విచారించిన ఇంతమందిలో లేని తృప్తి, సంతోషం ఈ పేదింట్లో మాత్రం ఎలా ఉంటుంది? ఈ ఇంటిలోకి వెళ్ళటం, అడగటం కూడా అనవసరం అనుకున్నారు. కాని, ప్రతి ఒక్కరినీ కనుక్కోమని రాజాజ్ఞ! రాజుకు ఈ ఇంటిని వదిలేశామని తెలిస్తే తమకు శిక్ష తప్పదు. ఎందుకు అనవసరంగా సమస్య కొని తెచ్చుకోవటం అని వారు ఆ ఇంటిలోనికి వెళ్లారు. ఆ ఇంట్లో ఒక భార్య, భర్త ఉంటున్నారు. భర్త ఒంటి మీద చొక్కా లేదు. మాసిపోయిన పంచె కట్టుకుని ఉన్నాడు. భార్య కూడా ఒక సాదా చీర కట్టుకుని ఉంది. వారు ఆ సమయంలో గంజి తాగుతున్నారు.

వారి పరిస్థితి అర్థమవుతున్నా, భటులు వారిని 'మీరు సంతోషంగా తృప్తిగా జీవిస్తున్నారా? మీకేమైనా ఇబ్బందులున్నాయా?' అని అడిగారు. ఆ వ్యక్తి నవ్వుతూ 'మేము మాకున్నదానితో చాలా సంతోషంగా, తృప్తిగా ఉన్నాము. మాకేం అత్యాశలు లేవ'న్నారు. భటులు చాలా ఆశ్చర్యపోయారు. ఆ వ్యక్తి, 'మీరెవరు, ఎందుకలా అడిగారు?' అనడిగితే భటులు ఇది రాజాజ్ఞ అని చెప్పి, అతని చొక్కా ఒకటి ఇమ్మన్నారు. ఆ వ్యక్తి చిరుగులు పడిన పాత చొక్కా ఇస్తే అది తీసుకుని వెళ్ళిపోయారు.

ఇది కథే అయినా, అత్యాశకు పోకుండా, ఉన్న దానితో సంతోషంగా ఉంటూ, కష్టపడటంలోని ఆనందాన్ని అనుభవిస్తూ జీవించే వారు మన మధ్యా ఉంటారు. వారిదే నిజమైన సంతోషం.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

**గ్రహం అనుగ్రహం**

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** బ.విదియ ప.3.37 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** మృగశిర ప.2.28 వరకు, తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** రా.11.15 నుండి 12.55 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.26 నుండి 12.14 వరకు, **అమృత ఘడియలు:** ఉ.5.26 నుండి 7.03 వరకు.; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 6.16, **సూర్యాస్తమయం:** 5.20.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
బుధవారం ॥ 29-11-2023



# ● దుర్గ రాసింది సీతా చాలీసా!

**హనుమాన్ చాలీసా, సాయి చాలీసా గురించి మనకు తెలుసు. సీతా చాలీసాను రాసి, వినిపిస్తున్నారు డాక్టర్ జిఎల్‌కె దుర్గ. ఆంధ్రమహిళా సభ రిటైర్డ్ ప్రిన్సిపల్ అయిన దుర్గ మోటివేషనల్ స్పీకర్‌గానూ యువతలో స్ఫూర్తిని కలిగిస్తున్నారు. అరవైఏడేళ్ల వయసులో జీవితాన్ని అర్థవంతంగా మార్చుకుంటూ స్ఫూర్తిని కలిగించే ఎన్నో విషయాలు ఇలా మన ముందుంచారు.**



డాక్టర్ జిఎల్‌కె దుర్గ

‘‘నేటి మహిళల పరిస్థితి చూస్తుంటే ఒక పక్కన ఆకాశంలోకి దూసుకుపోతున్నాం... మరోపక్కన అథోలోకంలోకి కూడా వెళుతున్నామా అనిపిస్తుంది. ఓవైపు అమ్మాయిలను ఆకాశం అంత ఎత్తు ఎదగాలని ప్రోత్సహిస్తున్నాం.. మరోవైపు ఇంకా స్త్రీ భ్రూణహత్యలు జరగడం చూస్తున్నాం. మహిళలు ఎదగాలంటే మగవారిలోనూ మార్పు రావాలి. ఇప్పటికన్నా ఇతిహాస కాలం నాటి రోజులను తెలుసుకుంటే నాటి మహిళ తెగువ, సమయస్ఫూర్తి మనకు కనిపిస్తాయి. సీతా చాలీసా స్త్రీ కేంద్రకంగా ఉంటుంది.

### తెలుసుకుంటూ చేసిన ప్రయత్నం

శ్రీరామనవమి కళ్యాణోత్సవానికి మా అత్తగారి ఊరు వెళ్లాం. అక్కడ అమ్మవారికి మంగళసూత్ర ధారణ జరిగేటప్పుడు రామ, హనుమాన్ చాలీసా ఉంది, సీతాచాలీసా గురించి లేదే... అనిపించింది. తిరిగి ఇంటికి వచ్చిన తర్వాత అదే విషయం మనసులో మెదులుతుండటంతో ఇంటర్నెట్‌లో శోధించాను. నాకున్న స్నేహితులు, పెద్దలను అడిగాను. తెలుగులో సీతా చాలీసా లేదు. హిందీలో ఉంది కానీ... బాణీ వేరుగా ఉంది. దీంతో తెలుగులో సీతా చాలీసా రాయాలని నిర్ణయించుకున్నాను. ఇందుకోసం వాల్మీకి రామాయణాన్ని పారాయణ చేస్తూ... అందులో నుంచి సీతాదేవి గురించి ఉన్న వ్యాఖ్యానాలు రాసుకుంటూ వచ్చాను. ఈ ప్రయాణంలో చాలా మంది మిత్రులు, పెద్దలు నాకు సాయం చేశారు. నిజానికి వాల్మీకి మహాకవి, రామాయణ కథానాయిక అయిన సీత గురించి చాలా గొప్పగా... రాముడికి ఏ మాత్రం తీసిపోని విధంగా చెప్పారు. అందం, సుగుణాలలోనే కాదు సహనం, ధైర్యం, తెలివితేటలు, ఔదార్యం, సమయస్ఫూర్తి, మాటలు .. ఇలా అన్నింటిలోనూ ఆమె గొప్పతనం గురించి వివరించారు. సీతాదేవి బాల్యం, యవ్వనం, స్వయంవరం, కల్యాణం, అరణ్యవాసం, అశోకవనం, రావణ వధానంతరం రామునితో తిరిగి అయోధ్య చేరడం, పట్టాభిషేకం, అనంతరం అడవులకు వెళ్లడం, అక్కడినుంచి వాల్మీకి ఆశ్రమం చేరడం, లవకుశలను పెంచడం, చివరగా తల్లి భూదేవిలో కలిసిపోవడం వరకు ఆమె జీవనం ఎంత శక్తిమంతమైనదో... అదంతా చాలీసాలో వచ్చేలా కూర్చాను. బాల్యంలో ఆడుకుంటూ శివధనస్సును ఉంచిన మంజూషను జరిపినది అని ఉంటే.. ‘శివధనస్సును అవలీలగా జరిపిన బాలవు నీవు’ అని, హనుమతో మాట్లాడేటప్పుడు..‘రాముని ధ్యాసే శ్వాసగ నిలిపి తప మొనరించిన తాపసి వీవు’ అని అశోకవనంలో చెప్పడం.. పట్టాభిషేక సమయంలో హనుమకు పుత్రవాత్సల్యంతో ఇచ్చిన అపురూపమైన మణిహారం గురించి .. ఇలా రామాయణంలోని ప్రతి ఘట్టాన్ని ఆమె గుణగణాలను వివరిస్తూ చేసే చాలీసా మనలో ఒక స్ఫూర్తిని నింపుతుంది.



సీతాచాలీసాను బృందగానం చేయిస్తూ...

### నానమ్మ చెప్పిన కథలు..

నేను కామర్స్ సబ్జెక్ట్‌తో పీహెచ్‌డి పూర్తి చేసి, ఆంధ్ర మహిళా సభలో 35 ఏళ్లుగా లెక్చరర్‌గా, ప్రిన్సిపల్‌గా చేసి రిటైర్ అయ్యాను. ఆంధ్ర మహిళాసభ, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభకు వైస్‌ప్రెసిడెంట్‌గా ఉన్నాను. కాలేజీ రోజుల్లో బెస్ట్ స్టూడెంట్ అవార్డ్‌తో పాటు మెరిట్ స్కాలర్‌షిప్‌లు పొందాను. కామర్స్ స్టూడెంట్‌ని అయినా తెలుగు సాహిత్యం అంటే చాలా ఇష్టం. అలా, సంస్కృతం కూడా నేర్చుకున్నాను. అందుకు మా నానమ్మే కారణం. నా చిన్నతనంలో ఆమె ప్రతిరోజూ పడుకునే సమయంలో రామాయణంలోని కథలు చెప్పేది. ఆధ్యాత్మికతను పెంచే గజేంద్ర మోక్షం, రామాయణ, మహాభారతాల గురించి చెప్పేది. ఆ ఆసక్తితోనే పుస్తకాలు చదవడం అలవాటయ్యింది. ఇప్పటికి కూడా ప్రతి రోజూ ఉదయం రెండు గంటల సమయం రాయడానికి కేటాయిస్తే, రాత్రి రెండు గంటల సేపు చదవడానికి కేటాయిస్తాను.

### ప్రభుత్వ స్కూళ్లకు వెళ్లి..

పదేళ్లుగా మోటివేషనల్ స్పీకర్‌గా ఉన్నాను. టీచింగ్ వృత్తిలో కొనసాగడం వల్ల యువతకు, మహిళలకు మంచి విషయాలు నా ద్వారా వెళ్లడం ఒక అదృష్టంగా భావిస్తున్నాను. సమాజంలో మార్పు వచ్చేందుకు చేసే ఏ చిన్న పని అయినా ముందుండేందుకు ప్రయత్నిస్తుంటాను. ఇప్పటికీ ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి, ఆ రోజు ఏ టీచర్ అయితే రాలేదో ఆ స్థానంలో నేను మోటివేషనల్ క్లాస్ తీసుకుంటాను. జైలుకు వెళ్లి అక్కడ ఖైదీలుగా ఉన్న శిక్ష అనుభవిస్తున్న వారికి మంచి విషయాలు చెప్పడానికి ప్రయత్నిస్తుంటాను.

### మహిళల కోసం ప్రత్యేకం..

స్టాండప్ కామెడీ చేస్తుంటాను. స్వచ్ఛంద సంస్థలతో కలిసి సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటాను. అత్తగారు–కోడళ్ల మధ్య ఉండాల్సిన బంధాలు, మహిళల ఆరోగ్యం, చదువుకు సంబంధించిన అవగాహన కార్యక్రమాల్లో పాల్గొనడం, నాదైన బాణీలో నవ్విస్తూనే వారిని వారు దిద్దుకునే ఆలోచన కలిగించడానికి ప్రయత్నిస్తుంటాను. యువత కోసం వివేకానందుని రచనలు చేస్తున్నాను.

ఇటీవల జరిగిన ఓ భక్తి కార్యక్రమంలో సీతా చాలీసాను బృందంగా ఆలపించడంతో ఎన్నాళ్లుగానో నా మనసులో మెదిలిన ఒక ఆలోచన ఇలా రూపుదిద్దుకొని, ప్రజల ముందుకు రావడం ఎంతో ఆనందంగా అనిపించింది. ‘పద్యం, గద్యం ఎరుగని దుర్గకు నిను కొలిచే భాగ్యం దక్కెను’ అని సీతామాతకు వందనం చెప్పాను’’ అని వివరించారు దుర్గ.

– నిర్మలారెడ్డి

---

ట్రెండ్

# ప్లాస్టిక్‌పై కొత్త ఉద్యమం బర్తన్ బ్యాంక్

**పెళ్లి అనగానే డిస్పోజబుల్ ప్లాస్టిక్‌ను విపరీతంగా వాడాల్సి వస్తుంది. ఇది పర్యావరణానికి హాని. అంతే కాదు పల్లెల్లో వాటి వల్ల పేరుకున్న చెత్తతో ఎక్కడలేని మురికి. జబ్బులు. అందుకే ఉత్తరాదిలో చాలామంది మహిళా సర్పంచ్‌లు ‘బర్తన్ బ్యాంక్’ను ఏర్పాటు చేస్తున్నారు. ఊరికి ఇంతని స్టీలు పెళ్లి సామాను ఇచ్చి అందరూ వాటిని ఫ్రీగా వాడుకునేలా చేస్తున్నారు. ఇది దక్షిణాదికి అందుకోవాల్సి ఉంది.**



ఇండోర్‌లో మునిసిపల్ అధికారులు రెగ్యులర్‌గా కేటరింగ్ వాళ్లను, పెళ్లిళ్లు జరిగే ఫంక్షన్ హాళ్లను, రెస్టరెంట్‌లను సందర్శిస్తారు. ఎక్కడైనా ప్లాస్టిక్ వాడితే మొహమాటం లేకుండా ఫైన్ వేస్తారు. ఈ ఫైన్ ఐదు వందలతో మొదలయ్యి 12 లక్షల వరకూ ఉంటుంది. హోటళ్ల వారికి వాళ్లు ఒకటే చెబుతారు– ‘మీరు రోజూ వన్ టైమ్ యూజ్ ప్లాస్టిక్ వాడటం వల్ల చేసే ఖర్చును స్టీలు వాడకం ద్వారా పూర్తిగా తగ్గించవచ్చు’ అని. ఇండోర్‌కు క్లీన్ సిటీగా పేరు ఉంది. ఆ పేరును నిలబెట్టాలని అధికారుల తాపత్రయం. అంతే కాదు, వారు ఒక ‘బర్తన్ బ్యాంక్’ను కూడా ఏర్పాటు చేశారు. బర్తన్ అంటే గిన్నెలు. పెళ్లికి కావాల్సిన వంట, వడ్డన కోసం కావాల్సిన అన్ని పాత్రలు, గ్లాసులు, ప్లేట్లు, గరిటెలు అన్నీ ఒక చోట పెడతారు. 24 గంటల ముందు చెప్పి ఎవరైనా ఉచితంగా తీసుకెళ్లవచ్చు. ఉపయోగించుకున్నాక శుభ్రం చేసి తిరిగి చెల్లించాలి. ఏవైనా డ్యామేజీ అయినా పోయినా డబ్బు కట్టాలి. మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వారు ఈ బ్యాంక్‌కు పోటెత్తుతున్నారు.

### ఇదంతా ఎలా మొదలైంది?

రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒడిషా తదితర రాష్ట్రాలలో కొత్తగా పదవుల్లోకి వచ్చిన మహిళా సర్పంచ్‌లు పల్లెల్లో చెత్తగా పేరుకు పోతున్న ప్లాస్టిక్‌ను చూసి ఇది మొదలెట్టారు. రాజస్థాన్‌లోని జున్‌జును అనే పల్లెకు నీరూ యాదవ్ అనే ఆవిడ సర్పంచ్ అయ్యాక ఈ సంవత్సరం మొదలులో ‘బర్తన్ బ్యాంక్’ మొదలెట్టింది. ఊరి పెద్దలను ధిక్కరించి నిధులను ఇలాంటి పనులకు ఉపయోగించడం మొదలెట్టిన నీరూ యాదవ్ ‘బర్తన్ బ్యాంక్’ వల్ల ఊరు ఎంత శుభ్రంగా ఉంటుందో ప్రాక్టికల్‌గా చూపించాక అందరూ ఆమె నిర్ణయాన్ని అంగీకరించారు. అలా ఈ ఉద్యమం రాజస్థాన్ నుంచి ఇతర రాష్ట్రాలకు వ్యాపించింది.



‘ప్లాస్టిక్ వద్దు చెత్త వద్దు’ నినాదంతో మహిళా సర్పంచ్‌లు తమ గ్రామాల్లో బర్తన్ బ్యాంక్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో గ్రామానికి 1000 స్టీలుప్లేట్లు, రెండు వేల కూర గిన్నెలు, రెండు వేల స్టీలు గ్లాసులు, 2 వేల స్పూన్లు, 50 మంచి నీటి జగ్గులు, ఐదారు వంట డేగిసాలు ఏర్పాటు చేస్తూ... గ్రామంలో ఎవరి ఇంట ఏ శుభకార్యం జరిగినా ఈ బ్యాంక్ నుంచి ఉచితంగా గిన్నెలు పొందే సదుపాయం కల్పిస్తున్నారు. .

### దీదీ బర్తన్‌బ్యాంక్

ఛత్తీస్‌గఢ్‌లోని సర్గుజా జిల్లా అంబికా పూర్‌లో స్వయం ఉపాధి మహిళా బృందాలు తమ ఇళ్లల్లో శుభకార్యాల కోసం ‘దీదీ బర్తన్ బ్యాంక్’ ఏర్పాటు చేసుకున్నారు. అంటే ఈ మహిళల ఈ బ్యాంక్‌లో ఏర్పాటు చేసుకున్న పాత్రలను ఉచితంగా వాడుకోవచ్చు. అయితే రాను రాను జిల్లా అంతా అందరు ప్రజలూ వాడుకునేలా ఈ ‘దీదీ బర్తన్ బ్యాంక్’లు విస్తరించాయి. ‘ప్లాస్టిక్ చెత్త మురుగు నీటికి పెద్ద ప్రతిబంధకం. అది మట్టిలో కలవదు. దానిని రీసైకిల్ చేయడం కూడా వృథా. ఇలాంటి ప్లాస్టిక్‌కు స్టీలు వస్తువులతో విరుగుడు చెప్పాలి’ అంటారు ఈ మహిళలు.

### ఒడిస్సాలో

ఒడిస్సాలో బర్తన్ బ్యాంక్ ఉద్యమం జోరు మీద ఉంది. నౌపాడ జిల్లాలో భలేస్వర్ అనే పంచాయితీ సర్పంచ్ అయిన సరోజ్ దేవి అగర్వాల్ ఊరి పెద్దలను ఎదిరించి మరీ పంచాయితీ నిధుల నుంచి 75 వేలు మంజూరు చేసి ‘బర్తన్ బ్యాంక్’ ఏర్పాటు చేసింది. ‘ప్రతి ఊళ్లో ఇలాంటి బ్యాంక్ ఉండాలి’అంటుందామె.

అయితే ఈ బర్తన్ బ్యాంక్‌లు రెండు విధాలుగా పని చేస్తున్నాయి. కొన్ని చోట్ల కామన్‌గా పాత్రలను ఉంచేస్తే మరికొన్ని చోట్ల ఇంటికి ఇన్నని స్టీలు సామాన్లు ఇచ్చేస్తున్నారు. అంటే పెళ్లికి ఎవరికి పళ్లాలు వాళ్లు తెచ్చుకుని తిని తీసుకెళ్లిపోయేలా. ఇది కూడా బాగానే ఉందంటున్నారు కొందరు.

ఏమైనా ఉత్తరాది సంప్రదాయం దక్షిణాదికి కూడా వ్యాపిస్తే బాగుండు.

---

# జ్ఞాపకాలే ఆకాంక్షగా...



ఆకాంక్ష

మనకు నచ్చిన రంగు రంగుల చాక్లెట్ రేపర్స్ నుంచి మనం ఇష్టపడే వారు ఇచ్చిన పువ్వులు, నెమలీకల వరకు ప్రతి చిన్న వస్తువును పుస్తకాల్లో అపురూపంగా దాచుకునే వాళ్లం. అప్పుడప్పుడు వాటిని చూసుకుని తెగ మురిసిపోయిన సందర్భాలు ఎన్నో. ఇవి కొన్నేళ్లపాటు ఉన్నప్పటికీ తర్వాత ఆ పుస్తకాలను దాచుకునే ప్లేసు లేక వాటన్నింటిని కోల్పోయి బాధపడుతుంటాము. ‘‘ఇక ముందు మీరు దిగులు పడాల్సిన పనిలేదు. మీ చిన్ననాటి జ్ఞాపకాన్ని రెజిన్ ఆర్ట్‌లో ఎప్పటికీ దాచుకోవచ్చు’’ అని చెబుతోంది 31 ఏళ్ల ఆకాంక్ష సెహగల్. గులాబీ రేకులను సైతం ఏళ్లపాటు దాచుకునేలా అందమైన ఆకృతిలో రెజిన్ క్రాఫ్ట్‌ను రూపొందిస్తోంది. రెజిన్ ఆర్టిస్ట్ అయ్యేందుకు ఇండిగో ఉద్యోగాన్నే వదిలేసింది ఆకాంక్ష.

నాగపూర్‌కు చెందిన ఆకాంక్ష సెహగల్ అనుకున్నది సాధించేవరకు కష్టపడుతుంది. ఆ మనస్తత్వమే ఆమెని రెజిన్ క్రాఫ్ట్స్ ఆర్టిస్ట్‌గా మార్చింది. బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో డిగ్రీ పూర్తయ్యాక రేడియో మిర్చిలో సెలబ్రిటీ మేనేజర్‌గా చేరింది. ఎందుకో గానీ ఆ ఉద్యోగం ఆమెకు తృప్తి నివ్వలేదు. దాంతో విమానంలో ఎగరాలని చిన్నప్పటి నుంచి తాను కంటున్న కలలను నెరవేర్చుకునేందుకు విమానంలో ఉద్యోగం చేయాలనుకుంది. అందుకు తగ్గట్టుగా కష్టపడి ఇండిగోలో క్యాబిన్ క్రూ ఉద్యోగాన్ని సాధించింది.

### కల నిజమైనప్పటికీ...

క్యాబిన్ క్రూగా ఎంతో సంతోషంగా సాగిపోతున్న ఆకాంక్షకు క్రూగా కొంతకాలం మాత్రమే పనిచేస్తామని ఆ తరువాత పేపర్ వర్క్ పనిచేయాల్సి ఉంటుంది అని తెలిసింది. అప్పటి దాకా ఉన్న సంతోషం ఆవిరైంది. కొంతకాలం పనిచేసిన తరువాత నేను క్రూ గా ఉండలేను. పేపర్ వర్క్ చేయడం ఇష్టం లేదు. దీంతో తనకు నచ్చిన, ఎప్పటికీ ఉండే వృత్తిని కెరీర్‌గా ఎంచుకోవాలని నిర్ణయించుకుని మళ్లీ కొత్త ఉద్యోగం కోసం ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఒక పక్క క్యాబిన్ క్రూగా బాధ్యతలు నిర్వహిస్తూనే తనకెంతో ఇష్టమైన క్రాఫ్ట్స్‌ను కెరీర్‌గా ఎంచుకుంది.







### యునిక్ రెజిన్ క్రియేషన్స్..

చిన్నప్పటి నుంచి ఆర్ట్స్‌పై మక్కువ ఉన్న ఆకాంక్ష.. తనకి కాబోయే భర్తకు రెజిన్ క్రాఫ్ట్ తయారు చేసి బహుమతిగా ఇచ్చింది. అది చూసిన ఆకాంక్ష కాబోయే భర్త చాలా బావుంది. రెజిన్ క్రాఫ్ట్స్ తయారీలో నీకు మంచి నైపుణ్యం ఉంది. క్రాఫ్ట్స్ కోర్సు చెయ్యి అని ప్రోత్సహించాడు. దీంతో ఇండిగోలో ఉద్యోగం చేస్తూనే చిన్నచిన్న రెజిన్ క్రాఫ్ట్స్ తయారు చేయడం మొదలు పెట్టింది. ఈ క్రాఫ్ట్స్‌ను మరింత నాణ్యంగా తయారు చేసేందుకు ఇండిగో ఉద్యోగాన్ని వదిలేసి యూనిక్ రెజిన్ క్రియేషన్స్ పేరిట బ్రాండ్‌ను ప్రారంభించింది. తడిసినా పాడవకుండా ఉండే రెజిన్ పదార్థానికి రంగులు జోడించి అందమైన ఆకృతుల్లో ప్రత్యేకంగా ఉండే గిఫ్ట్స్ తయారు చేసి విక్రయించడం మొదలు పెట్టింది. ప్రారంభంలో అనేక సవాళ్లు ఎదురైనప్పటికీ కుటుంబం సహాయంతో తన బ్రాండ్‌ను చక్కగా నిర్వహిస్తోంది ఆకాంక్ష.





### మరింత ప్రత్యేకంగా...

మిగతా బహుమతుల కంటే రెజిన్‌క్రాఫ్ట్స్ ద్వారా అపురూప జ్ఞాపకాలను భద్రపరుచుకోవచ్చు. పెళ్లిదండలు, ఇష్టమైన వారు ఇచ్చిన పూలు, వాటి తాలుకా రేకులు, పుష్పగుచ్ఛాలు, శిశువు బొడ్డు తాడు వంటి వాటిని మరింత ప్రత్యేకంగా దాచుకునేలా రూపొందిస్తోంది. ఈ క్రాఫ్ట్స్ ఆకర్షణీయంగా ఉండడంతో కస్టమర్లు ఎగబడి మరీ ఆర్డర్లు ఇస్తున్నారు ఆకాంక్షకు.

ఇంత చిన్నవయసులో రెండు ఉద్యోగాలను అవలీలగా సాధించి, తనని తాను నిరూపించుకుంది. చివరికి తనకెంతో ఇష్టమైన క్రాఫ్ట్స్‌ను తయారు చేస్తూ రెజిన్ క్రాఫ్ట్ ఆర్టిస్ట్‌గా మారి ఎంతోమంది యువతీ యువకులకు ప్రేరణగా నిలుస్తోంది.

---

# ఇన్‌ఫ్లూయెన్సర్ టు ఎంటర్‌ప్రెన్యూర్

యూత్ పల్స్

**‘ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించడం అంటే మాటలా?’ అన్నది ఒకప్పటి మాట. మాటల మాంత్రికులైన యువ సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌లు కలర్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్ కలలు కంటున్నారు. ‘వ్యాపారం అంటే మాట్లాడినంత తేలిక కాదు’ అనే విమర్శను దాటి ఇన్‌ఫ్లూయెన్సర్‌లుగా తమ అనుభవాన్ని ఉపయోగించి ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా గెలుపు జెండా ఎగరేస్తున్నారు.**





బ్రాండ్స్ ద్వారా గుర్తింపు పొందిన యంగ్ ఇన్‌ఫ్లూయెన్సర్‌లు ఆ తరువాత తామే ఒక బ్రాండ్‌గా మారుతున్నారు. మాసివ్ ఆన్‌లైన్ ఫాలోయింగ్‌తో ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా మారుతున్నారు.

ఫ్యాషన్, బ్యూటీ అండ్ లైఫ్‌స్టైల్ యూ ట్యూబర్ జ్యోతీ సేథీ ఎంటర్‌ప్రెన్యూర్‌గా అడుగులు వేస్తోంది. కొన్ని నెలల క్రితం ‘అభారి’ పేరుతో శారీ బ్రాండ్‌ను లాంచ్ చేసింది. వివిధ ప్రాంతాలలో ఎగ్జిబిషన్‌లు ఏర్పాటు చేసింది. తక్కువ సమయంలోనే ఎంటర్‌ప్రెన్యూర్‌గా సక్సెస్ అయింది.

‘సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయడం కంటే ముందు వివిధ ప్రాంతాలలో ఎగ్జిబిషన్‌లను ఏర్పాటు చేయడం వల్ల కస్టమర్‌ల పల్స్ తెలుసుకోగలిగాను. వారి నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్ నాకు ఎంతో ఉపయోగపడింది’ అంటుంది జ్యోతి సేథీ.

ముంబైకి చెందిన సంజయ్ థీర్ ఆరో తరగతిలోనే వంట చేయడం నేర్చుకున్నాడు. హోటల్ మేనేజ్‌మెంట్ చదువుకున్న సంజయ్ ఫుడ్‌కు సంబంధించి యూట్యూబ్ చానల్ ‘యువర్ ఫుడ్ ల్యాబ్’ ప్రారంభించాడు. 13 మిలియన్‌ల ఫాలోవర్‌లతో దూసుకుపోయాడు. మూడు నెలల క్రితం కిచెన్ అండ్ హోమ్ అప్లయెన్స్ బ్రాండ్ ‘వైఎఫ్ఎల్ హోమ్’ను స్టార్ట్ చేశాడు.

‘ఒక వీడియోను రూపొందించడానికి కొన్ని రోజుల సమయం పడుతుంది. ఒక బ్రాండ్‌ను నిర్మించడానికి మాత్రం నెలలు, సంవత్సరాలు కూడా పట్టవచ్చు. ఇది పెద్ద సవాలు. ఆ సవాలును ఓపికతో మాత్రమే స్వీకరించాలి. కంటెంట్ క్రియేటర్‌గా నాకు అడ్వాంటేజ్ ఉండొచ్చు. అయితే ప్రాడక్ట్ మాట్లాడాలి’ అంటున్నాడు సంజయ్ థీర్.

ఇన్‌ఫ్లూయెన్సర్‌గా తనకు ఉన్న పది సంవత్సరాల అనుభవంతో రెండు సంవత్సరాల క్రితం ‘వియరీఫెడ్’ అనే బ్యూటీ బ్రాండ్‌ను స్టార్ట్ చేసి సక్సెస్ అయింది అనమ్ చష్మావాలా. తన స్కిన్ టోన్‌కు మ్యాచ్ అయ్యే లిప్‌స్టిక్ గురించి ఎంత వెదికినా ఎక్కడా కనిపించలేదు. ఈ నిరాశ నుంచే బ్రాండ్ ఆలోచన చేసింది. అయిదు సంవత్సరాల రీసెర్చ్ తరువాత తన బ్రాండ్‌ను పట్టాలకెక్కించింది.

26 సంవత్సరాల హిమాద్రి పటేల్ ఇన్ఫోసిస్‌లో చేస్తున్న ఉద్యోగాన్ని వదులుకొని ఫ్యాషన్ అండ్ లైఫ్‌స్టైల్ ఇన్‌ఫ్లూయెన్సర్‌గా మారింది. ఇన్‌ఫ్లూయెన్సర్‌గా సక్సెస్ అయిన తరువాత ఎత్నిక్ క్లాతింగ్ బ్రాండ్ ‘డ్రై బై హిమాద్రి’ స్టార్ట్ చేసింది.

కంటెంట్ క్రియేటర్‌గా ప్రయాణం ప్రారంభించిన రణ్‌వీర్ అల్హబాదియా పాడ్‌కాస్ట్ షో ‘ది రణ్‌వీర్ షో’తో డిజిటల్ ప్రపంచంలో సుపరిచితుడయ్యాడు. కాలేజి ఫ్రెండ్ విరాజ్ సేథ్‌తో కలిసి ‘మాంక్ ఎంటర్‌టైన్‌మెంట్’ కంపెనీ ప్రారంభించి విజయం సాధించాడు. ఫ్యాషన్ సెన్స్, ఫన్–లవ్ కంటెంట్‌తో కంటెంట్ క్రియేటర్‌గా పేరు తెచ్చుకున్న దీక్షా ఖురానా ‘డీక్లాతింగ్’ పేరుతో క్లాతింగ్ బ్రాండ్‌ను స్టార్ట్ చేసి సక్సెస్ అయింది.

ఇన్‌ఫ్లూయెన్సర్‌గా పేరు తెచ్చుకున్నవారికి ఎంటర్‌ప్రెన్యూర్‌గా నిలదొక్కుకోవడం అంత తేలిక కాదు.

‘సక్సెస్‌ఫుల్ బ్రాండ్‌లను క్రియేట్ చేయడానికి మౌలిక సదుపాయాల కొరత ఇన్‌ఫ్లూయెన్సర్‌లకు అడ్డంకిగా ఉంది’ అంటున్నాడు ఇన్‌ఫ్లూయెన్సర్ మార్కెటింగ్ ప్లాట్‌ఫామ్ ‘వన్ ఇంప్రెషన్’ సీయీవో అపాక్ష్ గుప్తా.

అంతమాత్రాన ‘ఇది మన స్పేస్ కాదు’ అనుకోవడం లేదు, అధైర్యపడడం లేదు యువ ఇన్‌ఫ్లూయెన్సర్‌లు. ఒక్కో అడుగు వేసుకుంటూ నడకలో వేగం పెంచుతున్నారు. ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా విజయం సాధిస్తున్నారు.



### కలా నిజమా అనుకున్నాను

నా బ్రాండ్‌కు ఆర్డర్లు మొదలై, పెరుగుతూ పోతున్న క్రమంలో ‘ఇది కలా నిజమా?’ అనుకున్నాను. ఈ విజయం నాకు బాగా ఉత్సాహాన్ని ఇచ్చింది. ‘ఇంకా ఏం చేయవచ్చు’ అని రక రకాలుగా ఆలోచించేలా చేసింది. ఇన్‌ఫ్లూయెన్సర్‌తో పోల్చితే ఎంటర్‌ప్రెన్యూర్‌గా బాగా కష్టపడాలి.

– అనమ్ చష్మవాలా,
బ్యూటీ బ్రాండ్ ‘వియరీఫెడ్’ ఫౌండర్

### ఆ కష్టమే ఇక్కడ కూడా...



వ్యాపారరంగంలోకి అడుగు పెట్టాలని ఎప్పటి నుంచో అనుకున్నాను. అయితే ముందుగా ఇన్‌ఫ్లూయెన్సర్, కంటెంట్ క్రియేటర్‌గా నాకంటూ పేరు తెచ్చుకోవాలనుకున్నాను. ఆ తరువాత వ్యాపారం వైపు అడుగులు వేశాను. యూట్యూబ్ ద్వారా ఒక కంపెనీ ఎలా మొదలు పెట్టాలి? జీఎస్‌టీ నంబర్ అంటే ఏమిటి... మొదలైన విషయాలను తెలుసుకున్నాను. మొదట్లో కొన్ని పొరపాట్లు జరిగాయి. అయితే వాటి నుంచి విలువైన విషయాలు నేర్చుకున్నాను. ఇన్‌ఫ్లూయెన్సర్‌గా పేరు తెచ్చుకోవడానికి ఎంతో కష్టపడ్డాను. అలాంటి కష్టమే వ్యాపారంలో పెడితే విజయం సాధిస్తాను అని నమ్మాను. ప్రజల నమ్మకాన్ని చూరగొనడం అనేది అది పెద్ద విజయం.

– జ్యోతి సేథీ, క్లాత్ బ్రాండ్ ‘అభారీ’ ఫౌండర్



### ట్రెండ్ సెట్ చేయాలి

ఫ్యాషన్ అండ్ లైఫ్ స్టైల్‌కు సంబంధించి సుపరిచిత బ్రాండ్‌లతో కలిసి పనిచేయడం ద్వారా ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోగలిగాను. ఆ తరువాత సొంతంగా ‘డీక్లాతింగ్’ క్లాతింగ్ బ్రాండ్‌ను స్టార్ట్ చేశాను. బ్రాండ్ స్టార్ట్ చేయడానికి ముందు ‘నా బ్రాండ్ ట్రెండ్ సెట్ చేయాలి’ అనుకున్నాను. అందరిలో ఒకరిగా కాకుండా మనదైన ప్రత్యేకతను సృష్టించుకున్నప్పుడు మాత్రమే మార్కెట్‌లో నిలదొక్కుకోగలం.

– దీక్షా ఖురానా,
క్లాతింగ్ బ్రాండ్ ‘డీక్లాతింగ్’ ఫౌండర్

**స్టాక్ మార్కెట్లు**

| దేశీ సూచీలు | సెన్సెక్స్ ▲ | నిఫ్టీ ▲ |
|---|---|---|
| | 204 | 95 |
| | 66,174 | 19,890 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

| విదేశీ సూచీలు (తాలి రెండు సోమవారం ముగింపు) | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 14,241 | ▽ | 10 |
| డోజోన్స్ | 35,333 | ▽ | 57 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,431 | ▽ | 30 |
| డాక్స్ | 15,937 | ▽ | 29 |
| షాంఘై | 3,039 | ▲ | 7 |
| నికాయ్ | 33,408 | ▽ | 39 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

**ఫారెక్స్ రేట్లు** రూ. లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఒకటికి | 82.62 | 84.29 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఒకటికి | 103.73 | 107.11 |
| € | యూరో | ఒకటికి | 89.88 | 92.96 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఒకటికి | 55.49 | 57.19 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఒకటికి | 53.52 | 55.90 |
| S$ | సింగపూర్ డాలర్ | ఒకటికి | 54.31 | 56.78 |
| SAR | సౌదీ రియాల్ | పదింటికి | 21.19 | 22.86 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | పదింటికి | 21.79 | 22.99 |
| ¥ | చైనా యువాన్ | పదింటికి | 10.49 | 12.58 |

## 70 లక్షల మొబైల్ నంబర్స్ రద్దు

**అనుమానాస్పద లావాదేవీలు కారణం**



**న్యూఢిల్లీ:** డిజిటల్ మోసాలకు చెక్ చెప్పే దిశగా 70 లక్షల మొబైల్ నంబర్లను సస్పెండ్ చేసినట్లు కేంద్ర ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి వివేక్ జోషి తెలిపారు. ఆయా నంబర్లపై అనుమానాస్పద లావాదేవీలను గుర్తించడమే ఇందుకు కారణమని ఆయన పేర్కొన్నారు. ఆర్థికాంశాలకు సంబంధించిన సైబర్ భద్రత, డిజిటల్ పేమెంట్ల మోసాలు పెరుగుతుండటం తదితర అంశాలపై నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న అనంతరం ఆయన ఈ విషయాలు తెలిపారు. ఇటువంటి సమావేశాలు మరిన్ని నిర్వహించనున్నట్లు, జనవరిలో తదుపరి భేటీ ఉండనున్నట్లు జోషి చెప్పారు. మోసాల బారిన పడకుండా అమాయక కస్టమర్లను కాపాడేందుకు సైబర్ మోసాల గురించి అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. డిజిటల్ పేమెంట్ మోసాలు, వాటిని కట్టడి చేయడంలో ఎదురవుతున్న సవాళ్లపై ఇండియన్ సైబర్ క్రైమ్ కో–ఆర్డినేషన్ సెంటర్ ఈ సమావేశంలో ప్రెజెంటేషన్ ఇచ్చింది.

## బెంగళూరులో ఏఎండీ గ్లోబల్ డిజైన్ సెంటర్



**న్యూఢిల్లీ:** అమెరికా సెమీకండక్టర్ దిగ్గజం ఏఎండీ తాజాగా బెంగళూరులో గ్లోబల్ డిజైన్ సెంటర్‌ను ప్రారంభించింది. 5,00,000 చ.అ. విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన క్యాంపస్‌ను ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రారంభించినట్లు కంపెనీ వివరించింది. ఇది తమకు అతి పెద్ద గ్లోబల్ డిజైన్ సెంటర్ అని తెలిపింది. భారత్‌లో 400 మిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసే ప్రణాళికల్లో భాగంగా ఏఎండీ దీన్ని ఏర్పాటు చేసింది. రాబోయే రోజుల్లో ఈ సెంటర్‌లో 3,000 మంది ఇంజనీర్లు ఉంటారని కంపెనీ తెలిపింది. 3డీ స్టాకింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్‌తో పాటు సెమీకండక్టర్ టెక్నాలజీ డిజైనింగ్, అభివృద్ధి కార్యకలాపాలపై దృష్టి పెట్టనున్నట్లు వివరించింది.

# భారత్‌లో మరో 1.6 బిలియన్ డాలర్లు

### విస్తరణ బాటలో ఫాక్స్‌కాన్

- ఇప్పటికే 8 బిలియన్ డాలర్ల పెట్టుబడులు
- చైనా ప్లస్ వన్ వ్యూహంలో భాగం

**ముంబై:** ఐఫోన్ల కాంట్రాక్ట్ తయారీ సంస్థ, తైవాన్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఫాక్స్‌కాన్ భారత్‌లో తమ కార్యకలాపాలను మరింతగా విస్తరించడంపై దృష్టి పెడుతోంది. ఈ క్రమంలో తాజాగా మరో 1.6 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 13 వేల కోట్లు) ఇన్వెస్ట్ చేయనున్నట్లు తైవాన్‌లోని స్టాక్ ఎక్స్ఛేంజీలకు సంస్థ తెలియజేసింది. భారత్‌లోని తమ అనుబంధ సంస్థ హాన్ హాయ్ టెక్నాలజీ ఇండియా మెగా డెవలప్‌మెంట్ ద్వారా పెట్టుబడులు పెట్టనున్నట్లు పేర్కొంది. చైనాకు మాత్రమే పరిమితం కాకుండా కార్యకలాపాలను ఇతర దేశాలకు కూడా మళ్లించే వ్యూహంలో భాగంగా (చైనా ప్లస్ వన్) కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అమెరికా–చైనా మధ్య ఉద్రిక్తతలు పెరుగుతుండటం తరచుగా సమస్యలకు దారి తీస్తున్న నేపథ్యంలో ఇది ప్రాధాన్యం సంతరించుకుంది. ఫాక్స్‌కాన్ ఇప్పటికే భారత్‌లో దాదాపు 8 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసింది. భారత మార్కెట్లో అవకాశాల రీత్యా ఇక్కడ తమ పెట్టుబడులను గతేడాదితో పోలిస్తే మరింతగా పెంచుకునే అవకాశం ఉందని కంపెనీ చైర్మన్ యంగ్ లియు ఇటీవలే తెలిపారు.




**ఐఫోన్ల తయారీలో టాప్..**

అమెరికా టెక్ దిగ్గజం యాపిల్‌కు అత్యధికంగా ఐఫోన్‌లను సరఫరా చేసే కాంట్రాక్ట్ తయారీ సంస్థల్లో ఫాక్స్‌కాన్‌ది అగ్రస్థానం. భారత్‌లోనూ పోటీ సంస్థలైన టాటా, పెగాట్రాన్‌కు మించి ఉత్పత్తి చేస్తోంది. ఫాక్స్‌కాన్ ఆదాయంలో దాదాపు సగభాగం ఐఫోన్ల తయారీ ద్వారానే ఉంటోంది. కంపెనీకి భారత్‌లో 40,000 మంది పైగా వర్కర్లు ఉన్నారు. ఇక్కడ మొత్తం 30 ఫ్యాక్టరీలు ఉండగా, ఏటా దాదాపు 10 బిలియన్ డాలర్ల ఆదాయం వస్తోంది. 2022లో ఫాక్స్‌కాన్ ఆదాయం 216 బిలియన్ డాలర్లు కాగా అందులో భారత విభాగం వాటా 4.6%గా నమోదైంది. అంతక్రితం ఏడాది 2021లో ఇది 2%గా ఉండేది. తమిళనాడులోని కాంచీపురం జిల్లాలో ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ కోసం మరో ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని ఫాక్స్‌కాన్ యోచిస్తోంది. అటు కర్ణాటకలో రూ. 8,800 కోట్లతో ఐఫోన్ విడిభాగాల యూనిట్ నెలకొల్పే యోచన కూడా ఉంది. ఇందుకు తుమకూరులోని జపాన్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌లో స్థలాన్ని కూడా అధికారులు పరిశీలించినట్లు సమాచారం. కొత్తగా ప్రతిపాదించిన 1.6 బిలియన్ డాలర్ల పెట్టుబడి ప్రణాళికల్లోనే ఈ ఇన్వెస్ట్‌మెంట్ కూడా భాగంగా ఉండొచ్చని భావిస్తున్నారు. ఈ ఫ్యాక్టరీతో కొత్తగా 14,000 పైచిలుకు ఉద్యోగాల కల్పన జరగవచ్చని అంచనా. ఇందులో ఫోన్ స్క్రీన్‌లు, వెలుపలి కవరింగ్‌లు తయారు చేసే అవకాశం ఉంది.

### సెమీకండక్టర్లపైనా దృష్టి..

భారత్‌లో తొలి సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు ఫాక్స్‌కాన్ సైతం పోటీపడుతోంది. ఇందుకోసం ముందుగా వేదాంత సంస్థతో జట్టు కట్టినప్పటికీ, తర్వాత ఆ జాయింట్ వెంచర్ నుంచి పక్కకు తప్పుకుంది. భారతీయ భాగస్వామి అవసరం లేకుండా సొంతంగానే ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తోంది. ఇందుకు సంబంధించి తమ ఫ్యాబ్ యూనిట్ ప్లాన్‌కి ఆమోదం పొందేందుకు ప్రభుత్వంతో చర్చలు కూడా జరుపుతున్నట్లు కంపెనీ గతంలో తెలిపింది.

## డెట్ మార్కెట్లో ఎఫ్‌పీఐల జోరు

**నవంబర్‌లో రూ. 12,400 కోట్లు**



**న్యూఢిల్లీ:** దేశీ రుణ సెక్యూరిటీల (డెట్) మార్కెట్లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) భారీగా ఇన్వెస్ట్ చేస్తున్నారు. ఈ నెల (నవంబర్ 27)లో ఇప్పటి వరకూ రూ. 12,400 కోట్ల విలువైన పెట్టుబడులు చేపట్టారు. గత రెండేళ్లలో ఇవి అత్యధికంకాగా.. ఆకర్షణీయ ఈల్డ్స్ ప్రభావం చూపుతున్నాయి. వర్ధమాన మార్కెట్ల జేపీ మోర్గాన్ గవర్నమెంట్ బాండ్ ఇండెక్స్‌లో దేశీ జీసెక్యూరిటీలను చేర్చడం ఇందుకు తోడ్పాటునిస్తున్నట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ కేలండర్ ఏడాది(2023) ప్రారంభంనుంచీ ఎఫ్‌పీఐలు దేశీ డెట్ మార్కెట్లపట్ల ఆసక్తి చూపుతున్నట్లు తెలియజేశారు. వెరసి మార్చి మినహా ఏడాది పొడవునా ఇన్వెస్ట్ చేస్తున్నట్లు తెలియజేశారు. మార్చిలో మాత్రం నికరంగా రూ. 2,505 కోట్ల పెట్టుబడులు వెనక్కి తీసుకున్నారు. కాగా.. తాజా పెట్టుబడులతో కలిపి రుణ సెక్యూరిటీలలో ఎఫ్‌పీఐల ఇన్వెస్ట్‌మెంట్స్ రూ. 47,900 కోట్లకు చేరినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ బాటలో 2021 సెప్టెంబర్ (రూ. 12,804 కోట్లు) తదుపరి తిరిగి ఈ నెలలో అత్యధికంగా రూ. 12,400 కోట్లు ఇన్వెస్ట్ చేశారు.

# 2 నెలల గరిష్టానికి నిఫ్టీ

**మళ్లీ 66 వేల పైకి సెన్సెక్స్**



**ముంబై:** అదానీ గ్రూప్ షేర్లు అదరగొట్టడంతో మంగళవారం నిఫ్టీ 95 పాయింట్లు పెరిగి 2 నెలల గరిష్ట స్థాయి 19,890 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 204 పాయింట్లు బలపడి 66,174 వద్ద నిలిచింది. క్రూడాయిల్ ధరలు దిగిరావడంతో ఇంధన షేర్లు రాణించడం కూడా కలిసొచ్చింది. ఉదయం స్వల్ప లాభాల్లో మొదలైన సూచీలు రోజంతా పరిమిత శ్రేణిలో కదలాడాయి. ట్రేడింగ్ చివర్లో ఆటో, విద్యుత్, మెటల్ షేర్లకు డిమాండ్ లభించడంతో ఒక దశలో సెన్సెక్స్ 286 పాయింట్లు పెరిగి 66,064 వద్ద, నిఫ్టీ 122 పాయింట్లు బలపడి 19,917 వద్ద ఇంట్రాడే గరిష్టాలను నమోదు చేసింది. ఎఫ్‌ఎంసీజీ, ఫార్మా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.784 కోట్ల షేర్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,325 కోట్ల షేర్లు కొన్నారు. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

హిండెన్‌బర్గ్ ఆరోపణలు పరిశీలించాలంటూ కోరుతూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీం కోర్టు తీర్పు రిజర్వ్ చేయడం అదానీ గ్రూప్‌లోని 10 కంపెనీల షేర్లూ లాభాల్లో ముగిశాయి. అత్యధికంగా అదానీ టోటల్ గ్యాస్ 20% ర్యాలీ చేసింది. అదానీ గ్రీన్ సొల్యూషన్స్ 19%, అదానీ గ్రీన్ 12%, ఎన్‌డీటీవీ 12%, అదానీ విల్మార్ 10%, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 9% చొప్పున లాభపడ్డాయి. అదానీ పోర్ట్స్ 5%, అంబుజా సిమెంట్స్ 4%, ఏసీసీ సిమెంట్స్ 3% పెరిగాయి. ఫలితంగా గ్రూప్ కంపెనీల సంయుక్త మార్కెట్ క్యాపిటలైజేషన్ మంగళవారం ఒక్కరోజే రూ. ఒక లక్ష కోట్లకు పైగా పెరిగి రూ.11.31 లక్షల కోట్లకు చేరింది.

# వాహనాలకు పండుగ గిరాకీ..

- 42 రోజుల్లో 37.93 లక్షల ఆటో మొబైల్ అమ్మకాలు
- డీలర్ల సమాఖ్య ఫాడా గణాంకాలు వెల్లడి

**న్యూఢిల్లీ:** ఈ ఏడాది పండుగ సీజన్‌లో దేశీయంగా 37,93,584 వాహనాలు అమ్ముడైనట్లు వాహన డీలర్ల సమాఖ్య ఫాడా వెల్లడించింది. గతేడాదితో పోలిస్తే 19% వృద్ధి నమోదైనట్లు తెలిపింది. వ్యవస్థలో నెలకొన్న బలమైన డిమాండ్ ఇందుకు కారణమని చెప్పుకొచ్చింది. నవరాత్రి ఉత్సవాలు ప్రారంభ రోజైన అక్టోబర్ 15 నుంచి నవంబర్ 25 వరకు(42 రోజులు) జరిగిన విక్రయాలకు సంబంధించిన గణాంకాలు ఫాడా మంగళవారం విడుదల చేసింది. ట్రాక్టర్లు మినహా అన్ని వాహన విభాగాల్లో గణనీయమైన వృద్ధి నమోదైనట్లు వివరించింది.



- ప్యాసింజర్ వాహన అమ్మకాలు 4,96,047 నుంచి 10% పెరిగి 5,47,246కి చేరాయి. ''సీజన్ తొలినాళ్లలో స్తబ్దుగా ఉన్న విక్రయాలు దీపావళి నుంచి భారీగా పుంజుకున్నాయి. స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్స్(ఎస్‌యూవీ)లకు భారీగా డిమాండ్ లభించింది'' అని ఫాడా అధ్యక్షుడు మనీష్ రాజ్ సిన్హా తెలిపారు.
- ద్విచక్ర వాహన విక్రయాలు 21% వృద్ధి పెరిగి 23,96,665 నుంచి 28,93,107 యూనిట్లకు చేరాయి. గ్రామీణ ప్రాంతం గిరాకీ పుంజుకోవడంతో రికార్డు స్థాయి విక్రయాలు జరిగినట్లు సిన్హా పేర్కొన్నారు.
- వాణిజ్య వాహన అమ్మకాలు 8% వృద్ధి చెంది 1,23,784 యూనిట్లకు చేరాయి.
- వార్షిక ప్రాతిపదికన త్రిచక్ర వాహన విక్రయాలు 41% పెరిగి 1,01,052 యూనిట్ల నుంచి 1,42,875 యూనిట్లకు చేరాయి.
- ట్రాక్టర్ల అమ్మకాల్లో 0.44% క్షీణత నమోదైంది. గతేడాదిలో 86,951 ట్రాకర్లు అమ్ముడవగా, ఈసారి 86,572 యూనిట్లకు పరిమితమయ్యాయి. దసరా సమయంలో 8.3% క్షీణత నమోదైన ట్రాకర్ల విక్రయాలు సీజన్ చరమాంకానికి భారీ రికవరీ సాధించాయని సిన్హా వివరించారు.

---





# జాబ్ పాయింట్

### ఎయిమ్స్ సంస్థల్లో 3036 నాన్ ఫ్యాకల్టీ పోస్టులు

న్యూఢిల్లీలోని కామన్ రిక్రూట్‌మెంట్ ఎగ్జామినేషన్ ఫర్ ఎయిమ్స్ (సీఆర్‌ఈ–ఎయిమ్స్).. ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌తోపాటు దేశవ్యాప్తంగా ఉన్న ఎయిమ్స్ సంస్థల్లో నాన్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, అసిస్టెంట్ డైటీషియన్, అసిస్టెంట్ ఇంజనీర్, అసిస్టెంట్ లాండ్రీ సూపర్‌వైజర్, అసిస్టెంట్ స్టోర్ ఆఫీసర్, ఆడియోలజిస్ట్ అండ్ స్పీచ్ థెరపిస్ట్, బయో మెడికల్ ఇంజనీర్, క్యాషియర్, కోడింగ్ క్లర్క్, డార్క్‌రూమ్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, డెంటల్ హైజీనిస్ట్, డైటీషియన్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి మెట్రిక్యులేషన్/పదో తరగతి, ఐటీఐ, 12వ తరగతి/ఇంటర్, సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా, పీహెచ్‌డీ, టైపింగ్/డ్రైవింగ్ సర్టిఫికేట్ కలిగి ఉండాలి.
» **ఎంపిక విధానం:** సీబీటీ రాతపరీక్ష/స్కిల్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 01.12.2023
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 06.12.2023 నుంచి 07.12.2023
» **అడ్మిట్ కార్డుల జారీ:** 12.12.2023.
» **పరీక్ష తేదీలు:** 18.12.2023 నుంచి 20.12.2023 వరకు
» **వెబ్‌సైట్:** www.aiimsexams.ac.in

### ఏఏఐసీఎల్ఏఎస్, న్యూఢిల్లీలో 906 సెక్యూరిటీ స్క్రీనర్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఏఏఐ కార్గో లాజిస్టిక్స్ అండ్ అలైడ్ సర్వీసెస్ కంపెనీ లిమిటెడ్ (ఏఏఐసీఎల్ఏఎస్).. దేశవ్యాప్తంగా ఏఏఐసీఎల్ఏఎస్ కేంద్రాల్లో ఫిక్స్‌డ్ టర్మ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన సెక్యూరిటీ స్క్రీనర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 906
» **అర్హత:** కనీసం 60 శాతం మార్కులు(ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 55 శాతం)తో ఏదైనా గుర్తింపు పొందిన బోర్డు/యూనివర్శిటీ/సంస్థ నుంచి గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులవ్వాలి. ఇంగ్లిష్, హిందీ లేదా స్థానిక భాషతో మాట్లాడే సామర్థ్యం కలిగి ఉండాలి. **వయసు:** 01.11.2023 నాటికి 27 ఏళ్లు మించకూడదు.
» **పోస్టింగ్ స్థలం:** చెన్నై, కోల్‌కతా, గోవా, కోజికడ్ (కాలికట్), వారణాసి, శ్రీనగర్, వడోదర, మధురై, తిరుపతి, రాయ్‌పూర్, వైజాగ్, ఇండోర్, అమృత్‌సర్, భువనేశ్వర్, అగర్తల, పోర్ట్ బ్లెయిర్, తిరుచ్చి, డెహ్రాడూన్, పుణె, సూరత్, లేహ్ శ్రీనగర్, పాట్నా.
» **వేతనం:** నెలకు రూ.30,000 నుంచి రూ.34,000
» **ఎంపిక విధానం:** డిగ్రీ మార్కులు, ఐ/కలర్ బ్లైండ్‌నెస్ ఎగ్జామ్, ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 08.12.2023
» **వెబ్‌సైట్:** www.aaiclas.aero

### ఏపీ సివిల్ సప్లైస్, పార్వతీపురంలో టెక్నికల్ అసిస్టెంట్ గ్రేడ్3 పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ లిమిటెడ్.. పార్వతీపురం మన్యం జిల్లాలో టెక్నికల్ అసిస్టెంట్ గ్రేడ్3 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 09
» **అర్హత:** బీఎస్సీ(అగ్రికల్చర్/హార్టికల్చర్/బయోటెక్నాలజీ/డ్రైల్యాండ్ అగ్రికల్చర్/బోటనీ) ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మార్కులు, పని అనుభవం, అదనపు విద్యార్హతలు(టీఏ/డీఈవో పోస్టులకు) ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత ధ్రువపత్రాల నకళ్లను జతచేసి రిజిస్టర్ పోస్టు ద్వారా లేదా వ్యక్తిగతంగా డిస్ట్రిక్ట్ సివిల్ సప్లైస్ మేనేజర్ ఆఫీస్, ఏపీ పౌర సరఫరాల కార్పొరేషన్ లిమిటెడ్, జిల్లా కార్యాలయం, సబ్ కలెక్టరేట్ కాంపౌండ్, పార్వతీపురం, పార్వతీపురం మన్యం జిల్లా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 30.11.2023.
» **వెబ్‌సైట్:** parvathipurammanyam.ap.gov.in

### పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో 12 టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు

ఏలూరులోని రెవెన్యూ డిపార్ట్‌మెంట్.. ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 12
» **అర్హత:** డిగ్రీతో కంప్యూటర్స్ లేదా బీఈ, బీటెక్/బీసీఏ/ఎంసీఏ లేదా డిగ్రీతో పీజీడీసీఏ, హయ్యర్ గ్రేడ్ టైప్ రైటింగ్ సర్టిఫికేట్ ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** రూ.18,500.
» **ఎంపిక విధానం:** డిగ్రీ, అకడమిక్ మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.11.2023
» **వెబ్‌సైట్:** https://westgodavari.ap.gov.in

# స్కిల్ ఉంటేనే.. కొలువు!

» ఐటీలో తగ్గనున్న ఫ్రెషర్స్ రిక్రూట్‌మెంట్
» స్కిల్స్ అప్ గ్రేడ్ చేసుకుంటేనే అవకాశాలు
» బీఎఫ్ఎస్ఐ, హాస్పిటాలిటీ, హెల్త్‌కేర్‌లో జాబ్స్

**ఏ రంగంలో నియామకాలు ఎక్కువగా జరుగుతున్నాయి.. ఐటీలో ఫ్రెషర్స్ రిక్రూట్‌మెంట్ పరిస్థితి ఎలా ఉంది.. ఏ స్కిల్స్‌కు జాబ్ మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువగా ఉంది..? ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, బ్యాచిలర్ డిగ్రీ కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులకు ఇలాంటి సందేహాలెన్నో!! ముఖ్యంగా నవంబర్ వచ్చిందంటే.. క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్, జాబ్ మార్కెట్ పరిస్థితులపై ఎంతో ఆసక్తి. కారణం.. మరికొద్ది నెలల్లో వారంతా కోర్సులు పూర్తి చేసుకొని ఉద్యోగ వేటలో జాబ్ మార్కెట్‌లోకి ప్రవేశిస్తుండటమే!! ఈ నేపథ్యంలో.. ఈ ఏడాది రిక్రూట్‌మెంట్ ట్రెండ్స్, డిమాండింగ్ స్కిల్స్, ఉద్యోగ సాధనకు మెలకువలపై ప్రత్యేక కథనం..**




ఐటీ రంగంలో ఈ ఏడాది నియామకాలు తక్కువగా ఉంటాయని ఇప్పటికే అంచనాలు వెలువడ్డాయి. మరోవైపు ఐటీని మినహాయించి.. ఇతర రంగాల్లో రిక్రూట్‌మెంట్స్‌లో వృద్ధి కనిపించనుందని, విద్యార్థులు సదరు రంగాలపై దృష్టి సారించాలని నిపుణులు సూచిస్తున్నారు.

#### ఆ మూడు సెక్టార్లు

తాజా జాబ్ మార్కెట్ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుంటే.. ముఖ్యంగా మూడు రంగాలు నియామకాల్లో ముందున్నట్లు పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. బీఎఫ్ఎస్ఐ, హెల్త్‌కేర్, హాస్పిటాలిటీ రంగాల్లో ఫ్రెషర్స్ రిక్రూట్‌మెంట్స్ పెరగనున్నాయి. దీంతోపాటు ఈ–కామర్స్, టెక్ స్టార్టప్స్, టెలికమ్యూనికేషన్స్ అండ్ ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లోనూ ఫ్రెషర్స్ నియామకాల్లో వృద్ధి కనిపించనుంది.

నౌకరీ డాట్ కామ్ నివేదిక ప్రకారం–సెప్టెంబర్ చివరికి బీఎఫ్ఎస్ఐ, హెల్త్‌కేర్ సెక్టార్ల నియామకాల్లో ఏడు శాతం పెరుగుదల కనిపించింది. బీఎఫ్ఎస్ఐలోని బ్యాంకింగ్ విభాగంలో గత సెప్టెంబర్‌తో పోల్చితే ఈ ఏడాది సెప్టెంబర్‌లో నియామకాల్లో 40 శాతం వృద్ధి కనిపించింది. ఈ రంగంలో మొత్తం ఏడు శాతం వృద్ధి కనిపించగా.. ఇందులో ఇన్సూరెన్స్ విభాగంలో నాలుగు శాతం మేరకు ఉద్యోగాలు తగ్గడం గమనార్హం. ట్రావెల్ అండ్ హాస్పిటాలిటీ సెక్టార్‌లో 22 శాతం, ఫార్మా/బయోటెక్/క్లినికల్ రీసెర్చ్ విభాగంలో 11 శాతం; ఆటోమోటివ్స్, ఆయిల్ అండ్ గ్యాస్/పవర్ సెక్టార్లలో ఆరు శాతం చొప్పున నియామకాల్లో వృద్ధి నమోదైంది. ఐటీ సాఫ్ట్‌వేర్/సాఫ్ట్‌వేర్ సర్వీసెస్‌లో మాత్రం 43 శాతం మేర నియామకాలు తగ్గడం గమనార్హం.

#### ఈ-కామర్స్, టెక్ స్టార్టప్స్

ఈ ఏడాది ఫ్రెషర్స్ నియామకాల్లో ఈ–కామర్స్ అగ్రస్థానంలో ఉంటుందని టీమ్‌లీజ్ నివేదిక పేర్కొంది. ఈ మేరకు కెరీర్ ఔట్‌లుక్ రిపోర్ట్ 2023–హెచ్‌వై2 (జులై–డిసెంబర్) పేరుతో ప్రత్యేక నివేదిక రూపొందించింది. ఈ నివేదిక ప్రకారం– ఈ–కామర్స్, టెక్ స్టార్టప్స్‌లో ఈ ఏడాది ద్వితీయార్థంలో 59 శాతం మేరకు ఫ్రెషర్స్ నియామకాలు జరగనున్నాయి. అదే విధంగా టెలికమ్యూనికేషన్స్‌లో 53 శాతం; ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో 50 శాతం చొప్పున రిక్రూట్‌మెంట్స్‌లో పెరుగుదల కనిపించనుంది. ఐటీ విభాగంలో 49 శాతం; హెల్త్‌కేర్/ఫార్మా రంగంలో 42 శాతం; కన్‌స్ట్రక్షన్ అండ్ రియల్ ఎస్టేట్, ఎడ్యుకేషనల్ సర్వీసెస్‌లో 21 శాతం; ఎఫ్‌ఎంసీజీలో 24 శాతం; కన్సల్టింగ్‌లో 13 శాతం చొప్పున నియామకాల్లో పెరుగుదల నమోదైంది. మొత్తంగా చూస్తే ఈ ఏడాది ప్రథమార్థంతో పోల్చితే ద్వితీయార్థంలో మూడు శాతం మేర ఫ్రెషర్ నియామకాలు పెరుగుతాయని నివేదిక స్పష్టం చేసింది.

#### హాస్పిటాలిటీలో 60 శాతం!

ఈ ఏడాది ద్వితీయార్థంలో హాస్పిటాలిటీ రంగంలో నియామకాల్లో 60 శాతం వృద్ధి నమోదవుతుందని పలు సర్వే నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. హెల్త్ టూరిజం, బిజినెస్ ట్రావెల్, డొమెస్టిక్ పర్సనల్ టూర్స్‌లో పెరుగుదల కనిపిస్తుండడమే ఇందుకు కారణంగా పేర్కొంటున్నారు. ఈవెంట్ కో ఆర్డినేటర్, జూనియర్ చెఫ్, ట్రావెల్ ఏజెంట్స్, రిసార్ట్ మేనేజర్స్, హోటల్ స్టాఫ్, హౌస్ కీపింగ్ విభాగాల్లో మానవ వనరులకు డిమాండ్ ఏర్పడనుంది. ఇదే సమయంలో స్కిల్ గ్యాప్ సమస్య కూడా ఈ రంగంలో ఉందని, సంబంధిత కోర్సుల అభ్యర్థులకు అవకాశాలు లభిస్తాయని చెబుతున్నారు.

#### బీఎఫ్ఎస్ఐలోనూ ఇదే జోరు

బీఎఫ్ఎస్ఐ సెక్టార్‌లో ముఖ్యంగా.. బ్యాంకింగ్ విభాగంలో నియామకాలు గతేడాది మాదిరిగానే కొనసాగుతాయని అంచనా. క్రెడిట్ కార్డ్ సేల్స్, కస్టమర్ సర్వీస్ ఏజెంట్స్, బ్రాంచ్ మేనేజర్స్ హోదాల్లో ఎక్కువ నియామకాలు ఉంటాయని నిపుణులు భావిస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బిగ్ డేటా అనలిటిక్స్ ఆధారిత సేవలు పెరగడం కూడా ఈ రంగంలో నియామకాలకు ఊతంగా నిలుస్తుందని పేర్కొంటున్నారు.

#### కన్సల్టింగ్.. తయారీ

ఫైనాన్షియల్ కన్సల్టింగ్ సెక్టార్‌లోనూ నూతన నియామకాల్లో జోరు కొనసాగనుంది. బిజినెస్ ఆపరేషన్స్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ టెక్నాలజీ, డేటా సైన్స్ తదితర విభాగాల్లో అయిదు వేలకుపై నియామకాలు జరగనున్నాయి. ఇక దేశ జీడీపీలో కీలకమైన తయారీ రంగం.. నియామకాలకు ఊతంగా నిలిచే పరిస్థితి కనిపిస్తోంది. ఈ రంగంలో దాదాపు 20 వేలకు పైగా కొత్త ఉద్యోగాలు సెప్టెంబర్–డిసెంబర్ మధ్య కాలంలో లభిస్తాయని అంచనా. 5జీ టెక్నాలజీ, నూతన ఆవిష్కరణలు, ఇండస్ట్రియల్ ఐఓటీ, ఆర్ అండ్ డీ కార్యకలాపాల్లో పెరుగుదలే ఇందుకు ప్రధాన కారణంగా పేర్కొంటున్నారు.

#### ఐటీలో ఇలా

దేశ ఐటీ రంగంలో దాదాపు 50 వేల ఉద్యోగాలు ఫ్రెషర్స్‌కు అందుబాటులోకి రానున్నట్లు అంచనా. దిగ్గజ సంస్థలతో పోల్చితే మధ్య తరహా ఐటీ సంస్థల్లో నియామకాలు కొంత ఎక్కువగా ఉంటాయని నిపుణులు భావిస్తున్నారు. బిగ్ డేటా టెస్టింగ్ ఇంజనీర్, ఐటీ ఆపరేషన్స్ మేనేజర్ వంటి జాబ్ ప్రొఫైల్స్‌కు డిమాండ్ నెలకొంది.

#### జాబ్ ప్రొఫైల్స్

డెవాప్స్ ఇంజనీర్, చార్టర్డ్ అకౌంటెంట్, ఎస్ఈఓ అనలిస్ట్, యుఎక్స్ డిజైనర్ వంటి జాబ్ ప్రొఫైల్స్‌కు డిమాండ్ నెలకొంది. అదే విధంగా డిజిటల్ మార్కెటింగ్ స్పెషలిస్ట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇంజనీర్ ఉద్యోగాలు కూడా ఎక్కువగా లభించనున్నాయి. బీఎఫ్ఎస్ఐ సెక్టార్‌లో.. బ్రాంచ్ మేనేజర్, ఫైనాన్షియల్ కన్సల్టెంట్ హోదాలకు డిమాండ్ ఉంది. హెల్త్‌కేర్ అండ్ ఫార్మా రంగంలో.. రీసెర్చర్స్, మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్స్‌కు డిమాండ్ నెలకొంది.

#### ఈ స్కిల్స్‌కు డిమాండ్

డిజిటల్ మార్కెటింగ్, బిజినెస్ కమ్యూనికేషన్, డేటా సైన్స్, బ్లాక్ చైన్, బిజినెస్ అనలిటిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సెర్చ్ ఇంజన్ ఆప్టిమైజేషన్ స్కిల్స్ ఉన్న వారికి జాబ్ మార్కెట్‌లో ప్రాధాన్యం ఉంటుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఫ్రెషర్స్ నియామకాల్లో సాఫ్ట్ స్కిల్స్‌కు ప్రాధాన్యం పెరుగుతోంది. క్రిటికల్ థింకింగ్, గ్రోత్ మైండ్ సెట్, టైమ్ మేనేజ్‌మెంట్, యాక్టివ్ లెర్నింగ్ దృక్పథం ఉన్న అభ్యర్థులకు అవకాశాలు లభిస్తాయని పేర్కొంటున్నారు.

#### అప్ స్కిల్లింగ్ మంత్ర

ఐటీలో తగ్గుతూ.. ఇతర రంగాల్లో నియామకాలు పెరుగుతున్న తరుణంలో విద్యార్థులు అప్ స్కిల్లింగ్‌కు ప్రాధాన్యం ఇస్తేనే ఉద్యోగ సాధనలో ముందుంటారని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం అన్ని రంగాల్లోనూ కీలకంగా మారిన ఏఐ/ఎంఎల్, బ్లాక్ చైన్, సైబర్ సెక్యూరిటీ, డేటా అనలిటిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్ నైపుణ్యాలు పొందేలా కృషి చేయాలని సూచిస్తున్నారు. ఐటీ ఉద్యోగాలు కోరుకునే వారు ఏఐ/ఐఓటీ స్కిల్స్‌పై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని.. డెవాప్స్, యుఎక్స్ డిజైన్ వంటి నైపుణ్యాలు పెంచుకునేందుకు కృషి చేయాలంటున్నారు.

#### ఎన్నో మార్గాలు

ఫ్రెష్ రిక్రూట్‌మెంట్స్‌లో కీలకంగా నిలుస్తున్న ఏఐ, ఐటీ స్కిల్స్‌ను సొంతం చేసుకునేందుకు ప్రస్తుతం పలు మార్గాలు అందుబాటులోకి వచ్చాయి. విద్యార్థులు ఇన్ఫోసిస్, మైక్రోసాఫ్ట్, ఇంటెల్, ఒరాకిల్, ఐబీఎం వంటి సంస్థలు అందిస్తున్న ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సులు పూర్తి చేయడం ఉపయుక్తంగా ఉంటుంది. అదే విధంగా సంబంధిత సర్టిఫికేషన్స్ సొంతం చేసుకుంటే.. ఉద్యోగ సాధనలో ముందంజలో నిలిచే అవకాశం ఉంటుంది.

# హ్యాట్రిక్ వాకిట్లో కేసీఆర్..?




**దక్షిణాదిలో ఇప్పటివరకు ఎంజీఆర్ ఒక్కరే**

సాక్షి ప్రతినిధి: వరుసగా మూడు ఎన్నికల్లో గెలిచి ఒక ముఖ్యమంత్రి హ్యాట్రిక్ సాధించడం ఒక అరుదైన రికార్డు. దక్షిణ భారతదేశంలో గతంలో ఒక్క ఎంజీఆర్ మాత్రమే వరుసగా మూడు ఎన్నికల్లో పార్టీని విజయపథంలోకి నడిపించారు. అయితే ఆయన పదేళ్లు మాత్రమే అధికారంలో ఉన్నారు. 1977లో ముఖ్యమంత్రి బాధ్యతలు తీసుకున్న ఆయన ప్రభుత్వాన్ని 1980లో గవర్నర్ బర్తరఫ్ చేశారు. గవర్నర్ పాలన అనంతరం 1980 ఎన్నికల్లో ఆయన పార్టీ మళ్లీ విజయం సాధించింది. 1984లో ఆయన మరోసారి గెలిచారు. 1987లోనే ఆయన చనిపోయారు. శిఖరప్రాయులైన తమిళ నాయకుడు సి. రాజగోపాలాచారి రెండేళ్లు, కామరాజ్ నాడార్ తొమ్మిదేళ్లు, అన్నాదొరై రెండేళ్లు మాత్రమే ముఖ్యమంత్రులుగా పనిచేశారు. కరుణానిధి సుదీర్ఘకాలం 17 సంవత్సరాల పాటు సీఎంగా చేసినప్పటికీ ఆయన నాయకత్వంలో వరుసగా రెండుసార్లు పార్టీ విజయం సాధించలేదు. కర్ణాటకలో దిగ్గజ నాయకులైన నిజలింగప్ప, వీరేంద్రపాటిల్, దేవరాజ్ అర్స్, రామకృష్ణ హెగ్డేలకు ఎవరికీ ఈ ఘనత దక్కలేదు. కేరళలో ఐదేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకొని తదుపరి ఎన్నికల్లో మళ్లీ గెలిచిన ఘనత ప్రస్తుత సీఎం పినరయి విజయన్‌కే దక్కింది. ఈకే నయనార్, కరుణాకరన్‌లు పదేళ్లు అధికారంలో ఉన్నా వరుసగా లేరు. వివిధ సందర్భాల్లో మూడు విడతలుగా పనిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావం కోసం నాటి హైదరాబాద్ స్టేట్ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు తన పదవిని త్యాగం చేశారు. అప్పటినుంచి తెలుగుదేశం పార్టీ పుట్టేవరకూ రాష్ట్రం కాంగ్రెస్ ఏలుబడిలోనే ఉన్నది. సంజీవరెడ్డి దగ్గర్నుంచీ విజయభాస్కరరెడ్డి దాకా ఏ ముఖ్యమంత్రి కూడా ఐదేళ్ల కాలం పని చేయలేదు. కాసు బ్రహ్మానందరెడ్డి ఏడేళ్ల కాలం పని చేసినా ఒక ఎన్నిక దగ్గర్నుంచి మళ్లీ ఎన్నికల వరకు ఆయన పదవిలో లేరు. ఎన్టీఆర్ కూడా అంతే. వరుసగా ఐదేళ్లు లేరు. 1989లో ముందస్తుకు వెళ్లి ఓడిపోయారు. చంద్రబాబు నాయకత్వంలో తొలిసారి వాజ్‌పేయి అండతో గెలిచారు. ఆ తర్వాత ముందస్తుకు వెళ్లి ఓడిపోయారు. రాష్ట్ర విభజన తర్వాత మాత్రమే ఆయన ఐదేళ్లు పూర్తి చేసుకున్నారు. కానీ ఆ తదుపరి ఎన్నికల్లో ఓడిపోయారు. ఒక్క వైఎస్.రాజశేఖరరెడ్డికి మాత్రమే రాష్ట్ర ఎన్నికల చరిత్రలో ఎన్నికల నుంచి ఎన్నికల దాకా ఐదేళ్లు పూర్తి చేసుకొని తదుపరి ఎన్నికల్లో పార్టీని గెలిపించిన ఘనత దక్కింది. దురదృష్టవశాత్తు ఆయన కొద్ది రోజులకే చనిపోయారు. లేకపోతే పదేళ్ల కిందనే తెలుగునాట హ్యాట్రిక్ అంచనాలు వెలువడేవి. ఇన్నాళ్లకు కేసీఆర్‌కు అటువంటి అవకాశం ఎదురైంది. హ్యాట్రిక్ కొట్టగలమనే నమ్మకాన్ని బీఆర్ఎస్ శ్రేణులు వ్యక్తం చేస్తున్నాయి. ఇందుకు కారణంగా పదేళ్ల తమ పరిపాలనా ఘనతలను వారు ఏకరువు పెడుతున్నారు. హైదరాబాద్ నగరాభివృద్ధిని ప్రముఖంగా పేర్కొంటున్నారు. ఈ అభివృద్ధి కారణంగా తలసరి ఆదాయంలో రాష్ట్రం అగ్రస్థానాన్ని సాధించిన వైనాన్ని బీఆర్ఎస్ ప్రచారం చేసుకుంటున్నది. 24 గంటల వ్యవసాయ విద్యుత్, ఇబ్బడిముబ్బడిగా పెరిగిన వ్యవసాయ ఉత్పత్తుల గణాంకాలను ఆ పార్టీ ఎన్నికల ప్రచారంలో ప్రముఖంగా ప్రస్తావించింది. నీటిపారుదల సౌకర్యం, వైద్య కళాశాలల ఏర్పాటులో రికార్డు సృష్టించామని బీఆర్ఎస్ పార్టీ ఆధారాలతో సహా ప్రముఖంగా ప్రకటనలిస్తున్నది.

## ఐటీ అభివృద్ధి, రైతులు, లబ్ధిదారుల అండతో గెలుపునకు ఢోకా లేదంటున్న బీఆర్ఎస్

ఐటీ రంగంలో గణనీయమైన ప్రగతి తమ హయాంలోనే సాధ్యమైందని, ఐటీ ఎగుమతుల వృద్ధిరేటులో బెంగళూరును అధిగమించి హైదరాబాద్ దూసుకుపోతున్నదని చెబుతున్నారు. ప్రస్తుతం నగరంలో పది లక్షలమంది ఐటీ ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇవన్నీ ఈ ఎన్నికల్లో తమకు తోడ్పడతాయని ఆ పార్టీ విశ్వాసంతో ఉన్నది. 69 లక్షలమంది రైతుబంధు లబ్ధిదారులు, 44 లక్షలమంది ఆసరా పెన్షనర్లు అండగా ఉన్నందున వల్ల తమ గెలుపునకు ఢోకా లేదని ఆ పార్టీ అభిప్రాయపడుతున్నది. పదేళ్లు అధికారంలో ఉన్నందున సహజంగా ఉండే వ్యతిరేకతకు తోడు, సుమారు 30 మంది అభ్యర్థుల మీద తీవ్ర వ్యతిరేకత ఉన్నప్పటికీ టికెట్లు ఇవ్వడం రాజకీయ తప్పిదమనే అభిప్రాయం బలంగా వ్యక్తమవుతున్నది. ఫలితంగా కొన్ని సెక్షన్లలో వ్యతిరేకత బాహాటంగా వ్యక్తమవుతున్నది. ఈ పరిస్థితుల్లో కూడా 70కి పైగా సీట్లు గెలుస్తామనే ఆశల్లో ఆ పార్టీ నాయకులున్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు సరిపోయే బొటాబొటి సీట్లను బీఆర్ఎస్ గెలుచుకోవచ్చని కొన్ని తటస్థ సర్వేలు చెబుతున్నాయి. గ్రేటర్ హైదరాబాద్, ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాల్లో బీఆర్ఎస్ గణనీయమైన ఫలితాలను సాధిస్తుందని, కరీంనగర్, వరంగల్, మహబూబ్‌నగర్‌లలో సాధారణ మెజారిటీ సాధిస్తుందని తటస్థ సర్వేలు అంచనా వేస్తున్నాయి. చివరి మూడురోజుల్లో బీజేపీ అనూహ్యంగా పుంజుకోవడం కొంతమేర బీఆర్ఎస్‌కు ఉపయోగపడవచ్చు. ఆ పార్టీ ఓటింగ్ శాతం 15 దాటుతుందని, సీట్ల సంఖ్య డబుల్ డిజిట్‌లోకి ఎంట్రీ ఇస్తుందని కమలనాథులు గట్టి నమ్మకంతో ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గతవారం రోజులుగా క్షేత్రస్థాయి వాతావరణం కొంత భిన్నంగా కనిపిస్తున్నా గ్రేటర్ హైదరాబాద్, బీజేపీ ఫ్యాక్టర్ ఆ వాతావరణాన్ని బ్యాలెన్స్ చేయవచ్చని కొన్ని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అదే జరిగితే కేసీఆర్ హ్యాట్రిక్‌కు అవకాశం చిక్కినట్లే. కానీ, జనం మనసులో ఏముందో తెలుసుకోవడం అంత సులభంగా కనిపించడం లేదు.

# దుమ్ము రేగింది..




సాక్షి, హైదరాబాద్

**ఈసారి రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం దుమ్ము రేపింది. వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చేందుకు బీఆర్ఎస్, ఎలాగైనా తెలంగాణలో అధికారం కోసం కాంగ్రెస్, భవిష్యత్‌కు బాటలు వేసుకోవడంతోపాటు కాలం కలసివస్తే పవర్ దక్కుతుందనే ధీమాతో బీజేపీ, అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సీపీఐ, సీపీఎం, బీఎస్పీ లాంటి పార్టీలు, ఫార్వర్డ్‌బ్లాక్‌తో పాటు ఇతర రిజిస్టర్డ్ పార్టీల గుర్తులపై, స్వతంత్రులుగా పోటీ చేస్తున్న అభ్యర్థులంతా కలిసి రెండు నెలలుగా తెలంగాణలో ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించారు. బీఆర్ఎస్ నుంచి సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌లు రాష్ట్రమంతటా ఎన్నికల ప్రచారం నిర్వహించగా, కాంగ్రెస్ పార్టీ నుంచి సోనియా, రాహుల్, ప్రియాంక, ఖర్గే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్, భట్టి, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు, బీజేపీ నుంచి ప్రధాని మోదీ, అమిత్‌షా, నడ్డా, యోగి, హిమంతబిశ్వశర్మ, రాజ్‌నాథ్‌సింగ్, గడ్కరీ, స్మృతీ ఇరానీ తదితరులతో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, లక్ష్మణ్ తదితరులు, బీఎస్పీ నుంచి మాయావతి, సీపీఐ నుంచి రాజా, సీపీఎం నుంచి సీతారాం ఏచూరి, బృందాకారత్, మాణిక్‌సర్కార్ తదితరులు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.**

**రెండు నెలలు ధూంధాంగా ఎన్నికల ప్రచార హోరు**

**సర్వశక్తులూ ఒడ్డిన ప్రధాన రాజకీయ పార్టీలు**

ఏకంగా 96 సభల్లో ప్రసంగించిన సీఎం కేసీఆర్

రాష్ట్రం చుట్టి వచ్చిన కేటీఆర్, హరీశ్...

సోనియా చేతుల మీదుగా ఆరుగ్యారంటీల ప్రకటన... పింఛన్ల ప్రకటన రాహుల్ నోటి నుంచి

ఈసారి ఎన్నికల ప్రచారంలో ఆకర్షణీయంగా ప్రియాంక

కమలం పార్టీ నుంచి కదనరంగంలోకి మోదీ, అమిత్‌షా, నడ్డా, యోగి, రాజ్‌నాథ్‌సింగ్, గడ్కరీ, స్మృతీ ఇరానీ

బీఎస్పీ నుంచి మాయావతి, మార్క్సిస్టుల పక్షాన సీతారాం ఏచూరి, బృందా కారత్, మాణిక్‌సర్కార్, డి.రాజా



**ప్రజా ఆశీర్వాద సభలతో బీఆర్ఎస్**

అసెంబ్లీ ఎన్నికల ప్రచార అంకానికి మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు తెరపడిన నేపథ్యంలో భారత రాష్ట్ర సమితి ప్రచార తీరుతెన్నులు సమీక్షించడంతో పాటు పోలింగ్ ముగిసేంత వరకు అనుసరించాల్సిన వ్యూహంపై దృష్టి సారించింది. ప్రధాన విపక్ష పార్టీలతో పోలిస్తే బీఆర్ఎస్ పార్టీ ముందస్తుగా అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించింది. బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ అక్టోబర్ 15న మొదలుకుని రెండు విడతల్లో కలుపుకుని 33 రోజుల వ్యవధిలో 96 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 'ప్రజా ఆశీర్వాద సభలు' పేరిట జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో ప్రసంగించారు. ఈ నెల 25న సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరగాల్సిన బహిరంగ సభను చివరి నిమిషంలో వాయిదా వేసుకుంది. ప్రచారం చివరి రోజున తాను పోటీ చేస్తున్న గజ్వేల్‌లో భారీ బహిరంగ సభ ద్వారా ప్రజా ఆశీర్వాద సభలకు కేసీఆర్ ముగింపు పలికారు. పార్టీ స్టార్ ప్రచారకర్తలైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రి తన్నీరు హరీశ్‌రావు కూడా బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించారు. రెండు నెలలుగా ఈ ఇద్దరూ సభలు, రోడ్‌షోలు, వివిధ వర్గాలతో భేటీలు, ప్రత్యేక ఇంటర్వ్యూలతో తీరిక లేకుండా గడిపారు. తాము పోటీ చేస్తున్న నియోజకవర్గాల్లో ప్రచారాన్ని సమన్వయం చేసుకుంటూనే సీఎం కేసీఆర్ స్వయంగా పోటీ చేస్తున్న గజ్వేల్‌లో హరీశ్‌రావు, కామారెడ్డిలో కేటీఆర్ ప్రచారాన్ని పర్యవేక్షించారు. మంత్రి కేటీఆర్ 70 రోడ్‌షోలు, 30 బహిరంగసభల్లో పాల్గొన్నారు. మంత్రి హరీశ్‌రావు కూడా సుమారు అంతే సంఖ్యలో రోడ్‌షోలు, ప్రచార సభల్లో పాల్గొన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పోటీ చేస్తున్న కొడంగల్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించి ఈ నెల 22న జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ ప్రసంగించారు. కేటీఆర్, హరీశ్‌కూడా కొడంగల్‌లో రోడ్‌షోలు నిర్వహించి పార్టీ కేడర్‌లో ఉత్సాహాన్ని నింపే ప్రయత్నం చేశారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నిజామాబాద్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ తదితరులు గతంలో తాము ప్రాతినిధ్యం వహించిన లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో పార్టీ ప్రచారానికి నేతృత్వం వహించారు. మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, గంగుల కమలాకర్, నిరంజన్‌రెడ్డి తదితరులు తాము ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి జిల్లాల పరిధిలో అడపాదడపా ప్రచారంలో పాల్గొన్నారు.

**మేనిఫెస్టోకు మెరుగులు దిద్దుతూ**

ఎన్నికల మేనిఫెస్టోను గత నెల 15న ప్రకటించడంతో పాటు అదే రోజు హుస్నాబాద్ నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన కేసీఆర్ తాను పాల్గొన్న ప్రచార సభల్లో అందులోని అంశాలను ప్రధానంగా ప్రస్తావించారు. నిఘా సంస్థల నివేదికలు, సర్వే సంస్థలు, వివిధ మార్గాల్లో అందిన సమాచారాన్ని క్రోడీకరించి మేనిఫెస్టోలో అదనపు అంశాలను కూడా ప్రచార క్రమంలో జోడించారు. గల్ఫ్, బీడీ, ఆటో కార్మికులకు పలు హామీలు ఇవ్వడంతో ఉద్యోగ నోటిఫికేషన్లు తదితరాలపై ఓటర్లలో నెలకొన్న అపోహలను తొలగించేందుకు కేటీఆర్ ప్రచార అంకంలో ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించారు. నిరుద్యోగ యువత, తొలి ఓటర్లు, మహిళా ఓటర్లు, మైనారిటీ ఓటర్లు ఇలా పలువురితో ప్రత్యక్షంగా భేటీ అయ్యారు. ఓ వైపు ప్రచార లోపాలను సరిదిద్దుకుంటూనే పార్టీ అభ్యర్థులపై వ్యతిరేకత ఉన్న చోట దానిని తటస్థ స్థితి (న్యూట్రలైజేషన్)కి తీసుకు వచ్చేందుకు ప్రాధాన్యం ఇచ్చారు. ప్రచార, ప్రసార సాధనాల ద్వారా బీఆర్ఎస్ ప్రభుత్వ విజయాలు, మేనిఫెస్టోలోని అంశాలను బలంగా తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ వివిధ రూపాల్లో ముమ్మర ప్రయత్నాలు చేసింది.

## కాంగ్రెస్ కదిలిందిలా...!

ఈ ఏడాది జూలై 2వ తేదీ నుంచి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కదనరంగంలోకి దూకింది. ఖమ్మం వేదికగా జరిగిన 'తెలంగాణ ప్రజాగర్జన' సభలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పార్టీలో చేరారు. అదే రోజున భట్టి విక్రమార్క తన పాదయాత్రను ముగించారు. రాహుల్‌గాంధీ హాజరైన ఈ సభ వేదికగానే వితంతువులు, వృద్ధులకు రూ.4వేల పింఛన్ ప్రకటించారు. ఆగస్టు 12న 'తిరగబడదాం-తరిమికొడదాం' పేరుతో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించింది. బోయిన్‌పల్లిలోని రాజీవ్‌గాంధీ నాలెడ్జ్‌సెంటర్‌లో 16 అంశాలతో బీఆర్ఎస్, బీజేపీలపై చార్జిషీట్ విడుదల చేసింది. ఆ తర్వాత ఆగస్టు 26న చేవెళ్లలో జరిగిన ప్రజాగర్జన సభలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను ఖర్గే ప్రకటించారు. సెప్టెంబర్9వ తేదీన మాజీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నేతృత్వంలో మేనిఫెస్టో కమిటీతో పాటు ఎన్నికల కోసం మరో 8 కమిటీలను ప్రకటించింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఢిల్లీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలను కాదని ఈసారి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశాలను హైదరాబాద్‌లో నిర్వహించడం ద్వారా పార్టీ కేడర్‌లో కొత్త ఉత్సాహం నింపే ప్రయత్నం చేశారు. ఈ ఏడాది సెప్టెంబర్ 16,17 తేదీల్లో హైదరాబాద్ వేదికగా ఈ సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగానే తుక్కుగూడలో జరిగిన విజయభేరి సభకు సోనియా, రాహుల్, ఖర్గేలు హాజరయ్యారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటు తన కల అని చెప్పిన సోనియా ఆ సభ వేదికగానే ఆరు గ్యారంటీలను ప్రకటించారు. ఆ తర్వాత అక్టోబర్ 15న 55 మందితో కాంగ్రెస్ తన తొలి జాబితాను ప్రకటించింది. అభ్యర్థుల ప్రకటన తర్వాత తొలిసారి రాష్ట్రానికి రాహుల్‌గాంధీ అక్టోబర్ 18న తెలంగాణకు వచ్చారు. తన సోదరి ప్రియాంకతో కలిసి వచ్చిన రాహుల్ రామప్ప ఆలయాన్ని సందర్శించుకుని ములుగు నియోజకవర్గంలోని రామాంజిపూర్‌లో కార్నర్‌మీటింగ్‌కు హాజరయ్యారు. తర్వాతి రోజు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రాహుల్‌యాత్ర నిర్వహించారు. సింగరేణి కార్మికులతో భేటీ అయ్యారు. అక్టోబర్ 28న సంగారెడ్డిలో జరిగిన విజయభేరి సభకు ఖర్గే, భట్టి, రేవంత్, జగ్గారెడ్డి తదితరులు హాజరయ్యారు. అదే నెల 31న కొల్లాపూర్‌లో జరిగిన పాలమూరు ప్రజాభేరి సభకు రాహుల్ వచ్చారు. నవంబర్1వ తేదీన రాహుల్ గాంధీ కల్వకుర్తి, జడ్చర్ల, షాద్‌నగర్‌లలో సమావేశాలు ఏర్పాటు చేశారు. ఆ రోజే బీసీ జనగణన చేస్తామని ప్రకటించారు. నవంబర్2వ తేదీన మేడిగడ్డ ప్రాజెక్టును సందర్శించి కాళేశ్వరంలో అవినీతిని ఎత్తి చూపారు. నవంబర్7వ తేదీన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తన ఎన్నికల ప్రచారాన్ని ఆలంపూర్ నుంచి ప్రారంభించి మొత్తంగా 63 నియోజకవర్గాల్లో పర్యటించి 87 సభల్లో పాల్గొన్నారు. రాహుల్ 25, ప్రియాంక 26, ఖర్గే 10 ఎన్నికల సభల్లో అభ్యర్థుల తరఫున ప్రచారం చేశారు.



**డిక్లరేషన్ల ప్రకటన..:** నవంబర్ 9 న హైదరాబాద్‌లో కేంద్ర మాజీమంత్రి సల్మాన్ ఖుర్షీద్ చేతుల మీదుగా మైనార్టీ డిక్లరేషన్‌ను విడుదల చేశారు. ఆ తర్వాతి రోజునే కామారెడ్డిలో జరిగిన సభకు హాజరైన కర్ణాటక సీఎం సిద్ధరామయ్య బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించారు. ఆ తర్వాత నవంబర్17న గాంధీభవన్ వేదికగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విడుదల చేశారు. నవంబర్19న ఖానాపూర్‌లో జరిగిన సభకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ హాజరయ్యారు. అదే నెల 22న నల్లగొండ, అలంపూర్‌లో జరిగిన సభలకు ఖర్గే హాజరయ్యారు. ఇక, ఈనెల 24న మహబూబాబాద్, సిద్దిపేట జిల్లాల్లో ప్రియాంక ప్రచారం నిర్వహించారు. మరుసటి రోజు ప్రియాంకాగాంధీ పాలేరు, ఖమ్మం, మధిర అసెంబ్లీల పరిధిలో ప్రచారం నిర్వహించారు. అదే రోజున కల్వకుర్తి, సనత్‌నగర్ సభలకు ఖర్గే, ఆదిలాబాద్, బోధన్, వేములవాడ ఎన్నికల ప్రచార సభలకు రాహుల్‌గాంధీ హాజరయ్యారు. మరుసటి రోజున కామారెడ్డి, ఆందోల్, సంగారెడ్డి సభలకు రాహుల్, కొడంగల్‌కు ప్రియాంక వెళ్లారు. ఇక, ప్రచారం ముగియనున్న చివరి రోజున రాహుల్‌గాంధీ జీహెచ్ఎంసీ పరిధిలోని జూబ్లీహిల్స్, నాంపల్లి, మల్కాజ్‌గిరి స్థానాల్లో ప్రచారం చేయగా, ప్రియాంకాగాంధీ జహీరాబాద్, మల్కాజ్‌గిరి సభలకు హాజరయ్యారు. ఆరోగ్యం సహకరించని కారణంగా తెలంగాణకు రాలేకపోయిన సోనియాగాంధీ వీడియో సందేశం ద్వారా కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల ప్రచారాన్ని ముగించింది.

## కమలదళం..కదన రంగం



అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ అభ్యర్థుల తరఫున ఆ పార్టీ అగ్రనాయకత్వం రాష్ట్రమంతా విస్తృత ప్రచారం నిర్వహించింది. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎం వరకు పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడడానికి ముందే అక్టోబర్ 1న మహబూబ్‌నగర్, 3న నిజామాబాద్‌లలో బహిరంగసభల్లో పాల్గొనడం ద్వారా రాష్ట్రంలో పార్టీ ఎన్నికల ప్రచారానికి ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారు. ప్రచారపర్వం ముగియడానికి ఒకరోజు ముందే...సోమవారం రాత్రికల్లా మోదీ, అమిత్‌షా, నడ్డా తమ మలివిడత ప్రచారాన్ని పూర్తి చేశారు.

### మోదీ వరుస పర్యటనలు

ఎన్నికల షెడ్యూల్ జారీకి ముందు మోదీ రెండు రోజుల పర్యటన (మహబూబ్‌నగర్, నిజామాబాద్ సభలు) కూడా కలిపితే, మొత్తంగా ఆయన ఏడు రోజులు రాష్ట్రంలో పర్యటించారు. పార్టీ పక్షాన నిర్వహించిన బీసీల ఆత్మగౌరవసభ, ఎస్సీ ఉపకులాల రిజర్వేషన్ల వర్గీకరణకు సంబంధించి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించినసభకు మోదీ హాజరయ్యారు. ఇవి కూడా కలిపి మొత్తం 10 సభలు, ఒక రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ నెల 25న కామారెడ్డి, మహేశ్వరం పరిధిలో నిర్వహించిన బహిరంగసభలు, 26న నిర్మల్, తూప్రాన్‌లలో సభలు, 27న మహబూబాబాద్, కరీంనగర్‌లో ఎన్నికల బహిరంగసభలతో పాటు ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ నుంచి కాచిగూడ చౌరస్తా వరకు హైదరాబాద్‌లో రోడ్‌షో నిర్వహించారు. ఈ పర్యటనల్లో భాగంగా...ఆధ్యాత్మిక కార్యక్రమాల్లోనూ ఆయన పాల్గొన్నారు. కన్హా శాంతివనంలో రామచంద్రమిషన్ కార్యక్రమం, తిరుమల వెంకన్న దర్శనం, అమీర్‌పేటలోని గురుద్వారాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఎన్టీఆర్ స్టేడియంలో కోటి దీపోత్సవంలో మోదీ పాల్గొన్నారు.

### అమిత్‌షా 22 దాకా సభల్లో...

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విడతల వారీగా పర్యటించడంతో పాటు, ఈ నెల 24 నుంచి 27 దాకా ప్రచారంలోనే తలమునకలయ్యారు. రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, అంబర్‌పేట, కోరుట్ల, కొల్లాపూర్, ఖైరతాబాద్, మక్తల్, ములుగు, భువనగిరి, మునుగోడు, పటాన్‌చెరు, ఆర్మూర్, హుజూరాబాద్, పెద్దపల్లి, మంచిర్యాల, జనగామ, ఉప్పల్, నల్లగొండ, వరంగల్, గద్వాల, సూర్యాపేట కలుపుకొని మొత్తం 22 సభలతోపాటు, రోడ్‌షో, ఎంఆర్‌పీఎస్ మీటింగ్‌లో పాల్గొన్నారు. జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సికింద్రాబాద్, ముషీరాబాద్, కూకట్‌పల్లి, జగిత్యాల, బాన్సువాడ, జుక్కల్, బోధన్, హుజూర్‌నగర్, చేవెళ్ల, నారాయణపేట, మల్కాజ్‌గిరి, నిజామాబాద్ అర్బన్, సంగారెడ్డి ఇలా 15 బహిరంగసభల్లో ప్రసంగించారు. కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ హుజూరాబాద్, మహేశ్వరం, కంటోన్మెంట్, ఆర్మూర్, మేడ్చల్, కార్వాన్‌లలో నిర్వహించిన సభల్లో పాల్గొన్నారు. మరో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కొల్లాపూర్, ఎల్లారెడ్డి నియోజకవర్గాల పరిధిలో నిర్వహించిన బహిరంగసభల్లో ప్రసంగించారు. మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సిర్పూర్, వేములవాడ, గోషామహల్, మహబూబ్‌నగర్, కల్వకుర్తి, సనత్‌నగర్, ఎల్బీనగర్, కుత్బుల్లాపూర్‌లలో, అసోం సీఎం హిమంతబిశ్వ శర్మ చార్మినార్, మలక్‌పేట్, సిర్పూర్, పరకాల, దేవరకద్ర బహిరంగసభల్లో ప్రసంగించారు.

## బీఎస్పీ, సీపీఎం, సీపీఐ

ప్రధాన పార్టీలతో సమానంగా బీఎస్పీ అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను రంగంలోకి దింపింది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ పలు నియోజకవర్గాల్లో అభ్యర్థుల పక్షాన ప్రచారం చేశారు. ఆ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి సూర్యాపేట, పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

- ఎవరితోనూ పొత్తులేకుండా సీపీఎం మొత్తం 19 స్థానాల్లో పోటీ చేస్తుండగా.. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పాలేరు నుంచి రంగంలో ఉన్నారు. సీపీఎం తరఫున ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందాకారత్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. సీతారాం ఏచూరి పాలేరు, ఖమ్మం, మిర్యాలగూడ, భువనగిరి నియోజకవర్గాల్లో పర్యటించారు.
- సీపీఐ పోటీ చేస్తున్న ఒకే ఒక్క సీటు కొత్తగూడెంలో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శి నారాయణ, పోటీ చేస్తున్న అభ్యర్థి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావులు ప్రచారంలో పాల్గొన్నారు.

**ఉమ్మడి ఖమ్మం జిల్లా కొత్తగూడెంలో కాంగ్రెస్ అభ్యర్థి పోటీలో లేరు, ఆ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ సీపీఐకి కేటాయించింది. కానీ ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి గెలుస్తారంటూ ఓ సర్వే తేల్చి పడేసింది.**

**ఉమ్మడి మెదక్ జిల్లా నారాయణ్ ఖేడ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి సంజీవరెడ్డి. తొలుత సురేశ్ షెట్కార్‌కి టికెట్ కేటాయించినా.. తర్వాత మార్చారు. కానీ సురేశ్ షెట్కార్ తన సీనియారిటీని ఉపయోగించి ఇక్కడ మంచి మెజారిటీ దక్కించుకుంటారని మరో సర్వే సంస్థ దర్జాగా ప్రకటించేసింది.**

**ఇవే కాదు, ఇలాంటి లీలలు ఎన్నో సర్వే రిపోర్టుల్లో ప్రత్యక్షమవుతున్నాయి. పోలింగ్‌కు కేవలం రెండు రోజులు మాత్రమే మిగిలిఉన్న తరుణంలో ఇలాంటి ఉత్తుత్తి సర్వేలు ఓటర్లను అయోమయానికి గురి చేస్తున్నాయి. ప్రస్తుతం పూటకు పది సర్వే ఫలితాలు సోషల్ మీడియా వేదికగా ప్రత్యక్షమవుతున్నాయి.**

సాక్షి, హైదరాబాద్

# సర్వే జనా.. నిజం లేదు

**శాస్త్రీయత లేదు.. క్షేత్రస్థాయి పని అసలే లేదు**

**జనం ఆసక్తిని ఆసరాగా చేసుకుని..:** రాష్ట్రంలో త్రిముఖ పోటీ నెలకొన్న తరుణంలో.. ఏ పార్టీకి విజయావకాశాలు ఉన్నాయనే ఉత్కంఠ పెరిగింది. కాంగ్రెస్–బీఆర్ఎస్ మధ్య పోటీ తీవ్రంగా ఉందన్న మాట ఎక్కువగా వినిపిస్తున్నందున, ఈ రెండు పార్టీల్లో దేని ఆధిపత్యం ఎంతన్న విషయాన్ని ఆసరాగా చేసుకుని విచ్చలవిడిగా సర్వే ఫలితాలు వెల్లడవుతున్నాయి. క్షేత్రస్థాయిలో పర్యటనలు లేకుండా, ఇంట్లో కూర్చుని తోచిన అంకెలు వేసుకుంటూ సర్వేల పేరుతో బోగస్ సంస్థలు ఫలితాలను సోషల్ మీడియాలో ఉంచుతున్నాయి. ఇళ్లలో కూర్చుని అంకెల గారడీ చేసే క్రమంలో ఎన్నో పొరపాట్లు సమోదవుతున్నాయి. ఇక మరికొందరు ఘనులు.. అప్పటికే వెల్లడైన నాలుగైదు సర్వే ఫలితాలను బేరీజు వేసి, అన్నింటిని జోడించి అటూ ఇటూ మార్చి సర్వే ఫలితాలంటూ వివరాలను పోస్ట్ చేస్తున్నారు. సర్వే ఫలితాలను చాలామంది అనుసరించే వీలుండటంతో ఎక్కువ వ్యూస్‌కు ఈ మాయ చేస్తున్నారు. దీంతో జనం వేటిని విశ్వసించాలో తెలియక అయోమయంలో పడిపోతున్నారు.

**సర్వే సంస్థల పేరు ధ్వనించేలా..:** ప్రతి ఎన్నికల్లో శాస్త్రీయంగా సర్వే చేస్తూ కొన్ని సంస్థలు ఫలితాలను వెల్లడిస్తున్నాయి. వాటికి ప్రత్యేకంగా నెట్‌వర్క్ ఉంటుంది. ఒక నియోజకవర్గంలో ఎన్ని శాంపిల్స్ సేకరించాలి, ఒక ఊరిలో ఎన్ని ఇళ్లను కవర్ చేయాలి, అందులో పురుషులెందరు, మహిళలెందరు, ఎన్ని ఇళ్లకో శాంపిల్ సేకరించాలి.. లాంటి శాస్త్రీయ విధానాన్ని అనుసరిస్తుంటారు. వీటిని ప్రజలు ఫాలో అవుతుంటారు. ఇప్పుడు ఆ సర్వే సంస్థల పేరుకు ముందో, వెనకో మరో పదాన్ని జోడించి కొన్ని బోగస్ సంస్థలు సర్వే ఫలితాలను విడుదల చేస్తున్నాయి.

# ఓటరు దేవుడో... నీకో దండం

## అంచనాలకు అందని జనం

- నేతలకు చుక్కలు చూపిస్తున్న ఓటరు
- ఏ రోటికాడ ఆ పాట
- అందరి దగ్గరా తాయిలాలు... చివరికి ఓటు ఎవరికో
- హామీలు తీసుకుంటూ.. ప్రమాణాలు చేయించుకుంటున్న నేతలు
- సభలు, సమావేశాలంటే తిప్పలే
- బతిమిలాడినా రాని ఓటరు
- కూలీ కన్నా ఎక్కువిస్తేనే వస్తామనే డిమాండ్
- ఊరూరా ఓటరు దేవుడి మేజిక్కులు



**సాక్షి, హైదరాబాద్:** ఓటరు నాడి పసిగట్టడం నాయకులకు పజిల్‌గానే ఉంది. గుమ్మం దాకా వెళ్లినా.. తాయిలాలు పంచినా.. ఆ ఓటు తమకే పడుతుందా? అనే అనుమానం అన్ని పార్టీల నాయకులనూ వేధిస్తోంది. గతంలో మాదిరి చాలామంది ఓటర్లు రాజకీయ అభిప్రాయం వెల్లడించడం లేదు. పనులన్నీ మానుకుని నేతల వెంటా అడుగులేయడం లేదు. తప్పించుకు తిరగడంలో తమనే మించిపోయారని పలువురు నాయకులు తలలు పట్టుకుంటున్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఓటరు మనోగతం తెలుసుకునేందుకు పార్టీలు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. ప్రలోభాలు పెట్టే సమయంలో తమ వైపే ఉంటామని అభ్యర్థుల అనుయాయులు ఓటర్లతో ప్రమాణాలు చేయిస్తున్నారు. అది కూడా నాయకులకు నమ్మకం కలిగించడం లేదు. ఈ ప్రమాణాలు అందరికీ చేస్తున్నారని నేతల వాకబులో తెలుస్తోంది. 'నాయకులు హామీలిచ్చి అమలు చేయనప్పుడు మేం ప్రమాణాలు చేస్తే తప్పేంటి' అని కొందరు ఓటర్లు బాహాటంగానే అంటున్నారు.

### డబ్బు గెలిపిస్తుందా?

ప్రతీ నియోజకవర్గంలో దాదాపు 2 లక్షలకు పైగా ఓటర్లుంటారు. కనీసం సగం మందికి డబ్బులు పంచాలని నేతలు టార్గెట్‌గా పెట్టుకుంటున్నారు. ఈ వ్యవహారంలో చాలాచోట్ల పోటాపోటీ నడుస్తోంది. ఖమ్మం జిల్లాలోని ఓ ముఖ్యమైన నియోజకవర్గంలో ఓ అభ్యర్థి ఓటుకు రూ.3 వేలు పంచినట్టు చెప్పుకుంటున్నారు. ఇది తెలిసిన మరో నేత మరో రూ. 500 ఎక్కువ ఇవ్వడానికి సిద్ధపడ్డారు. దీంతో రెండో దఫా పంపకం ఉంటుందని డబ్బు పంపిణీ చేసిన అభ్యర్థి ఓటరుకు సంకేతాలు ఇవ్వాల్సి వచ్చింది. అంటే కనీసంగా నియోజకవర్గంలో రూ. 30 కోట్లు పంపకం చేయడం ప్రధాన పార్టీలకు అనివార్యమైంది. ఇంత చేసినా పడే ఓట్లు ఎన్ని? ఎంత మంది పోలింగ్ బూత్ దాకా వస్తారు? గతంలో మునుగోడు ఎన్నిక అత్యంత ఖరీదైందిగా చెప్పుకుంటారు. తమకు రూ. 10 వేలు ఇచ్చారని ఓటర్లే బాహాటంగా చెప్పిన పరిస్థితి. ఇంత చేసినా డబ్బులు ఖర్చు పెట్టిన అభ్యర్థి అనుకున్న ఓట్లు పడలేదు. హుజూరాబాద్, హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లోనూ డబ్బు విపరీతంగా పంచినట్టు వార్తలొచ్చాయి. ఇంత చేస్తే చాలా మంది పోలింగ్ కేంద్రానికే రాలేదని నేతలు అంటున్నారు. ఈ అనుభవం గుర్తు చేసుకుని నేతలు ఆందోళనలో ఉన్నారు. ఎవరి దగ్గర డబ్బులు తీసుకోకున్నా, తమను ఓ పార్టీ ఖాతాలో చేర్చేస్తారని, ఆ తర్వాత స్థానికంగా రకరకాల వేధింపులుంటాయని, అందుకే అందరి దగ్గర డబ్బులు తీసుకుంటున్నామని పలువురు ఓటర్లు అంటున్నారు. 'అక్కడికెళ్లాక ఎవరికో ఒకరికి ఓటు వేస్తాం' అని తెలివిగా తప్పించుకుంటున్నారు. నిజానికి ఓటరు ఏదో ఒక అభ్యర్థికి ఓటేయాలని ముందే ఫిక్స్ అవుతున్నాడు.


### మీరు ఏ పార్టీ అంటే ఆ పార్టీనే

రోడ్‌షోలు, బహిరంగసభలకు వస్తున్న ప్రజల నుంచి అభిప్రాయం సేకరించేందుకు అన్ని పార్టీ నేతలూ ప్రయత్నిస్తున్నారు. ఇక్కడా ఓటర్ల నుంచి విచిత్రమైన అనుభవం ఎదురవుతోంది. ఇటీవల కరీంనగర్‌లో జరిగిన ఓ రోడ్డు షోలో ఓ నేత అనుయాయుడు ప్రజాభిప్రాయం సేకరించేందుకు 'ఈసారి ఏ పార్టీ గెలుస్తుంది?' అని ప్రశ్నించాడు. 'మీరు ఏ పార్టీ అనుకుంటున్నారు?' అని తెలివిగా ఓటర్లు ఎదురు ప్రశ్న వేశారు. అడిగే వ్యక్తి ఫలానా పార్టీ అని తెలిస్తే ఆ పార్టీనే గెలుస్తుందంటూ బదులిస్తున్నారు. గతంలో మాదిరి సభలు సమావేశాలకు పార్టీపై అభిమానంతో రావడం లేదని నేతలకూ తెలుసు. వచ్చే వాళ్లకు ఒక్కొక్కరికీ రూ. 400 ఇవ్వడం రివాజుగా మారింది. దీంతో పాటు ఇతర ఖర్చులూ ఉంటాయి. వీళ్లంతా పెయిడ్ ఆర్టిస్టుల్లానే యాక్ట్ చేస్తున్నారు. అన్ని పార్టీల సభలకూ వెళ్తున్నారు.

### సెంటిమెంటా?

**రా**ష్ట్ర, జాతీయ స్థాయి నేతల సభలు పెడుతున్న అభ్యర్థుల కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి. భారీ జనసమీకరణ చేస్తామని హామీ ఇచ్చిన నేతలకు ఇది సాధ్యం కావడం లేదు. పత్తి ఏరే సీజన్ కావడం, ఈ సమయంలోనే వరి కోతలు ఉండటంతో జనం ఆ పనులకు వెళుతున్నారు. 'తాము వ్యవసాయ పనులకు వెళ్తే రోజుకు రూ. 800 వరకూ వస్తుంది... పార్టీలేమిస్తాయి? నాలుగొందలేగా?' అంటున్నారు జనం. పట్టణాల్లో అడ్డా కూలీలైతే అడ్డంగా మాట్లాడుతున్నారు. భవన నిర్మాణ పనులకు వెళ్తే రోజుకు రూ. వెయ్యి వస్తున్నాయని, అంతకన్నా ఎక్కువ ఇస్తేనే వస్తామంటున్నారు. ఎన్నికలొస్తే తమ పార్టీ అభ్యర్థి కోసం అన్ని పనులు మానేసి వచ్చే వాళ్లని, ఇప్పుడు ఏ సెంటిమెంట్ లేదంటూ చెప్పడం నేతలకు గుబులు పుట్టిస్తోంది.

## ఓటు ఎవరికి అంటే.. కాకే మన ఆదర్శం!



''**కా**కిని ఆదర్శంగా తీసుకుంటే ఓటును సరిగా వేయొచ్చు'' అంటూ విలక్షణంగా సెలవిచ్చారు స్వామి ఎలక్షనానంద అలియాస్ స్వామి సలక్షణానంద.

''అదెలా స్వామీ?'' అయోమయంగా అడిగాడు శిష్యుడు

''కథల్లో కాకుల్నీ, కాకమ్మ కథల్నీ గుర్తు పెట్టుకుంటే ఓటు వేయడంలో పొరబాట్లు జరగవు. చెబుతా విను'' అంటూ తన స్టేట్‌మెంట్‌ను పునరుద్ఘాటిస్తూ, దానికి తగిన దాఖలా కూడా ఇచ్చారు స్వామీజీ.

''అనగనగా ఓ కాకి. అదెంతో కష్టపడి ఓ మాంసం ముక్కను సంపాయించుకుంది. పక్షి ప్రపంచంలో కాకి పిల్లే కాకుండా..కాకి తిండీ కాకికి ముద్దే. దాని భోజనం దానికి పవిత్రమే కదా..అచ్చం మనలోకంలో మన ఓటులాగే.

కాకి నోటనున్న మాంసం ముక్కను చూసి, నక్కకు నోరూరింది. అది చెట్టుకిందికి వచ్చి.. ''కాకి బావా... కాకి బావా... గానగంధర్వులంటూ మనుషులేవో తప్పుడు కూతలు కూస్తూ ఉంటారుగానీ..పాటంటే అసలు నీదే కదా. పక్షుల్లో పి.సుశీల నువ్వే కదా'' అని పొగుడుతుంది.

ఆ పొగడ్తలకు పరవశించిన కాకి గొంతెత్తి పాడుతుంది. అంతే..కాకి నోటనున్న నల్లి బొక్క సహిత మాంసం ముక్క కాస్తా నక్కకు దక్కుతుంది.

కాకి తెలివైనదే. కానీ ఎవరి తెలివితేటలైనా అవి ఒక రంగానికే పరిమితం. కాకికి కాస్త సైన్సుతోపాటు బోలెడంత యుక్తి కూడా తెలుసు. కాకి యుక్తిని తెలిపే కథ మరొకటుంది.

కాకి, జింక, ఎలుక ఈ మూడూ ఫ్రెండ్సు. 'నన్ను కూడా మీ గ్రూపులో చేర్చుకొమ్మంటుం'ది ఓ నక్క. బోలెడంత డౌటు పడుతూనే, తప్పని పరిస్థితుల్లో దాంతో ఫ్రెండ్షిప్ చేస్తాయి కాకి, జింక, ఎలుక. ఓ పక్క ఫ్రెండ్‌షిప్ నటిస్తూనే జింకను ఉచ్చులో చిక్కేలా చేస్తుంది నక్క.

'నక్కబావా.. నక్కబావా ఉచ్చు కొరికి నన్ను విడిపించవా' అని అడుగుతుంది జింక.

''ఉచ్చును జంతునరంతో చేస్తారు. ఇవాళ శనివారం కదా. నేను నాన్‌వెజ్ ముట్టను. కాస్త వెయిట్ చెయ్. రేపొచ్చి విడిపిస్తానం''టూ వేటగాడొచ్చి జింకను చంపడం కోసం దూరంగా వెళ్లి వేచి చూస్తుంటుంది.

సంగతంతా తెలుస్తుంది కాకికీ, ఎలుకలకు. జింక దగ్గరికెళ్లి ఓ ఐడియా చెబుతుంది కాకి. ఆ ప్రకారం... జింక తన కడుపును ఉబ్బించి, చచ్చినట్టు నటిస్తూ పడి ఉంటుంది. జింక కంటిని పొడుస్తున్నట్టు యాక్షన్ చేస్తుంది కాకి. ఈలోపు వేటగాడు దూరం నుంచే చూసి, జింక చచ్చిందనుకుని వెళ్లిపోతాడు. ఇంతలో ఉచ్చు కొరికేస్తుంది ఎలుక. జింక సేఫ్. ఇలా కాకికి కొంత సోషల్ ఎవేర్‌నెస్సు ఉంది. మరి కాస్త సైన్సు తెలుసంతే. అందుకే తనకు తెలిసిన సైన్స్‌తో గులకరాళ్లు కుండలో వేసి, అడుగునున్న నీళ్లను పైకి రప్పించగలిగింది. ఇలా..దానికి ఫ్లుయిడ్ మెకానిక్స్ కొంత తెలుసుగానీ మ్యాథమేటిక్స్ అస్సలు తెలియదు. అందువల్ల..కోకిల తన గుడ్లను.. కాకి గూట్లో పెట్టి, దాంతోనే పొదిగించినా దానికి తెలియరాలేదూ..ఆ ఎక్స్‌ట్రా గుడ్లు ఎక్కణ్నుంచి వచ్చాయోనన్న తెలివీ లేదు. సైన్సు తెలిసిన కాకికి మ్యాథ్సూ, సాంగ్సూ తెలియాలనే రూలేమీ లేదు కదా. బల్బ్ కనిపెట్టినంత తేలిగ్గా ఎడిసన్ గారు బట్టలు నేయలేకపోవచ్చూ, బాదం హల్వా చేయలేకపోవచ్చు కదా.

కాబట్టి దీన్ని బట్టి తెలిసే నీతి ఏమిటి? కాకి మాంసం ముక్క ఎంత విలువైనదో... మన నోటికాడికి కూడూ, గూడూ, గుడ్డా వచ్చేలా చేసే ఓటూ అంతే విలువైనది. దాన్ని తమ వశం చేసుకోడానికి చాలా మంది అభ్యర్థులు...'ఓటర్లంతా తెలివైన వాళ్లు. వాళ్లెప్పుడూ తప్పుచేయరు' అంటూ ఉబ్బేస్తూ ఉంటారు.

అందుకే ప్రతి ఓటరూ తన బలమేమిటో తెలుసుకోవాలి. తనకు లేని బలాన్ని ఉన్నట్టుగా చూపే యుక్తుల్ని తెలుసుకుని తెలివిగా మసలాలి. అంతే కాదు... తెలివైన కాకిలా మనకు కావాల్సిన లబ్ధిని కుండలో నీళ్లలా సాధించుకోవాలి. మన సోషల్ ఎవేర్‌నెస్సుతో... మన ఫ్రెండ్సూ, నైబర్ల ఓట్లను కొట్టేయాలనుకునే నక్కజిత్తుల వాళ్లనూ, ముప్పు తెచ్చే వేటగాళ్లలాంటి వాళ్ల గురించి అప్రమత్తం చేయాలి.

అంతేతప్ప... తెలివైన ఓటరెప్పుడూ పొగడ్తలకు పొంగిపోయి, విలువైన ఓటును కాకి నోట మాంసం ముక్కలా అర్హత లేని అభ్యర్థుల పాలు చేయకూడదు'' అంటూ ముగించారు స్వామి ఎలక్షనానంద.

షుగర్ & పెప్పర్
..:: యాసీన్



## ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం

- పూర్తి స్థాయిలో సన్నద్ధమైన పోలీసు శాఖ
- స్థానిక పోలీసులతోపాటు కేంద్ర బలగాల మోహరింపు
- రెండు విడతల్లో వచ్చిన 375 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలు
- వివిధ రాష్ట్రాలనుంచి 23,500 మంది హోంగార్డుల రాక

**సాక్షి, హైదరాబాద్:** అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసేలా పోలీసుశాఖ పూర్తిస్థాయిలో సన్నద్ధమైంది. స్థానిక పోలీసులతోపాటు రాష్ట్ర, కేంద్ర సాయుధ పోలీసు బలగాలు ఎన్నికల బందోబస్తు విధుల్లో మోహరించాయి. రాష్ట్ర పోలీసు శాఖ నుంచి 45 వేల మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉన్నట్టు పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఎన్నికల బందోబస్తు కోసం రాష్ట్ర పోలీసు శాఖ ప్రతిపాదనలు పంపిన విధంగానే బందోబస్తు విధుల కోసం రెండు విడతల్లో 375 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలను కేటాయించినట్టు ఆయన తెలిపారు. అంతేకాక కర్ణాటక, ఏపీ, మహారాష్ట్ర నుంచి ఐదు వేల మంది చొప్పున, మధ్యప్రదేశ్, తమిళనాడుల నుంచి రెండువేల మంది చొప్పున, ఛత్తీస్‌గఢ్ నుంచి 2,500 మంది కలిపి మొత్తంగా 23,500 మంది హోంగార్డులు రాష్ట్ర ఎన్నికల బందోబస్తు విధుల్లో పాల్గొననున్నారు. ఇప్పటికే ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన సిబ్బంది వారికి కేటాయించిన ప్రాంతాలకు చేరుకున్నట్టు ఆ అధికారి వెల్లడించారు. ఇతర రాష్ట్రాల పోలీసులు, హోంగార్డులు పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు విధులు నిర్వర్తిస్తారని తెలిపారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఉంటుందని, ఇందులో కేంద్ర సాయుధ పోలీసు బలగాలు కీలక విధుల్లో ఉంటాయని ఆయన వివరించారు.

**ముమ్మరంగా తనిఖీలు..**

రాష్ట్రవ్యాప్తంగా 119 అసెంబ్లీ నియోజవర్గాల పరిధిలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సాయుధ పోలీసు బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నాయి. పోలింగ్‌కు రెండు రోజులే గడువు ఉండటంతో ఓటర్లను ఆకట్టుకునేందుకు నాయకులు ప్రలోభాల పర్వానికి తెరతీశారని పరిశీలకులు చెపుతున్నారు. గుట్టుచప్పుడు కాకుండా నగదు, మద్యం పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ కుట్రలను భగ్నం చేసేందుకు అధికారులు సైతం అదే రీతిన ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నారు. స్థానిక పోలీసులతోపాటు రాష్ట్రవ్యాప్తంగా 373 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 374 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్‌లు నిఘా పెట్టాయి. 95 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులలో తనిఖీలు ముమ్మరం చేశారు. మరోవైపు సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన పోస్టులు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఉండే వ్యాఖ్యలు, ఫొటోలు, వీడియోలపైనా పోలీసులు నిఘా పెడుతున్నారు. హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయం మొదలు అన్ని పోలీసు కమిషనరేట్లలో, జిల్లాల ఎస్పీ కార్యాలయాల్లో ఇప్పటికే ప్రారంభించిన సోషల్ మీడియా మానిటరింగ్ సెల్స్ పూర్తి స్థాయిలో పనిచేస్తున్నాయి.

## ప్రజలపైనే భారం

గాసిప్ టైమ్

**అ**సెంబ్లీ ఎన్నికల ప్రచారం ముగిసింది. హాట్‌హాట్‌గా, వ్యక్తిగత దూషణలు, ప్రభుత్వాల వైఫల్యాలు, గతంలో అధికారంలో ఉన్న పార్టీల వైఫల్యాలు, తెలంగాణ ఏర్పాటు, అందులో అసువులు బాసిన ప్రజల గురించి, ప్రభుత్వాల అవినీతిపై పార్టీల స్టార్‌క్యాంపెయినర్లు రచ్చరచ్చ చేశారు. ప్రతీ రాజకీయపార్టీ తామొక్కరే సక్కదనమన్నట్టు ప్రజల ముందు తమ వాదనలు వినిపించాయి. ఇప్పుడంతా హుష్.. గప్‌చుప్..స్టార్ క్యాంపెయినర్లు నియోజకవర్గాలను చుట్టుముట్టారు చెవుల్లో తుప్పు వదిలించారు. ప్రచారానికి వచ్చిన నాయకుల్లో చాలామందికి వారెవరో కూడా ఓటర్లకు తెలియని పరిస్థితి. ఏదో తీసుకొచ్చారు. వచ్చాం.. విన్నాం.. వెళ్తున్నాం అన్నట్టుగా ఉంది సభలకు వచ్చిన ప్రజల పరిస్థితి. ఇంత జరిగినా..అభ్యర్థులే గుబులు గుబులుగా ఉన్నారు. అంతా అయిపోయింది.. ఇక పంచుడే మిగిలింది... ఆ పైన దేవుని దయ, ఓటరన్న దయ అంటూ భారం అంతా వారిపైనే వేశారు. ఆఖరి నిమిషం వరకు గెలుపుపై విశ్వాసం సడలకుండా బింకంగా ఉండడమే పోటీలో ఉన్న అభ్యర్థులకు ఇక మిగిలింది....

## ఇంతకూ ఎవరు గెలుస్తారంటావ్!




- ప్రభుత్వ ఆఫీసుల్లో ఎన్నికలపై చర్చోపచర్చలు
- కోడ్‌తో సాధారణ పనులకే యంత్రాంగం పరిమితం
- తీరిక దొరికినప్పుడల్లా ఎన్నికల గెలుపోటములపై డిబేట్‌లు

"అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారంటావ్? ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది? ఓటరు నాడి ఎలా ఉంది?" ప్రభుత్వ కార్యాలయాల్లో తరచూ వినిపించిన ప్రశ్నలివి. అధికారి స్థాయి నుంచి కిందిస్థాయి ఉద్యోగి వరకు తారసపడిన వ్యక్తులతో ఆసక్తిగా ప్రశ్నలడిగారు. వాటికి వస్తున్న జవాబులతో ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ విశ్లేషణ వాతావరణం కనిపించింది.

**సాక్షి, హైదరాబాద్:** ఎన్నికల కోడ్‌తో ప్రభుత్వ స్థాయిలో కొత్త కార్యక్రమాలేవీ లేవు. ఇప్పటికే అమల్లో ఉన్న పథకాలకు సంబంధించి కొత్తగా లబ్ధిదారుల ఎంపిక, లబ్ధి చేకూర్చే కార్యక్రమాలకు బ్రేక్ పడింది. ఫలితంగా ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, ఉద్యోగులకు కాస్త విరామం దొరికినట్టయ్యింది. దీంతో ఆ కార్యాలయాల్లో ఎటు చూసినా ఎన్నికలపైనే చర్చోపచర్చలు జరిగాయి. ఉద్యోగులు కాకుండా ఇతరులెవరైనా కార్యాలయానికి వెళ్తే ''ఎవరు గెలుస్తారంటావ్'' అంటూ ఉద్యోగులు సరదాగా ఆసక్తికర చర్చ పెట్టారు.



### ఉన్నతాధికారులు సైతం...

తెలంగాణ ఏర్పడిన తర్వాత మూడోసారి జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలివి. వరుసగా రెండుసార్లు బీఆర్ఎస్(అప్పట్లో టీఆర్ఎస్) అధికారం చేపట్టగా... ఇప్పుడు మూడోసారి కూడా గెలుపుపై అదే ధీమా వ్యక్తం చేస్తూ అందరి కంటే ముందుగా ప్రచారం ప్రారంభించింది. ప్రభుత్వ కార్యాలయాల్లో ఓటరు నాడిని అంచనా వేస్తూ గత పదేళ్లలో జరిగిన సంక్షేమ పథకాలు, లబ్ధిదారులు, ఓటరు నాడి తదితర విశ్లేషణతో గెలుపోటములు ఎలా ఉంటాయో ఊహాజనిత అంచనాలకు దిగారు. స్నేహపూర్వక వాతావరణంలో జరుగుతున్న చర్చల్లో కొందరు ఉన్నతాధికారులు సైతం పాలు పంచుకుంటున్నారు.

### అప్పుడే బెట్టింగ్‌లు?

చాలామంది ఉద్యోగులు, అధికారులు వారి సొంత నియోజకవర్గాలు, పనిచేసిన నియోజకవర్గాల్లో స్నేహితులను ఫోన్లలో అడిగి మరీ ఎన్నికల సరళిని తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఆ పార్టీ అధికారంలోకి వస్తుందని, మరి కొందరు మరో పార్టీ అధికారంలోకి వస్తుందంటూ ధీమా వ్యక్తం చేస్తూ కొందరైతే ఏకంగా బెట్టింగులకు సైతం దిగారు.

## ప్రజలతో మాది పేగు బంధం.. కాంగ్రెస్‌ది చేదు బంధం



Interview

బీఆర్ఎస్‌కు స్పష్టమైన ఆదరణ కనిపిస్తోంది

- కేసీఆర్ పథకాలను కాంగ్రెస్ కాపీ కొట్టింది
- ఈసారి దిగువ, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమంపై దృష్టి పెడతాం
- మహిళా రిజర్వేషన్ చట్టంపై 'సుప్రీం'లో ఇంప్లీడ్ అవుతాం

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

కల్యాల మల్లికార్జున్‌రెడ్డి

'అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ముగింపు దశకు చేరిన క్రమంలో ప్రజల్లో బీఆర్ఎస్‌కు స్పష్టమైన ఆదరణ కనిపిస్తోంది. బీఆర్ఎస్‌కు ప్రజలతో ఉన్నది పేగు బంధం అయితే, కాంగ్రెస్‌తో ఉన్నది చేదు బంధం. కాంగ్రెస్, బీజేపీ సోషల్ మీడియాలో సృష్టించే అయోమయం, చెప్పే అబద్ధాల నడుమ బీఆర్ఎస్‌ను ప్రజలు ప్రత్యామ్నాయంగా ఎంచుకుంటున్నారు. బీజేపీ గత ఎన్నికల్లోనూ 105 చోట్ల డిపాజిట్ కోల్పోయింది. ఈసారి కూడా అంతకంటే గొప్పగా ఏమీ ఉండదు. కాంగ్రెస్ మాకు చాలా దూరంలో ఉన్నా ఎంతో కొంత పోటీనిస్తోంది. అందుకే కాంగ్రెస్ ఆలోచన సరళి, అహంకారం, అజ్ఞానం గురించి ప్రజలకు విడమరిచి చెప్తున్నాం'అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. పదేళ్ల నుంచి కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గ్యారంటీల పేరిట కాపీ కొట్టి, దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ పబ్బం గడుపుకుంటోందని ఆమె 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

**మీ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని విపక్షాలు చేస్తున్న విమర్శల సంగతేంటి?**

ప్రజాదరణ ఉన్న కేసీఆర్‌ను అందుకోలేని విపక్ష నేతలు ఆయన వ్యక్తిత్వాన్ని తగ్గించేలా దిగజారి మాట్లాడుతున్నారు. కష్టపడేతత్వం లోపించిన విపక్షాలు ఏది పడితే అది మాట్లాడుతున్నాయి. తెలంగాణకు భౌగోళికంగా, రాజకీయంగా గుర్తింపు తెచ్చిన కేసీఆర్‌పై విమర్శలు చేస్తున్న తీరును ప్రజలు ఏవగించుకుంటున్నారు. మాది కుటుంబ పార్టీ అంటున్న వారు మేము గల్లీ నుంచి ఢిల్లీ దాకా తెలంగాణ ప్రజల గొంతు వినిపించి రాష్ట్రాన్ని, అనేక రక్షణలు తెచ్చామనే విషయాన్ని గమనించాలి. లక్ష సవాళ్లు, విష ప్రచారాలను ఛేదించి తెలంగాణను సాధించిన కేసీఆర్‌ను గతంలో ప్రజలు దీవించారు. ఇప్పుడూ అదే జరుగుతుంది.

**ఎన్నికల ప్రచారం ముగింపు దశకు వచ్చింది. మీ కష్టం ఎంత మేర ఫలిస్తుంది?**

కేసీఆర్ పెద్ద మనసుతో తెచ్చిన సంక్షేమ పథకాలను కాంగ్రెస్ కాపీ కొడుతున్నా, అమలు చేసే శక్తి ఎవరికి ఉందో ప్రజలకు తెలుసు. తెలంగాణ ప్రజలు మాకు ఆత్మబంధువులు. సంపదను సృష్టించి తెలంగాణ సామాజిక నిర్మాణాన్ని అర్థం చేసుకుని పెట్టిన పథకాలు ఫలితాన్ని ఇస్తున్నాయి. రాష్ట్రంలో వచ్చే 50 ఏళ్లకు అవసరమయ్యే మౌలిక వసతులను దూరదృష్టితో అభివృద్ధి చేస్తున్నాం. సంక్షేమ పథకాలు, అభివృద్ధి మాకు రెండు కళ్ల లాంటివి. మళ్లీ అధికారంలోకి వస్తే దిగువ, మధ్య తరగతి కుటుంబాల సంక్షేమానికి పెద్దపీట వేస్తాం. యువత విషయానికి వస్తే ఈ తరం చాలా తెలివైంది. తెలంగాణ ఉద్యమ సమయంతో పోలిస్తే కొత్త తరానికి సమాచారం అందుబాటులో ఉంది. రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉంటే బాగుంటుందనే విషయంలో కొత్త తరానికి స్పష్టత ఉంది. కేసీఆర్ కమిట్‌మెంట్‌ను వీరు గుర్తిస్తారు.

**మహిళా రిజర్వేషన్ చట్టంపై మీ తదుపరి కార్యాచరణ ఏంటి?**

2024 లోక్‌సభ ఎన్నికల్లోనే మహిళా రిజర్వేషన్లు అమలయ్యేలా భారత జాగృతి తరఫున సుప్రీంకోర్టులో ఇంప్లీడ్ అవుతాం. డిసెంబర్ 3 తర్వాత ఢిల్లీ స్థాయిలో ఉద్యమిస్తాం.

**జాతీయ పార్టీల అగ్రనేతల ప్రచారం మీ పార్టీపై ప్రభావం చూపిందా?**

విపక్షాలకు పీఎంలు, సీఎంలు ఉంటే తెలంగాణకు కేసీఆర్ ఉన్నారు. కర్ణాటకలో బీజేపీ ఫెయిల్ కావడంతోనే కాంగ్రెస్ గెలిచింది. మా సీఎం కేసీఆర్. కాంగ్రెస్, బీజేపీ సీఎం అభ్యర్థి ఎవరనేది ఢిల్లీ నేతలు చెప్పడం లేదు. సీల్డ్ కవర్ సీఎంల చేతిలో రాష్ట్ర భవిష్యత్‌ను పెట్టలేము. కాంగ్రెస్ నాయకులకు ప్రజలు, పార్టీ పట్ల కమిట్‌మెంట్ లేదు. వ్యక్తిగత ప్రయోజనం తప్ప, ప్రజల కోసం పనిచేయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్, బీజేపీలకు లేదు. రెండు పార్టీలు లోపాయికారి ఒప్పందంతో కేసీఆర్‌ను ఇబ్బందులు పెట్టాలని చూస్తున్నాయి. కేసీఆర్‌ను గెలిపించడంలో తెలంగాణ ప్రజలకు స్పష్టత ఉంది.

**రైతుబంధును నిలిపివేయాలనే కాంగ్రెస్ ఫిర్యాదుపై ఏమంటారు?**

రైతు కష్టాలను తీర్చేందుకు రైతుబంధు అమలు చేస్తున్నాం. కానీ కాంగ్రెస్ రైతుల నోటి ముందు ముద్దను లాక్కొంటున్నది. వీరికి రైతులు, ప్రజల విషయంలో ఎలాంటి పట్టింపు లేదు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. 